సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 17 | సంచిక: 217

సోమవారం | 28-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



సోఫీ డివైన్ 'షో'

రెండో వన్డేలో భారత్‌పై 76 పరుగులతో నెగ్గిన కివీస్


-14లో



ఈక్విటీలపై పన్ను సున్నా!

చట్టంలో పలు వెసులుబాట్లు.. వాటిని అనుసరిస్తే పన్ను భారం పడదు

-15లో



'డిజిటల్ అరెస్టు'కు భయపడకండి

దేశంలో పెరుగుతున్న 'డిజిటల్ అరెస్టు' మోసాలకు భయపడరాదని ప్రజలకు ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'లో సూచించారు.

వివరాలు 6లో ▸



ముంబై దాడులపై స్పందనేలేదు!

26/11 దాడులపై మన దేశం నుంచి స్పందనే లేకపోయిందని పరోక్షంగా నాటి యూపీఏ సర్కార్‌ను కేంద్ర మంత్రి జైశంకర్ ఆక్షేపించారు.

వివరాలు 6లో ▸



ఓట్లు తగ్గినా గద్దెనెక్కవచ్చు!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గమ్మత్తైన పరోక్ష ఎన్నిక విధానం అమల్లో ఉంది. అధ్యక్షుడిని ఎలక్టోరల్ కాలేజీ సభ్యులే నిర్ణయిస్తారు.

వివరాలు 6లో ▸



ఖమేనీ ఆరోగ్యం విషమం?

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (85) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది.

వివరాలు 6లో ▸

ఖజానా కటకట!

ఆర్థిక సంవత్సరం 6 నెలలు గడిచేసరికి డోలాయమానంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

బడ్జెట్ ప్రతిపాదనలను బట్టి చూస్తే..

రాబడి **39.41%** | ఖర్చు **39.75%**

2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ రూ. **2.74** లక్షల కోట్లు

ఆరు నెలలు ముగిసే సరికి ఆదాయం రూ. **1.08** లక్షల కోట్లే (39.41% మాత్రమే)



రూ.2.54 లక్షల కోట్ల ఖర్చు ప్రతిపాదించగా ఆరు నెలల్లో రూ.1.01 లక్షల కోట్లు అంటే 39.75% వ్యయం

రూ.లక్ష కోట్ల రాబడిలో అప్పులే రూ.32 వేల కోట్లు.. పన్ను ఆదాయం రూ.69 వేల కోట్లే

అమ్మకపు పన్ను మినహా అన్ని పన్ను రాబడుల్లోనూ గత ఏడాదితో పోలిస్తే తగ్గుదల

ఇదే పరిస్థితి కొనసాగితే ఆర్థిక సంవత్సరం చివరికి రూ.2 లక్షల కోట్లు వచ్చేది కూడా అనుమానమే!

ప్రభుత్వం త్వరగా మేలుకోకపోతే ముందుంది గడ్డుకాలమే అంటున్న ఆర్థిక నిపుణులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 ఆదాయం కింద ప్రతిపాదిస్తే, ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలు ముగిసే సమయానికి రూ.39.41 మాత్రమే వచ్చాయి. కానీ బడ్జెట్‌లో రూ.100 ఖర్చు కింద ప్రతిపాదించగా, ఇదే ఆరు నెలల్లో ఖర్చు పెట్టింది మాత్రం రూ.39.75. అంటే బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే ఆదాయం కంటే ప్రభుత్వ ఖర్చే ఎక్కువగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పన్ను రాబడుల్లో మందగమనం, కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం రాకపోవడం, పన్నేతర ఆదాయం భారీగా తగ్గడం లాంటి పరిణామాలతో ఆరు నెలల తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి డోలాయమానంలో పడిందని ఈ గణాంకాల ద్వారా అర్థమవుతోంది. ముఖ్యంగా గత ఏడాదితో పోలిస్తే అమ్మకపు పన్ను మినహా మిగిలిన పన్ను రాబడుల్లోనూ తగ్గుదల నమోదు కావడం గమనార్హం.

వచ్చింది రూ.లక్ష కోట్లే

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2.74 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 నాటికి ఆరు నెలలు ముగిసే సమయానికి ఈ ప్రతిపాదనల్లో కేవలం 39.41 శాతం అంటే రూ.1.08 లక్షల కోట్లు మాత్రమే ఖజానాకు చేరింది. ఇందులో పన్ను రాబడులు కేవలం రూ.69 వేల కోట్లు మాత్రమే కావడం గమనార్హం. బడ్జెట్ ప్రతిపాదనలను బట్టి ఈ ఆర్థిక సంవత్సరంలో

మిగతా 2వ పేజీలో ▶

'విందు'పై రాజకీయం

జన్వాడలోని ఇంట్లో కేటీఆర్ బావమరిది దావత్‌పై పోలీసుల దాడి

అది రేవ్ పార్టీ అంటూ విస్తృతంగా ప్రచారం

కేటీఆర్, బీఆర్ఎస్ లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ నేతల ఆరోపణలు

అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహించారంటూ పోలీసుల కేసులు

అటు రాయదుర్గంలోని కేటీఆర్ బావమరుదుల నివాసాల్లో సోదాలు

కాంగ్రెస్ సర్కారు తీరుపై బీఆర్ఎస్ నేతల విమర్శలు

ఇంట్లో శుభకార్యాలు కూడా చేసుకునే పరిస్థితి లేదంటూ మండిపాటు

అది రేవ్ పార్టీ కాదు.. ఫ్యామిలీ దావత్ అని స్పష్టం చేసిన కేటీఆర్

కుటుంబ సభ్యులు, పిల్లలు ఉంటే.. రేవ్ పార్టీ అని ప్రచారం చేస్తారా?

ఎలాంటి డ్రగ్స్ దొరకలేదని చెప్తూనే.. కేసు ఎలా పెడతారని మండిపాటు

సాక్షి, హైదరాబాద్: జన్వాడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో జరిగిన విందు రాజకీయ రంగు పులుముకుంది. పోలీసుల దాడులు.. రేవ్ పార్టీ జరిగిందనే ప్రచారం.. అనుమతి లేకుండా మద్యంతో పార్టీ నిర్వహించారంటూ కేసులు.. ఒకరికి డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చిందనే వార్తలు.. రాయదుర్గంలోని కేటీఆర్ బావమరుదుల నివాసాల్లో పోలీసుల సోదాలు.. అధికార, విపక్షాల నేతల విమర్శలతో ఆదివారం పొద్దంతా హైడ్రామా చోటు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి రాజ్ పాకాల ఇంటిపై ఎక్సైజ్, ఎస్‌వోటీ పోలీసులు చేసిన దాడిలో విదేశీ మద్యం సీసాలు దొరకడం, విందులో పాల్గొన్న ఒకరు డ్రగ్స్ తీసుకుని ఉన్నట్టు తేలడంతో.. కేసులు నమోదు చేశారు. ఇదే సమయంలో రేవ్ పార్టీ

మిగతా 2వ పేజీలో ▶



జన్వాడలోని రాజ్ పాకాల ఇల్లు ప్రధాన ద్వారం

న్యూస్‌రీల్

గ్రూప్-1 మెయిన్స్‌కు 67.17 శాతం హాజరు



అభ్యర్థుల ఆందోళనలు, అరెస్టుల నేపథ్యంలో ప్రారంభమైన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 21న ప్రారంభమైన పరీక్షలు వరుసగా వారంపాటు కొనసాగాయి. 21,093 (67.17%) మంది అభ్యర్థులు అన్ని పరీక్షలకూ హాజరయ్యారు.

- వివరాలు 12లో▶

కడుపు నిండుగా.. షుగర్‌కు దూరంగా..!



షుగర్ బాధితులు హాయిగా లాగించేయడానికి వీలైన బియ్యం రకమే 'తెలంగాణ సోనా' అని తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణ బియ్యంతో పోలిస్తే ఈ బియ్యం గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువని.. రక్తంలో వేగంగా షుగర్ లెవల్స్ పెరిగే సమస్య తక్కువని అంటున్నారు.

- వివరాలు 3లో▶

మతతత్వ, అవినీతి శక్తులే మా శత్రువులు



బీజేపీ, డీఎంకేలపై టీవీకే అధ్యక్షుడు, ప్రముఖ తమిళ హీరో విజయ్ వాగ్బాణాలు ఎక్కుపెట్టారు. 'మతం, భాష అంటూ ప్రజల్ని చీల్చి రాజకీయం చేసే శక్తులు, రాష్ట్రాన్ని దోచుకుంటున్న అవినీతిపరులే మా పార్టీకి ప్రధాన శత్రువులు' అని ప్రకటించారు.

- వివరాలు 6లో▶

ఇక పొగబండ్లు మాయం



డీజిల్ ఇంజిన్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపేసే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక పూర్తి స్థాయిలో ఎలక్ట్రిక్ ఇంజిన్లనే వాడాలన్న రైల్వే శాఖ నిర్ణయానికి తగ్గట్టుగా ఏర్పాట్లు వేగిరమయ్యాయి.

- వివరాలు 16లో▶



నది స్వచ్ఛత చేకూరడానికి ఎంత కాలం పడుతుందో తెలియదు కానీ.. మీకు మాత్రం చాలా సమయమే పడుతుంది!



ఆదివారం ఇందిరాపార్క్ వద్ద సదర్ ఉత్సవంలో పుంగనూరు ఆవుతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ అభివృద్ధిని.. ఏ శక్తులూ అడ్డుకోలేవు

- మూసీ పునరుజ్జీవంపై దృఢ సంకల్పంతో సాగుతున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎనలేనిది.. సదర్‌ను అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటన

5లో

బెయిల్ రద్దు కుట్రలో భాగం పంచుకుంటారా?

షర్మిలపై విజయసాయిరెడ్డి మండిపాటు

సరస్వతి షేర్ల బదిలీపై సుప్రీం రిటైర్డ్ జడ్జీల న్యాయ సలహాను సైతం మీకు పంపినా పెడచెవిన పెడతారా?

ఇప్పటికే పదేళ్లలో రూ.200 కోట్లు ఇచ్చిన అన్నకు.. సొంత ఆస్తిలో 40 శాతం వాటా రాసిచ్చిన జగనన్నకు మీరు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ ఇదేనా?



ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

- వైఎస్సార్ చనిపోయిన పదేళ్ల తరువాత.. మీ వివాహమైన 20 ఏళ్ల తరువాత తన సొంత ఆస్తిలో వాటా ఏ అన్న అయినా ఇస్తాడా?
- కనీస కృతజ్ఞత చూపకపోగా శత్రువుల కుట్రల్లో పాలు పంచుకుంటారా?
- మీరు తాజ్‌మహల్, విప్రో కావాలని అడిగితే ఇచ్చేస్తారా షర్మిలా?
- అతి మంచితనం వల్లే జగన్ సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు

వివరాలు 12లో▶

బస్సు యజమానులుగా మహిళలు!



ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- ఎస్‌హెచ్‌జీలకు నాలుగేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడి

5లో

ఖమ్మం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు



రండి బాబూ రండి.. హైడ్రా అప్రూవ్డ్ ఇళ్లు కొనండి!

కూల్చివేతల నేపథ్యంలో కస్టమర్లను ఆకర్షించేందుకు బిల్డర్ల తంటాలు

వివరాలు 5లో▶

- హైదరాబాద్‌లో 5–6 నెలలుగా తగ్గిన స్థిరాస్తి కొనుగోళ్లు
- తమ ప్రాజెక్టులకు హైడ్రా ఆమోదం ఉందంటూ డెవలపర్ల ఫోన్లు
- ప్రీ–ఈఎంఐలు, ఉచిత రిజిస్ట్రేషన్లు, లక్కీ డ్రాలతో ఆకర్షించే ప్రయత్నం

నేడు కరెంట్ చార్జీల పెంపుపై నిర్ణయం



ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు దాఖలు చేసిన 9 వేర్వేరు పిటిషన్లపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) సోమవారం తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఈ మేరకు వేర్వేరు టారిఫ్ ఉత్తర్వులు జారీ చేయనుంది.

-3లో

10 మంది టీజీఎస్పీ సిబ్బంది డిస్మిస్

ఆందోళనలతో క్రమశిక్షణ ఉల్లంఘించారంటూ సర్కారు చర్యలు

సాక్షి, హైదరాబాద్: సెలవుల్లో మార్పులు, ఇతర డిమాండ్లతో ఆందోళనలు చేపట్టిన తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకుంది. తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్న 10 మందిని గుర్తించి.. ఆర్టికల్ 311 ప్రకారం ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది. పోలీస్ మాన్యువల్‌కు విరుద్ధంగా వ్యవహరించడం, ఆందోళనలను రెచ్చగొట్టడం, మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ, సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ క్రమశిక్షణను ఉల్లంఘించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్టు పేర్కొంటూ డీజీపీ కార్యాలయం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్వాసనకు గురైన సిబ్బంది వీరే..: 3వ బెటాలియన్ కానిస్టేబుల్ జి.రవికుమార్.. 6వ బెటాలియన్ కానిస్టేబుల్ కె.భూషణ్‌రావు.. 12వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ ఎస్‌కే షరీఫ్.. 17వ బెటాలియన్ ఏఆర్ఎస్సై సాయిరామ్, కానిస్టేబుళ్లు కె.లక్ష్మీనారాయణ, ఎస్.కరుణాకర్‌రెడ్డి, టి.వంశీ, బండెల అశోక్, ఆర్.శ్రీనివాస్‌లను విధుల్లోంచి తొలగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సద్దుమణగని ఆందోళనలు

కొన్ని బెటాలియన్లలో టీజీఎస్పీ సిబ్బంది నిరసనలు

తమ తోటివారిపై సస్పెన్షన్లు ఎత్తివేయాలంటూ వినతులు

12లో

ఏక్ పోలీస్ విధానం అమలు చేసేవరకు తగ్గేది లేదంటున్న కానిస్టేబుళ్లు

అనుమతి లేకుండా మద్యం పార్టీ

విదేశీ మద్యానికి డ్యూటీ ఫ్రీ బిల్స్ చూపించలేదు: ఎక్సైజ్ మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: జన్వాడ ఫామ్‌హౌజ్ ఘటనపై ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్పందించి సోదాలు చేయడం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల డ్యూటీ అని, చట్టం ఎవరికీ చుట్టం కాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతోనే ఎస్‌వోటీ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఫామ్‌హౌస్‌లో తనిఖీలు నిర్వహించారన్నారు. ఫాంహౌస్‌లో వేడుకలకు ఎలాంటి ఈవెంట్ పర్మిషన్లు తీసుకోలేదని.. అనుమతి లేకుండా లిక్కర్ పార్టీ జరిగినట్టు అధికారులు గుర్తించారని, అక్కడ లభించిన విదేశీ మద్యానికి సంబంధించిన డ్యూటీ ఫ్రీ బిల్స్ కూడా చూపించలేదని పేర్కొన్నారు.

నేరుగా ఎదుర్కోలేకే.. ఈ చౌకబారు రాజకీయాలు

మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీఆర్ఎస్‌పార్టీని నేరుగా ఎదుర్కోలేకే చౌక బారు రాజకీయాలకు దిగుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల ఫామ్‌హౌజ్ ఘటనపై హరీశ్‌రావు ఈ మేరకు స్పందిస్తూ ఆదివారం తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ పెట్టారు. 'ప్రత్యర్థులను ఎదుర్కోలేనివారే ప్రత్యర్థుల కుటుంబాలను తరచూ టార్గెట్ చేస్తారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కక్ష రాజకీయాలను.. డైవర్షన్ పాలిటిక్స్‌ను, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ కేడర్‌ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాను. రాహుల్ గాంధీ మొహబత్‌కా దుఖాన్ అనే ముఖం దీంతో పూర్తిగా బహిర్గతం అయ్యింది' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

నేటి సాయంత్రం వరకు నిరసనలపై నిషేధం

పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: నగరంలో కొన్ని సంఘాలు, కొందరు వ్యక్తులు ధర్నాలు, ఇతర నిరసనలు చేపట్టనున్నట్లు తెలుస్తోందని, వీటివల్ల ప్రజా జీవితానికి, శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు నిరసనలపై నిషేధం విధిస్తున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సీఆర్‌పీసీ అమల్లోఉన్నప్పుడు 144 సెక్షన్ మాదిరిగా, ప్రస్తుతం భారతీయ నాగరిక్ సురక్ష సన్నిహిత (బీఎన్ఎస్ఎస్) లోని సెక్షన్ 163 ప్రకారం ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. దీని ప్రకారం సోమవారం సాయంత్రం వరకు నగరంలో ఎక్కడా ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది ఒకేచోట గుమిగూడ కూడదని ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, నిరసనలు బహిరంగ సభలు, సమావేశాలు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. వ్యక్తులు కానీ, గ్రూపులు కానీ.. ఎలాంటి ప్రసంగాలు, బొమ్మలు ప్రదర్శించడం, గుర్తులు చూపించడం, ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించడం, సోషల్ మీడియా ద్వారా సందేశాలు వ్యాప్తి చేయడం నిషేధమని ప్రకటించారు. శాంతియుతంగా చేపట్టే ధర్నాలకు ఇందిరాపార్కు వద్ద ఉన్న ధర్నా చౌక్‌లో మాత్రమే అనుమతులు ఇస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

అది ఎక్సైజ్ చట్ట ఉల్లంఘనే

జన్వాడ పార్టీపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాజ్ పాకాల నిర్వహించిన పార్టీలో నాన్ డ్యూటీ మద్యం వినియోగించారని, అది ఎక్సైజ్ చట్టం ఉల్లంఘనేనని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. "రాజ్ పాకాలకు చెందిన ఫామ్‌హౌస్‌లో సైబరాబాద్ పోలీస్, ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయి. 12 విదేశీ మద్యం సీసాలు, ఒక నాన్ డ్యూటీ పెయిడ్ విదేశీ మద్యం సీసా, 11 తెలంగాణ మద్యం సీసాలు, ఒక మహారాష్ట్ర మద్యం సీసా, 11 బీర్లు స్వాధీనం చేసుకున్నాం. ఎక్సైజ్ అనుమతి తీసుకోకుండా రాజ్ పాకాల ఈవెంట్ నిర్వహించారు. దీనికితోడు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగించారు. ఇది ఎక్సైజ్ చట్టం ఉల్లంఘనే. దీనిపై కేసులు నమోదు చేశాం" అని తెలిపారు. కాగా.. రాయదుర్గంలోని రాజ్ పాకాల, శైలేంద్ర నివాసాల్లో జరిపిన సోదాలలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన 49 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ ప్రకటించారు.

అక్రమంగా సోదాలు: రాజ్ పాకాల న్యాయవాది

అధికారులు ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా రాజ్ పాకాల ఇంట్లో అక్రమంగా సోదాలు జరిపారని ఆయన తరఫు న్యాయవాది జక్కుల లక్ష్మణ్ పేర్కొన్నారు. దీనిని డీజీపీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. యజమానులు లేనప్పుడు ఇంట్లోకి చొరబడి సోదాలు చేశారని, ఏ కేసుపై సెర్చ్ చేశారు. ఏం సీజ్ చేశారో చెప్పలేదని.. దీనిపై చట్టపరంగా ముందుకెళతామని పేర్కొన్నారు.

రాజ్ పాకాల ఇంట్లో పార్టీపై
పోలీసుల దాడి

కేటీఆర్ బావమరిదికి చెందిన ఇంట్లో అనుమతి లేకుండా లిక్కర్ పార్టీ | శనివారం రాత్రి దాడి చేసిన ఎస్‌ఓటీ, ఎక్సైజ్ పోలీసులు | డ్యూటీ ఫ్రీ విదేశీ మద్యంతోపాటు స్థానిక లిక్కర్ స్వాధీనం

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది పాకాల రాజేంద్రప్రసాద్ అలియాస్ రాజ్ పాకాలకు చెందిన ఇంట్లో నిర్వహించిన పార్టీపై ఎక్సైజ్, ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. అనుమతి లేకుండా లిక్కర్ పార్టీ నిర్వహించారని, డ్యూటీ ఫ్రీ విదేశీ మద్యం వినియోగించారని గుర్తించారు. పార్టీలో పాల్గొన్నవారిలో ఒకరు కొకైన్ వినియోగించి ఉన్నట్లుగా తేల్చారు. ఈ మేరకు రాజ్ పాకాల, మద్దూరి విజయ్‌పై మోకిలా పోలీసులు, రాజ్ పాకాలపై శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మోకిలా ఠాణాలో నమోదైన ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. "రాజ్ పాకాల నానక్‌రామ్‌గూడలో ఈటీజీ పేరుతో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. అందులో సీఈఓగా పనిచేస్తున్న జూబ్లీహిల్స్ వాసి మద్దూరి విజయ్‌కు ఫ్యూజన్ యాక్స్ పేరుతో మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. రాజ్ పాకాల హైదరాబాద్ శివార్లలోని జన్వాడలో ఉన్న షీర్‌మాథే ప్రాపర్టీస్‌లో కొన్నాళ్ల క్రితం ఓ ఇంటిని నిర్మించారు. అందులో తరచుగా వీకెండ్ పార్టీలు ఇస్తూ.. స్నేహితులు, తమ సంస్థల్లోని ఉద్యోగులతో కలిసి పేకాట ఆడుతున్నారు. ఐదేళ్లుగా తనతో సన్నిహితంగా ఉన్న విజయ్‌ను శనివారం రాత్రి తన ఇంట్లో నిర్వహిస్తున్న దీపావళి పార్టీకి రావాలంటూ రాజ్ పాకాల ఆహ్వానించారు. ఈ పార్టీలో వీరిద్దరితో సహా 38 మంది పాల్గొన్నారు." అని పోలీసులు పేర్కొన్నారు.

విశ్వసనీయ సమాచారంతో దాడి..

"రాజ్ పాకాల ఇంట్లో పార్టీపై మోకిలా పోలీసులకు శనివారం రాత్రి సమాచారం అందింది. ఠాణాలోని



పోలీసులు స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యం

జనరల్ డైరీలో ఎంట్రీ నమోదు చేసిన అధికారులు.. నార్సింగి ఏసీపీ నుంచి సెర్చ్ ప్రొసీడింగ్స్ తీసుకున్నారు. ఆపై ఎస్‌వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్), ఎక్సైజ్ పోలీసులతో కలసి శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో రాజ్ పాకాల ఇంటిపై దాడి చేశారు. ఎలాంటి ఈవెంట్ పర్మిషన్ లేకుండా పార్టీలో స్థానిక లిక్కర్‌ను, డ్యూటీ ఫ్రీ విదేశీ మద్యాన్ని వినియోగిస్తున్నట్టు గుర్తించి.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. పార్టీకి హాజరైన పురుషులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా మద్దూరి విజయ్ కొకైన్ తీసుకున్నట్టు తేలింది. మహిళా పోలీసుల సాయంతో ఆ ఇంట్లో ఉన్న మహిళలకు డ్రగ్స్ పరీక్షలు చేయడానికి పోలీసులు ప్రయత్నించగా.. వారి నుంచి విముఖత ఎదురైంది. ఇక ఆ ఇంట్లో తనిఖీలు చేసిన పోలీసులు విదేశీ మద్యం, పేకాటకు సంబంధించిన వస్తువులు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. 16 మంది మహిళలు సహా 38 మందిని అదుపులోకి తీసుకున్నారు." అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. పేకాట నిర్వహణ, ఒకరు డ్రగ్స్ తీసుకున్నట్టు తేలడంపై మోకిలా పోలీసులు కేసు నమోదు చేసి, అందులో రాజ్ పాకాల, విజయ్‌లను నిందితులుగా చేర్చారు. ఇక అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహణ, విదేశీ మద్యం వినియోగంపై శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు రాజ్ పాకాలపై కేసు నమోదు చేశారు.

ముమ్మరంగా దర్యాప్తు..

రాజ్ పాకాల ఇంట్లో జరిగిన పార్టీ కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలిన మద్దూరి విజయ్‌ను విచారిస్తున్నారు. ఆ డ్రగ్‌ను తనకు రాజ్ పాకాల ఇచ్చారని విజయ్ చెప్పారని.. ఈ క్రమంలో రాజ్ పాకాలకు కొకైన్ ఎలా వచ్చింది? ఎవరు విక్రయించారు? ఆ పార్టీలో ఎవరెవరు పాల్గొన్నారనే వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు చెప్తున్నారు. విజయ్‌ను పార్టీ జరిగిన ప్రాంతంలోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు.. రాజ్ పాకాలను ఆదివారం ఉదయం 10 గంటలకు శంషాబాద్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్.. మధ్యాహ్నం 2 గంటలకు మోకిలా పోలీస్‌స్టేషన్‌కు విచారణ కోసం రావాలని ఆదేశించారు. కానీ రాజ్ పాకాల ఈ విచారణలకు హాజరుకాలేదు. ఆయన మొబైల్ స్విచాఫ్ వస్తోందని, గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాజ్ పాకాల, ఆయన సోదరుడి నివాసాల్లో సోదాలు

గచ్చిబౌలి, బంజారాహిల్స్ (హైదరాబాద్): జన్వాడలోని రాజ్ పాకాల ఇంట్లో పార్టీపై శనివారం రాత్రి దాడి చేసిన పోలీసులు.. ఆదివారం రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్‌లో ఉన్న రాజ్ పాకాల, ఆయన సోదరుడు శైలేంద్ర నివాసాల్లో సోదాలు చేపట్టారు. ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషీ, తమ సిబ్బందితో, భారీ పోలీసు బందోబస్తుతో ఈ తనిఖీలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు శైలేంద్ర నివాసంలో సోదాలు చేశారు. షో కేస్‌లు తాళాలు వేసి ఉండటం, తాళంచెవులు లేకపోవడంతో వాటిని పగలగొట్టి తనిఖీ చేశారు. రాత్రి 7 గంటల నుంచి రాజ్ పాకాల విల్లాలో సోదాలు చేశారు. రాత్రి 9 గంటల నుంచి రాజ్ పాకాల బంధువులకు మరో విల్లాలో తనిఖీలు చేపట్టారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతల నిరసన

సోదాల విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఒరియన్ విల్లాస్ వద్దకు



శైలేంద్ర నివాసం వద్ద పోలీసులు

చేరుకున్నారు. అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఫామ్‌హౌస్‌లో పార్టీ చేసుకుంటే ఇళ్లలో సోదాలు చేయడం ఏమిటని నిలదీశారు. అయితే అక్కడే ఉన్న రాయదుర్గం పోలీసులు కల్పించుకుని సోదాలకు సహకరించాలని కోరారు. ఈ సమయంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. దీనితో పోలీసులు ఎమ్మెల్యేలు వివేకానంద, మాగంటి గోపీనాథ్, డాక్టర్ సంజయ్‌కుమార్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మన్నె క్రిశాంక్, జయసింహ తదితరులను అదుపులోకి తీసుకుని, పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

కేటీఆర్ నివాసం వద్ద హడావుడి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంట్లోనూ సోదాలు జరపబోతున్నారన్న ప్రచారం జరగడంతో ఆదివారం.. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు బంజారాహిల్స్ లోని కేటీఆర్ నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ భారీగా మోహరించిన పోలీసులు.. వారిని కేటీఆర్ ఇంట్లోకి అనుమతించలేదు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఇతర నేతలను అదుపులోకి తీసుకున్నారు.

రేవ్ పార్టీ కాదు.. ఫ్యామిలీ దావత్

కేటీఆర్ స్పష్టీకరణ

- దీపావళికి ఇంట్లో పార్టీ చేసుకోవాలంటే పర్మిషన్ కావాలా?
- ఎలాంటి డ్రగ్స్ దొరకలేదని చెప్తూనే.. కేసు ఎలా పెడతారు?
- అది ఫామ్‌హౌస్ కాదు.. నా బావమరిది ఉండే ఇల్లు
- రాజకీయంగా ఎదుర్కోలేకే కేసుల కుట్ర
- అక్రమ కేసులు బనాయించి దెబ్బతీసేందుకు సర్కారు యత్నం
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టీకరణ
- కేసీఆర్ నేర్పిన ఉద్యమ బాటలోనే నడుస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీని, తమను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతూ కుట్రలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. తనను ఎదుర్కోలేక కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. జైళ్లకు పంపినా, ఎక్కడికి పంపినా తాము ఉద్యమ బాటలో నడుస్తామని.. చావుకు తెగించి ఉద్యమం చేశామని, ఈ కేసులకు, చిల్లర ప్రయత్నాలకు భయపడబోమని స్పష్టం చేశారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో జరిగిన పార్టీపై కేసు నమోదైన నేపథ్యంలో కేటీఆర్ ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వరుస వైఫల్యాలు, ఆరు గ్యారంటీలు, రేవంత్ బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండర్లు,



మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సివిల్ సప్లైస్ స్కామ్‌పై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధీరోదాత్తంగా పోరాటం చేస్తున్నారు. వాటిపై మాకు సమాధానం చెప్పే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. చేతనైతే రాజకీయంగా తలబడండి. శాసనసభ పెట్టండి. రుణమాఫీ కావచ్చు.. మూసీ సుందరీకరణ కావచ్చు.. ఆరు గ్యారంటీల అమలు కావచ్చు.. ప్రతి అంశం మీద సావధానంగా చర్చించి మిమ్మల్ని ఎండగట్టడానికి కేసీఆర్ ఆధ్వర్యంలో సిద్ధంగా ఉన్నాం. కానీ ఈ రకంగా గొంతునొక్కి, ఇష్టమొచ్చినట్లు కేసులు పెట్టి.. రాజకీయంగా మా కుటుంబ సభ్యులను వేధించి ఏదో సాధిస్తామని అనుకుంటే మీరు సాధించేది ఏమీ ఉండదు.

నా బావమరిదికి నెగెటివ్ వచ్చిందిగా..

దీపావళికి ఒక ఇంట్లో దావత్ చేసుకోవాలంటే పర్మిషన్ తీసుకోవాలంట. మా బావమరిది రాజ్ పాకాల జన్వాడ రిజర్వ్ కాలనీలో కొత్త ఇల్లు కట్టుకున్నారు. అది ఫామ్‌హౌస్ కాదు.. నా బావమరిది నివాసం ఉండే ఇల్లు. రాజ్ పాకాల ఏం తప్పు చేశాడు. తన సొంతింట్లో దావత్ చేసుకుంటే రేవ్ పార్టీ అని పేరుపెట్టి.. దాన్నో సినిమా చేశారు. ఆ పార్టీలో మా బావమరిది తల్లి, చిన్న పిల్లలు కూడా ఉన్నారు. పార్టీలో ఉన్నది ఎవరో పురుషులు, మహిళలు కాదు.. భార్యాభర్తలు. పొద్దున నాలుగు మందు బాటిళ్లు దొరికాయని ఎక్సైజ్ కేసు పెట్టారు. కానీ సాయంత్రానికి డ్రగ్స్ కేసుగా మారిపోయింది. ఎన్డీపీఎస్‌లో 25, 27, 29 సెక్షన్లు పెట్టారు. అసలు ఆ సెక్షన్లు ఏమిటి? సప్లయర్, కన్సంప్షన్, కోహోస్ట్ అని పెట్టారు. అసలు సప్లయర్ అనే సెక్షన్ పెట్టాలంటే అక్కడ డ్రగ్స్ దొరికి ఉండాలి. లేదా ఎవరో ఒకరు సప్లై చేసి ఉండాలి. అసలు డ్రగ్సే దొరకలేదని మీరే చెబుతున్నారు. ఇంకా కేసు ఎలా పెడతారు? అక్కడ 14 మందికి టెస్ట్ చేస్తే 13 మందికి నెగెటివ్ వచ్చింది. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన ఒక్కరు కూడా.. ఆయన ఎక్కడ తీసుకున్నాడో తెలుసుకోకుండా ఎలా కేసు పెడతారు? మత్తు పదార్థం దొరికిందా? ఏ రకంగా బద్నాం చేస్తారు?

నేను కూడా ఉన్నానని తప్పుడు ప్రచారం

కుటుంబ కార్యక్రమాన్ని రేవ్ పార్టీ అంటూ కొందరు పైశాచిక ఆనందం పొందుతున్నారు. నేను అక్కడ లేకున్నా నా పేరుతో అడ్డగోలుగా వార్తలు ప్రచారం చేస్తున్నారు. ప్రజాజీవితంలో ఉంటే మాపై ఎలాంటి మాటలైనా అడ్డగోలు ప్రచారం చేయవచ్చా? అది రాజ్ పాకాల ఇల్లు, ఫాంహౌజ్ కాదు. కుటుంబ సభ్యులను పురుషులు, మహిళలు అంటూ చెప్పి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఈ 21 గంటలు పరిశోధించి పట్టుకున్నది ఏమిటి? అక్కడ ఏం లేదని చాలా స్పష్టంగా అధికారులే చెప్పారు, అయినా ఎందుకీ దుష్ప్రచారం. రాజ్ పాకాలకు డ్రగ్స్ టెస్ట్ చేస్తే నెగిటివ్ వచ్చింది. అయినా ఆయనపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. అయినా ఎన్డీపీఎస్ కేసు ఎలా పెడతారు? ఉదయం ఇచ్చిన పంచనామాకు, ఎఫ్ఐఆర్‌కు తేడా ఎలా వచ్చింది? బాంబులు అని చెప్పి కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదు.

ఎంత ఇబ్బంది పెట్టినా పోరాటం ఆపం..

అక్రమ కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా.. మమ్మల్ని ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా పోరాటాన్ని ఆపబోం. రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం. మీరిచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, ప్రజలను మోసం చేయడాన్ని ప్రజల్లోకి తీసుకెళతాం. కేసీఆర్ నేర్పిన ఉద్యమ బాటలో నడుస్తాం." అని కేటీఆర్ పేర్కొన్నారు.

బుకాయిస్తే తప్పు ఒప్పు కాదు

సీఎం, మంత్రుల జోక్యం ఉందనడం అవివేకం: మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: తాగి దొరికిన కేసులో బుకాయిస్తే తప్పు ఒప్పవుతుందని అనుకోవడం పొరపాటని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దొరికిన దొంగలు సమర్థించుకుంటూనే ప్రభుత్వాన్ని బద్‌నాం చేసే పనిలో ఉండడం దారుణమని అన్నారు. జన్వాడ ఫామ్‌హౌజ్ ఘటనపై ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ విషయంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని స్పష్టం చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేస్తే దొరికారని చెప్పారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం తప్పుకాదనే ధోరణిలో బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని, పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీసే విధంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. నిజంగా నిర్దోషులయితే నిరూపించుకోవాలని హితవు పలికారు. ఈ కేసులో ముఖ్యమంత్రి, మంత్రుల జోక్యం ఉంద నడం బీఆర్ఎస్ మాజీ మంత్రులు, శాసనసభ్యుల అవివేకానికి నిదర్శనమని పొన్నం వ్యాఖ్యానించారు.

సమగ్ర విచారణ జరిపించాలి

జన్వాడ ఫామ్‌హౌజ్‌లో జరిగిన రేవ్‌పార్టీ, అనుమతి లేని మద్యం వినియోగం కేసులో సమగ్ర విచారణ జరిపించాలని కేటీఆర్‌కు డ్రగ్స్ టెస్ట్ చేయాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎం.ఎ.ఫహీమ్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎస్.శివసేనారెడ్డి, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి డిమాండ్ చేశారు. జన్వాడ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మహిళా ప్రతినిధులు సైబరాబాద్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు.

జన్వాడపై బీఆర్ఎస్, కాంగ్రెస్ రాజీ

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రాజీపడుతున్నట్లు జన్వాడ రేవ్ పార్టీ విషయంలో మరోసారి రుజువైందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆదివా రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్విట్టర్ టిల్లు బామ్మర్ది ఫామ్ హౌజ్‌లో రేవ్‌పార్టీ కేసు నీరుగార్చే కుట్ర మొదలైందని, ఆ పార్టీలో డ్రగ్స్ ఆనవాళ్లు లేవని పోలీసులతో చెప్పించేలా కాంగ్రెస్ నుంచి ఒత్తిడి కొనసాగుతోందని, లిక్కర్ పార్టీయే తప్ప రేవ్‌పార్టీ కాదని బుకా యించేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. జన్వాడ ఫామ్ హౌజ్ రేవ్ పార్టీపై సుద్దపూస ఏమంటాడో వేచి చూస్తున్నట్లు తెలిపారు. రేవ్‌పార్టీ పంచనామాలోనే డ్రగ్స్ ఆనవాళ్లు లేకుండా కుట్ర చేశారని, విదేశీ మద్యం బాటిళ్ల పేర్లను మాత్రమే ప్రస్తావించినట్లు తెలిసిందని అన్నారు. ట్విట్టర్ టిల్లు, ఆయన కుటుంబ సభ్యులను తప్పించి, ఈ కేసులో అనామకుల పేర్లను చేర్చుతున్నారని, తద్వారా బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వం దీపావళి బహుమతి ఇస్తోందని పేర్కొన్నారు. సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న డ్రగ్స్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజీధోరణి ప్రదర్శిస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు. సీసీ ఫుటేజీ సహా ఇతర ఆధారాలు ధ్వంసం కాకుండా చూడాలని, బడా నేతలతోసహా రేవ్‌పార్టీలో ఉన్న వాళ్లందరినీ అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జన్వాడ పార్టీ వివరాలు బయటపెట్టాలి

గజ్వేల్: జన్వాడ ఫామ్ హౌజ్ రేవ్‌పార్టీ వివరాలన్నీ బయట పెట్టాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు.

టార్గెట్ చేసి రచ్చ చేస్తున్నారు

కేటీఆర్ బావమరిదిని బద్నాం చేసే ప్రయత్నం ఇది

- మీడియా సమావేశంలో మాజీ మంత్రులు తలసాని, వేముల, సబిత, శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉధృతంగా ముందుకు వెళుతున్నందునే, ప్రభుత్వం టార్గెట్ చేసి రచ్చచేస్తోందని మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల సొంతంగా ఫామ్‌హౌస్ కట్టుకుని గృహ ప్రవేశం చేశారని, దాన్ని రేవ్‌పార్టీ అంటూ కుట్రలకు తెరతీశారని వారు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వా రు మాట్లాడారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ, ప్రభుత్వంపై కేటీఆర్ దూకుడుగా వెళ్తున్నందునే ఆయనను టార్గెట్ చేస్తున్నారు. కేటీఆర్ బావమరిది కాబట్టి బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిగత కక్షలు రాజకీయాల్లో ఇప్పుడే చూస్తున్నాం అన్నారు. వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ, కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కుట్ర చేస్తున్నారని, ఆయనపై కక్ష తీర్చుకునేందుకు కుటుంబ సభ్యులను బలిచేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎవరూ శుభకార్యం చేసుకోవద్దా అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. పోలీసు కుటుంబాలు రోడ్డెక్కితే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించలేదని, రాజ్ పాకాల విషయంలో మా త్రం వీడియో రిలీజ్ చేశారని విమర్శించారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణలో కక్షపూరిత రాజకీయాలు లేవని, ఇప్పుడు కొత్తగా అలాంటి సంస్కృతిని తీసుకురావద్దని అన్నారు. లేని ఆధారాలను సృష్టించి నా తమ్ముడిని అరెస్ట్ చేశారని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. కాగా, మాజీ మంత్రి కేటీఆర్ ను లక్ష్యంగా చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ సీని యర్ నాయకుడు దాసోజు శ్రవణ్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేటీఆర్‌ను ఇరికించే ప్రయత్నమిది

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా, సమస్యలపై నిలదీస్తున్న కేటీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, సంజయ్, నాయకు లు గెల్లు శ్రీనివాస్, సతీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. జన్వాడ పార్టీ వ్యవహారంలో ఆయనను కావాలనే ఇరికిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వారు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

'విందు'పై రాజకీయం

▶ మొదటి పేజీ తరువాయి

జరిగిందంటూ మీడియాలో, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనితో కేటీఆర్ లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. కేటీఆర్ లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేయగా.. విందుకు సంబంధించిన సీసీ ఫుటేజీ విడుదల చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మరోవైపు ఈ ఘటనపై కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఇంట్లో శుభకార్యాలు కూడా చేసుకునే పరిస్థితి రాష్ట్రంలో లేకుండా పోయిందని మండిపడ్డారు. తమను రాజకీయంగా ఎదుర్కొలేక కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసులతో కుట్రలు చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. కొత్తగా ఇల్లు కట్టుకుని, దీపావళికి దావత్ చేసుకుంటే.. రేవ్ పార్టీ అని ప్రచారం చేశారని, అక్కడ తన బావమరిది తల్లి, చిన్న పిల్లలు కూడా ఉన్నారని వివరించారు. అసలు డ్రగ్స్ ఏమీ దొరకలేదని చెప్తూనే.. కేసులు ఎలా పెట్టారని నిలదీశారు.

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేన్‌రెడ్డి కన్నుమూత



సాక్షి, హైదరాబాద్/ నల్లకుంట: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎస్.ఇంద్రసేన్‌రెడ్డి (81) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన సోమాజి గూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. కళాశాల రోజుల నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉన్న ఇంద్రసేన్‌రెడ్డి 1960 దశకం మొదట్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి యూని యన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1972లో ఉమ్మడి ఏపీ యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయన 1975లో జాతీయ యువజన కాంగ్రెస్‌కు ఎంపికయ్యారు. ఏపీసీసీ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఇంద్ర సేన్‌రెడ్డి ఏఐసీసీ సభ్యుడిగా, ఏపీ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్‌గా, టి. అంజయ్య మంత్రివర్గంలో ప్రత్యేక ఆహ్వానితుడిగా, ఏపీఐడీసీ చైర్మన్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించారు.

సీఎం సంతాపం

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేన్‌రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా ఎంతో సేవ చేసిన ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు కూడా సంతాపం వ్యక్తం చేశారు.

ఖజానా కటకట!

▶ మొదటి పేజీ తరువాయి

రూ.1.64 లక్షల కోట్లు పన్ను రాబడుల రూపంలో సమకూరాలి. అంటే ఆరు నెలలకు అందులో సగం లెక్కన కనీసం రూ.82 వేల కోట్లు రావాల్సి ఉంది. కానీ ఏకంగా రూ.13 వేల కోట్లు తక్కువగా కేవలం రూ.69 వేల కోట్లు మాత్రమే పన్నుల రూపంలో సమకూరాయి. జీఎస్టీ కింద రూ. 24,732 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.7,251 కోట్లు, అమ్మకపు పన్ను ద్వారా రూ.16,081 కోట్లు, ఎక్సైజ్ పద్దు కింద రూ.9,492 కోట్లు వచ్చాయి. ఇందులో అమ్మకపు పన్ను మినహా అన్ని శాఖల్లోనూ గత ఏడాది కంటే తగ్గుదల కనిపించింది. ఇక పన్నేతర ఆదాయం అయితే గత ఏడాదితో పోలిస్తే చాలా దూరంలో ఉంది. గత ఏడాది బడ్జెట్ ప్రతిపాదనల్లో సెప్టెంబర్ నాటికి 74 శాతం పన్నేతర ఆదాయం రాగా, ఈ ఏడాది బడ్జెట్ ప్రతిపాదనల్లో ఇప్పటివరకు కేవలం 11.65 శాతం అంటే రూ.4,101 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇప్పటి వరకు రూ.లక్ష కోట్లు రాగా, మరో రూ.1.70 లక్షల కోట్లు రావాల్సి ఉందని, కానీ పరిస్థితి ఇలా కొనసాగితే మరో రూ.లక్ష కోట్లు రావడం కూడా గగనమేనని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి.

30 శాతానికి పైగా అప్పులే

రెవెన్యూ రాబడులు పోను రాష్ట్ర ప్రభుత్వ ఖజానా అప్పుల మీదనే ఆధారపడి నడుస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు వచ్చిన రూ. 1.08 లక్షల కోట్ల ఆదాయంలో అప్పులు రూ. 32,536 కోట్లు ఉండటం గమనార్హం. అంటే మొత్తం వచ్చిన దాంట్లో 30 శాతానికి పైగా అప్పుల ద్వారానే సమకూరిందన్నమాట. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రతిపాదించిన మొత్తం అప్పుల్లో ఇప్పటికే 66 శాతం సమీకరించిన నేపథ్యంలో రానున్న ఆరు నెలల్లో అప్పుల సమీకరణకు కూడా అడ్డంకులు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు అనుగుణంగా రుణాల సమీకరణ జరగాల్సిన నేపథ్యంలో రానున్న ఆరునెలల పాటు సొంత ఆదాయం పెంచుకోవడం పైనే ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంటుందని, లేదంటే ఖజానాకు తిప్పలు తప్పవని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. ఇక కేంద్రం నుంచి సాయం కూడా ఆశించిన మేర అందడం లేదని ఆరునెలల లెక్కలు చెపుతున్నాయి. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేంద్రం రూ.21 వేల కోట్లకు పైగా ఇస్తుందని బడ్జెట్‌లో ప్రతిపాదించగా, ఆరు నెలల్లో కేవలం రూ.2,447 కోట్లు (11 శాతం) వచ్చాయి.

ఖర్చులు పైపైకి..

ఓ వైపు ఆదాయం తగ్గుతుండగా, మరోవైపు ఖర్చుల అనివార్యత రాష్ట్ర ఖజానాను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఈ ఏడాది రూ.2.54 లక్షల కోట్లు ఖర్చవుతుందని బడ్జెట్‌లో ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ.1.01 లక్షల కోట్లు (39.75 శాతం) ఖర్చయినట్లు ఆర్థిక శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో రెవెన్యూ పద్దు కింద రూ.41,802 కోట్లు, అప్పులకు వడ్డీల కింద రూ.13,187 కోట్లు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కోసం రూ.21,279 కోట్లు, పింఛన్ల కోసం రూ. 8,560 కోట్లు, సబ్సిడీల రూపంలో రూ.6,376 కోట్లు వ్యయం జరిగింది. ఇక మూలధన వ్యయం కింద మరో రూ.9,924 కోట్లు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. అనివార్య ఖర్చులు పెరిగాయని అర్థమవుతోందని, ఈ ఏడాదిలో కొత్త పథకాల అమలుకు ఎలాంటి అవకాశం లేదని, ఉన్న పథకాలనే కనాకష్టంగా కొనసాగించాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. రాబడి తగ్గి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మరింత పొదుపుగా వ్యవహరించడంతో పాటు వీలున్నంత త్వరగా రాబడి మార్గాలను పెంచుకునే ప్రయత్నాలను ప్రారంభించకపోతే ఆర్థిక ఒడిదుడుకులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

అదనపు రాబడులొచ్చే ప్రణాళికలు చూడండి

సీఎస్‌తో సీఎం, డిప్యూటీ సీఎం ప్రత్యేక భేటీ

రాష్ట్ర ఆదాయ వనరులపై ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఉద్యోగ సంఘాల జేఏసీలతో సమావేశం అనంతరం ఈ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ పరిస్థితులను బేరీజు వేసుకుని అదనంగా ఖజానాకు రాబడులు వచ్చేందుకు ఎలాంటి ప్రణాళికలు చేపడతారో వివరిస్తూ వీలున్నంత త్వరగా నివేదికలు ఇవ్వాలని సీఎస్‌ను సీఎం, డిప్యూటీ సీఎంలు ఆదేశించినట్టు సమాచారం.



కడుపు నిండుగా.. షుగర్‌కు దూరంగా..!

- సాధారణ బియ్యం గ్లైసిమిక్ ఇండెక్స్ 79.22.. తెలంగాణ సోనా ఇండెక్స్ 51.5 మాత్రమేనని వెల్లడి
- 'షుగర్ ఫ్రీ బియ్యం'గా పేరు పొందడంతో పెరుగుతున్న డిమాండ్
- ఈ బియ్యానికి మంచి డిమాండ్.. ఆన్‌లైన్‌లోనూ భారీగా వ్యాపారం
- తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో సాగు.. దేశవ్యాప్తంగా మరో 30 లక్షల ఎకరాల్లో పంట
- తమిళనాడు, కర్ణాటక సహా ఉత్తరాది రాష్ట్రాలకు చేరిన తెలంగాణ సోనా
- యూరప్, అమెరికా దేశాలకూ బియ్యం ఎగుమతి

'తెలంగాణ సోనా'బియ్యంతో మేలు అంటున్న వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు ● మధుమేహ బాధితులు ధైర్యంగా తీసుకోవచ్చని సూచన

ఏ రోజైనా వేరే ఏం తిన్నా.. ఎంత తిన్నా.. కాసింత అన్నం కడుపులో పడితే తప్ప మనసున పట్టదు.. కూరలు ఏవైనా చేత్తో కలుపుకొంటూ ఇంత అన్నం తింటే ఉండే తృప్తే వేరు. కానీ మధుమేహం (షుగర్) వ్యాధి వచ్చి.. ఈ సంతృప్తి లేకుండా చేస్తోంది. అన్నం త్వరగా అరిగి, శరీరంలోకి వేగంగా గ్లూకోజ్ విడుదల కావడం.. రక్తంలో షుగర్ స్థాయిలు వేగంగా పెరిగిపోయే అవకాశం ఉండటమే దీనికి కారణం. దీనితో షుగర్‌తో బాధపడుతున్నవారు అన్నాన్ని చూస్తూనే నోరు కట్టేసుకుంటున్నారు. పెద్దగా అలవాటు లేకపోయినా, తినడానికి కాస్త ఇబ్బందిగా ఉన్నా.. గోధుమ, జొన్న రొట్టెలనో.. కొర్రలు, ఊదలతో చేసిన అన్నమో తింటున్నారు. కానీ షుగర్ బాధితులు పెద్దగా గాభరా అవసరం లేకుండా హాయిగా లాగించేయడానికి వీలైన బియ్యం రకమే.. 'తెలంగాణ సోనా'. సాధారణ బియ్యంతో పోలిస్తే.. ఈ బియ్యం గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువని, రక్తంలో వేగంగా షుగర్ లెవల్స్ పెరిగే సమస్య తక్కువని తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

- సాక్షి, హైదరాబాద్

మన వ్యవసాయ వర్సిటీలోనే అభివృద్ధి..

అన్నం తింటే రక్తంలో షుగర్ స్థాయి వేగంగా పెరుగుతుందన్న భయంతో నడి వయస్కులు కూడా ఆహార అలవాట్లను మార్చుకుంటున్నారు. షుగర్ వచ్చినవారు, యాభై ఏళ్లు దాటినవారైతే నోటికి తాళం వేసుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న దాదాపు అన్ని రకాల బియ్యంతోనూ ఇదే సమస్య. అదే 'తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048)'రకంతో ఈ ఇబ్బంది ఉండదని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మిగతా రకాల బియ్యంతో పోలిస్తే.. ఈ రకం బియ్యం గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువని, మన కిష్టమైన అన్నం తింటూనే షుగర్‌ను నియంత్రణలో పెట్టుకోవచ్చని వివరిస్తున్నారు. ఈ తెలంగాణ సోనా బియ్యం ప్రత్యేకతలకు సంబంధించి అమెరికా 'జర్నల్ ఆఫ్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్'లోనూ ఆర్టికల్ ప్రచురితమైందని చెబుతున్నారు. ఈ బియ్యం గ్లైసిమిక్ ఇండెక్స్ 51.5 మాత్రమే. ఈ రకాన్ని వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలే అభివృద్ధి చేయడం గమనార్హం.

సరిహద్దులు దాటిన తెలంగాణ సోనా

'షుగర్ ఫ్రీ రైస్'గా పేరు తెచ్చుకున్న తెలంగాణ సోనా బియ్యానికి దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల్లోనూ డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ రకం వరిని పండించేందుకు వివిధ రాష్ట్రాల రైతులు మొగ్గుచూపుతున్నారు. మిగతా సన్నరకాల వరితో పోల్చితే పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉండటం, తక్కువ కాలంలోనే పంట చేతికి రావడం, అన్ని కాలాల్లోనూ సాగుకు అనుకూలం కావడంతో.. 'తెలంగాణ సోనా'రకం వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మూడేళ్ల క్రితం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన తెలంగాణ సోనా సాగు.. ఇప్పుడు ఎనిమిది రాష్ట్రాలకు విస్తరించింది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లోనూ సాగు చేస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం లెక్కల ప్రకారం తెలంగాణలో రెండు సీజన్లలో కలిపి 20 లక్షల ఎకరాల్లో తెలంగాణ సోనా వరి సాగవుతోంది. ఇతర రాష్ట్రాల్లో మరో 30 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. సాధారణంగా ఇతర సన్నరకాల వడ్లను మిల్లింగ్ చేస్తే.. 50 నుంచి 60 కిలోల బియ్యమే వస్తాయి. నూకల శాతం ఎక్కువగా ఉంటుంది. తెలంగాణ సోనా రకమైతే 68 నుంచి 70 కిలోల వరకు బియ్యం వస్తున్నాయని.. ఈ రకం సాగు వ్యవధి మిగతా వాటి కంటే 20 రోజులు తక్కువ కావడం వల్ల ఫెర్టిలైజర్ వాడకం కూడా తక్కువేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లో భారీగా వ్యాపారం

తెలంగాణ సోనా బియ్యానికి మార్కెట్లో డిమాండ్ పెరిగింది. షుగర్ బాధితులతోపాటు సాధారణ వ్యక్తులూ దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. దీనితో ఆన్‌లైన్‌లో ఈ బియ్యం వ్యాపారం పెరిగింది. అమెజాన్ వంటి ప్రముఖ ఈ-కామర్స్ సైట్లలోనూ తెలంగాణ సోనా విక్రయాలు సాగుతున్నాయి. 'డయాబెటిక్ కంట్రోల్ వైట్ రైస్, డయాబెటిక్ కేర్ రైస్, షుగర్ కంట్రోల్ రైస్, డెక్కన్ ముద్ర లో జీఐ, గ్రెయిన్ స్పేస్ తెలంగాణ సోనా రైస్, డాక్టర్ రైస్ డయాబెటిక్ రైస్'తదితర పేర్లతో ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్నాయి. అయితే ఈ పేరిట అమ్ముతున్నదంతా తెలంగాణ సోనా రకమేనా అన్నది తేల్చడం, పక్కాగా అదేనా, కాదా అని గుర్తుపట్టడం కష్టమేనని నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)తోపాటు పలు సంస్థలు, వ్యక్తులతో వ్యవసాయ విశ్వవిద్యాలయం తెలంగాణ సోనా బ్రాండింగ్‌పై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

ఓ మోతాదు మేరకు తినొచ్చు

సాధారణ బియ్యంతో పోలిస్తే తెలంగాణ సోనా గ్లైసిమిక్ ఇండెక్స్ త క్కువని వ్యవసాయ విశ్వవిద్యాల యం శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ లెక్కన చూ స్తే ఇతర రకాల బియ్యం కంటే తెలంగాణ సోనాతో ప్రయోజనం ఉంటుందని చెప్పవచ్చు. మధుమే హం బాధితులు ఓ మోతాదు వరకు ఈ బియ్యంతో వండిన అన్నం తీసుకో వచ్చు. దక్షిణ భారతంలో వేల ఏళ్లుగా అన్నమే ప్రధాన ఆహారం. అన్నం తింటేనే కాస్త సంతృప్తి. అందువల్ల మధుమేహ బాధితులు వైద్యులను సంప్రదించి.. ఎంత మేరకు ఈ అన్నం తినవచ్చన్నది నిర్ధారించుకుని వాడితే మంచిది.

– ప్రొఫెసర్ కిరణ్ మాదల, గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్



గ్లైసిమిక్ ఇండెక్స్ ఏంటి? దానితో సమస్యేమిటి?

మనం తీసుకునే ఏ ఆహారమైనా ఎంత వేగంగా అరిగిపోయి, శరీరంలోకి ఎంత గ్లూకోజ్‌ను విడుదల చేస్తుందనే లెక్కను గ్లైసిమిక్ ఇండెక్స్(జీఐ)తో కొలుస్తారు. జీఐ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే.. రక్తంలో షుగర్ స్థాయిలు అంత వేగంగా పెరుగుతాయన్న మాట. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు తీవ్రమైన సమస్యగా మారుతుంది. బియ్యంతో చేసిన అన్నం ఎక్కువ. 1-55 మధ్య ఉంటే తక్కువగా అని.. 56-69 ఉంటే మధ్యస్థమని.. 70 శాతానికి పైగా ఉంటే అత్యధికమని చెబుతారు. సాధారణంగా బియ్యం గ్లైసిమిక్ ఇండెక్స్ 79.22 వరకు ఉంటుంది. అందుకే షుగర్ బాధితులు అన్నం తగ్గించి, ఇతర ఆహారం తీసుకుంటారు. అయితే తెలంగాణ సోనా గ్లైసిమిక్ ఇండెక్స్ 51.5 వరకే ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అయితే హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 'జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) మాత్రం తెలంగాణ సోనాలో మరీ అంత తక్కువగా గ్లైసిమిక్ ఇండెక్స్ ఉండదని పేర్కొంది.

బాధితులకు తెలంగాణ సోనాతో మేలు



తెలంగాణ సోనా రకం బియ్యంతో వండిన అన్నాన్ని షుగర్ బాధితులు తీసుకోవచ్చు. ఇది మెల్లగా జీర్ణమవుతుంది. గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ కావడం వల్ల గ్లూకోజ్ లెవల్స్ వేగంగా పెరగవు. షుగర్ బాధితులేకాదు.. మిగతా వారంతా ఈ బియ్యాన్ని వాడటం వల్ల ప్రయోజనం ఉంటుంది.

– డాక్టర్ ఆర్.జగదీశ్వర్, రిటైర్డ్ పరిశోధన సంచాలకుడు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఈ బియ్యంలో పిండి పదార్థాలు తక్కువ



సాంబమసూరి, ఇతర వరి రకాలతో పోలిస్తే తెలంగాణ సోనా బియ్యంలో పిండి పదార్థాల శాతం తక్కువ. కాబట్టి ఇది షుగర్ బాధితులకు ఉపయోగపడుతుంది. వాస్తవంగా షుగర్ నియంత్రణ కోసం ఈ వరి వంగడాన్ని తయారు చేయలేదు. రూపొందించిన తర్వాత అందులో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువని తేలింది. పలు పరిశోధనల తర్వాత వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2015లో తెలంగాణ సోనాను అభివృద్ధి చేసింది. రకం సాగుతో రైతులకూ ప్రయోజనం. పెట్టుబడి తక్కువ. దిగుబడి ఎక్కువ.

– డాక్టర్ వై.చంద్రమోహన్, ప్రిన్సిపల్ సైంటిస్ట్, రైస్‌బ్రీడర్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఆత్మగౌరవాన్నే టీచర్లు కోరుతున్నారు

పింగిలి శ్రీపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ టీచర్స్ నియోజకవర్గం పరిధిలోని ఉపాధ్యాయులు శాసనమండలిలో ఈసారి మార్పును కోరుకుంటున్నారని ఆ నియోజకవర్గం నుంచి పీఆర్‌టీయూటీఎస్ తరఫున పోటీ చేయబోతున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. ప్రతీ ఉపాధ్యాయుడు తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టే, చట్టసభలో తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడే వారినే గెలిపించాలని భావిస్తున్నట్టు చెప్పారు. ప్రచారానికి శ్రీకారం చుట్టిన శ్రీపాల్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడారు. తనకు ఇంకా తొమ్మిదేళ్ల సర్వీస్ ఉందని, చాలా మంది టీచర్లు తనను తమ ప్రతినిధిగా ఉండాలని ఒత్తిడి చేస్తున్నందునే ఎమ్మెల్సీగా పోటీచేస్తున్నానని తెలిపారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం టీచర్లలో విశ్వాసాన్ని పెంచిందని, మూడు జిల్లాల్లో ఎక్కడికి వెళ్లినా పీఆర్‌టీ యూటీఎస్ నేతగా సాధించిన విజయాలే ప్రచార అస్త్రాలుగా ఉపయోగపడుతు న్నాయని తెలిపారు. ఓ ఎమ్మెల్సీగా చట్టసభల్లో వాణి విన్పించడం ఎంత ముఖ్యమో టీచర్లకు అర్థమయ్యేలా చెబుతున్నానని అన్నారు. చైతన్యవంతమైన ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో టీచర్లు ఎప్పుడూ మార్పును స్వాగతిస్తారని శ్రీపాల్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణ ఆర్చరీ సంఘం కార్యవర్గం ఎన్నిక



టి.రాజు



పి.అరవింద్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికై ంది. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి.రాజు, ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా పి.అరవింద్ కుమార్, కోశాధికారిగా కంచర్ల సత్యప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.విజయ్ కుమార్ రెడ్డి ఎన్నికయ్యారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి టి.జగపతి రావు ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఎన్నికైన నూతన కార్యవర్గం నాలుగేళ్లపాటు కొనసాగుతుంది.

రాష్ట్ర క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా విశ్వనాథన్



జీడిమెట్ల: రాష్ట్ర క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా రిటైర్డ్ ఐజీపీ డాక్టర్ విశ్వనాథన్ రవీందర్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం జీడిమెట్లలోని క్షత్రియ సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విశ్వనాథ్ రవిని సంఘం ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ రవి మాట్లాడుతూ...తెలంగాణలో ఉన్న ఖత్రి పట్కార్ కులస్తులలో పేదరికం పోవడానికి మిషన్ ఉథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. క్షత్రియ సమాజ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ మిషన్ ఉథాన్‌కు అనుగుణంగా ప్రజలనుంచి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఉప్పల్ బగాయత్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 30గుంటల స్థలంలో సమాజ్ భవన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. అఖిలభారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ బాలకృష్ణ మాట్లాడుతూ...క్షత్రియ సమాజ్ అభివృద్ధి చెందాలంటే ప్రజలకు విద్య చాలా అవసరమన్నారు.

హెచ్‌సీయూలో వామపక్ష కూటమి ఘనవిజయం

- 2024-25 విద్యార్థి సంఘం ఎన్నికల ప్రక్రియ పూర్తి
- ఆరు పదవుల్లో ఐదింటిని కైవసం చేసుకున్న ఎస్ఎఫ్ఐ కూటమి



ఉమేశ్ అంబేడ్కర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ విద్యార్థి సంఘాలతో కూడిన వామపక్ష కూటమి వరుసగా రెండోసారి ఘన విజయం సాధించింది. 2024-25 విద్యాసంవత్సరానికి జరిగిన ఈ ఎన్నికలలో ఆరు ప్రధాన పదవుల్లో ఐదు కీలక పదవుల్ని ఎస్ఎఫ్ఐ కై వసం చేసుకోగా క్రీడల కార్యదర్శి పదవిని ఎన్ఎస్‌యూఐ కైవసం చేసుకుంది.

హెచ్‌సీయూ నూతన అధ్యక్షుడుగా ఉమేశ్ అంబేడ్కర్

హెచ్‌సీయూ 2024-25 విద్యాసంఘం నూతన అధ్యక్షుడిగా వామపక్ష కూటమికి చెందిన ఉమేశ్ అంబేడ్కర్ తన ప్రత్యర్థి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో నిలిచిన ఆకాశ్‌భాటిపై విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా ఆకాశ్‌కుమార్ 213 ఓట్ల మెజార్టీతో, ప్రధాన కార్యదర్శిగా నిహాద్ సులేమాని 207 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వీరితోపాటు సహాయకార్యదర్శి పదవికి ఇదే కూటమికి చెందిన త్రివేణి తన ప్రత్యర్థి ముషాద్ అహ్మద్‌పై 451 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించింది. సాంస్కృతిక కార్యదర్శిగా ఇదే కూటమి నుంచి పోటీ చేసిన కేవీ కృష్ణమూర్తి తన ప్రత్యర్థి సోనియాదాస్‌పై 179 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. క్రీడా కార్యదర్శిగా ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ, ఎంఎస్ఎఫ్ కూటమికి చెందిన మంగ్పి ఘన విజయం సాధించడం విశేషం.

హైదరాబాద్‌లో టీఐసీ తొలి అకాడమీ



హైదరాబాద్: ది ఇన్వెస్టర్ కో (టీఐసీ) హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో తమ మొదటి అకాడమీని ప్రారంభించింది. టీఐసీ వ్యవస్థాపకులు రక్షత్ గోయల్, సంస్థ మాస్టర్ ఫ్రాంచైజీ నిర్వాహకులు విశ్వనాథ్ సామా, అకాడమీ ఫ్రాంచైజీ నిర్వాహకులు సంజయ్ దోల్వానీ నూతన అకాడమీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణలేమి, ట్రేడింగ్‌పై అపనమ్మకం, ఆర్థిక రక్షణ లేకపోవడంతో ఎక్కువ మంది మార్కెట్లను నమ్మడం లేదన్నారు. అయితే ప్రజల్లో ఈ అయోమయాన్ని తొలగించి, మార్కెట్లలో వారు తొలి అడుగు వేసేందుకు టీఐసీ అకాడమీ సహాయపడుతుందని, దీనికోసం ఈ ఫైనాన్షియల్ స్టార్టప్ ప్లాట్‌ఫాంను అందుబాటులోకి తెచ్చిందని వెల్లడించారు. వివరాలకు 7673983352 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు కరెంట్ చార్జీల పెంపుపై నిర్ణయం

- రూ.1,200 కోట్ల విద్యుత్ చార్జీల పెంపునకు డిస్కంల ప్రతిపాదన
- రూ.963 కోట్ల ట్రూఅప్ చార్జీల వసూళ్లకు జెన్‌కో విన్నపం
- ప్రకటించనున్న తెలంగాణ ఈఆర్సీ
- 9 వేర్వేరు పిటిషన్లపై రానున్న ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు దాఖలు చేసిన 9 వేర్వేరు పిటిషన్లపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) సోమవారం తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఈ మేరకు వేర్వేరు టారిఫ్ ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్యల ఐదేళ్ల పదవీకాలం మంగళవారంతో ముగియనుండగా, ఒకరోజు ముందు ఈ పిటిషన్లపై తమ నిర్ణయాన్ని వెల్లడించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రాష్ట్రంలో రూ.1,200 కోట్ల మేర విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కం) దాఖలు చేసిన ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్) పిటిషన్లతో పాటు 2024-29 మధ్యకాలానికి సంబంధించిన మల్టీ ఇయర్ టారిఫ్ (ఎంవైటీ) పిటిషన్లపై ఈఆర్సీ ప్రకటించనున్న నిర్ణయం కీలకం కానుంది. దీంతో నవంబర్ 1 నుంచి వినియోగదారులపై ప్రత్యక్షంగా చార్జీల పెంపు భారం పడబోతోంది. హెచ్‌టీ కేటగిరీలో ఎనర్జీ (విద్యుత్) చార్జీల పెంపు, లోటెన్షన్ (ఎల్టీ) కేటగిరీలో నెలకు 300 యూనిట్లకుపైగా వినియోగించే వారి ఫిక్స్‌డ్ చార్జీ (డిమాండ్ చార్జీ)ల పెంపును డిస్కంలు ప్రతిపాదించాయి. హెచ్‌టీ కేటగిరీకి ఎనర్జీ చార్జీల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో రూ.100 కోట్లు కలిపి రూ.800 కోట్లు భారం వేసేందుకు అనుమతి కోరాయి. మరో రూ.400 కోట్లను ఎల్టీ వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీల పెంపు ద్వారా రాబట్టుకుంటామని డిస్కంలు ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. అలాగే జెన్‌కో 2022-23కి సంబంధించి దాఖలు చేసిన రూ.963.18 కోట్ల ట్రూఅప్ చార్జీల పిటిషన్‌తో పాటు 2024-29 మధ్యకాలానికి సంబంధించిన ఎంవైటీ పిటిషన్‌పై సైతం ఈఆర్సీ నిర్ణయాన్ని ప్రకటించనుంది. వీటితో భవిష్యత్తులో వినియోగదారులపై పరోక్షంగా చార్జీల పెంపు భారం పడనుంది.

రూ.16,346 కోట్ల ట్రాన్స్‌కో ఏఆర్ఆర్‌పై రేపు

ట్రాన్స్‌కో దాఖలు చేసిన 2024-29 మధ్యకాలానికి ట్రాన్స్‌మిషన్ బిజినెస్, ఎస్ఎల్‌డీసీ యాక్టివిటీకి సంబంధించిన రెండు ఎంవైటీ పిటిషన్లపై ఈఆర్సీ తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. వచ్చే ఐదేళ్లలో మొత్తం రూ.16,346.1 కోట్ల ఆదాయ అవసరాలున్నట్టు అంచనా వేస్తూ ఆ మేరకు ట్రాన్స్‌మిషన్ చార్జీలను కొంతవరకు పెంచి వసూలు చేసుకోవడానికి ట్రాన్స్‌కో ప్రతిపాదించింది.

పది రోజుల్లో పనులు షురూ

'స్కిల్స్ వర్సిటీ'కి ముందడుగు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాల నిర్మాణాలకు మరో ముందడుగు పడింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఈ క్యాంపస్‌ను నిర్మించేందుకు అంగీకరించింది. అంతేకాదు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇందుకు రూ.200 కోట్ల భారీ విరాళాన్ని కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. నవంబర్ 8న అకాడమిక్, పరిపాలన, ల్యాబొరేటరీ, గ్రంథాలయం, పార్కింగ్, ఫుడ్‌కోర్టు, 700 మంది కూర్చొనే సామర్థ్యం గల ఆడిటోరియం, భద్రతా సిబ్బంది వసతి గృహాలు, క్రీడా మైదానాల పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే టీఎస్ఐఐసీ, జిల్లా రెవెన్యూ యంత్రాంగాలు ఆయా భూములను సేకరించి, చదును చేసి వర్సిటీకి అప్పగించాయి.

17 కోర్సులు.. ఏటా 20 వేల మందికి శిక్షణ

కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్ 112లోని 57 ఎకరాల విస్తీర్ణంలో రూ.150 కోట్ల అంచనా వ్యయంతో 'యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ' నిర్మాణానికి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. వర్సిటీలో ఫార్మా, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, రిటైల్, ఈ కామర్స్, లాజిస్టిక్, ప్యాకింగ్, హార్డ్‌వేర్, ఎలక్ట్రీషియన్ వంటి 17 రంగాల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్, మూడేళ్ల డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ కోర్సులను అందించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కోర్సులను నిర్వహించనున్నారు. ఏటా 20 వేల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో 'యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ బిల్లు-2024'ను కూడా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గవర్నర్/ సీఎం ఈ వర్సిటీకి చాన్స్‌లర్‌గా వ్యవహరించనున్నారు. వీసీ సహా 15 మందితో పాలకమండలి ఉంటుంది. ఇందులో ఏడుగురు సభ్యులు పరిశ్రమలకు చెందిన వారే ఉంటారు. వర్సిటీ మూడేళ్ల నిర్వహణకు రూ.312 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేసింది. రూ.170 కోట్లు కేవలం కోర్సుల ఫీజుల రూపంలో సమకూరనున్నాయి.

సీఎస్ఆర్ కింద ఓ గ్రామాన్ని దత్తత తీసుకోవాలి

మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి కార్పొరేట్ సంస్థ ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజాభవన్‌లో కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థ ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రణాళికాబద్ధంగా సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేయాలని, ఇందుకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఆదిలాబాద్, ములుగు వంటి అటవీ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలని కోరారు. కంపెనీలు పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో తమ సామాజిక బాధ్య తను, కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. మారు మూల ప్రాంతాల్లో ఉన్న అవకాశాలను, వనరులను, అవసరాలను కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలకు తెలియజెప్పేందుకు వారితో కలిసి త్వరలో బస్సు యాత్ర చేపట్టనున్నట్టు సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవసాయ వర్సిటీకే ఐకార్ గుర్తింపు

జయశంకర్ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ కోర్సుల ప్రవేశం కోసం.. ప్రైవేటు సంస్థల మాయాజాలంలో చిక్కుకోవద్దని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికే 'ఏ' గ్రేడ్‌తో కూడిన ఐకార్ గుర్తింపు ఉందని ఆయన స్పష్టం చేశారు. గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలలతో తమకెలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీట్లు ఇప్పిస్తామని ప్రచారం చేసుకునే దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను హెచ్చరించారు. ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కోటాలో భారీగా ఫీజులు తగ్గించడమే కాకుండా.. సీట్లు కూడా పెంచామని వివరించారు. పెంచిన సీట్లను కౌన్సెలింగ్ ద్వారా.. ప్రతిభ ప్రాతిపదికపై భర్తీ చేస్తామని తెలిపారు. ఎలాంటి దళారులు, కన్సల్టెంట్లపై ఆధారపడవద్దని, వారి మాయమాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. పెంచిన ప్రత్యేక కోటా సీట్ల భర్తీ కోసం ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నవంబర్ 1 వరకు స్వీకరిస్తున్నామని వెల్లడించారు. ప్రవేశాల సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్ www.pjtsau.edu.inను మాత్రమే చూడాలని జానయ్య సూచించారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి

సాక్షి, హైదరాబాద్:ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నేత మొగుళ్ల రాజిరెడ్డి నియమితులయ్యారు. జనగామ జిల్లాకు చెందిన రాజిరెడ్డిని ఉపాధ్యక్షునిగా నియమిస్తూ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ జలమండలి యూనియన్ అధ్యక్షుడిగా ఉన్న రాజిరెడ్డి.. భవిష్యత్తులో యూనియన్ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, తనను ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి.. రాజిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ బలోపేతంతో పాటు కార్మికుల సంక్షేమం కోసం భవిష్యత్తులో పనిచేస్తానని ఆదివారం ఒక ప్రకటనలో రాజిరెడ్డి వెల్లడించారు.



స్నేహితుడిని పొందే ఏకైక మార్గం స్నేహితుడిలా ఉండటమే!
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 28 అక్టోబర్ 2024

సువర్ణ వాకిలి

'చూశావా... ఏం తెచ్చానో' అన్నాడతను స్కూటర్ ఇంటి ముందు ఆపి. వెనుక ట్రాలీ వచ్చి ఆగింది. అన్నీ మొక్కలే. నర్సరీ నుంచి తాజాగా దిగినవి. 'అడిగావుగా... మల్లెతీగ తెచ్చాను'... 'ఇదిగో... నీకు ఇష్టమైన బంతి. కుండీలోనే ఎన్ని పూసేసిందో చూడు'... 'చిట్టి రోజాలు... రెక్క చామంతులు... ఈ మందారం కొమ్మలేసేంతగా పెరిగితే చాలా బాగుంటుంది'... వరుసగా చూపుతున్నాడు. ఎన్నాళ్లుగానో అడుగుతోంది. ఇవాళ ఉదయాన్నే లేచి, చెప్పా పెట్టకుండా వెళ్లి తెచ్చాడు. సంతోషంగా, సంబరంగా, ప్రేమగా చూస్తోంది వాటన్నింటిని! 'నన్నూ తీసుకెళ్లుంటే బాగుండేదిగా'... 'ఇంట్లోకి మొక్కలు వస్తున్నప్పుడు నువ్వు ఎదురు రావాలనీ'... ఆమె చేతిలో చాలా పూలున్న చిన్న కుండీని పెట్టి సెల్ఫీ దిగాడు. ఇద్దరూ హాయిగా నవ్వారు ఫొటోలో. 'దీని పేరు బెగోనియా అట. బాగుంది కదూ'...

మరోచోట మరో ఇంటతను రెండు రోజులుగా ఇల్లు సర్దుతున్నాడు. భార్యను పిలిచి 'అనవసరమైన సామాను చాలా పేర్చిపెట్టావు చూడు' అని బుజ్జగించి పారవేయించాడు. మాసిన కర్టెన్లు తీసి, ఉతికిన కర్టెన్లు మార్చాడు. దుమ్ము పట్టిన లైట్లను తుడిచాడు. అన్నీ చక్కగా అమర్చి హాల్లో రెండు ర్యాకులను ఖాళీగా సంపాదించగలిగాడు. 'ఇప్పుడు ఏం చేద్దామని ఈ ర్యాకులను' అందామె. 'చెప్తా' అని సాయంత్రం పిల్లల్ని తీసుకొని ఆటో ఎక్కి పుస్తకాల షాపుకు చేరాడు. 'పిల్లలూ... ఒక ర్యాకుకు సరిపడా పుస్తకాలు మీరు కొనుక్కోండి. ఒక ర్యాకుకు సరిపడా మేము కొనుక్కుంటాం'.... పెళ్లికి ముందు వారిద్దరూ పుస్తకాలు చదివేవారు. సంసారంలో పడి వదిలేశారు. 'ఇష్టమైన అలవాటు. తిరిగి మొదలెడదాం' అన్నాడు భార్యతో. అప్పటికే ఆమె పుస్తకాలు ఎంచి ఒకవైపు పెట్టేస్తోందిగా!

ఇంకో నగరం. ఉదయపు ఎండ ఎక్కువగా లేదు. అలాగని తక్కువగా లేదు. మంచి గాలి వీస్తున్నందు వల్ల బాల్కనీలో ఎదురూ బొదురూ సమయం ఆహ్లాదంగా ఉంది. 'నీ ఫోను ఇవ్వు' అన్నాడామెతో భర్త. తీసుకుని స్విగ్గి, జొమాటో లాంటి యాప్స్ డిలీట్ చేశాడు. తన ఫోన్ ఆమెకు ఇచ్చాడు. 'ఫుడ్ డెలివరీ యాప్స్ తీసెయ్' అన్నాడు. తీసేసింది. 'ఇవాళ్టి నుంచి బయటి తిండి వద్దు. ఈ ఇంట్లోకి ఏది వచ్చినా ఇకపై హెల్దీదే వస్తుంది. నేను వారంలో మూడు బ్రేక్‌ఫాస్ట్‌లు, కనీసం రెండు డిన్నర్లు నువ్వు కిచెన్‌లోకి రానవసరం లేకుండా చేయగలను. మిగిలింది నువ్వు చేయి. అసలు పొయ్యి ఎక్కవలసిన అవసరం లేని మంచి తిండి కూడా పిల్లలతో కూచుని డిజైన్ చేద్దాం. ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకు వెచ్చించే సమయం మన ఉదరం కోసం వెచ్చిస్తే తెలిసి తెలిసీ ద్రోహం చేసుకోని వాళ్లం అవుతాం. మన తాత ముత్తాతలు వండుకోవడానికి తిండిలేక ఏడ్చేవాళ్లు. మనకు అన్నీ ఉన్నా వండుకోవడానికి ఏడిస్తే ఎలా? పరుగు పెట్టి సంపాదించి పట్టెడు మెతుకులు తినలేని స్థితికి చేరితే సంతోషమా మనకు?'

అబ్బో! ఆ ఇంటిలో సందడి వేరేగా ఉంది. కోడలు మాటిమాటికీ ఊరికి ఫోన్లు మాట్లాడుతూ ఉంది. టికెట్ల ఏర్పాటు చూస్తూ ఉంది. అంత వరకూ ఖాళీగా ఉన్న మూడో బెడ్‌రూమును సిద్ధం చేస్తూ ఉంది. కొడుకు ఉద్వేగంగా ఉన్నాడు. కలా నిజమా తేల్చుకోలేక ఉన్నాడు. సాకులు వెతుక్కున్నారు తనూ తన భార్య. లేనిపోని తప్పులు వెతికారు తనూ తన భార్య. మా జోలికి రావద్దని తేల్చి చెప్పారు ఇద్దరూ కలిసి. బాగానే ఉంది. హాయిగా ఉంది. కాని బాగానే ఉందా... హాయిగా ఉందా... తల్లితండ్రులు అడుగుపెట్టి నాలుగేళ్లు అవుతున్న ఈ ఇల్లు. వారి ఆశీర్వాదం తాకని ఇల్లు. వారి మాటలు వినపడని, వారి గదమాయింపులూ ఆత్మీయ హెచ్చరికలూ లేని ఇల్లు. పశ్చాత్తాపం పిల్లలకు మరో పుట్టుక ఇస్తుంది. ఈ పుట్టుక తల్లితండ్రులను కోరింది. మనవలు వెళ్లి రిసీవ్ చేసుకొని తీసుకువస్తే కొడుకూ కోడల్ని కన్నీటి కళ్లతో చూస్తూ లోపలికి అడుగు పెట్టారు తల్లితండ్రులు. విశేషం చూడండి. ఆ రోజు 'ధన్‌తేరస్'.

సాధారణంగా ధన్‌తేరస్‌కి ఇంటికి బంగారం వస్తే మంచిది అనంటారు. కాని పై నాలుగు ఇళ్లలో బంగారం వంటి నిర్ణయాలు జరిగాయి. సిసలైన 'ధన్‌తేరస్' అదే కావచ్చు.

ధనం వల్ల ధన్యత రాదు. ధన్యత నొసగే జీవితం గడపడమే నిజమైన ధనం కలిగి ఉండటం. గాలినిచ్చే మంచి చెట్టు, పుష్టినిచ్చే తాజా ఆహారం, కష్టసుఖాలు పంచుకునే నిజమైన మిత్రులు, బుద్ధి వికాసాలు కలిగించి ఈర్ష్యా వైషమ్యం పోగొట్టే పుస్తకాలు, సదా అమ్మా నాన్నల సాంగత్యం, కుటుంబ సభ్యులంతా కలిసి భోం చేయగల సమయాలు, కనీస వ్యాయామం... ఇవి ఏ ఇంట ప్రతిరోజూ ఉంటాయో, అడుగు పెడతాయో, అంటిపెట్టుకుని ఉన్నాయన్న భరోసా కల్పిస్తాయో ఆ ఇల్లు సదా సమృద్ధితో అలరారుతుంది. అక్కడ అనివార్యంగా సంపద పోగవుతుంది. ఉత్తమమైన లోహం బంగారం. అది ఉత్తమమైన నివాసాన్నే ఎంచుకుంటుంది.

శీతగాలులు ముమ్మరమయ్యే ముందు ఉల్లాస, ఉత్సాహాల కోసం దీపావళి. పనికి మనసొప్పని ఈ మందకొడి రోజులలో జీవనోపాధి దొరకకపోతే గనక జరుగుబాటుకు దాచిన ధన్‌తేరస్ పసిడి. పెద్దలు ఏం చేసినా ఆచితూచి, ఆలోచించి చేస్తారు. ధన్‌తేరస్‌కు తప్పక బంగారం, వెండి, వస్తువులు కొనదలుచుకుంటే కొనండి. కాని ప్రతి ఇల్లూ ఒక సువర్ణ వాకిలి కావాలంటే మాత్రం అహం, అసూయ, అజ్ఞానాలను చిమ్మి బయట పారబోయండి! 'వాడికేం... బంగారంలా బతికాడు' అంటారు. అలా బతికి అనిపించుకోండి!

ధన త్రయోదశి శుభాకాంక్షలు. ప్రతి ఇంటా వికసిత కాంతులు కురియుగాక!

ముఖాముఖి సంభాషణల్లో మేటి

కామెంట్



కరణ్ థాపర్


ఒక మనిషిని ఇంటర్వ్యూ చేయడమంటే పైపై ప్రశ్నలు అడగటం కాదు. లోతుగా, సునిశితంగా, ప్రేక్షకులకు మరింత సమాచారాన్ని, ఆ విషయం మీద మంచి అవగాహనను ఇచ్చేలా ఆ సంభాషణ జరగాలి. అలాంటి అర్థవంతమైన ఇంటర్వ్యూలకు పెట్టింది పేరు బీబీసీలో వచ్చే 'హార్డ్‌టాక్'. 1997లో మొదలైన ఈ కార్యక్రమం ఆంగ్లంలో వార్తలు చూసేవారికి ప్రపంచవ్యాప్తంగా సుపరిచితం. అసలు బీబీసీ వరల్డ్ సర్వీస్‌ను ప్రేక్షకులు ఇష్టపడేదే ఈ ఇంటర్వ్యూ కోసం! నెల్సన్ మండేలా, మిఖాయిల్ గోర్బచేవ్, కోఫీ అన్నన్, బేనజీర్ భుట్టో, హ్యూగో చావెజ్ లాంటి ఎందరో భిన్న దేశాల నాయకులను ఇందులో ఇంటర్వ్యూ చేశారు. అయితే, పాతికేళ్లుగా వస్తున్న ఈ కార్యక్రమాన్ని ఖర్చులు తగ్గించుకోవడానికి ఆపేస్తున్నారని తెలియడం నిరాశ కలిగిస్తోంది.

'హార్డ్‌టాక్' పేరుతో బీబీసీలో ఓ కార్యక్రమం వస్తుంది. నాకు చాలా ఇష్టమైన ప్రోగ్రామ్. ప్చ్... రానున్న మార్చి నుంచి ఈ కార్యక్రమం ఉండదు. ఈ వార్త నన్ను ఆశ్చర్యపరిచింది. కొంత నిస్పృహ కూడా ఆవరించింది. అసలా నిర్ణయమే మూర్ఖమైంది అనుకుంటున్నా. అయితే నిర్ణయం జరిగిపోయింది, ఇక చేసేందుకు ఏమీ లేదు.

ఖర్చులు తగ్గించుకునే కార్యక్రమంలో భాగంగా బీబీసీ... హార్డ్‌టాక్‌ను నిలిపేస్తోందని తెలిసింది. సుమారు 70 కోట్ల పౌండ్లు సంస్థకు ఆదా చేయాలన్నది ఆలోచన. అసలీ ప్రోగ్రామ్‌కు ఎంత ఖర్చు అవుతోందో నాకు స్పష్టంగా తెలియదు కానీ... 70 కోట్ల పౌండ్లలో చాలా చాలా తక్కువ భాగమని మాత్రం అనుకుంటున్నా. నా భయమల్లా ఇది ఏదో చేయబోయి, ఇంకేదో అయినట్లు అవుతుందేమో అని! ఈ నిర్ణయం తీసుకున్నందుకు భవిష్యత్తులో బీబీసీ కచ్చితంగా పశ్చాత్తాప పడుతుంది. వీటన్నిటికంటే ముఖ్యమైన విషయం... నా లాంటి ఫాలోయర్లు బాగా నిరుత్సాహపడతారు. ఎందుకంటే హార్డ్‌టాక్ కేవలం ఒక టాక్‌షో కాదు... బీబీసీలో ఇలాంటి ప్రోగ్రామ్ ఇంకోటి లేదు. అంతెందుకు చాలా ఛానెళ్లలోనూ లేదు. ఒక విషయం మీద సంపూర్ణ అవగాహన, విషయాన్ని పైస్థాయిలో చూడగలగడం, ఉద్వేగపూరిత లోతు ఉండే ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడో తప్ప కనబడవు.

సరే... ఏంటి హార్డ్‌టాక్ ప్రత్యేకత? ముఖాముఖి ఇంటర్వ్యూలలో దీర్ఘకాలం నడుస్తున్న ప్రోగ్రామ్ ఇది. నిర్దిష్ట అంశంపై ప్రముఖుడు ఒకరు మాట్లాడటం ఈ కార్యక్రమంలో జరుగుతుంది. ముఖాముఖి ఇంటర్వ్యూల్లో చాలా దూకుడుగా ఉంటుంది. చర్చకు ఉద్దేశించిన అంశం ముందు వెనుకల గురించి క్షుణ్ణంగా పరిశీలించి, అర్థం చేసుకున్న తరువాతే కార్యక్రమం జరుగుతుంది. ప్రోగ్రామ్ పూర్తయిన తరువాత మనకు విషయ పరిజ్ఞానం పెరుగుతుందనడం అతిశయోక్తి కాదు. ఉన్న అనుమానాలు తీరతాయి కూడా! ఏ న్యూస్ బులిటెన్ కూడా విడమరచి చెప్పలేని విధంగా హార్డ్‌టాక్‌లో విషయాలపై చర్చ జరుగు తుంది. క్లుప్తంగా చెప్పాలంటే ఈ కార్యక్రమం ఛానల్‌లో అవశేషం కాదు... గుండెకాయ లాంటిది!

కొంచెం వివరంగా ఆలోచిస్తే ఇంకో విషయం స్పష్టమవుతుంది.



బీబీసీకి అసలు విషయం అర్థం కాలేదనాలి. సుదీర్ఘ ఇంటర్వ్యూలు... ప్రశ్నించేందుకు, వివరాలు తెలుసుకునేందుకు, మనం అనుకున్న విషయాలపై పట్టుబట్టేందుకు, విషయం లోతుల్లోకి వెళ్లేందుకు అవకాశం కల్పిస్తాయి. ఇది చిన్న చిన్న ఇంటర్వ్యూల ద్వారా అసాధ్యం. హార్డ్‌టాక్ వంటి కార్యక్రమాలను నిర్వహించడం అందరికీ సాధ్యం కాక పోవచ్చు. కానీ... చాలామంది ఇష్టపడే కార్యక్రమం.

చాలా ఎక్కువగా పొగుడుతున్నానని అనుకుంటూ ఉంటే ఒకసారి ఆలోచించండి. బీబీసీలో హార్డ్‌టాక్ ప్రెజెంటర్లకే పేరు ప్రఖ్యాతులు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకు? అప్పట్లో టిమ్ సెబాస్టియన్ చాలామంది అభిమానం, ఆరాధన పొందిన హార్డ్‌టాక్ ప్రెజెంటర్ (1997 నుంచి ఎనిమిదేళ్ల పాటు చేశారు)! ఈయనతో ఇంటర్వ్యూ అంటే... చాలామంది ఇబ్బంది పడేంత జనాదరణ సంపాదించుకున్నారు టిమ్. ఇంటర్వ్యూలు ఎదుర్కొన్న వారు టిమ్‌ను ఇష్టపడలేదన్నది బహిరంగ రహస్యం.

2005 నుంచి హార్డ్‌టాక్ కార్యక్రమాన్ని స్టీఫెన్ సాకర్ నిర్వహిస్తున్నారు. ఈయన టిమ్ కంటే చాలా భిన్నం. కానీ ఆదరణ మాత్రం బాగా ఉంది. టిమ్ వైఖరి చాలా దూకుడుగా ఉండేది. అవతలి వ్యక్తికి పదే పదే అడ్డు తగిలేవాడు. సూటి ప్రశ్నలు సంధించేవాడు. స్టీఫెన్ కొంచెం ఆలోచించి ప్రశ్నలు వేస్తాడు. కొన్నిసార్లు ప్రొఫెసర్ మాదిరిగా వ్యవహరిస్తాడు కూడా! టిమ్ విధ్వంసం లాంటి వాడైతే స్టీఫెన్ నెమ్మదిగా అవతలి వ్యక్తి మెదడును ఆక్రమించేసే టైపు. టిమ్, స్టీఫెన్‌లు ఎవరైనా సరే... నిష్ఠుర సత్యాలతో అతిథిని ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి నెడతారు.

నా భయమల్లా బీబీసీ మరీ మొద్దుబారిపోతోందేమో అని! అత్యద్భుతమైన కార్యక్రమాలను అకస్మాత్తుగా నిలిపివేయడం ఈ మధ్యకాలంలో ఇది రెండోసారి. 'న్యూస్‌నైట్' ఛానెల్ మొత్తానికి హైలైట్‌గా ఉండేది. రెండు మూడు కథనాలను మాత్రమే చర్చించేవారు కానీ... చాలా లోతుగా సాగేది. ఈ కార్యక్రమ ప్రెజెంటర్ జెరెమీ ప్యాక్స్‌మన్ మంచి జర్నలిస్టుగా ఇంగ్లిష్ మాట్లాడే దేశాల్లో పేరొందారు. న్యూస్‌నైట్‌లో వచ్చిన మరో గొప్ప వార్తా కథనం ప్రిన్స్ ఆండ్రూతో ఎమిలీ మైట్లిస్ నిర్వహించిన ఇంటర్వ్యూ.

అన్నీ పోయాయి. ఇప్పుడు కార్యక్రమాలన్నీ న్యూస్ బులిటెన్‌ను మరింత పొడిగించినట్లు మాత్రమే కొనసాగుతున్నాయి. ప్రతి వారం రాత్రి 10 గంటలకు తప్పకుండా చూడాలని అనుకునే స్థాయి నుంచి ఇప్పుడు... చూడకపోయినా ఏం కాదులే అన్న స్థితికి వచ్చేశాం. చాలా మంది పరిస్థితి కూడా ఇదే!

విచిత్రమైన విషయం ఏమిటంటే... బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ 'వరల్డ్ సర్వీస్' కోసం అదనపు నిధులు కావాలంటూ ఒక పక్క బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడుతున్నారు. హార్డ్‌టాక్ మూతపడుతోందన్న వార్తలు రాగానే స్టీఫెన్ చేసిన ఒక ట్వీట్ గుర్తుకొస్తోంది: ''అద్భుతమైన ప్రొడ్యూసర్లు, పరిశోధకులు ఉన్న బృందాన్ని విడదీశారు. బీబీసీ వరల్డ్ సర్వీస్ కార్యక్రమం అనేది ప్రజాస్వామిక భావప్రకటనకు ఎంత ముఖ్యమో టిమ్ ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు.''

హార్డ్‌టాక్ ప్రభావశీలత, ఆ కార్యక్రమం ద్వారా వ్యక్తమయ్యే భావాలు ఎంత కీలకమైనవో టిమ్ డేవీకి తెలుసా? బీబీసీ వరల్డ్ కార్యక్రమం చూసేదే అందులోని హార్డ్‌టాక్ కోసమని ఆయన అర్థం చేసుకున్నారా? 'హార్డ్‌టాక్'ను ఎత్తేయడం ఇప్పుడు దాన్ని చూడకుండా ఉండటానికి మరో అదనపు కారణం అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నింద వెనుక...



ఈ రోజుల్లో ఎవరినైనా నాజీ అనడం అంటే దానర్థం, 'నీకు అభిప్రాయం ఉండే హక్కును నిరాకరిస్తున్నాను' అని చెప్పడం.

- రసెల్ బ్రాండ్, నటుడు

తప్పకొంటారా?



(నవంబర్‌లో మొదలుకానున్న) ఆస్ట్రేలియా టూరు మొదలుకాకముందే టెస్టు క్రికెట్ నుంచి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ విరమణను ప్రకటిస్తారని నాకు గట్టిగా అనిపిస్తోంది.

- మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

అసలు విలాసం



ఆధునిక జీవితంలో విలాసం ఏమిటంటే, సాధారణ, ప్రశాంతమైన జీవితం గడపగలగడం! అది మితిమీరిన వస్తువులు కలిగివుండటం వల్లనో, అందరికీ తెలిసేట్టుగా వాటిని వినియోగించడం వల్లనో రాదు.

- తాహిర్ అష్రఫ్, పోలీసు అధికారి

ప్రేమ లోతు



ప్రేమ అనేది అద్భుతమైన, ఉదాత్తమైన భావన. కానీ అది ఉచితంగా రాదు. మనం ఇతరుల జీవితాల్లోకి సంతోషాన్ని తేగలిగినప్పుడే దాన్ని పొందగలం. అప్పుడు మాత్రమే ఈ అందమైన, తేజోవంతమైన అనుభూతి తాలూకు పూర్తి లోతులను అనుభవించగలం.

- జాఫర్ మీర్జో, రచయిత

అలా మొదలు...



ఫాసిజం ఎలా మొదలవుతుందని (బ్రిటిష్ తత్వవేత్త) బెర్ట్రాండ్ రసెల్‌ను అడిగితే ఆయన ఇలా జవాబిచ్చారు: 'ముందు వాళ్లు మూర్ఖులను ఫాసినేట్ (భ్రమ కల్పించడం) చేస్తారు. తర్వాత తెలివైనవాళ్ల నోళ్లు మూస్తారు.'

- బిల్ మాడెన్, సంగీతకారుడు

ఇంకోలా తీయొచ్చా?



నాకు ఎనిమిదేళ్లు ఉన్నప్పుడు విటోరియో డెసికా దర్శకత్వం వహించిన 'బైసికిల్ థీవ్స్'(1948) సినిమా చూశాను. సినిమాలను ఇంకా ఎన్నో రకాలుగానో తీయొచ్చన్న ఆలోచనల వరదను అది పుట్టించింది.

- అల్ఫాన్సో క్వేరన్, మెక్సికో దర్శకుడు

అంతటా దయే!



మీరు గెలిచినప్పుడు దయగా ఉండండి. మిమ్మల్ని పట్టించుకోనప్పుడు దయగా ఉండండి. మీరు నిలిచిపోయినప్పుడు దయగా ఉండండి. మీరు నిరాశగా ఉన్నప్పుడు దయగా ఉండండి. మీరు సంశయంలో ఉన్నప్పుడు దయగా ఉండండి. మీరు భయంలో ఉన్నప్పుడు దయగా ఉండండి. దయ అనేది బలహీనతకు సంకేతం కాదు. దయ అనేది మీకు ఎప్పుడూ మేలే చేస్తుంది.

- వాలా అఫ్సార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

ఇన్ బాక్స్

ఇది నిజంగా యుద్ధమే!

దళితోద్యమనాయకులు, కవి, రచయిత అయిన కత్తి పద్మారావు స్వీయ చరిత్ర 'అస్పృశ్యుని యుద్ధ గాథ' మూడో భాగం ఇటీవల వెలువడింది. నిచ్చెన మెట్ల భారతీయ సమాజంలో ఒక సాధారణ దళితుని జీవనమే పెద్ద యుద్ధంతో సమానం. అటువంటిది దళితుల పక్షాన ఉద్యమించి, ఒక నాయకునిగా అవతరించడానికి ఎంతటి యుద్ధం చేయవలసి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆయన చేసిన దళిత పోరాటాలు, దళిత బహుజన జీవన సంస్కృతులపై ఆయన



విశ్లేషణ, ఆయనలో దాగి ఉన్న తాత్వికత, హేతుబద్ధత, ప్రకృతితో ఆయన మమేకమైన తీరు ఈ పుస్తకంలో చూడవచ్చు. తన స్వీయ చరిత్ర మొదటి, రెండవ భాగాలలో తన బాల్యం, కారంచేడు పోరాటాల గురించి రాశారు. ప్రస్తుత మూడో భాగంలో సామాజిక, సాంస్కృతిక, కవిత్వ, తాత్విక జీవిత యానాన్ని దృశ్యీకరింపజేశారు. ప్రకృతిలో భాగంగా బతికే యానాదులంటే తనకు ఇష్టమనీ, అందుకే తన జీవితానికీ వారి జీవితానికీ దగ్గరి సంబంధం ఉందంటారాయన.

స్వయంగా బౌద్ధ మతాన్ని ఆచరించే ఈయన బౌద్ధాన్ని స్త్రీవాద కోణం నుండి అధ్యయనం చేశారు. దానికి సంబంధించిన వివరాలు ఈ పుస్తకంలో ఎన్నో ఉన్నాయి. అలాగే సాంఖ్య, యోగ దర్శనాల గురించీ అనేక వివరణలు ఇందులో ఇచ్చారు. ఇటీవల హిందూ మతం పునర్జీవనం కావడానికి కొన్ని సంస్థలు చేస్తున్న ప్రయత్నానికి కొన్ని దళితవాడలు దోహదకరంగా ఉన్నాయనీ, ఈ రివైవలిజం 10 శాతం దళిత ఉద్యోగుల్లో, దళిత వాడల్లో జరుగుతోందనీ కత్తి గమనించారు. సంస్కృతం లెక్చరర్‌గా పనిచేసిన ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసినప్పుడు... 'నేను దిగులు పడింది జీతం గురించి కాదు, పాఠం చెప్పే అవకాశం పోయింది' అని ఆనాటి తన మానసిక స్థితిని పేర్కొన్నారు. అయితే ఉద్యమ ప్రస్థానంలో వందలాది సభల్లో లక్షలాదిమందిని ఉద్దేశించి చేసిన ప్రసంగాలు తనకు తృప్తినిచ్చాయంటారాయన.

ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమిది. దీన్ని చదివితే కుల నిర్మూలనా చైతన్యం, ఆచరణ సంస్కృతి ప్రతి ఒక్కరిలో కలుగుతుంది. ఈ పుస్తకం సమకాలీన చరిత్రను గ్రంథస్థం చేసిన అమూల్యమైన రికార్డుగా చెప్పడం అతిశయోక్తి కాదు.

– బండి రుక్మిణీ ప్రసన్న, నూజివీడు

సామాన్యుల భాషలో... సన్నిహితమైన న్యాయం

సందర్భం



తడకమళ్ల మురళీధర్

మన దేశంలోని అన్ని హైకోర్టుల్లో అధికారికంగా వాడేది ఇంగ్లీషు భాష. కానీ కేసులో గెలిచినవాడు, ఓడిన సామాన్యుడు కూడా తమ గెలుపోటములకు కారణాలు అర్థం చేసుకోలేని పరిస్థితి. అందుకే తీర్పుల్లోని కారణాలు అర్థమయ్యే భాషలో తెలియజేసి, సామాన్యుడికి న్యాయ వ్యవస్థ చేరువ కావాలనే సదుద్దేశ్యంతో సుప్రీంకోర్టు, దేశంలోని అన్ని హైకోర్టులు వారి తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించి, ఉచితంగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.

ఇటీవల తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాము ఇంగ్లీషులో వెలువరించే ముఖ్యమైన తీర్పులను తెలుగులోకి అనువాదం చేయించే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది. తదనుగుణంగా ఇంగ్లీషు నుండి తెలుగులోకి తర్జుమా చేయటానికి విశ్రాంత ఉద్యోగులు, విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదుల సేవలు వినియోగించుకుంటోంది. అనువాదకుల కొరత మూలాన ప్రస్తుతానికి ముఖ్యమైన తీర్పులకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

అనువాదకుల సేవలు ఉచితంగా స్వీకరించటం లేదు. వారి సేవలకు గాను, హైకోర్టు ప్రతి పేజీకి మూడు వందల రూపాయలు చెల్లిస్తుంది. ఇంగ్లీషులో వెలువరించిన తీర్పుల కాపీలను వారి ఇంటి దగ్గరే అనువాదం చేసి, సహేతుకమైన సమయంలో అనువాదాన్ని హైకోర్టులోని సంబంధిత అధికారులకు స్వయంగా అందజేయడం లేదా ఆన్‌లైన్‌లో పంపించటం అనువాదకుల పని.

ఈ కార్యక్రమ సక్రమ నిర్వహణ కోసం హైకోర్టు తన పరిపాలనా భవనంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగంలో తెలుగు భాషపై పట్టున్న ఇద్దరు విశ్రాంత జిల్లా న్యాయమూర్తులను ఎడిటర్, డిప్యూటీ ఎడిటర్‌గా; ఒక విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జిని రిపోర్టర్‌గా నియామకం చేసింది. ఇంగ్లీషు నుండి తెలుగులోకి ప్రైవేటు అనువాదకులు తర్జుమా చేసిన ముఖ్యమైన తీర్పులను జాగ్రత్తగా పరిశీలించి, ప్రతి తీర్పుకు అందులో ఉన్నటువంటి ముఖ్యాంశాలను జోడించి, వాటిని తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్‌లో నెల వారీగా పెట్టవలసిన బాధ్యత వీరికి అప్పగించింది. వెబ్‌సైట్‌ను 2024 ఆగస్టు 15న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమైన తీర్పుల తెలుగు ప్రతులను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొని చదువుకునే అవకాశం కల్పించారు.

అనువాదకులను శాశ్వత ప్రాతిపదికన నియమించుకోడానికి, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు అనుమతి ఇచ్చింది. 25 తెలుగు అనువాదకులు, 10 డేటా ఎంట్రీ



ఆపరేటర్లు, 5 తెలుగు టైపిస్ట్ పోస్టులను కూడా మంజూరు చేసింది. త్వరలో హైకోర్టు ఈ పోస్టులను భర్తీ చేసే అవకాశం లేకపోలేదు. తెలుగు అనువాదకులు దొరకటం అంత సులభమేమీ కాదు. ఎందుకంటే తెలంగాణ సచివాలయంలో కూడా ఈ కొరత ఉందని తెలుస్తోంది.

మరో విషయమేమంటే ప్రతి పౌరుడికీ హైకోర్టు వెబ్‌సైట్ ద్వారా ముఖ్యమైన తెలుగు తీర్పులను డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం ఉందనే విషయం తెలియజేయాలనే ఆశయంతో... జిల్లా న్యాయమూర్తులు, జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థలు; సంబంధిత జిల్లా ప్రభుత్వ అధికారులు న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా ప్రచారం కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతగా ప్రచారం కల్పించినా తెలుగులో తీర్పులు చదువుకోవాలనుకునే విషయం, అది ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉందనే విషయం అంత సులువుగా సామాన్యుడికి తెలియక పోవచ్చు. అవగాహన కల్పించటానికి సకల ప్రయత్నాలు చేయటానికి న్యాయ వ్యవస్థ గట్టిగానే కృషి చేయాలి. దీనికి న్యాయవాదుల పాత్ర పరిమితమని అనుకోవద్దు.

ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, కక్షిదారులు తాము దాఖలు చేసిన కేసుల్లో న్యాయమూర్తులు ఇంగ్లీషులో వెలువరించిన తీర్పులను తమ భాషలో చదివి అర్థం చేసుకొని సంతృప్తి పడాలనే దృక్పథం. అనువాదం అంటే ప్రస్తుత కాలంలో ఎవరికీ అర్థం కాని పూర్తి గ్రాంథిక భాషా ప్రయోగం చేయకుండా, వ్యవహారిక భాషను వాడాలనీ, అవసరమైతే దైనందిన ఇంగ్లీషు పదాలను అదే విధంగా వాడాలనీ హైకోర్టు సూచన చేసింది.


టెక్నాలజీ అతి వేగంగా దూసుకుపోతున్న ప్రస్తుత కాలంలో, ఇప్పటికే హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్లలో రికార్డ్ చేసిన సాక్ష్యాల నకళ్ళను అప్పటికప్పుడు ఇరుపక్షాలకు ఉచితంగా అందజేసే ఏర్పాటు ఉంది. అదే విధంగా హైకోర్టు రిజిస్ట్రీ జోక్యం లేకుండా, తీర్పు చెప్పిన రోజే తీర్పు ప్రతిని ఇరుపక్షాలకు కోర్టులోనే ఉచితంగా అందజేయాలి. దిగువ కోర్టుల్లో కూడా సివిల్, క్రిమినల్ తీర్పు అనే భేదం లేకుండా, ఇదే పద్ధతి పాటించడానికి ఎటువంటి ఆటంకం ఉండకపోవచ్చు.

అయితే నూటికి నూరు శాతం తీర్పుల తెలుగు అనువాదం సరైనది లేదా తప్పులు లేనిదని చెప్పలేం. ఈ తెలుగు తీర్పుల అనువాదం కేవలం చదువుకొని అర్థం చేసుకోవడానికి మాత్రమే పరిమితం. తెలుగు అనువాదం ఆధారంగా ఎవరు కూడా తప్పొప్పులు ఎంచి దానిపై అప్పీళ్ళు వేసే అవకాశం లేదు. ఇందు కోసం హైకోర్టు వెబ్‌సైట్‌లో డిస్ క్లెయిమర్ కూడా చొప్పించారు.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి
మొబైల్: 98485 45970

మానవతకు ప్రతిరూపం

మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యావంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందు తుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ (ధర్మం) మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ఐర్లాండులో ఆమె 1867 అక్టోబర్ 28న జన్మించారు. ఆమె అసలు పేరు మార్గరెట్ ఎలిజబెత్ నోబెల్. 1895లో భారత మహిళా ఔన్నత్యంపై స్వామి వివేకానంద లండన్‌లో చేసిన ప్రసంగాలు మార్గరెట్ జీవితాన్ని మార్చాయి. భారతీయ స్త్రీ గొప్పదనం గురించి విన్న ఆమె... వివేకానందను కలిసి 1898 జనవరి 28న భారత్ వచ్చింది. ఆమెకు వివేకానంద 'నివేదిత' అని నామకరణం చేశారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ద మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించారు. ఇతరుల పట్ల దయతో మెలిగే ఆమె మంచి అభిరుచి గల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది.



సిస్టర్ నివేదిత

ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ముఖ్యంగా బాలికల విద్య కోసం ఆమె 1898 నవంబరులో కలకత్తాలోని బాగ్ బజారులో పాఠశాలను ప్రారంభించారు. కనీస విద్య లేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేశారు. 1899 మార్చిలో కలకత్తా వాసులకు ప్లేగువ్యాధి సోకినప్పుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించారు.

భారత మహిళల ఔన్నత్యంగురించీ, ఆచార వ్యవహారాల గురించీ న్యూయార్క్, షికాగో వంటి నగరాల్లో ప్రసంగించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ చురుకైన పాత్ర పోషించారు. 1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. 1911 అక్టోబర్ 13న డార్జిలింగ్‌లో మరణించిన సిస్టర్ నివేదిత తలపెట్టిన పనులను విస్తరించడమే మనం ఆమెకు ఇవ్వగల నివాళి.

– సాకి । 99511 72002
(నేడు సిస్టర్ నివేదిత జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.8.47 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పుబ్బ సా.5.04 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.1.00 నుండి 2.44 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.57 వరకు, తదుపరి ప.2.27 నుండి 3.15 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.04 నుండి 11.48 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.00, **సూర్యాస్తమయం:** 5.28.

రండి బాబూ రండి..

హైడ్రా అప్రూవ్డ్ ఇళ్లు కొనండి!

హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో వినియోగదారులను ఆకర్షించేందుకు బిల్డర్ల తంటాలు

- హైదరాబాద్‌లో 5–6 నెలలుగా తగ్గిన స్థిరాస్తి కొనుగోళ్లు
- భవనాలను హైడ్రా కూల్చేస్తుందేమోనని వినియోగదారుల్లో పెరిగిన భయాలు.. దీంతో తమ ప్రాజెక్టులకు హైడ్రా ఆమోదం ఉందంటూ కస్టమర్లకు డెవలపర్ల ఫోన్లు
- నిర్మాణాలకు భద్రత ఉందంటూ ముందస్తు ఒప్పందాలు
- ప్రీ–ఈఎంఐలు, ఉచిత రిజిస్ట్రేషన్లు, లక్కీ డ్రాలతో ఆకర్షించే ప్రయత్నం



సాక్షి, హైదరాబాద్: రండి బాబూ రండి.. భాగ్యనగరంలో హైడ్రా ఆమోదించిన మా వెంచర్/ప్రాజెక్టులో దయచేసి ఇళ్లు కొనుగోలు చేయండి'. ఇదీ ఇప్పుడు రాజధాని హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాల కోసం బిల్డర్లు/డెవలపర్లు చేస్తున్న జపం. నగరంలో ఓఆర్ఆర్ లోపల ఉన్న చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో కట్టిన అక్రమ నిర్మాణాలను ఇటీవల కూల్చేయడం నగర రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. హైడ్రా భయంతో నగరంలో ఇళ్లు కొనాలంటేనే గృహ కొనుగోలుదారులు భయపడిపోతున్నారు. ఆయా ప్రాజెక్టులకు నిర్మాణ అనుమతులతోపాటు వాటికి గృహ రుణాలు లభించే అర్హతలన్నీ ఉన్నప్పటికీ ధైర్యం చేయలేకపోతున్నారు. హైడ్రా ఎప్పుడు ఏ భవనాన్ని కూల్చేస్తుందోనని భయపడుతూ ప్రాపర్టీల కొనుగోళ్లకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో గత ఐదారు నెలలుగా గ్రేటర్ హైదరాబాద్‌లో గృహ కొనుగోళ్లతోపాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా తగ్గింది. 10 శాతం డౌన్ పేమెంట్ కట్టిన కొందరు వినియోగదారులు ఏకంగా డెవలపర్లతో ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నారు. మరికొందరైతే గృహ కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో కస్టమర్లను ఆకర్షించడం రియల్టర్లకు సవాల్‌గా మారింది. భవిష్యత్తులో నిర్మాణాలకు ఎలాంటి ఢోకా ఉండదని కొందరు డెవలపర్లు కస్టమర్లతో ముందస్తు అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు.

ఆఫర్లతో కస్టమర్లకు వల..

సాధారణంగా దసరా, దీపావళి పండుగల్లో గృహ కొనుగోళ్లు జోరుగా సాగుతుంటాయి. కానీ ఈసారి ఆశించినంత వ్యాపారం లేదని డెవలపర్లు వాపోతున్నారు. దీంతో కొందరు బిల్డర్లు ప్రత్యేకంగా టెలికాలర్లను నియమించుకొని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మించే తమ ప్రాజెక్టులు/వెంచర్లకు 'హైడ్రా అప్రూవల్' ఉందంటూ కస్టమర్లకు ఫోన్లు చేసి వివరిస్తున్నారు. ప్రీ–ఈఎంఐ, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఉచిత కారు, విదేశీ ప్రయాణాలు వంటి రకరకాల ఆఫర్లతో కస్టమర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదాయంతో సంబంధం లేకుండా 90 శాతం వరకూ బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని కూడా చెబుతున్నారు.

ఫోర్త్ సిటీలో జోరుగా..

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడంతో ఆయా ప్రాంతాల పరిధిలో భూముల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మరోవైపు ముచ్చర్లలో ఫోర్త్ సిటీ రానున్న నేపథ్యంలో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. ఇప్పుడు స్థలాలు కొని పెట్టుకుంటే భవిష్యత్తులో రేట్లు అమాంతం పెరుగుతాయని రియల్టర్లు చెబుతున్నారు. సీఎం ప్రకటనలతో కూడిన కరపత్రాలను కస్టమర్లకు వాట్సాప్ ద్వారా పంపుతున్నారు.

క్లుప్తంగా...

స్కూటర్ నుంచి కుబేరుడెలా అయ్యారో చెప్పండి?

- కడియం తీరుపై రాజయ్య ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి కడియం శ్రీహరి 1994లో ఎమ్మెల్యే అయ్యేనాటికి ఆయనకు ఓ డొక్కు స్కూటర్ ఉండేదని, ఆ తర్వాత ఆయన కుబేరుడు ఎలా అయ్యారని మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య ప్రశ్నించారు. ఉమ్మడిఏపీలో నాడు దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ పిలిచి కడియం శ్రీహరిని ఎమ్మెల్యే చేసి మంత్రిని చేశారని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన కడియం పదవి అడ్డుపెట్టుకుని కోట్లు సంపాదించారని ఆరోపించారు. కానీ కడియం శ్రీహరి మాత్రం చంద్రబాబుతో చేతులు కలిపి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ భవన్‌లో రాజయ్య మీడియాతో మాట్లాడారు. కడియం శ్రీహరి రాజకీయ వ్యభిచారిలా ప్రవర్తిస్తున్నా రని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్‌లపై కడియం అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపు చట్టాలపై గౌరవం ఉందని కడియం మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

30 మంది బాలికలకు అస్వస్థత

- ముత్తారం 'కస్తూర్బా'లో కలకలం



అస్వస్థతకు గురైన బాలికను పరీక్షిస్తున్న నర్సు

ముత్తారం (మంథని): పెద్దపల్లి జిల్లా ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సుమారు 30 మంది బాలికలు ఆదివారం రాత్రి హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. సాయంత్రం వరకు బాగానే ఉన్న బాలికలు.. ఒకేసారి తీవ్రమైన దగ్గుతో అస్వస్థులయ్యారు. దీంతో సిబ్బంది వెంటనే వారిని పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బాలికల తల్లిదండ్రులు, స్థానికులు కేజీబీవీకి చేరుకుని ఆందోళనకు దిగారు. స్కూల్ సమీపంలోని పంట పొలాల్లో చల్లిన పురుగు మందు వాసన పీల్చి బాలికలు దగ్గు బారినపడి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వ వైద్యుడు అమరేందర్‌రావును సంప్రదించగా.. బాలికల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు. ఫుడ్‌పాయిజన్‌తో విరోచనాలు, వాంతులు అవుతాయని, కానీ బాలికల్లో దగ్గు తప్ప ఇలాంటి లక్షణాలేవీ లేవని తెలిపారు. ఏదైనా వైరస్‌తో ఒకరి తర్వాత మరొకరికి దగ్గు సోకి ఉంటుందని వివరించారు. వీరిలో ముగ్గురు, నలుగురికి దగ్గు అదుపులోకి రాలేదన్నారు.



బాలికలకు చికిత్స చేస్తున్న వైద్యులు

తిరుపతిలో వరుస బాంబు బెదిరింపులు

తిరుపతి క్రైమ్: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో వరసగా బాంబు బెదిరింపులు వస్తున్నాయి. గత వారం రోజుల్లో పలుమార్లు నగరంలోని ప్రముఖ హోటల్స్‌ను టార్గెట్ చేస్తూ బాంబులు పెట్టామని మెయిల్స్ ద్వారా బెదిరిస్తున్న దుండగులు తాజాగా తిరుపతిలోని ఇస్కాన్ టెంపుల్‌లో బాంబు పెట్టామని ఆదివారం బెదిరింపులకు దిగారు. దీంతో పోలీసు యంత్రాంగం ఇస్కాన్ టెంపుల్ వద్ద డాగ్, బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జాఫర్ సాధిక్ అనే పేరుతో బాంబు బెదిరింపు మెయిల్ వచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. త్వరలోనే బెదిరింపులకు కారణమైన వ్యక్తులను అదుపులోకి తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధిని.. ఏ శక్తులూ అడ్డుకోలేవు

- మూసీ పునరుజ్జీవంపై దృఢ సంకల్పంతో సాగుతున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎనలేనిది
- సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటన
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సదర్ ఉత్సవాలు

కవాడిగూడ (హైదరాబాద్): మురికి కూపంగా మారిన మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని ఏ శక్తులూ అడ్డుకోలేవని.. నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో యాదవులు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించే సదర్ ఉత్సవాలు ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఘనంగా జరిగాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో.. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, స్పీకర్ ప్రసాద్‌కుమార్, నేతలు పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి సీఎం రేవంత్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా దున్నపోతుల విన్యాసాలు, యాదవుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జంట నగరాలలోని యాదవులు దున్నపోతులను ప్రత్యేకంగా అలంకరించి బ్యాండ్‌మేళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి వేల మంది యాదవులు కూడా హాజరయ్యారు.



ఆదివారం హైదరాబాద్‌లో సదర్ వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

యాదవులకు రాజకీయాల్లో సముచిత స్థానం

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎనలేనిదని సీఎం రేవంత్ కొనియాడారు. సదర్ అంటే యాదవుల ఖదర్ అని.. యాదవులు రాజకీయంగా ఎదగాలనే అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపామని చెప్పారు. రాబోయే రోజుల్లో యాదవ సామాజిక వర్గానికి రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. యాదవ సామాజిక వర్గం ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ఇక నుంచి ఏటా సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా.. శ్రీకృష్ణుడు యాదవులను ఆశీర్వదించినట్టుగానే రాష్ట్ర ప్రభుత్వ హామీలు అమలు చేసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీస్సులు అందజేయాలని కోరుతున్నానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణలో పూర్వకాలం నుంచీ వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉందని, అందుకు తోడ్పడే పశువులను యాదవులు ప్రాణసమానంగా పూజించడం గొప్ప సంస్కృతి అని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి,, కాంగ్రెస్ సీనియర్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, కృష్ణాయాదవ్, ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ పాలన పూర్తిగా గాడి తప్పింది

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- 'జన్వాడ'పై దర్యాప్తు చేయాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలన, పది నెలల కాంగ్రెస్ పాలన.. రెండూ ఒకే విధంగా ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలవుతోందని, సీఎం రేవంత్ పాలన పూర్తిగా గాడి తప్పిందని, ఆర్థిక వ్యవస్థ తీవ్ర గందరగోళంగా మారిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికి.. చేతకాని హామీలన్నీ ఇచ్చారని, ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల భవనాల అద్దె చెల్లించలేని పరిస్థితిలో ఉందన్నారు. మహిళలకు రెండున్నరవేలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, కాలేజీ విద్యార్థులకు స్కూటీలు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల పెన్షన్‌పెంపుదల, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, యువతకు నిరుద్యోగ భృతి.. ఏవీ జాడలేదన్నారు. రైతుబంధు రాబందుల పాలైందని విమర్శించారు. దళితబంధు జాడలేదని, బీసీబంధు ఎవరూ ఎత్తుకెళ్లారో తెలియదని, ఏ ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం అమలు చేసే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. ఇవన్నీ వదిలేసి మూసీ ప్రక్షాళనకు రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. ముందుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌హయాంలో చేసిన అప్పులు, ఈ పది నెలల్లో చేసిన అప్పు, చెల్లించిన వడ్డీ ఎంతో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్‌పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భ్రష్టు పట్టిందని, కాళేశ్వరం పేరుతో దోపిడీ చేసిందని అన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పది నెలల పాలనలో రియల్‌ఎస్టేట్‌రంగం కుప్పకూలిందని, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణకు బీజేపీ వ్యతిరేకం కాదని, అన్ని రకాలుగా సాకారం అందిస్తామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇళ్లు కూల్చివేసినందుకే బీజేపీ ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకించిందన్నారు. జన్వాడ రేవ్‌పార్టీ నిజమో, కాదో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరి ఫామ్‌హౌస్‌అయినా దర్యాప్తు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

బస్సు యజమానులుగా మహిళలు!

- ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్న డిప్యూటీ సీఎం భట్టి
- ఎస్‌హెచ్‌జీలకు నాలుగేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడి



ఆదివారం ఖమ్మంలో బస్ షెల్టర్ పక్కన స్త్రీ స్టాల్ వద్ద టీ తాగుతున్న భట్టి విక్రమార్క

ఖమ్మం సహకారనగర్: ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆర్టీసీకి లాభాలు వస్తున్నాయని, కొత్త బస్సులు అవసరమవుతున్న క్రమంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) సభ్యుల ద్వారా బస్సులు కొనుగోలు చేయిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వమే రుణాలు అందజేయడంతో పాటు ఆ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి నెలకు రూ.400 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోందని అన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, భోజనశాల, లేడీస్ లాంజ్, బస్‌షెల్టర్, స్త్రీ టీ స్టాల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్ర మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. రానున్న నాలుగేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

వ్యాపార యూనిట్లతో లాభాలు

మహిళలకు అందించే రుణాలతో వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా వారికి మంచి లాభాలు వస్తాయని భట్టి పేర్కొన్నారు. కూసుమంచి మండలం జుజ్జుల్‌రావుపేటకు చెందిన రాణి తన వ్యవసాయ క్షేత్రంలో చేపలు, రొయ్యలు, నాటుకోళ్లు, గొర్రెల పెంపకం, కూరగాయలు, సేంద్రియ వరి సాగుతో నెలకు రూ.2 లక్షలకు పైగా సంపాదిస్తోందని తెలిపారు. మరో నలుగురికి ఉపాధి కూడా కల్పిస్తోందని వివరించారు. అంతకుముందు బోనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన భట్టి.. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

బీసీల రాజకీయ ఊచకోతకు బలికాక తప్పదు

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

పంజగుట్ట: తనకు అగ్రకులాల ఓట్లు వద్దని బహిరంగంగా ప్రకటిస్తున్నానని, అగ్రకుల రాజకీయ నాయకులు కూడా తమకు బీసీల ఓట్లు వద్దని ప్రకటించగలరా అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సవాల్ విసిరారు. రాబోయే రోజుల్లో మండలి చైర్మన్, 15 ఎమ్మెల్యేలు ఎంబీసీ కులానికి చెందిన వారు ఉంటారని 2028 ఎన్నికల్లో అగ్రకుల రాజకీయ నాయకులు బీసీ ల రాజకీయ ఊచకోతకు బలికాక తప్పదని హెచ్చరించారు. బీసీ టైమ్స్, బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ప్రతీనెల చివరి ఆదివారం జరిగే బీసీ కులబాంధవుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. బీసీ సమాజ్ వ్యవస్థాపకుడు సంగెం సూర్యారావు ఆధ్వర్యంలో రవి కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మల్లన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రూప్ –1 పరీక్షల ఫలితాలు నెలరోజుల్లో విడుదల చేస్తామని హడావుడిగా పరీక్షాపత్రాలు దిద్దుతున్నారన్నారు. ఇదంతా ఈడబ్ల్యూఎస్ కోటాలో అగ్రకులాలకు ఉద్యోగాలు ఇచ్చుకునే కుట్రలో భాగమేనని మండిపడ్డారు.

మూసీ మురుగు నిర్మూలనకు బీఆర్ఎస్, బీజేపీ వ్యతిరేకమా?

- ఎంపీ చామల కిరణ్ ప్రశ్న



రైతుల ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడుతున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం: రాష్ట్రానికి మంచి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మురికికూపంలో బతుకుతున్న మూసీ పరీవాహక ప్రజల బతుకులు మార్చుతు న్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విషతుల్యమైన మూసీనదికి పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పాటుపడు తుంటే బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని.. మూసీ ప్రక్షాళనకు ఆ పార్టీలు వ్యతి రేకమా అని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల, భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య మూసీ నది బ్రిడ్జిపై ఆదివారం నిర్వహించిన మూసీ పరీవాహక రైతుల ఆత్మీయ సమ్మేళన సభకు తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంలతో కలిసి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మురుగు నీటితో అత్యంత ప్రమాదకరంగా మారిన మూసీనదిని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు చేయాలేకానీ ప్రజల కోసం చేపట్టే పనులను అభాసుపాలు చేయవద్దని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏ ర్పాటు చేసి రూ.25వేల కోట్లు మింగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సబర్మతి, గంగా నదులను ప్రక్షాళన చేస్తే మంచిదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూసీని ప్రక్షాళన చేయడం మంచిది కాదా అని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌ను ఉద్దేశించి చామల ప్రశ్నించారు.

అగ్నిప్రమాదంలో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు షాపింగ్ మాల్స్, రెడీమేడ్ వస్త్ర దుకాణం ఆహుతయ్యాయి. రూ.20 కోట్ల మేర నష్టం సంభవించింది. ఆదివారం ఉద యం 6 గంటల సమయంలో విజయ షాపింగ్ మాల్ లోపలి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే జనగామ అగ్నిమాపక శాఖ బృందం అక్కడికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. అంతకుముందే పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు తదితర ప్రాంతాల ఫైర్ స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. రెండు గంటలు గడిచినా అగ్నిమాపక వాహనాలు రాలేదు. మరోవైపు జనగామ ఫైర్ ఇంజన్‌లో నీళ్లు అయిపోవడంతో మంటలు మరింత చెలరేగాయి. ఇంతలో అగ్నికీలలకు పక్కనే ఉన్న ఎస్ఆర్ రెడీమేడ్ వస్త్ర దుకాణానికి వ్యాపించాయి. రెండు గంటలు ఆలస్యంగా మరో అగ్నిమాపక శకటం వచ్చే సరికే.. పక్కనే ఉన్న శ్రీలక్ష్మీ షాపింగ్ కాంపెక్స్‌ను మంటలు చుట్టుముట్టాయి. ఇదే సమయంలో షాపింగ్ కాంప్లెక్స్‌లోని సిలిండర్లు పేలిపోవడంతో అక్కడి వారంతా భయంతో పరుగులు పెట్టారు. కాగా పక్కనే ఉన్న ముత్తూట్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, కాంప్లెక్స్‌లోని 16 వ్యాపార సముదాయాల్లోకి మంటలు వ్యాపించే క్రమంలో అగ్నిమాపక శాఖ శ్రమించడంతో పెను ప్రమాదం తప్పింది.

మూసీ పేరిట లూటీకే వ్యతిరేకం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ
- ఢిల్లీ పెద్దల కోసం రూ.లక్షన్నర కోట్ల అవినీతికి పాల్పడతామంటే ఊరుకోం
- ఇళ్ల కూల్చివేతలు అడ్డుకుంటాం.. పేదలకు అండగా ఉంటాం



ఎస్టీపీ ప్లాంట్‌లో శుద్ధిచేసిన నీటిని చూపిస్తున్న కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్ (హైదరాబాద్): మూసీ ప్రక్షాళన, సుందరీకరణ, అభివృద్ధికి తాము, తమ పార్టీ వ్యతిరేకం కాదని, దానిపేరిట లూటిఫికేషన్‌కు మాత్రమే వ్యతిరేకమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టు పేరు చెప్పి ఢిల్లీ పెద్దల కోసం లక్షన్నర కోట్ల రూపాయల అవినీతి చేస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలను పక్కనపెట్టి మూసీకి లక్షన్నర కోట్లు ఖర్చుపెడతామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెబుతోందని, కేవలం రూ.1,100 కోట్లతో గోదావరి నీళ్లు మూసీకి తీసుకువస్తే సుందరీకరణ పూర్తి అవుతుందని చెప్పారు. నాచారంలోని మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ) పనితీరును పార్టీ నేతలతో కలిసి ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు.

రూ.3,866 కోట్లతో ఎస్టీపీల నిర్మాణం

బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లలో రాష్ట్రంలో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని మాజీమంత్రి కేటీఆర్ చెప్పారు. మురుగునీటి శుద్ధి కోసం రూ.3,866 కోట్లతో ఎస్టీపీల నిర్మాణం చేపట్టామని తెలిపారు. పేద ప్రజల ఇళ్లు కూలగొట్టి షాపింగ్ మాల్స్ కట్టేందుకు చేస్తున్న కుట్రను అడ్డుకుంటామని, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ చెప్పారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆవు పంచకంతో ఎస్టీపీ శుద్ధి

కేటీఆర్ నాచారం ఎస్టీపీ సందర్శన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నేతలు చేతులకు నల్ల బ్యాడ్జీలను కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కేటీఆర్ తిరిగిన ప్రదేశంలో ఆవు పంచకంతో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్ఆర్ మోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మావోయిస్టు తాటి బామన్ లొంగుబాటు

ములుగు: జనతా సర్కార్ జారపల్లి ఆర్‌పీసీ అధ్యక్షుడు మావోయిస్టు తాటి బామన్ పోలీసు ల ఎదుట లొంగిపోయారు. ములుగు ఇన్‌చార్జి ఓఎస్డీ రవీందర్ ఆదివారం మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజా పూర్ జిల్లా సెండ్ర బోర్ గ్రామానికి చెందిన బామన్ దక్షిణ బస్తర్ డీవీసీలో పనిచేస్తున్నారు. 2004లో అప్పటి పామేడు దళకమాండర్ ముఖేశ్ ప్రోద్బలంతో మిలీషియా సభ్యుడిగా పార్టీలో చేరి 2010లో జారపల్లి జనతా సర్కార్‌లో సభ్యుడిగా ఎదిగారు. అదే ఏడాది ఆ పార్టీ అధ్యక్షుడు సోడి దేవా అరెస్టు తర్వాత ఆయన స్థానంలో అధ్యక్షుడిగా బామన్ కొనసాగుతున్నారు. 2006లో తాగ్గా డం సమీపంలో మావోయిస్టుల దాడిలో 12 మంది పోలీసులు మృతి చెందిన ఘటనతో పాటు 2013లో సెండ్రబోర్‌లో ఎదురుకాల్పులు, 20 19లో యాంపూర్ ఘటన, 2024లో పామెడ్ పరిధి ధర్మారం పోలీసు క్యాంపుదాడి లో కూడా బామన్ కీలకంగా వ్యవహరించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలకు ఆకర్షితుడైన బామన్ ప్రశాంత జీవితం గడపాలని లొంగిపోయారు.



ఖమేనీ ఆరోగ్యం విషమం?

కుమారుడే తదుపరి సుప్రీం లీడర్!

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (85) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆయన చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. దీంతో ఆయన వారసుడు ఎవరన్న దానిపై చర్చ మొదలైంది. ఖమేనీ తనయుడు ముజ్తబా ఖమేనీ (55) తదుపరి సుప్రీం లీడర్ కావొచ్చని ప్రచారం సాగుతోంది. ఈ మేరకు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఓ కథనం ప్రచురించింది. ఖమేనీ 1989 నుంచి సుప్రీం లీడర్‌గా ఉన్నారు. రుహోల్లా ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ అత్యున్నత నాయకుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఒకవైపు ఇజ్రాయెల్ దాడులు, మరోవైపు దిగజారుతున్న ఖమేనీ ఆరోగ్య పరిస్థితి నేపథ్యంలో ఇరాన్‌లో పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ఘర్షణలు మరింత ముదరడం తాము కోరుకోవడం లేదని ఇరాన్ అధికారులు చెప్పారు.

'ఇజ్రాయెల్‌కు సత్తా చూపుదాం'

డెయిర్ అల్–బలాహ్: ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఆదివారం తీవ్రంగా ఖండించారు. ''ఇరాన్ బలాన్ని, శక్తి సామర్థ్యాలు ఇజ్రాయెల్‌కు అర్థమయేలా చేయడం ముఖ్యం. ఇరాన్ సత్తా రుచి చూపిద్దాం'' అంటూ పిలుపునిచ్చారు. అయితే ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ కీలక అణు స్థావరాలు భారీగా దెబ్బతిన్నట్లు ఉపగ్రహ చిత్రాల ఆధారంగా నిపుణులు అంచనాకు వచ్చారు. ''ఆ స్థావరాల్లో సొరంగాలు నిర్మించి అణ్వాయుధ, క్షిపణి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అవిక ఆగిపోయినట్లే. వాటి పునరుద్ధరణకు కనీసం రెండేళ్లకు పైగా పట్టవచ్చు'' అని చెబుతున్నారు.

ఓట్లు తగ్గినా... గద్దెనెక్కవచ్చు!

అమెరికా ఎన్నికల్లో గమ్మత్తు

విజేతను తేల్చేది ఎలక్టోరల్ ఓట్లే	అత్యధిక ఓట్లొచ్చినా ఓటమి సాధ్యమే	ఎలక్టోరల్ కాలేజీ విధానమే కారణం	అగ్రరాజ్యమైనా సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ



అధ్యక్ష తరహా పాలన ఉన్న చాలా దేశాల్లో ఆ పదవికి ప్రత్యక్ష ఎన్నిక జరుగుతుంది. ప్రజలు తమ ప్రెసిడెంట్‌ను నేరుగా ఎన్నుకుంటారు. అత్యధిక ఓట్లు సాధించే వారే విజేతగా నిలుస్తారు. కానీ అగ్రరాజ్యమైన అమెరికాలో మాత్రం గమ్మత్తైన పరోక్ష ఎన్నిక విధానం అమల్లో ఉంది. అక్కడ అధ్యక్షున్ని ఎన్నుకునేది ఎలక్టోరల్ కాలేజీ. మరి పోలింగ్ తేదీన ప్రజలు ఓటేసేది ఎవరికంటారా? ఎలక్టర్లుగా పిలిచే ఈ ఎలక్టోరల్ కాలేజీ సభ్యులకు. అనంతరం వారంతా కలిసి అధ్యక్షున్ని, ఉపాధ్యక్షున్ని నేరుగా ఎన్నుకుంటారు.

విన్నర్ టేక్స్ ఆల్!

అధ్యక్ష ఎన్నిక విషయంలో అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 48 రాష్ట్రాలు విన్నర్ టేక్స్ ఆల్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. దానిప్రకారం ఒక రాష్ట్ర ఎలక్టోరల్ ఓట్లన్నీ ఆ రాష్ట్రంలో మెజారిటీ ఓట్లు సాధించే అభ్యర్థికే దక్కుతాయి (మెయిన్, నెబ్రాస్కా మాత్రం అభ్యర్థులు సాధించే ఓట్ల ప్రకారం నైష్పత్తిక పద్ధతిలో వారికి ఎలక్టర్లను కేటాయిస్తాయి). దీనివల్ల దేశవ్యాప్తంగా కలిపి అత్యధిక ఓట్లు (పాపులర్ ఓట్) సాధించే అభ్యర్థి కూడా ఓటమి పాలయ్యే ఆస్కారం పుష్కలంగా ఉంది. గతంలో ఇలా జరిగింది కూడా. 2016లో డెమొక్రాట్ల అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌కు రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే ఏకంగా 28 లక్షల పై చిలుకు ఓట్లు ఎక్కువగా వచ్చాయి. అయినా ఆమె ఏకంగా 74 ఎలక్టోరల్ ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు! 2000లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి అల్ గోర్ కూడా తన రిపబ్లికన్ ప్రత్యర్థి జార్జి డబ్ల్యు.బుష్ కంటే 5.5 లక్షల ఎక్కువ ఓట్లు సాధించారు. అయినా 271 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు సాధించిన బుష్‌కే పీఠం దక్కింది. 1876, 1888ల్లో కూడా పాపులర్ ఓట్ సాధించిన అభ్యర్థులు ఓటమి చవిచూశారు. కాకపోతే ఇప్పటిదాకా జరిగిన 59 అధ్యక్ష ఎన్నికల్లో ఏకంగా 54సార్లు పాపులర్ ఓట్ సాధించిన అభ్యర్థే విజేతగా నిలిచారు.

ఎందుకీ 'కాలేజీ'...?

ఎలక్టోరల్ కాలేజీ వ్యవస్థ వల్ల చిన్న రాష్ట్రాలకు కూడా అధ్యక్షుని ఎన్నికలో తగిన ప్రాధాన్యం దక్కుతుంది. అంతేగాక అభ్యర్థులు దేశమంతటా కాలికి బలపం కట్టుకుని తిరిగే అవసరముండదు. గెలుపోటములను నిర్దేశించి ఆరేడు స్వింగ్ స్టేట్స్‌పై గట్టిగా దృష్టి పెడితే సరిపోతుంది. కాకపోతే ఈ విధానంలో లోపాలూ లేకపోలేదు. పాపులర్ ఓట్ సాధించిన వాళ్లు కూడా ఓడే ఆస్కారముండటం వాటిలో ప్రధానమైనది. తమ ఓట్లకు ప్రాధాన్యం లేదనే భావనతో జనం ఓటింగ్‌కు దూరమయ్యే ఆస్కారమూ ఉంటుంది.

జనాభాకు తగ్గట్టు...

ప్రతి రాష్ట్రానికి జనాభాకు అనుగుణంగా ఎలక్టర్ల సంఖ్యను కేటాయిస్తారు. ఇది ఆ రాష్ట్రానికి కేటాయించిన ప్రతినిధుల సభ, సెనేట్ సభ్యుల సంఖ్యకు సమానంగా ఉంటుంది. ప్రస్తుతం ఎలక్టోరల్ కాలేజీ ఓట్ల సంఖ్య 538. అధ్యక్ష ఎన్నికలో నెగ్గాలంటే వీటిలో కనీసం 270 ఓట్లు అవసరం. కాలిఫోర్నియాలో అత్యధికంగా 54 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లుంటే వ్యోమింగ్, నార్త్ డకోటా, అలస్కా వంటి రాష్ట్రాల్లో కేవలం మూడే ఉన్నాయి.



అమెరికాలోనూ అప్పుడప్పుడూ గోడదూకుళ్లు!

ఎలక్టర్లు తమ పార్టీ అభ్యర్థికే ఓటేయాలన్న రాజ్యాంగ నిర్బంధమేమీ అమెరికాలో లేదు! 2016లో ఏడుగురు ఎలక్టర్లు ప్రత్యర్థులకు ఓటేశారు. వీరిలో ఐదుగురు డెమొక్రాట్లు కాగా ఇద్దరు రిపబ్లికన్లు. అయితే వారి చర్య తుది ఫలితంపై ప్రభావం చూపలేదు. హిల్లరీ క్లింటన్‌కు 232 ఎలక్టర్ ఓట్లు రాగా 306 ఓట్లతో ట్రంప్ సునాయాసంగా విజయం సాధించారు. ఇలాంటి గోడదూకుడు ఎలక్టర్లకు సంబంధిత పార్టీలు జరిమానా విధించడమే గాక వారిపై అనర్హత వేటు కూడా వేయొచ్చు. వారిపై చట్ట ప్రకారం చర్యలు కూడా చేపట్టమే గాక వారి స్థానంలో వేరేవాళ్లను ఎలక్టర్లుగా నియమించుకునేందుకు వీలు కల్పిస్తూ 32 రాష్ట్రాలు చట్టాలు చేశాయి.

సుదీర్ఘ ప్రక్రియ

అమెరికాలో అధ్యక్ష ఎన్నిక సుదీర్ఘ ప్రక్రియ. **ముం**దుగా ప్రధాన పార్టీలు తమ అధ్యక్ష అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుడతాయి. ఇది **పోలిం**గ్‌కు దాదాపు 9 నెలల ముందుగా**నే** మొదలవుతుంది...

- ➤ అధ్యక్ష అభ్యర్థులపై కాకస్‌లు, ప్రైమరీల ద్వారా పార్టీ సభ్యులు, ప్రతినిధులు తమ అభిప్రాయం వెలిబుచ్చుతారు.
- ➤ అనంతరం ఆగస్టు/సెప్టెంబర్ నెల్లలో పార్టీ జాతీయ సదస్సులో అభ్యర్థిని అధికారికంగా ప్రకటిస్తారు. అక్కడినుంచి ఎన్నికల పోరు ఊపందుకుంటుంది.
- ➤ ప్రచారం, ప్రధాన అభ్యర్థుల డిబేట్లతో పోరు పతాక స్థాయికి చేరుకుంటుంది.
- ➤ నవంబర్‌లో తొలి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం పోలింగ్ ఉంటుంది.
- ➤ విజేత ఎవరో పోలింగ్ ముగియగానే ఆ **రాత్రే** దాదాపుగా తేలిపోతుంది.
- ➤ అయితే అంతకు కొద్ది నెలల నుంచే **ముందస్తు** ఓటింగ్ సదుపాయం కూడా ఉంటుం**ది. ఈసారి** ఇప్పటికే 3.5 కోట్ల మందికి పైగా అమెరి**కన్లు ముందుగానే** ఓటేయడం విశేషం.

అసలు ఎన్నిక డిసెంబర్ 16న!

ఓటింగ్ ముగిశాక కూడా అమెరికా అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ ఏకంగా మరో రెండు నెలల పాటు సాగుతుంది!

- ➤ రాష్ట్రాల స్థాయిలో ఎలక్టర్ల ఎన్నిక ప్రక్రియ దాదాపు నెల పాటు జరుగుతుంది. మెయిన్, నెబ్రాస్కా మినహా మిగతా 48 రాష్ట్రాల్లోనూ మెజారిటీ ఓట్లు సాధించిన పార్టీకే ఆ రాష్ట్రంలోని మొత్తం ఎలక్టోరల్ ఓట్లూ దక్కుతాయి.
- ➤ అనంతరం తమ ఎలక్టర్లుగా ఎవరుండాలో సదరు పార్టీ తాలూకు రాష్ట్ర శాఖ నిర్ణయిస్తుంది.
- ➤ ఎలక్టర్లుగా ఎన్నికైన వారంతా డిసెంబర్‌లో రెండో బుధవారం తర్వాత వచ్చే సోమవారం ఆయా రాష్ట్రాల రాజధానుల్లో భేటీ అవుతారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులకు విడివిడిగా ఓటేస్తారు. ఒకవిధంగా అధ్యక్షున్ని వాస్తవంగా ఎన్నుకునేది ఈ రోజే! ఈసారి ఎలక్టర్ల భేటీ డిసెంబర్ 16న జరగనుంది.
- ➤ అనంతరం డిసెంబర్ నెల నాలుగో బుధవారం లోగా, అంటే ఎలక్టర్ల భేటీ జరిగిన 9 రోజుల్లోపు వారి ఓట్లన్నీ సెనేట్ అధ్యక్షునికి చేరాల్సి ఉంటుంది.

జనవరి 6న ఫలితం

జనవరి 6న అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశం జరుగుతుంది. **ఎలక్టోర**ల్ ఓట్ల లెక్కింపు జరిపి అధ్యక్ష, ఉపాధ్యక్షులను అధికారి**కంగా** ప్రకటిస్తారు. అమెరికా ఉపాధ్యక్షుడు ఈ ప్రక్రియను సెనేట్ అధ్యక్షుని హోదాలో పర్యవేక్షిస్తారు. నూతన అధ్యక్ష, **ఉ**పాధ్యక్షుల పేర్లను కూడా ప్రకటిస్తారు.

- ➤ ఎలక్టోరల్ ఓట్లలో ఏ అభ్యర్థికీ మెజారిటీ రాకపోతే అధ్యక్షున్ని ఎన్నుకునే బాధ్యత ప్రతినిధుల సభపై పడుతుంది. దాని సభ్యులంతా కలిసి అత్యధిక ఎలక్టోరల్ ఓట్లు సాధించిన తొలి ముగ్గురు అభ్యర్థుల్లో నుంచి మెజారిటీ ఓటు ద్వారా ఒకరిని అధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- ➤ ఉపాధ్యక్ష పదవికి కూడా అంతే. ఎవరికీ మెజారిటీ రాకపోతే అత్యధిక ఎలక్టోరల్ ఓట్లు సాధించిన తొలి ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరిని సెనేట్ సభ్యులు మెజారిటీ ఓటు ద్వారా ఉపాధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- ➤ దాంతో అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ కొలిక్కి వచ్చినట్టే. చివరగా **జనవ**రి 20న ప్రమాణస్వీకారం ఉంటుంది. ముందుగా ఉపా**ధ్యక్షుడు**, అనంతరం అధ్యక్షుడు ప్రమాణస్వీకారం చేస్తారు. ఆ **రోజు ఆది**వారమైతే కార్యక్రమాన్ని జనవరి 21న నిర్వహిస్తారు.
- ➤ **1933 దాకా** కొత్త అధ్యక్షుడు మార్చి 4న ప్రమాణస్వీకారం చేసేవారు. **1937 నుంచి జనవ**రి 20కి మార్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

'ముంబై' దాడులపై నాడు స్పందనే లేదు!



- యూపీఏ సర్కారుపై జై శంకర్ విసుర్లు
- ఇప్పుడైతే గట్టిగా బదులిస్తామన్న మంత్రి

ముంబై: 2008లో ముంబైలో జరిగిన ఉగ్రదాడికి సంబంధించి నాటి కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వంపై విదేశాంగ మంత్రి జై శంకర్ పరోక్ష విమర్శలు చేశారు. ఆ దాడికి భారత్ వైపు నుంచి స్పందనే లేకపోయిందంటూ ఆక్షేపించారు. ముంబైలో ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ''ముంబై దాడి జరిగినప్పుడు భారత్ నుంచి దానిపై స్పందనే లేదు. ఆ సమయంలో ఐరాస భద్రతా మండలిలో భారత్ సభ్య దేశం. ఉగ్రవాద వ్యతిరేక కమిటీ అధ్యక్ష స్థానంలో ఉంది. ఆ కమిటీ భేటీ కూడా ఉగ్ర దాడికి లక్ష్యంగా మారిన ముంబై తాజ్ హోటల్లోనే జరిగింది'' అని గుర్తు చేశారు. ''ఇప్పుడు పరిస్థితి మారింది. నేడున్నది నాటి భారత్ కాదు. ఉగ్ర ఘటనలపై గట్టిగా స్పందిస్తున్నాం. దుస్సాహసం చేస్తే మన సమాధానమే వేరుగా ఉంటుంది'' అని స్పష్టం చేశారు. మనతో పగలు వ్యాపారం చేస్తాం, రాత్రిళ్లు మనపైనే ఉగ్ర దాడులు చేస్తామంటే కుదరదన్నారు. తూర్పు లద్దాఖ్‌లో 2020 నాటి పరిస్థితి నెలకొనాలంటే చైనా సేనలను పూర్తిగా ఉపసంహరించుకోవాల్సి ఉంటుందని జైశంకర్ అన్నారు.

మమత సర్కారు వల్లే బెంగాల్లోకి చొరబాట్లు

మేమొస్తేనే ప్రశాంతత: అమిత్ షా


కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ సర్కారు అసమర్థత వల్లే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు, చొరబాట్లు పెచ్చరిల్లుతున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. అవి అంతమైతేనే ఆ రాష్ట్రంలో శాంతి నెలకొంటుందన్నారు. 2026లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక వాటిని అడ్డుకుని ప్రశాంతతను నెలకొల్పుతామన్నారు. బెంగాల్‌లో ప్యాసింజర్ టర్మినల్, కార్గోగేట్ అయిన పెట్రాపోల్ భూతలపోర్ట్‌లో ఆధునీకరించిన 'మైత్రీ ద్వార్'ను ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ''సరిహద్దు వెంట అధికారికంగా ప్రజల రాకపోకలు లేనందువల్లే చొరబాట్లు ఎక్కువయ్యాయి. ఇది రాష్ట్రంలో అశాంతిని రాజేస్తోంది. అన్నారు. కేంద్ర నిధుల్ని మమత సర్కారు దోచేస్తోందని అమిత్ షా మండిపడ్డారు. ''ఒక్క గ్రామీణ ఉపాధి హామీ పథకం కిందే ఎన్‌డీఏ హయాంలో ఏకంగా రూ.54,000 కోట్ల నిధులు అందాయి. కానీ అవన్నీ టీఎంసీ నేతలకు చేరాయి. ఈ దోపిడీని 2026లో అడ్డుకుంటాం'' అన్నారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న పెట్రాపోల్ ల్యాండ్‌పోర్ట్ ఆసియాలోనే అతిపెద్దది. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలకమైంది.

'డిజిటల్ అరెస్టు'కు... భయపడకండి

నేరగాళ్ల ఫోన్లకు బెంబేలెత్తకండి

- అప్రమత్తతతోనే డిజిటల్ భద్రత
- మన్ కీ బాత్‌లో మోదీ సూచన

న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతుండడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం వేశారు. ఇటీవల పెచ్చరిల్లుతున్న 'డిజిటల్ అరెస్టు' ఫ్రాడ్‌ను ఆదివారం 'మన్‌కీ బాత్'లో ప్రధానంగా ప్రస్తావించారు. ''అన్ని వయసుల వారూ వీటి బారిన పడుతున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోతున్నారు'' అని ఆవేదన వెలిబుచ్చారు. సైబర్ నేరగాడికి, బాధితుడికి మధ్య జరిగిన సంభాషణను మోదీ ఉదాహరించారు. ''సైబర్ నేరగాళ్లు తొలుత వ్యక్తిగత సమాచారం సేకరిస్తారు. తర్వాత ఫోన్లు చేసి మీరు నేరాల్లో ఇరుక్కున్నారంటూ భయభ్రాంతులకు గురి చేస్తారు. ఆలోచించుకొనే సమయం కూడా ఇవ్వరు. డబ్బులిస్తారా, అరెస్టవుతారా అంటూ బెదిరిస్తారు. భయపడితే మానసికంగా మరింత ఒత్తిడికి గురి చేసి డబ్బు గుంజుతారు. 'ఆగడం, ఆలోచించడం, చర్య తీసుకోవడం' ఈ మోసాలకు విరుగుడు'' అన్నారు. ''ఇలాంటి గుర్తు తెలియని బెదిరింపు ఫోన్లకు భయపడకుండా ధైర్యంగా ఉండండి. దర్యాప్తు సంస్థలు, పోలీసులు ప్రజలకు ఇలాంటి ఫోన్లు చేయరని, డబ్బులడగరని గుర్తుంచుకోండి. సాయం కోసం జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ '1930'కు ఫోన్ చేయండి. సైబర్ నేరగాళ్లతో సంభాషణను రికార్డు చేసి దర్యాప్తు సంస్థలకు అందించండి. సైబర్ మోసాలపై cybercrime. gov. in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయండి'' అని సూచించారు. ''డిజిటల్ మోసాలు, ఆన్‌లైన్ స్కాములపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. అప్రమత్తతే డిజిటల్ భద్రత కల్పిస్తుంది'' అని ఉద్ఘాటించారు. సైబర్ నేరగాళ్లను సమాజానికి శత్రువులుగా అభివర్ణించారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.



అవి మరపురాని క్షణాలు

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఈ నెల 31న ఘనంగా నిర్వహించుకుందామని మోదీ అన్నారు. ''గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి వేడుకలు నవంబర్ 15న ప్రారంభమవుతాయి. గతేడాది జార్ఖండ్‌లో బిర్సా ముండా స్వగ్రామం ఉలిహాతును సందర్శించా. అవి మరపురాని క్షణాలు'' అన్నారు.

యానిమేషన్‌లో అద్భుతాలు

ప్రతి రంగంలోనూ 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తి కనిపిస్తోందని మోదీ హర్షం వెలిబుచ్చారు. ''మన రక్షణ ఉత్పత్తులు 85 దేశాలకు ఎగుమతవుతున్నాయి. యానిమేషన్ రంగంలో మన కళాకారులు గణనీయమైన ప్రగతి సాధించారు. చోటా భీమ్, హనుమాన్, మోటు–పత్లూ, ఢోలక్‌పూర్ కా ఢోల్ వంటి యానిమేషన్ సిరీస్‌లు విదేశాల్లోనూ ప్రజాదరణ పొందుతున్నాయి. భారత్‌ను ప్రపంచ యానిమేషన్ పవర్‌హౌస్‌గా మారుద్దాం. ఇండియాలో గేమింగ్ రంగం వేగంగా విస్తరిస్తోంది. మన గేమ్స్‌కు ప్రపంచమంతటా ఆదరణ ఉంది. పర్యాటకానికి వర్చువల్ రియాలిటీ (వీటీ) ఊతం ఇస్తోంది. ప్రపంచంలో తదుపరి సూపర్ హిట్ యానిమేషన్ చిత్రం మీ కంప్యూటర్ నుంచే రావొచ్చు. మరో గొప్ప గేమ్‌ను మీరే సృష్టించవచ్చు'' అని యువతనుద్దేశించి పేర్కొన్నారు.

మతతత్వ, అవినీతి శక్తులే... మా శత్రువులు

బీజేపీ, డీఎంకేలపై 'తళపతి' విజయ్ వాగ్బాణాలు

2026 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తామని వ్యాఖ్యలు

టీవీకే తొలి మహానాడుకు భారీగా వచ్చిన జనం





ఆదివారం టీవీకే తొలి సభకు హాజరైన అశేష జనసందోహం (ఇన్‌సెట్‌లో) వాళ్లనుద్దేశించి ప్రసంగిస్తున్న విజయ్

సాక్షి, చెన్నై: కేంద్రంలో, తమిళనాట అధికార పార్టీలైన బీజేపీ, డీఎంకేలపై తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ తమిళ హీరో విజయ్ వాగ్బాణాలు ఎక్కుపెట్టారు. ''మతం, భాష అంటూ ప్రజల్ని చీల్చి రాజకీయం చేసే శక్తులు, ద్రవిడ నమూనా అంటూ రాష్ట్రాన్ని దోచుకుంటున్న అవినీతిపరులే మా పార్టీకి ప్రధాన శత్రువులు'' అని ప్రకటించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తమతో కలిసి వచ్చే వారిని అధికారంలో భాగస్వాములను చేస్తామని ప్రకటించారు. ఆయన 8 నెలల క్రితం సొంత పార్టీ ఏర్పాటు చేయడం తెలిసిందే. టీవీకే తొలి మహానాడు విల్లుపురం జిల్లా వీ సాలై గ్రామంలో ఆదివారం జరిగింది. సభకు అభిమానులు, కార్యకర్తలు అసంఖ్యాకంగా పోటెత్తారు. ఈ సందర్భంగా విజయ్ ఆవేశపూరితంగా సుదీర్ఘ ప్రసంగం చేశారు. ''ద్రవిడ సిద్ధాంతకర్త ఈవీఆర్ పెరియార్, కర్మ యోగి కామరాజ్, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, వీర నారీ వేలూ నాచియార్ ఆదర్శంగా టీవీకే సాగుతుంది. లౌకిక, సామాజిక, న్యాయ సిద్ధాంతాలతో పార్టీని నడుపుతాం. అందరం సమానమని చాటే సరికొత్త రాజకీయాలను తమిళనాడులో చూస్తారు'' అని అన్నారు. ''నన్ను విమర్శించిన వాళ్ల పేర్లను ప్రస్తావించబోను. వాళ్లలా అమర్యాదకరంగా మాట్లాడబోను. సంస్కారయుత రాజకీయాలు చేస్తా'' అని చెప్పారు.

ఎంజీఆర్, ఎన్టీఆరే స్ఫూర్తి

తమిళనాడులో ఎంజీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ సినీ రంగం నుంచి రాజకీయంగా చరిత్ర సృష్టించారని విజయ్ గుర్తు చేశారు. ''ఆ దిశగా తమిళనాడులో మరో కొత్త అధ్యాయం లిఖిస్తాం. శాస్త్రసాంకేతి రంగాల్లో మాత్రమే మార్పు రావాలా? రాజకీయాలూ మారాలి. కానీ నన్ను ఈ స్థాయికి తెచ్చిన ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే అన్నింటికీ సిద్ధపడి రాజకీయాల్లోకి అడుగుపెట్టా. అత్యున్నత స్థాయిలో కొనసాగుతున్న సినిమా కెరీర్‌ను వదిలి వచ్చా''. అన్నారు. నీట్ పరీక్ష విధానాన్ని విజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. తన చెల్లెలి మరణం ఎంతగా బాధించిందో 'నీట్' కారణంగా అరియలూర్‌లో ఆత్మహత్య చేసుకున్న అమ్మాయి ఉదంతమూ అంతే బాధించిందన్నారు.

అశేష జనవాహిని

మహానాడుకు నిర్వాహకులే ఊహించని రీతిలో జనసందోహం పోటెత్తింది. సభ సాయంత్రం నాలుగింటికి కాగా ఉదయం నుంచే వేలాదిగా అభిమానుల రాక మొదలైంది. దాంతో సభను ముందుగానే ప్రారంభించారు. రాత్రి ఏడింటికి సభ ముగిసినా రాత్రి 9 దాకా జనం వస్తూనే ఉన్నారు. దాంతో చెన్నై–తిరుచ్చి జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది.

నెతన్యాహుకు చేదు అనుభవం

టెల్ అవీవ్/దుబాయ్: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు చేదు అనుభవం ఎదురైంది. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన అనుమాష దాడికి హీబ్రూ క్యాలెండర్ ప్రకారం ఆదివారానికి ఏడాది నిండింది. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో నెతన్యాహు ప్రసంగిస్తుండగా నిరసనకారులు అడ్డుకున్నారు. 'సిగ్గు, సిగ్గు' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. నెతన్యాహు మధ్యలోనే ప్రసంగాన్ని ఆపేశారు. ఇజ్రాయెల్ తాజా వైమానిక దాడుల్లో ఇరాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పుకొచ్చారు.

గాజాలో 22 మంది దుర్మరణం

డెయిర్ అల్–బలాహ్: ఉత్తర గాజాలోని బెయిట్ లహియాపై శనివారం రాత్రి ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడుల్లో 11 మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరగొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బాధితులంతా మూడు కుటుంబాలకు చెందిన వారేనని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. లెబనాన్ నుంచి దూసుకొచ్చిన డ్రోన్ పేలి తమ పౌరులు గాయపడినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై భారీ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

పంజాబ్‌లో 105 కిలోల హెరాయిన్ పట్టివేత

చండీగఢ్: సరిహద్దుల్లో డ్రగ్స్ రాకెట్‌ను పంజాబ్ పోలీసులు ఛేదించారు. 105 కిలోల హెరాయిన్‌ను సీజ్ చేయడంతోపాటు తుర్కియే కేంద్రంగా పనిచేసే డ్రగ్స్ స్మగ్లర్ నవ్ భులార్ ముఠాలోని నవ్‌జ్యోత్ సింగ్, లవ్‌ప్రీత్ కుమార్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. హెరాయిన్‌తోపాటు సుమారు 32 కిలోల కెఫీన్ ఎన్‌హైడ్రస్, 17 కిలోల డెక్స్‌ట్రోమెథార్ఫాన్ (డీఎంఆర్) అనే నిషేధిత డ్రగ్స్‌ను కూడా పట్టుకున్నారు. ఈ మాదక ద్రవ్యాల విలువ రూ.100 కోట్ల పైమాటేనని చెబుతున్నారు. హెరాయిన్‌తోపాటు వీటిని కూడా వాడితే ఆ ప్రభావం నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని డీజీపీ గౌరవ్ యాదవ్ ఆదివారం చెప్పారు. విదేశీ తయారీ పిస్టళ్లు ఐదు, ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పాకిస్తాన్ నుంచి ఈ మాదక ద్రవ్యాలను దొంగచాటుగా జల మార్గంలో తరలించేందుకు స్మగ్లర్లు భారీ రబ్బర్ ట్యూబ్‌లను వినియోగించారని వివరించారు.

జపాన్‌లో పాలక పక్షానికి ఎదురుదెబ్బ

టోక్యో: జపాన్ పార్లమెంట్‌లోని శక్తిమంతమైన దిగువ సభకు ఆదివారం జరిగిన ఎన్నికల ఫలితాల్లో అధికార పక్షం మెజారిటీకి గండిపడింది. 465 సీట్లకు గాను మెజారిటీకి 233 సీట్లు అవసరం. చివరి ఫలితాలు అందేటప్పటికీ అధికార లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ, మిత్రపక్షం కొమెయిటో కలిపి 211 సీట్లు గెలుచుకున్నాయి. ఈ సంఖ్య కొంత పెరిగేలా ఉన్నా అధికార పక్షానికి మెజారిటీ కష్టమేనని భావిస్తున్నారు. ప్రతిపక్షం, ఇతరులు కలిసి 224 వరకు స్థానాలను దక్కించుకున్నారు. స్వతంత్రులుగా పోటీ చేసి, విజయం సాధించిన తమ వారిని కూడా కలుపుకుంటే అధికార పక్షం బలం పెరగొచ్చు. అయితే, అవినీతి ఆరోపణల నేపథ్యంలో వారిని చేర్చుకునేందుకు ఎల్‌డీపీ సిద్ధంగా లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంలోని మరో పార్టీ సాయంతో ప్రధానమంత్రి షిగెరు ఇషిబా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు.

శ్రీనగర్‌లో ఎన్‌సీ ఎమ్మెల్యే అరెస్టు

శ్రీనగర్: అధికార నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)కి చెందిన ఎమ్మెల్యే బషీర్ అహ్మద్ వీరిని శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఇండిగో విమానంలో జమ్మూ వెళ్లేందుకు రాగా ఎయిర్‌పోర్టులోని ఎక్స్ రే స్కాన్ మెషీన్ ఆయన బ్యాగులో రెండు బుల్లెట్లు ఉన్నట్లు గుర్తించింది. దీంతో, బుల్లెట్లను స్వాధీనం చేసుకుని, ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో బషీర్ అహ్మద్ శ్రీగుఫ్వారా– బిజ్‌బెహర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 28 । అక్టోబర్ । 2024



అవుట్ 'ఫిట్'.. వ్యాయామం హిట్..
వ్యాయామానికి తగిన అవుట్ ఫిట్ ధరిస్తున్నారా.. లేదా? అనేది ఆలోచించకపోతే ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు వ్యాయామ నిపుణులు. - సిటీప్లస్‌లో



ఈవీ సందేహాలు..!
నగర వాసుల్లో విద్యుత్ వాహనాలపై అనేక అనుమానాలు, సందేహాలు నెలకొన్నాయి. గత కొంతకాలంగా విద్యుత్ వాహనాల వినియోగం విరివిగా పెరిగింది. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/20.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది . గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







సంబరంగా సదర్

సదర్ సంబరాలు అంబరాన్నంటాయి. డప్పు దరువులకనుగుణంగా దున్నపోతుల విన్యాసాలు, యాదవుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఇందిరా పార్కు సమీపంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.

పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ముషీరాబాద్: చిన్నారుల్లో దేశభక్తిని మరింత పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మం సూచించారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్య వైశ్య భవన్‌లో భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో చిన్నారులకు దేశభక్తి బృందగానం పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలపై చిన్ననాటి నుంచే పిల్లల్లో బీజం వేయాలని సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు యువతలో జాతీయ భావజాలం, దేశభక్తి, క్రమ శిక్షణ పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశభక్తి పాటల పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు డిసెంబర్ 15న బెంగళూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌గౌడ్, నాగరాజులు మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశ భక్తి బృందగాన పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ సౌత్ రీజినల్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం శాస్త్రి, సంయుక్త కార్యదర్శి నరేంద్ర కృష్ణ, నాగేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజలింగం, అంబిక, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం అనుమతిస్తేనే..

...మెట్రో రెండో దశకు కదలిక

- నాలుగేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- మొత్తం 8 లక్షలకు చేరనున్న ప్రయాణికుల సంఖ్య



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశకు రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన నేపథ్యంలో కేంద్రం అనుమతి తప్పనిసరిగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం ఆమోదం కీలకంగా మారింది. మొదటి దశ ప్రాజెక్టు అనంతరం రెండో దశకు ప్రణాళికలను రూపొందించినప్పటికీ.. ఇప్పటికే తీవ్ర జాప్యం నెలకొంది. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. ఈ జాప్యం కారణంగా ఇతర మెట్రోపాలిటన్ నగరాల్లో మెట్రో రెండు, మూడో దశలు కూడా పూర్తయ్యాయి. కానీ.. నగరంలో రెండోదశ ఏడెనిమిదేళ్ల ఆలస్యంగా ప్రారంభం కావడం గమనార్హం. కేబినెట్ ఆమోదంతో ఒక అడుగు ముందుకు పడింది కానీ ఇప్పుడు కేంద్రం అనుమతితో పాటు నిధుల కేటాయింపే కీలకంగా మారింది.

2029 నాటికి పూర్తయ్యే అవకాశం..

భాగ్య నగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మెట్రో రెండో దశ అనివార్యంగా మారింది. మొదటి దశలో మూడు కారిడార్‌లలో మెట్రో పరుగులు తీస్తోంది. నిత్యం సుమారు 5 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రెండో దశ పూర్తయితే 8 లక్షల మంది మెట్రోల్లో పయనించే అవకాశం ఉంది. నాగోల్ నుంచి రాయదుర్గం వరకు, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ వరకు, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు చేపట్టిన మెట్రో మొదటి దశ నిర్మాణానికి రూ.22 వేల కోట్ల వరకు ఖర్చు కాగా, ప్రస్తుత రెండో దశకు రూ.24, 269 కోట్లతో హైదరాబాద్ మెట్రో రైల్ డీపీఆర్‌ను రూపొందించింది. 5 కారిడార్‌లలో 76.4 కిలో మీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. కేంద్రం సకాలంలో అనుమతించి నిధులు కేటాయిస్తే 2029 నాటికి రెండో దశ పూర్తయ్యే అవకాశం ఉంది. కేంద్రం నుంచి అనుమతి లభించడంలో ఆలస్యం జరిగితే ఈప్రాజెక్టు మరింత వెనక్కి వెళ్లనుంది. రానున్న బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రం ఆమోదంతో పాటు నిధుల కేటాయింపు తప్పనిసరి.

9వ స్థానానికి..

మెట్రో రెండో దశలో ఆలస్యం కారణంగా ఢిల్లీ తర్వాత రెండో స్థాననంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు 9వ స్థానానికి పడిపోయినట్లు రవాణారంగ నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా వంటి పెద్ద నగరాలతో పాటు, పుణె, నాగపూర్, అహ్మదాబాద్ వంటి చిన్న నగరాలు కూడా మెట్రో విస్తరణలో హైదరాబాద్‌ను అధిగమించాయి. రెండో దశ నిర్మాణంలో జరిగిన ఆలస్యం వల్ల ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా భారీగా పెరిగింది. గత ప్రభుత్వ హయాంలోనే పీపీపీ పద్ధతిలో పూర్తి చేయాల్సిన ఎంజీబీఎస్- ఫలక్‌నుమా మార్గం నిలిచిపోయింది. ప్రస్తుతం దాన్ని రెండో దశలో కలిపి చాంద్రాయణగుట్ట వరకు పొడిగించిన సంగతి తెలిసిందే.

5 కారిడార్‌లలో రెండో దశ....

- నాగోల్- శంషాబాద్ ఎయిర్ పోర్టు (36.8 కి.మీ)
- రాయదుర్గం-కోకాపేట్ నియోపొలిస్ (11.6 కి.మీ)
- ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ)
- మియాపూర్-పటాన్‌చెరు (13.4కి.మీ)
- ఎల్‌బీనగర్-హయత్ నగర్ (7.1 కి.మీ.)

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం మెట్రో రెండో దశతో పాటు మూసీ ప్రక్షాళనను ప్రతిష్టాత్మకంగా భావించి కార్యాచరణ చేపట్టారు. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.24.269 కోట్లలో 30 శాతం అంటే రూ.7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం అంటే రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంది. మిగతా 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుకోవాలని నిర్ణయించారు.

డబ్బు కోసం దారుణం

కర్ణాటకలో హైదరాబాదీ హత్య

- స్నేహితుడితో కలిసి భర్తను చంపిన భార్య
- ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కొడగు ఎస్పీ రామరాజన్



హతుడు రమేష్‌కుమార్



నిందితురాలు నిహారిక



నిందితులు నిఖిల్



అంకుర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు చెందిన రమేష్ కుమార్ అనే వ్యాపారి కర్ణాటకలో దారుణ హత్యకు గురయ్యారు. కారులో హత్య చేసి మృతదేహాన్ని అక్కడి ఓ కాఫీ ఎస్టేట్‌లో పడేసి కాల్చేశారు. ఈ నెల 3న చోటుచేసుకున్న ఈ ఘాతుకానికి ఆయన భార్య నిహారిక సూత్రధారిగా తేలింది. ఈమెతో పాటు ప్రియుడు, స్నేహితుడిని శనివారం అరెస్టు చేసిన కొడగు పోలీసులు హతుడి కారును స్వాధీనం చేసుకున్నారు. కొడగు ఎస్పీ ఆర్.రామరాజన్ చెప్పిన వివరాల ప్రకారం.. నిహారిక స్వస్థలం యాదాద్రి- భువనగిరి జిల్లా మునీరాబాద్. గతంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని వివాహం చేసుకుని విడాకులు తీసుకుంది. ఆ తర్వాత హరియాణాకు చెందిన మరో వ్యక్తిని ఆమె పెళ్లి చేసుకుంది. అక్కడ నివసిస్తుండగా ఓ చీటింగ్ కేసులో భార్యాభర్తలు జైలుకు వెళ్లారు. జైలులో ఉండగా హరియాణాలోని కర్నాల్ ప్రాంతానికి చెందిన ఓ మహిళతో వీరికి పరిచయమైంది. ఆ మహిళను కలవడానికి తరచూ జైలుకు వచ్చే ఆమె కుమారుడు అంకుర్ రాణాతోనూ స్నేహం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రెండో భర్తను కూడా నిహారిక వదిలేసి.. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రమేష్ కుమార్ (54)ను వివాహం చేసుకుంది. బెంగళూరులో నివసిస్తూ ఓ ప్రముఖ సంస్థలో పని చేసేది.

రూ.8 కోట్లు కాజేయాలని..

ఏపీలోని కడప జిల్లా వాసవీ నగర్ నుంచి బెంగళూరులోని రామమూర్తి నగర్‌లో వెటర్నరీ డాక్టర్‌గా స్థిరపడిన నిఖిల్ మైరెడ్డితో నిహారికకు ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. ఈ క్రమంలో రమేష్‌కుమార్ ఇటీవల తన స్థిరాస్తిని విక్రయించగా వచ్చిన రూ.8 కోట్లు కాజేయాలని నిహారిక పథకం పన్నింది. రమేష్‌ను హత్య చేసేందుకు అంకుర్ రాణాను సంప్రదించింది. ఈ నెల 1న అంకుర్‌తో కలిసి హైదరాబాద్ చేరుకున్న నిహారిక తన భర్త వద్ద ఉంది. 3వ తేదీన తమను బెంగళూరులో దింపి రావాలంటూ భర్తకు కోరింది. దీనికి అంగీకరించిన రమేష్ కుమార్ తన మెర్సిడెజ్ బెంజ్ కారులో ఇద్దరినీ తీసుకుని బయలుదేరారు. అంకుర్ కారు నడుపుతుండగా.. పక్క సీటులో రమేష్, వెనుక నిహారిక కూర్చున్నారు. మార్గంమధ్యలో హైవేపై కారు ఆపి.. ఊపిరి ఆడకుండా చేసి రమేష్‌ను హత్య చేశారు. మృతదేహాన్ని కారులోనే ఉంచి బెంగళూరులోని హోరామావూ ప్రాంతం వరకు వెళ్లారు.

మృత దేహాన్ని కాల్చేసి..

ఆపై నిఖిల్‌ను సంప్రదించిన నిహారిక తన భర్త రమేష్ కుమార్ హత్య విషయం చెప్పింది. అతడి సలహా మేరకు మృతదేహాన్ని ఊటీ సమీపంలోని సుంటికొప్పలో ఉన్న కాఫీ ఎస్టేట్‌లోకి తీసుకువెళ్లారు. పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి కారులో ఉడాయించారు. ఈ నెల 8న సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కొడగు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన అధికారులు వివిధ ప్రాంతాల్లోని దాదాపు 500 సీసీ కెమెరాల్లో ఈ నెల 1 తేదీ నుంచి రికార్డు అయిన ఫీడ్‌ను పరిశీలించారు. ఓ కెమెరాలో కారు కదలికలతో పాటు దాని నంబర్ కూడా పోలీసులకు కనిపించింది. దీని ఆధారంగా హైదరాబాద్ వచ్చిన కొడగు పోలీసులు హతుడి వివరాలు సేకరించారు. ఆపై నిహారిక, నిఖిల్‌లను బెంగళూరులో, అంకుర్‌ను హరియాణాలో అరెస్టు చేశారు. వీరి కారుతో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఖాళీ ఇళ్ల నేలమట్టం

- డబుల్ బెడ్రూం ఇళ్ల నుంచి తిరిగొస్తున్న మూసీ నిర్వాసితులు
- గుర్తించి మిగతా వాటిని సైతం కూల్చివేస్తున్న యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక పరిధిలో ఖాళీ చేసిన నివాసాలకు తిరిగి వెనక్కి రావాలని నిర్వాసితులు ప్రయత్నిస్తుండటంతో.. వాటి కూల్చివేతకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. నిర్వాసితులకు పునరావాసం కింద డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడంతో ఖాళీ చేసిన నివాసాలను ఇప్పటికే కొన్నింటిని కూల్చివేయగా, మిగతా వాటి కూల్చివేత సైతం రెండురోజుల క్రితం ప్రారంభించింది. తాజాగా నదీ పరీవాహక పరిధిలోని మూసారాంబాగ్‌లోని సుమారు 25పైగా ఇళను కూల్చివేసింది. మిగతా నివాసాల కూల్చివేతకు సైతం సిద్ధం అవుతోంది.

తిరిగి పాత నివాసాలకు రాక..

వాస్తవంగా మూసీ పక్షాళనపై రాజకీయ రగడతో నదీ గర్భం, బఫర్ జోన్‌లో గుర్తించిన నివాసాలకు పునరావాసం, పరిహారం అంశాలు తేల్చాకే కట్టడాల తొలగింపునకు ముందడుగు వేయాలని సర్కారు మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ యంత్రాంగం వెనక్కి తగ్గింది. నదీ గర్భంలో సైతం రెడ్ మార్కింగ్ నిలిచిపోగా.. నివాసాలు ఖాళీ చేసి డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలిన కుటుంబాల గృహాలను సైతం కొన్నింటిని మాత్రమే కూలీలతో కూల్చివేసి మిగతా వాటిని స్వాధీనం చేసుకొని వదిలివేశారు. తాజాగా ప్రధాన రాజకీయ పార్టీలన్నీ మూసీ నివాసితులకు మద్దతు ప్రకటించడంతో భవిష్యత్ కూల్చివేతలపై సందిగ్ధత నెలకొంది. అయితే.. నివాసాలు ఖాళీ చేసి డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లిన కొన్ని ఉమ్మడి కుటుంబాల సభ్యులు తిరిగి తమ పాత నివాసాలకు తిరిగి వేచ్చే ప్రయత్నాలు చేస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై మిగతా ఖాళీ నివాసాలు కూల్చివేతలకు సిద్ధమైంది.

ఇదీ పరిస్థితి..

ఇప్పటికే మూసీ రివర్ బెడ్‌లోని మూసానగర్, శంకర్‌నగర్‌లో కొన్ని ఇళ్లను కూల్చివేయగా మిగిలిన ఇళ్లను సైతం నేలమట్టం చేసింది. వాస్తవంగా మూసారంబాగ్ . డివిజన్ పరిధిలో మొత్తం 109 నిర్మాణాలుండగా, అందులో సాయిలు హట్స్‌లో 25, అంబేడ్కర్ హట్స్‌లో 17, ఆదిజాంబవంతుని హట్స్, అజయ్ హట్స్‌లో 26, అజయ్ హట్స్‌లోని 20 ఇళ్లను ఇప్పటికే కూలీలతో కూల్చివేయించారు.

పరీవాహక పరిధిలో..

మూసీ పరీవాహక పరిధిలో 12,184కుపైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని నదీ గర్భం, బఫర్ జోన్లుగా వర్గీకరించి విభజించారు. నదీ గర్భంలో 2,166 నిర్మాణాలు ఉండగా, అందులో 288 భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్లు వరకు బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు, ఇందులో 1032 భారీ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికి రివర్‌బెడ్‌లో మాత్రం రెడ్ మార్కింగ్ జరిగింది.



ఫైర్ వర్క్స్ దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు



కాలిబూడిదైన ద్విచక్ర వాహనాలు

క్రాకర్స్ షాపులో అగ్ని ప్రమాదం

- కాలిపోయిన పది ద్విచక్ర వాహనాలు
- దట్టమైన పొగతో ఇద్దరు మహిళలకు అస్వస్థత

సుల్తాన్‌బజార్: బొగ్గులకుంటలోని పరస్ ఫైర్‌వర్క్స్ దుకాణంలో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పది ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. గౌలిగూడ నుంచి నాలుగు ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. క్రాకర్స్‌కు నిప్పు అంటుకుని భారీ శబ్దాలు రావడం, మంటలు ఎగిసిపడటంతో చుట్టు పక్కల ఉన్నవాళ్లు భయాందోళనతో పరుగులు తీశారు. దట్టమైన పొగతో అస్వస్థతకు గురైన ఇద్దరు మహిళలను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు బొగ్గులకుంట చౌరస్తా నుంచి కోఠి బ్యాంక్ స్ట్రీట్ వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటా? లేక మానవ తప్పిదమా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. దుకాణం పక్కన ఉన్న బిల్డింగ్‌కు కూడా మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న తాజా టిఫిన్ సెంటర్‌కు సైతం మంటలు వ్యాపించాయి. గౌలిగూడ ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని అగ్నిమాపక బృందం మంటలను ఆర్పింది. క్రాకర్స్ కొనుగులుదారుల వాహనాలు కూడా అగ్నికి ఆహుతి కావడం ఆందోళనకు కలిగిస్తోంది.

సర్కారు చదువుకు సాన

- ప్రభుత్వ బడుల బలోపేతంపై ప్రత్యేక నజర్
- రేపు ఎంఈఓలకు ఒకరోజు శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇటీవల ప్రతి మండలానికి ఒక ఎంఈఓను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ఈ నెల 29 (మంగళవారం)న హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల నుంచి 42 మంది ఎంఈఓలు శిక్షణకు హాజరు కానున్నారు.

పర్యవేక్షణకు ప్రాధాన్యం..

- ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 1-5 తరగతుల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ) పేరుతో తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లోని 6-9 తరగతుల విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లిప్)ను ఉన్నతి పేరుతో అమలు చేస్తున్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో విద్యాశాఖ చేపట్టిన తొలిమెట్టు, ఉన్నతి తదితర కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా ఎంఈఓలు పర్యవేక్షణ చేయాలి. పర్యవేక్షణ వివరాలను పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేకంగా యాప్‌లో నమోదు చేయడంలో ఎంఈఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.
- గతంలో కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం), మండల నోడల్ అధికారి (ఎంఎన్ఓ), మండల విద్యాధికారి (ఎంఈఓ) వ్యవస్థ అమలులో ఉండేది. సీనియర్ హెచ్ఎంలు ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వహించేవారు. వీరికి (ఒక్కో ఇన్‌చార్జి ఎంఈఓకు) రెండు నుంచి ఆరు మండలాల అదనపు బాధ్యతలు ఉండటంతో సరైన పర్యవేక్షణ నిర్వహించలేకపోయారు. ఎంఎన్ఓగా పని చేస్తున్న సీనియర్ హెచ్ఎంలను ప్రస్తుతం ఎంఈఓలుగా నియమించారు. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా.. ఒక ఉప్పల్ మండలానికి మాత్రమే రెగ్యులర్ ఎంఈఓ ఉన్నారు. మిగతా 14 మండలాలకు ఎంఎన్ఓగా పనిచేస్తున్న సీనియర్ హెచ్ఎంలు ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలోనే పాఠశాలల పర్యవేక్షణ, విద్యా ప్రమాణాల పెంపు తదితర అంశాలపై ఎంఈఓలకు శిక్షణ ఇస్తారు.

ఆకట్టుకున్న లిటరరీ కార్నివాల్‌–2024





లిటరరీ కార్నివాల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్‌ పబ్లిక్‌ స్కూల్‌ విద్యాశ్రమంలో రెండు రోజులపాటు జరిగిన వార్షిక లిటరరీ కార్నివాల్‌–2024 విశేషంగా ఆకట్టుకుంది. వివిధ రకాల థీమ్‌లతో కొనసాగిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కళాత్మక, సృజనాత్మక నైపుణ్యాన్ని చాటారు. రవీంద్రనాథ్‌ ఠాగూర్‌ రచించిన కాబూలీవాలా డ్రామా ద్వారా విద్యార్థులు పాత్రలకు జీవం పోసి ఆకట్టుకున్నారు. అలాగే సరోజినీనాయుడు రచించిన కవితలను వినిపించి అందులో సారాంశాన్ని ఆవిష్కరించి ఆలోచింపజేశారు. టీబీసీ కామెడీ షో, మ్యూజిక్‌ కన్సర్ట్‌లు అపరిమితమైన వినోదాన్ని పంచాయి. జూనియర్‌ విద్యార్థులు ప్రదర్శించిన మంకీ అండ్‌ ది క్రొకడైల్‌ స్కిట్‌ ఆహుతులను కట్టిపడేసింది. బటర్‌ఫ్లై డ్యాన్స్‌ ఓలలాడించింది. ప్రముఖ రచయితలు రచించిన కవితలు, పద్యాలు సాహిత్య పరిజ్ఞానాన్ని పంచాయి. అనంతరం స్టూడెంట్స్‌ క్యారెక్టర్‌ పరేడ్‌ నిర్వహించారు. వీటితో పాటు పోయిట్రీ ఇన్‌స్టాలేషన్, న్యూస్‌ రీడింగ్, డైలాగ్‌ రైటింగ్, రైటింగ్‌ బుక్, జాకెట్‌ డిజైనింగ్, కల్చరల్‌ స్పీచ్, లిటరరీ క్విజ్‌ డిబేట్‌ తదితర అంశాలను ప్రదర్శించి విద్యార్థులు తమ సృజనకు పదును పెట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ అరుణశ్రీ మాట్లాడుతూ లిటరరీ కార్నివాల్‌ విద్యార్థుల్లో సాహితీ అభిలాషను పెంచుతుందన్నారు. ప్రముఖ కవులు, రచయితలు రచించిన కవితలు, పద్యాలు విద్యార్థుల్లో సాహితీ పరిజ్ఞానాన్ని పెంపొందింపజేస్తాయని, ఆ దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.

పెళ్లి పేరుతో మోసం

నిందితుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్‌ : ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటగిరిలో నివాసం ఉంటున్న ఓ మహిళ సినీ పరిశ్రమలో మేకప్‌ ఆర్టిస్ట్‌గా పని చేసేది. ఆ సమయంలో ఆమెకు బోరబండ రామారావునగర్‌కు చెందిన యుగంధర్‌తో పరిచయం ఏర్పడటంతో ఇరువురి మధ్య స్నేహం కుదిరింది. తరచూ ఆమె ఉంటున్న ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో తాను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. కొన్నాళ్లుగా యుగంధర్‌ సదరు మహిళను దూరంగా ఉంచుతున్నాడు. దీంతో ఆమె బోరబండలోని యుగంధర్‌ ఇంటికి వెళ్లి నిలదీయగా అతనితో పాటు అతని తల్లిదండ్రులు ఆమెను బెదిరించారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య



సాయిసుదీప్‌రెడ్డి మృతదేహం

బంజారాహిల్స్‌: భవనం పైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌ కాలనీలోని శ్రీసాయిరామ్‌ మనోర్‌ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి రియల్‌ఎస్టేట్‌ వ్యాపారం చేస్తున్నాడు. అతడి పెద్ద కొడుకు సాయిసుదీప్‌రెడ్డి(21) మహేంద్ర యూనివర్సిటీలో బీటెక్‌ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే శ్రీనివాస్‌రెడ్డి మధురానగర్‌కు మారాడు. ఈ నెల 24న సాయిసుదీప్‌రెడ్డి స్నేహితులతో కలిసి తన బర్త్‌డే వేడుకలు జరుపుకున్నాడు. 26న సాయంత్రం అతను తన స్నేహితులతో కలిసి సాయిరామ్‌ మనోర్‌ అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. 5.30 సమయంలో తన స్నేహితుడు మనీష్‌తో పాటు మరో ఇద్దరితో కలిసి టెర్రస్‌ పైకి వెళ్లాడు. వారితో మాట్లాడుతున్న సాయిసుదీప్‌ సూర్యాస్తమయం చాలా బాగుంది చూడాలని వారి దృష్టి మరల్చి ఐదో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గత రెండు రోజులుగా తన కుమారుడు మూడీగా ఉంటున్నాడని, తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతున్నాడని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోల్‌కతాలో మర్డర్...

చార్మినార్‌లో షెల్టర్‌!

అక్కడి ఆనందాపూర్‌ పరిధిలో బడా వ్యాపారి హత్య

- జూలైలో ఘాతుకానికి ఒడిగట్టిన ముగ్గురు నిందితులు
- ఆపై నగరానికి వచ్చి చార్మినార్‌ ప్రాంతంలో ఆశ్రయం
- కేసు దర్యాప్తులో గుర్తించిన పశ్చిమ బెంగాల్‌ పోలీసులు
- చార్జ్‌షీట్‌లో నగరానికి చెందిన ఎండీ షేక్‌ నౌషాద్‌ పేరు
- అరెస్టు కోసం హైదరాబాద్‌ చేరుకున్న ప్రత్యేక బృందం



హత్య జరిగిన ప్రాంతం



హతుడు ఆరిఫ్‌ (ఫైల్‌)

సాక్షి, సిటీబ్యూరో: పశ్చిమ బెంగాల్‌ రాజధాని కోల్‌కతాలో సంచలనం సృష్టించిన బడా వ్యాపారి ఆరిఫ్‌ ఖాన్‌ హత్య కేసు లింకులు నగరంలో వెలుగు చూశాయి. అతడిని హతమార్చిన నిందితులు నేరుగా సిటీకి వచ్చి చార్మినార్‌ ప్రాంతంలో ఆశ్రయం పొందినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. ఈ కేసులో శుక్రవారం ఆనందాపూర్‌ కోర్టులో దాఖలు చేసిన అభియోగపత్రాల్లో ఈ విషయం పొందుపరిచారు. ఈ నేపథ్యంలోనే నిందితుల జాబితాలో నగరానికి చెందిన మహ్మద్‌ షేక్‌ నౌషాద్‌ పేరునూ చేర్చారు. అతడి కోసం గాలిస్తూ ఓ ప్రత్యేక బృందం హైదరాబాద్‌కు చేరుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం...

మరో ఇద్దరు స్నేహితులతో కలిసి...

తాను ఎంతగా డిమాండ్‌ చేస్తున్నా, బెదిరిస్తున్నా ఆరిఫ్‌ ఖాన్‌ డబ్బులు ఇవ్వకపోవడాన్ని అబ్బాస్‌ జీర్ణించుకోలేకపోయాడు. ఓ సందర్భంలో ఆరిఫ్‌ బహిరంగంగా తనను మందలించడంతో అబ్బాస్‌ కోపంతో రగిలిపోయాడు. ఒకప్పుడు తనతో పాటు చిన్న ఉద్యోగం చేసిన ఆరిఫ్‌ ఇప్పుడు బడా వ్యాపారిగా మారడంతో అప్పటికే ఈర్ష్యతో రగిలిపోతున్న అబ్బాస్‌ కోపానికి ఇది ఆజ్యం పోయినట్లయ్యింది. ఆరిఫ్‌ను వదిలేస్తే అతడి మాదిరిగానే మరికొందరు వ్యాపారులూ హఫ్తా ఇవ్వడం మానేస్తారని, ఆ ప్రాంతంలో తన ఆధిపత్యం దెబ్బతింటుందని అబ్బాస్‌ భావించాడు. దీనికి ఆరిఫ్‌ను బహిరంగంగా, నడిరోడ్డుపై హత్య చేయడమే పరిష్కారమని నిర్ణయించుకున్నాడు. దీనికోసం తన స్నేహితులైన మహ్మద్‌ జహీర్‌ ఖాన్, అమీర్‌బకర్‌లతో కలిసి రంగంలోకి దిగాడు.

స్నేహితుడే పగబట్టి..

కోల్‌కతా శివారులోని పంచన్నగ్రామ్‌ ప్రాంతానికి చెందిన ఆరిఫ్‌ ఖాన్, మోయిన్‌ అబ్బాస్‌ స్నేహితులు. గతంలో ఇద్దరూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతికారు. ఇరు కుటుంబాల మధ్యా మంచి సంబంధాలు ఉండేవి. కొన్నేళ్ల క్రితం ఆరిఫ్‌ ఖాన్‌ రియల్‌ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్‌ వ్యాపారం ప్రారంభించి కోల్‌కతాలోనే ప్రముఖ వ్యాపారవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. అబ్బాస్‌ మాత్రం ఆనందాపూర్‌ ప్రాంతంలో రౌడీగా మారి హఫ్తాలు వసూలు చేయడం మొదలెట్టాడు. ఇందులో భాగంగా తరచూ ఆరిఫ్‌ ఖాన్‌ నుంచి డబ్బులు డిమాండ్‌ చేసి వసూలు చేసేవాడు. నగదు ఇచ్చే ప్రతి సందర్భంలోనూ ప్రవర్తన మార్చుకోవాల్సిందిగా అబ్బాస్‌కు ఆరిఫ్‌ ఖాన్‌ హితబోధ చేస్తూ వచ్చాడు. ఇతడి ప్రవర్తనతో విసిగిపోయిన అబ్బాస్‌ డబ్బులు ఇవ్వడం మానేశాడు.

హత్య తర్వాత నగరానికి వచ్చి...

ఆరిఫ్‌ను హత్య చేయడం కోసం దాదాపు రెండు నెలల పాటు వేచి చూసిన ఈ త్రయం... ఈ ఏడాది జూలై 26న సాయంత్రం ఆనందాపూర్‌ ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆరిఫ్‌ను అడ్డగించిన వీరు ముగ్గురూ ఘర్షణకు దిగారు. ఆపై అతడిని వెంటాడి దారుణంగా హత్య చేశారు. హత్యానంతరం ముగ్గురిలో ఇద్దరు ముంబై పారిపోగా.. అబ్బాస్‌ మాత్రం చార్మినార్‌ ప్రాంతంలో నివసించే తన సమీప బంధువు మహ్మద్‌ షేక్‌ నౌషాద్‌ను సంప్రదించాడు. హత్య విషయం అతడికి చెప్పి... తనకు ఆశ్రయం ఇవ్వాలని కోరారు. నౌషాద్‌ అంగీకరించడంతో సిటీకి వచ్చిన అబ్బాస్‌ అతడి వద్ద ఆశ్రయం పొందాడు. హత్య జరిగిన మూడో రోజు నగరానికి వచ్చిన కోల్‌కతా పోలీసులు అబ్బాస్‌ను, ముంబైలో మిగిలిన ఇద్దరినీ అరెస్టు చేసి తీసుకువెళ్లారు.

అభియోగపత్రాల్లో నౌషాద్‌ పేరు...

అప్పట్లో కోల్‌కతా పోలీసులు నౌషాద్‌ను అరెస్టు చేయలేదు. హత్య విషయం తెలియకపోవడతంతో అబ్బాస్‌కు ఆశ్రయం ఇచ్చి ఉంటాడని భావించారు. అయితే అబ్బాస్‌ను కోర్టు అనుమతితో పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించగా అన్నీ తెలిసే నౌషాద్‌ ఇతడికి ఆశ్రయం ఇచ్చినట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో అక్కడి కోర్టులో దాఖలు చేసిన అభియోగపత్రాల్లో నౌషాద్‌ను నాలుగో నిందితుడిగా చేర్చారు. 100 పేజీల ఈ చార్జ్‌షీట్‌లో 48 మందిని సాక్షులుగానూ చేర్చారు. నౌషాద్‌ను అరెస్టు చేయడానికి ఓ ప్రత్యేక బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. అతడి ఆచూకీ లేకపోవడంతో ముమ్మరంగా గాలిస్తోంది.

రైల్లో బంగారు ఆభరణాలు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీనగర్‌కు చెందిన నాగేశ్వర్‌ రావు భార్య రత్నకుమారి శనివారం బెంగళూర్‌ – యశ్వంత్‌పూర్‌ రైలులో బయలుదేరి ఆదివారం ఉదయం కాచిగూడకు చేరుకుంది. స్టేషన్‌లో లిఫ్ట్‌ వద్ద ఆమె బ్యాగులోని 15 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,900 నగదు చోరీకి గురైనట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బ్యాగ్‌ మాయం

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ బ్యాగులో నుంచి బంగారు ఉంగరం, నగదు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరోఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప కథనం మేరకు మల్కాజ్‌గిరికి చెందిన స్వప్న కుటుంబంతో సహా తిరుపతి వెళ్లి శనివారం వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ రైల్లో తిరుగు ప్రయాణమయ్యాయి. రైలు మహబూబ్‌నగర్‌ స్టేషన్‌ వద్దకు రాగానే ఆమె బ్యాగు చోరీకి గురైంది. బ్యాగులో బంగారు ఉంగరం, రూ.3వేల నగదు ఉన్నట్లు బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్‌ రైల్వే పోలీస్‌ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఆస్పత్రుల్లో తెలంగాణ వైద్య మండలి తనిఖీలు

- క్వాలిఫైడ్‌ డాక్టర్ల ముసుగులో ఆర్‌ఎంపీల వైద్యం
- చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: ● టీజీఎంసీ చైర్మన్‌ డాక్టర్‌ మహేష్‌కుమార్‌



తనిఖీల్లో పాల్గొన్న టీజీఎంసీ సభ్యులు

బోడుప్పల్‌: మేడిపల్లి మండల పరిధిలో క్వాలిఫైడ్‌ వైద్యుల పేరుతో అనుమతులు తీసుకుని నకిలీ డాక్టర్లు నిర్వహిస్తున్న పలు ఆస్పత్రులపై శనివారం సాయంత్రం తెలంగాణ వైద్యమండలి ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో పాల్గొన్న హెచ్‌ఆర్‌డీఏ నాయకులు డాక్టర్‌ వంశీ, టీజీఎంసీ సభ్యులు డాక్టర్‌ ప్రతిభా లక్ష్మి, డాక్టర్‌ నరేష్‌ కుమార్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనస్తీషియా నిపుణుడైన డాక్టర్‌ సుదర్శన్‌రావు కార్డియాలాజిస్ట్‌గా చెప్పుకుంటూ బోడుప్పల్‌లో ఆర్‌బీఎం హాస్పిటల్‌ ఏర్పాటు చేశాడు. సదరు ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన పరీక్షలు చేయడమేగాక అంజియాగ్రామ్‌ చేసి స్టంట్‌లు వేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. డాక్టర్‌ సుదర్శన్‌రావు ఎలాంటి అర్హత లేకుండానే వైద్యం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. గుండెకు సంబంధించిన వైద్యులు డాక్టర్‌ కేకే రెడ్డి ఆధ్వర్యంలో 7 ప్రొసీజర్స్‌ చేసినట్లు అతను చెప్పాడని, అయితే రికార్డు బుక్‌లో 15 గుండెకు సంబంధించిన ప్రొసీజర్స్‌ గున్నట్లు గుర్తించామన్నారు. అంతేగాక ఆస్పత్రిలో స్కానింగ్‌ సంబంధిత రిపోర్టులు, రికార్డులు సరిగ్గా లేవని కొన్ని రిపోర్టులను రికార్డుల నుంచి తొలగించారన్నారు. అదే ప్రాంతంలో డాక్టర్‌ వంశీ పేరున విజయ హెల్త్‌ క్లినిక్‌కు అనుమతి తీసుకుని హోమియోపతి వైద్యుడు డాక్టర్‌ శంకర్‌ ప్రాక్టీస్‌ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. బుద్ధానగర్‌లో మహాలక్ష్మి క్లినిక్‌లో రుషికేష్‌ పేరు మీద అనుమతి తీసుకుని నకిలీ వైద్యుడు సత్యనారాయణ ప్రాక్టీస్‌ చేస్తున్నాడని, హాప్పీ చిల్డ్రన్స్‌ క్లినిక్‌ నిర్వహిస్తున్న డాక్టర్‌ పరమేష్, అసోసియేట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తూ మరో నకిలీ వైద్యుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌తో కలిసి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో సేకరించిన ఆధారాలను కౌన్సిల్‌కు అందజేస్తామని డాక్టర్‌ సుదర్శన్‌రావుతో పాటు, నకిలీ వైద్యులను ప్రోత్సహిస్తున్న ఇతర వైద్యులకు షోకాజ్‌ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయ హెల్త్‌ క్లినిక్, మహాలక్ష్మి క్లినిక్‌లపై క్లినికల్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మేడ్చల్‌ మల్కాజిగిరి వైద్య ఆరోగ్య అధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

కరాటే వచ్చినా కాపాడుకోలేకపోయాడు..

- కరాటే కోచ్‌పై దాడి ● తీవ్ర గాయాలు

బంజారాహిల్స్‌: పాత కక్షలతో ఓ కరాటే కోచ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..దమ్మాయిగూడకు చెందిన ఎండీ జహంగీర్‌ కరాటే కోచ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న అతను యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో స్కూల్‌ ఫెడరేషన్‌ గేమ్స్‌ నిర్వహిస్తుండగా అక్కడికి వచ్చిన పహాడీషరీఫ్‌కు చెందిన హఫీజ్, ఎజాజ్, ఒమర్‌బిన్, అహ్మద్, షేక్‌ సల్మాన్‌ తదితో గొడవపడ్డారు. హఫీజ్‌ పాత కక్షలతో జహంగీర్‌పై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. మిగతా వారు కూడా అతడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన జహంగీర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గౌలిపురా: భార్య గొడవపడి పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ పి.నాగదుర్గా ప్రసాద్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగులచింత ఆర్య మైదాన్‌ ప్రాంతానికి చెందిన సంఘమేశ్వర్‌ (37), శోభా దంపతులకు ఇద్దరు సంతానం. కుటుంబ కలహాల కారణంగా శోభ పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి డిప్రెషన్‌తో బాధపడుతున్న సంఘమేశ్వర్‌ ఆదివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిధిని పట్టించుకోకుండా

‘డిజిటల్‌ అరెస్టు’ తప్పించాడు!

- మియాపూర్‌ వాసికి ఫోన్‌ చేసిన సైబర్‌ నేరగాళ్లు
- భయంతో ఓ హోటల్‌ గదిలో స్వీయ నిర్బంధం
- కొన్ని గంటల తర్వాత ధైర్యం చేసిన బాధితుడు
- సిటీ ఠాణాకు ఫోన్, కానిస్టేబుల్‌ కౌన్సెలింగ్‌



కానిస్టేబుల్‌ గణేష్‌

సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్‌ పార్శిల్స్, మనీ లాండరింగ్, బ్యాంకు ఖాతా దుర్వినియోగం అంటూ పోలీసుల పేరుతో ఫోన్లు చేస్తున్న సైబర్‌ నేరగాళ్లు ‘డిజిటల్‌ అరెస్టు’ చేస్తున్నారు. వీడియో కాల్‌ ద్వారా నిఘా గంటల తరబడి నిర్బంధించి అందినకాడికి దండుకుంటున్నారు. ఇలాంటి వారి బారినపడి రూ.లక్షలు, రూ.కోట్లు నష్టపోయిన కేసులు ఇటీవలి కాలంలో అనేకం నమోదయ్యాయి. అయితే సిటీ సైబర్‌ క్రైమ్‌ ఠాణాకు చెందిన కానిస్టేబుల్‌ గణేష్‌ చొరవతో సైబరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ ఫ్రాడ్‌ బారినపడకుండా బయటపడ్డారు. పరిధులు పట్టించుకోకుండా వేళకాని వేళలో వచ్చిన ఫోన్‌ కాల్‌కూ పక్కాగా స్పందించిన గణేష్‌ను ఉన్నతాధికారులు ఆదివారం అభినందించారు. మియాపూర్‌ ప్రాంతానికి చెందిన ఓ ఐటీ ఉద్యోగికి శుక్రవారం వాట్సాప్‌ ద్వారా కొన్ని మెసేజ్‌లు వచ్చాయి. ఈయన ఆధార్‌ నెంబర్‌ వినియోగించి ముంబైలో కొందరు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, దీనిపై అక్కడ కేసు నమోదైందని వాటిలో ఉంది. ఆ సందేశాలను బాధితుడు పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్చువల్‌ నెంబర్ల ద్వారా ఫోన్‌ కాల్స్‌ మొదలయ్యాయి. ముంబై పోలీసుల మాదిరిగా మాట్లాడిన సైబర్‌ నేరగాళ్లు వీడియో కాల్‌ చేసి యూనిఫాంలో కనిపించారు. కేసు, అరెస్టు అంటూ తీవ్రంగా భయపెట్టి ఇంట్లో ఉంటే స్థానిక పోలీసులూ వచ్చిన అరెస్టు చేస్తారని భయపెట్టారు. తాను ఎప్పుడూ ముంబై రాలేదని, ఆ ఆర్థిక లావాదేవీలతో తనకు సంబంధం లేదని చెప్పినా సైబర్‌ నేరగాళ్లు పట్టించుకోలేదు. శనివారం తెల్లవారుజాము నుంచి రకరకాలుగా భయపెట్టిన వారు సదరు ఐటీ ఉద్యోగి బ్యాంకు ఖాతాలో రూ.13 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. సోమవారం వరకు అతడు ఎక్కడికీ వెళ్లకుండా, ఎవరితో మాట్లాడకుండా చేసి ఆపై ఆర్టీజీఎస్‌ ద్వారా ఆ మొత్తం కాజేయాలని పథకం వేశారు. దీంతో ఐటీ ఉద్యోగిని డిజిటల్‌ అరెస్టు చేస్తున్నట్లు చెప్పిన సైబర్‌ నేరగాళ్లు ఇంటి నుంచి బయటకు రప్పించారు. కుటుంబీకులతో సహా ఎవరినీ కలవద్దంటూ షరతు విధించి అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో బస చేయించారు. ఇలా ఆదివారం తెల్లవారుజాము 3 గంటల వరకు ఆడియో, వీడియో కాల్స్‌ కట్‌ చేయని సైబర్‌ నేరగాళ్లు బాధితుడిని హోటల్‌ గదిలోనే ఉంచారు. ఆ సమయంలో కాల్‌ కట్‌ అవడంతో బాధితుడికి కాస్తా అవకాశం చిక్కింది. దీంతో ధైర్యం చేసిన అతడు ఇంటర్‌నెట్‌లో సెర్చ్‌ చేసి హైదరాబాద్‌ సైబర్‌ క్రైమ్‌ ఠాణా ఫోన్‌ నెంబర్‌ తెలుసుకున్నాడు. తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో సదరు నెంబర్‌కు కాల్‌ చేయగా... ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ గణేష్‌ అందుకున్నారు. సాధారణంగా పోలీసులు తమకు ఫోన్‌ చేసిన బాధితులు బయటి ప్రాంతాలకు చెందిన వారని చెప్పగానే... అక్కడి అధికారులను సంప్రదించాలని చెబుతుంటారు. అయితే ఈ బాధితుడు మియాపూర్‌ వాసిని అని చెప్పినా ఆ సమయంలోనూ పక్కాగా స్పందించిన గణేష్‌ విషయం మొత్తం తెలుసుకున్నారు. అది సైబర్‌ మోసమంటూ బాధితుడికి కౌన్సెలింగ్‌ ఇవ్వడంతో పాటు మియాపూర్‌లో వారి ఇంటి పక్కన ఉండే స్నేహితుడి నెంబర్‌ తీసుకున్నాడు. ఆ సమయంలో ఆయనకు ఫోన్‌ చేసి విషయం చెప్పిన గణేష్‌... బాధితుడి వద్దకు వచ్చి తీసుకువెళ్లేలా చొరవ చూపారు. ఈ అంశంలో కానిస్టేబుల్‌ గణేష్‌ స్పందనకు ఉన్నతాధికారులు అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



కార్తీక్‌ గౌడ్‌ మృతదేహం

కీసర: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కీసర పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగారం ప్రాంతానికి చెందిన కార్తీక్‌గౌడ్‌(25) శనివారం రాత్రి బైక్‌పై కీసర నుంచి యాద్గార్‌పల్లి వెళుతుండగా గోశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ అదుపుతప్పి వ్యక్తి మృతి

నాగోలు: బైక్‌ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. నాగోలు ఎస్‌ఐ రమేష్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మేడ్చల్‌ జిల్లా, కొర్రెములకు చెందిన పడిగం జంగయ్య(43) టైలర్‌గా పని చేసేవాడు. ఈనెల 25న బైక్‌పై బొంగులూరుకు వెళుతుండగా గౌరెల్లి చౌరస్తా సమీపంలో బైక్‌ అదుపు తప్పి కింది పడటంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని బీఎన్‌రెడ్డి నగర్‌లోని వెల్‌నెస్‌ హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా జనరల్‌ హాస్పిటల్‌కు రెఫర్‌ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న జంగయ్య ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఆదివారం నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సోమవారం, 28, అక్టోబర్, 2024

చేతివృత్తులకు 'విశ్వకర్మ' చేయూత

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: కాలక్రమేణా చేతివృత్తులు కనుమరుగవుతున్నాయని, వృత్తులపై ఆధారపడినవారు ఉపాధి కోల్పోతున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. చేతి వృత్తులపై ఆధారపడిన వారిని ఆదుకోవడానికే కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఆదివారం కవాడిగూడ డివిజన్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ కుక్కలతూం దోబీఘాట్‌లో రూ.26 లక్షలతో నిర్మించతలపెట్టిన కమ్యూనిటీ హాల్ పనులకు స్థానిక కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణపనులను వీలైనంత త్వరగా అధికారులు పూర్తి చేసి రజకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా దోబీఘాట్ల అభివృద్ధికి కృషి చేశానని, ఇప్పుడు కేంద్రమంత్రిగా దోబీఘాట్‌ల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దోబీ(రజక) అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహ, రజక యువక సంఘం సలహాదారులు సి.కొమురయ్య, జె.ముత్యాలు, బి.చంద్రమోహన్, జె.రాజశేఖర్, ఎ.వెంకటేష్, జి.భాస్కర్, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ సీనియర్ నాయకులు జి.వెంకటేష్, పరిమళ్ కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం, సీకే శంకర్, పూసరాజు, ఎం.సి మహేందర్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

వైవిధ్యాన్ని చాటిన స్వదేశీ మేళా

మంత్రి జూపల్లి కృష్ణారావు



ముగింపు కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

ఖైరతాబాద్: అపారమైన చారిత్రకమైన వైభవం, ఘనమైన సంస్కృతిక వైవిధ్యాన్ని కలిగిన హైదరాబాద్ స్వదేశీ మేళాకు వేదిక కావడం గర్వంగా ఉందని, ఈ మేళ దేశంలోని వైవిధ్యాన్ని చాటిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పీపుల్స్ ప్లాజా వేదికగా స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబ్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళా ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మేళాలో వివిధ స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల కళాకారులను, వృత్తి నైపుణ్యాలను ఒకేచోట చేర్చి ఇంత గొప్పమేళాను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం స్వయం సమృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన వారంతా నగరంలోని చారిత్రక కట్టడాలను, విశేషాల్ని చూసి ఆస్వాదించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ హరీశ్ బాబు, జి.రమేష్ గౌడ్, ఇంద్రసేన్ రెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత కో కన్వీనర్లు సిద్దుల అశోక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ముగిసిన ఆర్థోపెడిక్ సర్జన్ల సదస్సు

150 మందికిపైగా నిపుణుల హాజరు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గురవారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో 'టెక్నిక్, టెక్నాలజీ, ట్రైబాలజీ' అనే మూడు అంశాలపై నిర్వహించిన ఆర్థోపెడిక్ సర్జన్ల అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. ప్లస్ ఆర్థోపెడిక్స్, ప్లస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జాయింట్ రిప్లేస్‌మెంట్‌లో కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీ, అత్యాధునిక ఇంప్లాంట్స్ అనే అంశంపై నిర్వహించిన సదస్సును చీఫ్ రోబోటిక్ జాయింట్ రీ ప్లేస్‌మెంట్ సర్జన్, చైర్మన్ సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి, చెన్నై సిమ్స్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ పి.సూర్యనారాయణ ప్రారంభించారు. డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ జాయింట్ రీ ప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలో సెరామిక్ ఇంప్లాంట్స్ ఉపయోగించడం వల్ల రోగికి ఇన్‌ఫెక్షన్లు తగ్గడం, ఇంప్లాంట్ లైఫ్ టైం పెరగడం వంటి ఉపయోగాలు ఉన్నాయన్నారు. జర్మనీకి చెందిన వాగ్నర్, స్విట్జర్లాండ్‌కు చెందిన మార్టిన్, మలేషియాకు చెందిన ఇజాస్ ఇబ్రహీం, శ్రీలంక నుంచి డాక్టర్ చందన మాట్లాడారు. ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ అఖిల్ దాడి, డాక్టర్ అవతార్ సింగ్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో 150 మందికిపైగా ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో విద్య విధ్వంసం

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



కోదండరాంను సన్మానిస్తున్న పుల్లయ్య, ఐలయ్య తదితరులు

ముషీరాబాద్: ఉన్నత విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉన్నత విద్యావ్యవస్థ విధ్వంసానికి గురైందని ఆరోపించారు. ఆదివారం విద్యానగర్ ఓయూ రోడ్డులోని ఆంధ్ర మహిళా సభ ఆడిటోరియంలో తెలంగాణ రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.పిచ్చయ్య, ఎ.పుల్లయ్య ఆధ్వర్యంలో కోదండరాంను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తామన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విద్యారంగానికి నిధుల కేటాయింపులో తెలంగాణ 28వ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.సుధాకర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ టి.ప్రతాప్‌రెడ్డి, అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ కె.ఐలయ్య, ఎం.ధర్మేందర్ రావు, డి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సు డిపోగా

హెచ్‌సీయూ



గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో

ఒకేసారి 69 బస్సుల కేటాయింపు

వీటిల్లో మహాలక్ష్మీ పథకం వర్తింపు

అన్నింటినీ సిటీ ఆర్డినరీలుగానే నడపాలని నిర్ణయం

ఫుల్ చార్జింగ్‌కు పట్టే సమయం గంటా 40 నిమిషాలు



హెచ్‌సీయూ డిపోకు కేటాయించిన 69 ఎలక్ట్రికల్ బస్సులు ఇవే..

కాలుష్య నియంత్రణ కోసమే...



నగరంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కోసమే ఈ ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని నిర్ణయించాం. దశలవారీగా డీజిల్ బస్సులను నగరంలోని ఇతర డిపోలకు అవసరాన్ని బట్టి కేటాయించారు. మా పరిధిలోని అన్ని రూట్లలో ఈ ఎలక్ట్రిక్ బస్సులను నడిపేలా చేశాం. ప్రయాణికులకు అందుబాటులో ఉంటూ, సమయపాలన పాటించేలా బస్సులను నడుపుతున్నాం. ఆక్యుపెన్సీ రేషియో పెంచి రాష్ట్ర ప్రభుత్వ, ఆర్టీసీ పాలకమండలి నిర్ణయం సరైనదే అని నిరూపించేలా సమష్టిగా కృషి చేస్తాం. డిపోను నగరంలోనే ఆదర్శంగా మార్చడంలో ప్రయాణికుల సహకారం ఎంతో అవసరం. ఈ బస్సులకు మహాలక్ష్మీ పథకం కూడా వర్తిస్తుంది.

– ఎం మురళీధర్‌రెడ్డి, డిపో మేనేజర్, హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో గచ్చిబౌలి

రాయదుర్గం: పర్యావరణ హితం, ప్రయాణికుల సౌలభ్యమే ధ్యేయంగా ఆర్టీసీ సంస్థ బస్సులను నడిపేందుకు దశలవారీగా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా ఎలక్ట్రిక్ బస్సు డిపోగా గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో మారిపోతోంది. డిపో చరిత్రలో మొదటిసారిగా ఒకేసారి 69 అత్యాధునిక 'ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ'ఎలక్ట్రిక్ బస్సులను అధికారులు కేటాయించారు. రెండు రోజులుగా డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి, అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేస్తూ బస్సులను ప్రయాణికులకు చేరవ చేసేందుకు యత్నిస్తున్నారు. హెచ్‌సీయూ డిపోలో ఎలక్ట్రికల్ చార్జింగ్ కేంద్రానికి చకచకా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశారు. ఉదయమే బస్సులను చార్జింగ్ చేసి కేటాయించిన రూట్‌లో నడిపేందుకు చర్యలు చేపట్టారు. కోఠి, మెహిదీపట్నం, సికింద్రాబాద్, జగద్గిరిగుట్ట, వేవ్‌రాక్, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తే మరింత మేలు చేకూరుతుందని ప్రయాణికులు భావిస్తున్నారు. బస్సును గంటా 40 నిమిషాలపాటు చార్జింగ్ చేస్తే 100 శాతం చార్జింగ్ అవుతుంది. ఇది 150 కిలోమీటర్లు నడిచే అవకాశం ఉంది. ప్రస్తుతం 50 శాతం చార్జింగ్ ఉన్నప్పుడు డిపోకు వచ్చి మళ్లీ ఫుల్ చార్జింగ్ చేసుకొని వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. భవిష్యత్తులో 20 శాతం చార్జింగ్ ఉంటే డిపోకు వచ్చి మళ్ళీ చార్జింగ్ ఫుల్ చేయించుకొని వెళ్లడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో మొత్తం బస్సులు 103 కాగా, వాటిల్లో ఎలక్ట్రికల్ బస్సులు 69, పాత డీజిల్ బస్సులు 34. ఇప్పటికే అన్ని రూట్లలో కొత్త బస్సులు తిరుగుతున్నాయి.



216కె/ఎల్ రూట్లో నిడిచేందుకు సిద్ధంగా ఉంచిన దృశ్యం

కేటాయించిన రూట్లు ఇవే..

హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోకు వచ్చిన 69 ఎలక్ట్రికల్ బస్సులను ఇప్పటికే రూట్లను కేటాయించారు. పటాన్‌చెరు- సికింద్రాబాద్ 219 నెంబర్ రూట్లో 19 బస్సులు, కొండాపూర్-సికింద్రాబాద్ 10 హెచ్ రూట్లో 17, లింగంపల్లి–కోఠి 216 రూట్లో 13, లింగంపల్లి–మెహిదిపట్నం వయా కొండాపూర్ 216కె/ఎల్ రూట్లో 10, జేఎన్‌టీయూ–వేవ్‌రాక్ 195 రూట్లో 5, జేఎన్‌టీయూ– మెహిదీపట్నం 126 రూట్లో 5 బస్సులు రయ్‌రయ్ అంటున్నాయి. ఆయా రూట్లలో ప్రతి పదినిమిషాలలోపే బస్సును ప్రయాణికులకు బస్టాపులో అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయడం విశేషం. ఈ ఎలక్ట్రికల్ బస్సులన్నింటినీ సిటీ ఆర్డినరీ బస్సులుగా నడపాలని అధికారులు నిర్ణయించారు. సామాన్య ప్రయాణికులకు చేరువ చేయడం, ఆక్యుపెన్సీ రేషియో పెంచడమే లక్ష్యమని డిపో అధికారులు పేర్కొంటున్నారు. ఈ బస్సులకు మహాలక్ష్మీ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు.

నగరంలో నేడు

- రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో ములగలేటి శివరామ్ రచించిన గో-సంజీవని ఆంగ్ల పుస్తకాన్ని రవీంద్ర భారతి ఆడిటోరియం హాల్‌లో ఉదయం 9 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆవిష్కరిస్తారు.
- లయన్స్ క్లబ్ ఆఫ్ నవభారత్, డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌ల ఆధ్వర్యంలో దీపావళి, వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రామకృష్ణ మఠంలోని బాలల సేవా విభాగంలో ఉదయం 10.30 గంటల నుంచి విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వివాహ వేడుకలో సీఎం రేవంత్



మల్కాజిగిరి శాసనసభ్యుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె అనుశ్రేయా- ఆదిత్యల వివాహం ఆదివారం శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎరీనాలో అత్యంత వైభవంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి సహా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీలు ఈటల రాజేందర్,చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీమంత్రులు మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, తలసాని, జగదీశ్‌రెడ్డి, నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలువురు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. – సాక్షి, సిటీబ్యూరో

వర్గీకరణ అనంతరమే ఉద్యోగాలు భర్తీ చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ



మాట్లాడుతున్న గోవిందు నరేష్ మాదిగ

బన్సీలాల్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అనంతరమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూ నగర్‌లో ఆదివారం జరిగిన సనత్‌నగర్ ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ద్రోహం చేశారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 30న ఖైరతాబాద్‌లో జరిగే మాదిగల ధర్మయుద్ధ సదస్సుకు ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మాచర్ల ప్రభాకర్, ఎమ్మెస్పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, సనత్‌నగర్ కో-ఆర్డినేటర్ కొండూరు కుమార్ బాబు, బైరపోగు శివ, ధ్రువ ఆదిత్య, కొండూరు సుచంద్ర, రమేష్, శంకరయ్య, నవీన్, సంతోష్, విజయ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు టికెట్లు ఇవ్వాలి

తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు

సాక్షి,సిటీబ్యూరో: మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ గ్రాడుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు టికెట్లు కేటాయించాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు టీపీసీసీ,బీజేపీలను కోరారు. బీసీలకు పార్లమెంటరీ వ్యవస్థలో సరైన ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో 52 శాతం ఉన్న బీసీలకు అసెంబ్లీలో 15 శాతానికి మించి ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. ఆరు శాతం ఉన్న అగ్రవర్ణాలకు 60 శాతానికిపైగా ప్రాతినిధ్యం లభించిందని పేర్కొన్నారు. సామాజిక సమతుల్యత చాలా అవసరమని, జాతీయ పార్టీలే ముందుగా చొరవ చూపి పాటించాలని సూచించారు. బీసీల ప్రాతినిధ్యం తగ్గడం, ఉన్నత వర్గాల ప్రాతినిధ్యం పెరగడం, జాతి సంపద సృష్టిస్తున్న బీసీలకు చట్టసభల ఎన్నికల్లో టికెట్లు కేటాయించకపోవడం సమాజానికి ఏ మాత్రం క్షేమకరం కాదన్నారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వీరేష్ ముదిరాజ్



ఎన్నికల రిట్నరింగ్ అధికారి జగన్‌మోహన్‌రావు నుంచి నియామకపత్రాన్ని అందుకుంటున్న కాసాని వీరేష్‌ముదిరాజ్

నిజాంపేట్: కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగాకుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లికి చెందిన కాసాని వీరేష్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఆదివారం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల రిట్నరింగ్ అధికారి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా కాసాని వీరేష్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా రవితోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వీరేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి కబడ్డీ వంటి క్రీడలను నిర్వహించి జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. తనకు అవకాశం కల్పించిన వివిధ జిల్లాల అసోసిషన్ అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఉస్మాన్ గంజ్‌లో టపాసుల దుకాణం ముందు క్యూ కట్టిన జనం



మార్కెట్లకు దీపావళి శోభ

దీపావళి శోభతో నగర మార్కెట్లు వెలిగిపోతున్నాయి. ప్రమిదలు, ఇతర అలంకరణ వస్తువులతోపాటు క్రాకర్స్ విక్రయాలు జోరందుకున్నాయి. ఉస్మాన్‌గంజ్‌లోని క్రాకర్స్ షాపుల్లో టపాసుల కొనుగోలుకు ఆదివారం జనం భారీగా తరలివచ్చారు. ఆయా దుకాణాల ముందు భారీగా క్యూ కట్టారు. రోడ్లపైనే ఆయా వస్తువుల విక్రయాల కారణంగా పలుచోట్ల పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.



ఉస్మాన్ గంజ్‌లో క్రాకర్స్ కొనుగోలు చేస్తున్న దృశ్యం



కొనుగోలుదారుల కోసం ఎదురుచూపులు



ఉస్మాన్‌గంజ్‌లో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జాం

బీసీ కమిషన్‌కు వినతిపత్రాలు అందజేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ కులగణన కోసం ఈ నెల 28 నుంచి నవంబర్ 13 వరకు సర్వే నిర్వహించనున్న బీసీ కమిషన్‌కు సహకరిస్తే వివిధ సమస్యలపై వినతిపత్రాలను అందజేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఆయా జిల్లాల కలెక్టరేట్ల కార్యాలయాలకు విచ్చేసే కమిషన్ సభ్యులకు బీసీ సమస్యల గురించి వివరించాలని సూచించారు. బీసీ కమిషన్ సభ్యులు పర్యటించే జిల్లాల వివరాలు ఇలా ఉన్నాయి... నేడు (28న) ఆదిలాబాద్, 29న నిజామాబాద్, 30న సంగారెడ్డి, నవంబర్ 1న కరీంనగర్, 2న వరంగల్, 4న నల్లగొండ, 8న ఖమ్మం, 7న రంగారెడ్డి, 8న మహబూబ్‌నగర్, 11న హైదరాబాద్, 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్, సభ్యులు అందుబాటులో ఉంటారని లింగంగౌడ్ వివరించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి

ఐసీఈయూ మహాసభల్లో తీర్మానం



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, బీమా సంస్థలను బలోపేతం చేయాలని, ఎల్ఐసీ, బీమా పరిశ్రమకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్(ఐసీఈయూ) హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల 23 వ సంయుక్త మహాసభలు తీర్మానించాయి. ఈ మేరకు ఆదివారం దోమల్‌గూడలో హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) 23వ సంయుక్త మహాసభలు ఘనంగా జరిగాయి. ఇందులో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) జాతీయ అధ్యక్షుడు రమేశ్, నాయకులు రవి, రాజశేఖర్, సుజాత, రవీంద్రనాథ్, శ్రీనివాసన్, రాజేష్ సింగ్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ వి.మైథిలీ ప్రతినిధులకు మార్గదర్శనం చేశారు. మహాసభలకు హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల అధ్యక్షులు మద్దిలేటి, గుణశేఖర్ అధ్యక్షత వహించగా, డివిజన్ల ప్రధాన కార్యదర్శులు జి తిరుపతయ్య, డి.ఎస్.రఘు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఐపీవో, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని, మహిళలు, దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖండించాలని పేర్కొంటూ పలు తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు.

కార్యవర్గాల ఎన్నిక

మహాసభలో ప్రతినిధులు 2024–25 సంవత్సరానికి కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా గిరిధర్, ఉపాధ్యక్షులుగా ఝాన్సీ లక్ష్మి, రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి, సంయుక్త కార్యదర్శులుగా గణేష్, రవీందర్, కోశాధికారిగా యాదగిరిరావు ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా గుణ శేఖర్, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా రఘు, సంయుక్త కార్యదర్శులుగా అనూరాధ, చంద్రశేఖర్, బాలస్వామి, రాజేష్ శ్రవణ్, శివ ఎన్నికయ్యారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 28, అక్టోబర్, 2024







ఏఐ ఆధారిత డోజీ పనితీరు భేష్

ఫ్రాంటియర్స్ జర్నల్‌లో ప్రచురితం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ఆధారిత ఉత్పత్తిగా ఇటీవల వైద్యరంగంలో పరిచయమైన డోజీ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ (ఈడబ్ల్యూఎస్) సమర్థవంతంగా పనిచేస్తోందని అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది. ఈ వివరాలను డోజీ బ్రాండ్ నగర ప్రతినిధులు తెలిపారు. ఫ్రాంటియర్స్ ఇన్ మెడికల్ టెక్నాలజీ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో.. రోగి ఆరోగ్యం క్షీణించడాన్ని 16 గంటల ముందుగానే ఈ పరికరం అంచనా వేస్తోందని తేల్చింది. అదే విధంగా దాదాపు 20 లక్షల పడకలు కలిగిన ఆస్పత్రులున్న మన దేశంలో ఈ ఏఐ ఆధారిత పవర్డ్ రిమోట్ పేషెంట్ మానిటరింగ్ , ఈడబ్ల్యూఎస్‌లు విప్లవాత్మక పరిష్కారం కాగలవని ఆశాభావం వ్యక్తం చేసింది.

'వి ఫర్ విమెన్' వాక్..

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత తరుణంలో ప్రతి ఎనిమిది మంది స్త్రీలలో ఒకరికి రొమ్ము కాన్సర్ వచ్చే అవకాశం ఉందని, కానీ సరైన సమయంలో గుర్తించి చికిత్స అందిస్తే 96% మంది ప్రాణాలను కాపాడవచ్చని వీ ఫర్ విమెన్ సంస్థ వ్యవస్థాపకురాలు, ప్రముఖ డాక్టర్ ప్రతిభా లక్ష్మి తెలిపారు. వీ ఫర్ విమెన్ సంస్థ ఆధ్వర్యంలో యేటా నిర్వహించే బ్రెస్ట్ కేన్సర్ అవేర్నెస్‌లో భాగంగా ఆదివారం కేబీఆర్ పార్క్ వేదికగా 2 కిలో మీటర్ల వాక్ నిర్వహించారు. ఇరవై సంవత్సరాలు దాటిన ప్రతి స్త్రీ తమ రొమ్ముని స్వయంగా పరిశీలించుకోవడం తెలుసుకోవాలని, నలభై సంవత్సరాలు దాటిన స్త్రీలు మామ్మోగ్రామ్ పరీక్ష చేసుకోవడం వల్ల రొమ్ము కేన్సర్ తొలి దశలోనే గుర్తించవచ్చని ప్రతిభా లక్ష్మి వివరించారు. వీ ఫర్ విమెన్.. సొసైటీ ఫర్ విమెన్ ఎంపవర్మెంట్ తరపున కాలేజ్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు తాము సిద్ధమన్నారు. కేవలం రొమ్ములో వాపులే కాక, రొమ్ము నుంచి నీరు కారడం, రంగు మారడం.. లేదా సంకల్లో గడ్డలు కూడా రొమ్ము కాన్సర్ లక్షణాలు కావచ్చని ఎమ్ఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి నిపుణులు డా. రవికుమార్ పేర్కొన్నారు. పురుషుల్లో కూడా రొమ్ము కేన్సర్ వస్తుందని హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. జుమ్మిడి వెంకట్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ శాఖ చైర్మన్ ప్రొ.రియాజ్, డా.మదన్ మోహన్, డా.అన్నపూర్ణ, డా.పవన సంధ్య, డా.సుధక్షన, అశ్విని, అక్షయ్, శ్రవణ్, అభిరామ్, ప్రభుత్వ సిటీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



అవుట్ ఫిట్.. వ్యాయామం హిట్..

తీరైన దుస్తులతోనే సరైన వ్యాయామ ఫలాలు

నప్పని డ్రెస్సింగ్‌తో చేసే వర్కవుట్స్ వల్ల కష్టాలే..

చేసే ఎక్సర్‌సైజ్‌ను బట్టి దుస్తులను ఎంచుకోవాలి

అవగాహన లేక అనారోగ్యాల పాలవుతున్న నగరవాసులు

ఎన్ని గంటలు చేయాలి? ఏం డైట్ తీసుకోవాలి? సరిగా వర్కవుట్ చేస్తున్నానా లేదా? వ్యాయామం చేయాలనుకునే/చేసే వారిలో ఎన్నో సందేహాలు.. మరి డ్రెస్ సంగతేంటి? వ్యాయామానికి తగ్గ అవుట్ ఫిట్ ధరిస్తున్నానా?అనేది ఆలోచించకపోతే ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు వ్యాయామ నిపుణులు. దీనిపై నగరానికి చెందిన వ్యాయామ నిపుణులతో కలిసి హామ్‌స్టెక్ ఫ్యాషన్ అండ్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డిజైనర్లు అందిస్తున్న సూచనలివి..

- సాక్షి, సిటీబ్యూరో

నిశ్చల జీవనశైలి, ఎక్కువ గంటలు కూర్చోడం వల్ల వచ్చే మధుమేహం, రక్తపోటు గుండె సమస్యలు వంటి జీవనశైలి వ్యాధులను ఎదుర్కోడంలో రెగ్యులర్ వ్యాయామం అవసరం. ఇది ఎండార్ఫిన్స్‌ను రిలీజ్ చేసి ఒత్తిడిని తగ్గించి మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. మంచి నిద్రనిస్తుంది. అయితే వర్కవుట్ సమయంలో సరైన యాక్టివ్ వేర్ ఉంటేనే ఇవన్నీ సాధ్యం. అనుచితమైన జిమ్‌వేర్ వ్యాయామాలకు అవసరమైన కండరాల సపోర్ట్‌ని అందించవు. మన ఫిట్‌నెస్ లక్ష్యాలకు సహకరించవు.

జిమ్ వేర్.. టేక్ కేర్..

వ్యాయామ సమయంలో సరైన యాక్టివ్‌వేర్ ఉత్సాహం పెంచడంతో పాటు అధిక చెమట, దుర్వాసనల నుంచి రక్షిస్తుంది. గాయాలను నివారించి శరీర ఉష్ణోగ్రతను నిర్వహిస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరచి పనిచేసే కండరాలకు ఆక్సిజన్‌ను అందించడంతో పాటు సామర్థ్యం మేరకు వ్యాయామాలు చేసేలా ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. సులభమైన కదలికలకు సహకరిస్తూ బరువులు ఎత్తడంలో సహాయపడి కండరాల పునరుద్ధరణను సులభతరం చేస్తుంది.



కండరాల నిర్మాణానికి, మెటబాలిక్ రేట్ పెరగడానికి స్ట్రెంగ్త్ ట్రైనింగ్, హై ఇంటెన్సిటీ వర్కవుట్స్‌కి కంప్రెషన్ లెగ్గింగ్స్, స్పోర్ట్స్ బ్రా వంటివి కికా యాక్టివ్ డిజైన్ చేస్తోంది.

శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి శరీరం నుంచి తేమ ఆవిరైపోవాలి. కాబట్టి తేమను సులభంగా ఆరబెట్టడానికి, చెడు వాసనను నిరోధించడానికి చల్లగా, సౌకర్యవంతంగా ఉంచడానికి మైక్రోఫైబర్‌తో కూడిన ఫ్యాబ్రిక్‌ను ఎంచుకోవాలి. పాలియెస్టర్, స్పాండెక్స్, పాలీ-డ్రై, నైలాన్ కూడా మంచివే.

- కొన్నిరకాల దుస్తులు అంటువ్యాధులు, దద్దుర్లు, దురదలకు దారితీయవచ్చు. శరీరపు సహజ ఉష్ణోగ్రతను దెబ్బతీసి, డీ హైడ్రేషన్, అలసట లేదా బర్నింగ్ సెన్సేషన్‌కు దారితీస్తాయి.
- వేసవి కాలంలో సౌకర్యవంతమైన, చల్లదనాన్నిచ్చే దుస్తులు, వర్షాకాలంలో అంటువ్యాధులు, అలెర్జీలు, చర్మ వ్యాధులను నివారించడానికి పొడిగా, తాజా అనుభూతిని కలిగించే దుస్తులను ఎంచుకోవాలి. శీతాకాలంలో వెచ్చగా ఉంచేవి, అవుట్‌డోర్ వ్యాయామ సమయంలో లేయర్‌లలో దుస్తులు ధరించడం వల్ల శరీర ఉష్ణోగ్రతను అనుసరించి ఒక్కో లేయర్‌ను తొలగించొచ్చు.
- గుండె ఆరోగ్యానికి, శక్తికి రన్నింగ్, సైక్లింగ్ వంటి కార్డియోవాస్క్యులర్ వ్యాయామాలు అవసరం. రన్నింగ్, జాగింగ్ చేసేవారి కోసం లైట్ వెయిట్ స్వెట్ అబ్జార్బింగ్, టీషర్ట్స్, షార్ట్స్, బి రన్నింగ్ అండ్ కార్డియో హెచ్‌ఆర్‌ఎక్స్ తదితర బ్రాండ్స్ అందిస్తున్నాయి.
- కీళ్ల మధ్య సమన్వయం, బ్యాలెన్సింగ్‌కి యోగా, స్ట్రెచ్ ఎక్సర్‌సైజ్‌లు ఉపకరిస్తాయి. దీనికి యోగా ఫ్లెక్సిబులిటీ, బ్లిస్ క్లబ్ వంటి బ్రాండ్స్ హై స్ట్రెచ్ లెగ్గింగ్స్, తేమను పీల్చుకునే స్పోర్ట్స్ బ్రాల తదితర అవుట్‌ఫిట్స్‌ను అందిస్తున్నాయి. జీవమే బ్రాండ్ కూడా ఫ్లెక్సిబులిటీ, సౌకర్యంగా ఉండే స్ట్రెచబుల్ యోగా గేర్‌ను అందుబాటులోకి తెచ్చింది.



ఫ్యాబ్రిక్.. ఇలా..

- బ్రీతబుల్ ఫ్యాబ్రిక్స్‌కి, మన దేశపు నేలకు తగ్గట్టుగా మెత్తగా ఉండే కుషన్ కలిగిన షూస్‌ని ప్యూమా ఇండియా అందిస్తోంది. యోగాతో పాటు స్ట్రెంగ్త్ ట్రెనింగ్‌కి ఉపకరించే లైట్ వెయిట్, ఎకో ఫ్రెండ్లీ దుస్తుల్ని ప్రయోగ్ తయారు చేస్తోంది.
- స్టైలిష్ అత్లీజర్, ఫ్యాషన్, ఫంక్షన్ రెండింటి మేలి కలయికతో డి.అత్లీజర్ అం ఆల్ డే యాక్టివ్ వేర్‌ను లులులెమన్ ఇండియా అందిస్తోంది. తేలికపాటి వ్యాయామాలతో పాటు రోజువారీ ఉపకరించే దుస్తులను నష్ యాక్టివ్ సమర్పిస్తోంది.
- చేసే వ్యాయామంపై అవగాహనతో పాటు ధరించే అవుట్‌ఫిట్‌పై కూడా జాగ్రత్తలు అవసరం. ప్రస్తుతం పలు రకాల బ్రాండ్స్, ఏ వ్యాయామ శైలికి తగ్గట్టుగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన దుస్తులను అందిస్తున్నాయి. వాటిలో నుంచి లేదా తామే ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్న కస్టమైజ్డ్ దుస్తులను ఫిట్‌నెస్ లవర్స్ వినియోగించుకోవచ్చు.

- హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాకల్టీ



అవుట్ ఫిట్.. ఇంపార్టెంట్

వ్యాయామం చేసే సమయంలో సరైన అవుట్ ఫిట్ ధరించడం అనేది చాలా ఇంపార్టెంట్. ఆ విషయంలో ఇప్పుడు చాలా మందిలో అవగాహన పెరిగింది. చెమట ఎక్కువ పడుతుంది కాబట్టి జిమ్ వర్కవుట్‌కి డ్రై ఫిట్ పేరిట అందుబాటులోకి వచ్చిన దుస్తులు, అదే విధంగా యోగ డ్రెస్సింగ్‌కు వచ్చేటప్పటికి ఫ్లెక్సిబుల్ ఫ్యాబ్రిక్ వినియోగిస్తున్నారు. జాగింగ్ చేసేవారికి జాగర్స్ సూట్స్, సైక్లింగ్‌కి స్కిన్ టైట్ ప్యాంట్ ఇలా వర్కవుట్ స్టైల్‌ని బట్టి ప్రత్యేక దుస్తులు అందుబాటులోకి వచ్చేశాయి. **- విజయ్ గంధం, ఫిట్‌నెస్ ట్రైనర్**



శ్రోతలను అలరించిన ఆకుండి బ్రదర్స్

త్యాగయ్య, మైసూర్ వాసుదేవాచార్య కృతులు, కీర్తనలతో గాత్ర కచేరీ..

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన చిన్నారులు ఆకుండి వ్యాస సాత్విక్, ఆకుండి వ్యాస సానిక్ ఆధ్వర్యంలో గాత్ర కచేరీ ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వేదికగా ఆదివారం శ్రీ గానాలయం వారు నిర్వహిస్తున్న 'వింటేజ్ హెరిటేజ్ టూర్' లో భాగంగా ఈ ఆకుండి బ్రదర్స్ తమ సంగీతంతో అలరించారు. ఈ చిన్నారి సోదరుల కచేరీలో త్యాగయ్య, మైసూర్ వాసుదేవాచార్య తదితర వాగ్గేయకారులు రచించిన మధురమైన భక్తి కృతులు, కీర్తనలు పాడారు. ముత్తుస్వామి దీక్షితులు రచించిన 'వాతాపి గణపతిం భజే' కృతితో కచేరీ మొదలుపెట్టి శ్రీ ప్రసన్న వెంకటదాసులవారు రచించిన 'ఎంత శ్రీమంతా నంతాను'తో ముగించారు. వీరి కచేరీకి పెద్దల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పదేళ్లుగా సంగీతం నేర్చుకుంటూ నగరంలో ఎన్నో చోట్ల కచేరీలు నిర్వహిస్తున్న ఈ చిన్నారి సోదరులను శ్రీ గానాలయం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కచేరీలో వయోలిన్‌పై విద్వాన్ శ్రీ అయ్యప్ప, మృదంగంపై విద్వాన్ శ్రీనివాస్ సహకరించారు.



కేన్సర్‌పై వాకథాన్

సినీతారలు సంయుక్తా మీనన్, మీనాక్షి చౌదరి హాజరు



బంజారాహిల్స్: బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహనా కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా వాకథాన్ ఉత్సాహంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సినీ హీరోయిన్లు సంయుక్తా మీనన్, మీనాక్షి చౌదరి పాల్గొని ప్రసంగించారు. ప్రతిఒక్కరూ బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని, ప్రాథమిక దశలోనే గుర్తించి మంచి వైద్యాన్ని పొందాలని, స్క్రీనింగ్‌లో కేన్సర్ అని తెలియగానే కంగారు పడొద్దని, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే దాన్ని జయించగలమన్నారు. ప్రస్తుతం మంచి టెక్నాలజీతో కూడిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అనంతరం వాకథాన్‌ను ఆస్పత్రి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఆస్పత్రి వైద్య విద్యార్థులు, డాక్టర్లు, నర్సులు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకూ ఈ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీ సందేహాలు!

బైకులకు సై.. కార్ల కొనుగోలుకు వెనకడుగు



సాక్షి, సిటీబ్యూరో: నగర వాసుల్లో విద్యుత్ వాహనాలపై అనేక అనుమానాలు, సందేహాలు నెలకొన్నాయి. గత కొంతకాలంగా విద్యుత్ వాహనాల వినియోగం విరివిగా పెరిగింది. దీనికితోడు ప్రభుత్వాల ప్రోత్సాహం కూడా ఓ కారణం అయితే, మెయింటెనెన్స్ కూడా మరో కారణంగా పలువురు వినియోగదారులు చెబుతున్నారు. అయితే ధరల విషయంలో కాస్త ఎక్కువగా ఉన్నాయని, సామాన్యులకు అందుబాటులో లేవని పలువురి వాదనలు వినిపిస్తున్నారు. నగరంతో పాటు దేశంలో అనేక కంపెనీలు ఈవీ వాహనాలను తయారు చేస్తున్నాయి. వీటిలో కొన్ని బ్రాండెడ్ కాగా మరికొన్ని హైబ్రిడ్ వెహికల్ కూడా అందుబాటులోకి వచ్చాయి. అయితే విద్యుత్ వాహనాల గురించి సమాచారం తెలుసుకునే వారికి పలు సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. కంపెనీల వారీగా వాహనాల ధర, ఒక సారి ఫుల్ ఛార్జింగ్ చేస్తే ఎంత దూరం ప్రయాణించవచ్చు. మన్నిక, లేటెస్ట్ ఫీచర్స్, ఇతర అంశాలపై ఆన్‌లైన్‌లో శోధించడం పరిపాటిగా మారింది. స్నేహితులు, కుటుంబ సభ్యుల అభిప్రాయాలు తీసుకుని, అన్నింటినీ సరిపోల్చుకున్నాకే నిర్ణయం తీసుకుంటున్నారు. అయితే విద్యుత్తు మోటారు సైకిల్ వరకూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నా, కార్లు, ఆటో రిక్షాల విషయంలో వినియోగదారుల మన్ననలు పొందలేకపోతున్నాయి.

విద్యుత్ వాహనాలపై అనుమానాలెన్నో!

ఛార్జింగ్ స్టేషన్ల కొరతే కారణమా!

టూవీలర్ కొనుగోలుకు సై..

ఇప్పటి వరకూ సుమారు 1.20 లక్షల విద్యుత్ మోటారు సైకిళ్లు మార్కెట్లో అమ్మకాలు జరగగా, కార్లు, ఆటో రిక్షా, ఇతర వాహనాలన్నీ కలపి సుమారు 16 వేలు అమ్ముడయ్యాయి. సాధారణంగా మోటారు సైకిళ్లు 70 శాతం ఉంటే, ఇతర వాహనాలు 30 శాతం ఉంటాయి. విద్యుత్తు వాహనాల విషయంలో ఇతర వాహనాల సంఖ్య 15 శాతం కంటే తక్కువ ఉంది. భవిష్యత్తులో ప్రభుత్వం మరిన్ని ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తే ఈవీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఛార్జింగ్ స్టేషన్ల కొరత..

ప్రధానంగా విద్యుత్ వాహనాల కొనుగోలుకు వెనుకాడటానికి నగరంలో సరైన ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడమే అనే వాదనలు వినిపిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని రాయితీలు ఇచ్చినా నగర పరిధి దాటి బయటకు వెళ్లాలనుకుంటే మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాహనాలకు ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లను విద్యుత్ ఛార్జింగ్ విషయంలో కనిపించడం లేదు. దీంతో లోకల్‌లో తిరగడానికి మాత్రమే విద్యుత్ వాహనాలు ఉపయోగపడతాయనే వాదన బలంగా వినిపిస్తోంది. నగరంలో విద్యుత్ వాహనాల అమ్మకాల సంఖ్య సైతం దీన్నే సూచిస్తోంది.

లాంగ్‌డ్రైవ్ వెళ్లాలంటే ఇబ్బంది



హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లాలనుకుంటే బస్సు, ట్రైన్ నమ్ముకుంటే సమయానికి చేరుకోలేము. డ్యూటీ అయ్యాక రాత్రి బయలుదేరితే ఉదయం విశాఖ చేరుకునేట్లు ప్లాన్ చేసుకుంటాం. విద్యుత్ కారులో పోవాలంటే ఛార్జింగ్ సరిపోదు. ప్రతి 300 కిలో మీటర్లకు ఒక దఫా ఛార్జింగ్ చేయాల్సి వస్తుంది. ఒక వేళ ఎక్కడైనా ఛార్జింగ్ పెడదాం అంటే సుమారు 6 గంటలు వెయిట్ చేయాల్సి ఉంటుంది. బ్యాటరీ లైఫ్ 8 ఏళ్లు అన్నారు. ఆ తరువాత కారు విలువలో సుమారు 40 శాతం బ్యాటరీ కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకే పెట్రోల్ కారు తీసుకున్నాను. **- వై.రాజేష్, కేపీహెచ్‌బీ**

నెలకు రూ.3 వేల ఖర్చు తగ్గింది



రెండేళ్ల క్రితం ఈవీ మోటారు సైకిల్ కొన్నాను. ప్రతి 5 వేల కిలో మీటర్లకు సర్వీసింగ్ చేయించాలి. ఫుల్ ఛార్జింగ్ చేశాక ఎకానమీ మోడ్‌లో వెళితే 105 కిలో మీటర్లు వస్తుంది. స్పోర్ట్స్ మోడ్‌లో వెళితే 80 కిలో మీటర్లు వస్తుంది. పెట్రోల్ స్కూటీకి నెలకు రూ.3,500 పెట్రోల్ అయ్యేది. ఈవీ కొన్నాక నెల కరెంటు బిల్లు రూ.500 నుంచి రూ.700కి పెరిగింది. అదనంగా రూ.200 పెరిగినా పెట్రోల్ రూ.3,500 వరకూ తగ్గింది.

- గాదిరాజు రామకృష్ణంరాజు, హైటెక్ సిటీ



క్లుప్తంగా...

కరెంట్ చార్జీల పెంపు దీపావళి కానుకా?

'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న దీపావళి కానుక కరెంటు చార్జీలు పెంచడమేనా..' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే 30 శాతం తగ్గిస్తామని ఎన్నికల ముందు ప్రచారంలో ఇచ్చిన హామీ ఏమైంది చంద్రబాబూ? అంటూ సూటిగా ప్రశ్నించారు. 'టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే విద్యుత్ చార్జీలు తగ్గించే వాళ్లం అని గతంలో చెప్పిన మీరు.. ఇప్పుడు ప్రజలు ఎంతగా వద్దని వేడుకున్నా వినిపించుకోకుండా రూ.6,072.86 కోట్ల భారం వేయడం భావ్యమేనా? ఎన్నికల ముందు అధికారం కోసం ఇచ్చిన హామీ మేరకు ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలని వినియోగదారులు చేసిన విజ్ఞప్తులను ఎందుకు పెడచెవిన పెట్టారు? ప్రజలపై అదనపు చార్జీల భారం వేయడమే మీ విజనా?' అంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

కడప నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసు

కడప (కోటిరెడ్డి సర్కిల్): కడప నుంచి హైదరాబాద్ వెళ్లే ఇండిగో ఫ్లైట్‌ను రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం కడప విమానాశ్రయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడప నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ఎంతో సమయం పడుతుందని, ప్రయాణికుల సమయాన్ని వృథా చేయకుండా విమాన సర్వీసులు ప్రారంభించామని చెప్పారు. రాబోయే రోజుల్లో కడప నుంచి ఇతర ప్రాంతాలకు మరిన్ని విమాన సర్వీసులను అందుబాటులోకి తెస్తామన్నారు.

నమ్మి ఓటేస్తే గొంతు కోస్తున్నారు

- రేవంత్ సర్కార్‌పై మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజం



సిద్దిపేటజోన్/హైదరాబాద్: రాష్ట్ర ప్రజలను మాయమాటలతో నమ్మించి కాంగ్రెస్ పార్టీ ప్రజలతో ఓట్లు వేయించుకుందని తీరా అధికారంలోకి వచ్చాక వారి గొంతుకోస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి సందర్భంగా రెండు డీఏలు వస్తాయనుకుంటే ఒకటే డీఏ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగుల్లో నిరాశ మిగిల్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 15 డీఏలను ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిందన్నారు.

టీజీఎస్పీ సిబ్బందిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయండి

తమ డిమాండ్ల సాధనకు ఆందోళన చేసిన 39 మంది టీజీఎస్పీ సిబ్బందిపై విధించిన సస్పెన్షన్‌ను మానవతా దృక్పథంతో ఆలోచించి తక్షణమే ఉపసంహరించుకోవాలని డీజీపీ జితేందర్‌ను మాజీమంత్రి హరీశ్‌రావు ఓ ప్రకటనలో కోరారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 67.17శాతం హాజరు

ప్రశాంతంగా పూర్తయిన పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: అభ్యర్థుల ఆందోళనలు, అరెస్టుల నేపథ్యంలో ప్రారంభమైన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 21న ప్రారంభమైన పరీక్షలు వరుసగా ఏడు రోజుల పాటు కొనసాగాయి. ఈ పరీక్షలకు 31,403 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఇందులో 31,383 మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ ఎంపిక చేయగా... స్పోర్ట్స్ కోటా కింద కోర్టును ఆశ్రయించిన 21 మంది అభ్యర్థులకు న్యాయస్థానం ఊరటనిచ్చింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని 46 కేంద్రాల్లో ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 21,093 (67.17%) మంది అభ్యర్థులు ఏడు రోజుల పాటు జరిగిన అన్ని పరీక్షలకూ హాజరయ్యారు. వీరి జవాబు పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేస్తారు.

మూడు జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలకు కేటాయించిన, పరీక్షలు రాసిన అభ్యర్థులు

జిల్లా	అభ్యర్థులు	హాజరు
హైదరాబాద్	5613	4719
రంగారెడ్డి	8011	5505
మేడ్చల్ మల్కాజిగిరి	17779	10869

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు కేటగిరీల వారీగా ఎంపికైన, పరీక్షలు రాసిన అభ్యర్థులు

కేటగిరీ	అభ్యర్థులు	హాజరు
ఓపెన్	3076	2384
ఈడబ్ల్యూఎస్	2774	1778
బీసీఏ	2449	1648
బీసీబీ	7560	4743
బీసీసీ	664	527
బీసీడీ	6324	3847
బీసీ ఇ	924	661
ఎస్సీ	4828	3503
ఎస్టీ	2783	1983
స్పోర్ట్స్	21	19





ఆకులన్నీ రాలిన చోటే.. కొత్త చిగురు కనిపిస్తుంది..

ఈ ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు పెన్‌గంగా నది పరీవాహక ప్రాంతమైన బేల మండలం సాంగిడి గ్రామంలో ఓ రైతు సాగు చేసిన పత్తి పంట నీట మునిగి కుళ్లిపోయింది. నష్టపోయిన బాధిత రైతు వర్షాలు తగ్గుముఖం పట్టాక.. పత్తి పంటను పూర్తిగా తొలగించి కంది పంటను సాగు చేశాడు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి.. కంది పంట ఏపుగా పెరిగి పూతదశకు చేరింది. పత్తి మునగడంతో వచ్చిన నష్టాన్ని.. కాస్తయినా అధిగమించేలా పెరిగిన కంది సాగు ప్రకృతి తీరుకు అద్దం పడుతోంది. - సాక్షి ఫొటో గ్రాఫర్- ఆదిలాబాద్.

హోంగార్డులపై 'కారుణ్య'మేదీ?



అరకొర జీతాలు.. అందులోనూ కోతలు

ఇబ్బందిగా జీవితం వెళ్లదీస్తున్నామంటూ హోంగార్డుల ఆవేదన

నవంబర్ తొలివారంలో ఆందోళన బాట పట్టే యోచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీస్ శాఖలో క్షేత్రస్థాయి విధుల్లో అత్యంత కీలకమైన హోంగార్డులు.. అరకొర జీతాలతో జీవితాలు వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నెలలో ఒక్కో తేదీన వేతనాలు వస్తున్నాయని.. ఒక్కోసారి సగం నెల గడిచినా జీతాలు అందని పరిస్థితి ఉంటోందని వాపోతున్నారు. తమకు కనీస జీవన భద్రత లేదని, హోంగార్డు చనిపోతే కారుణ్య నియామకంగానీ, మరేదైనా తీరులోగాని వారి కుటుంబాలకు న్యాయం జరగడం లేదని చెప్తున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆందోళన బాట పట్టాలనే యోచనతో ఉన్నామని అంటున్నారు.

సీఎం హామీలు అమలు చేయాలంటూ..

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న హోంగార్డు రవీందర్ గతేడాది సెప్టెంబర్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ సమయంలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించిన రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లోనే హోంగార్డుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని హోంగార్డులు గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హోంగార్డుల వేతన సవరణతోపాటు సమస్యలన్నీ పరిష్కరిస్తామని పేర్కొన్నారని చెప్తున్నారు. ఇక తాజాగా శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు సంబంధించి.. హోంగార్డు నుంచి డీజీపీ వరకు అందరి పిల్లలు అందులో చదువుతారని పలుమార్లు పేర్కొన్నారు. అయితే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ జీవోలో మాత్రం హోంగార్డుల ప్రస్తావన లేకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి విధుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేసే తమకు కూడా ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తారని పోలీసు అమరవీరుల దినోత్సవం రోజు ఆశతో ఎదురుచూశామని, కానీ అలాంటి హామీ ఏదీ రాలేదని వాపోతున్నారు. యూనిఫాం అలవెన్స్, స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ సహా పలు కీలక హామీలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచీ పెండింగ్‌లో ఉన్నాయని... కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అవి పరిష్కారం అవుతాయన్న ఆశతో ఉన్నామని చెప్తున్నారు.

కదలని స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ ఫైల్..

హోంగార్డులను సైతం లాస్ట్ పేగ్రేడ్ కింద తీసుకుని, వారిని స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ (ఎస్‌పీఏ)గా మార్చాలని 2017లో ప్రతిపాదన సిద్ధం చేశారు. రిక్రూట్‌మెంట్‌లో లోటుపాట్లను సరిదిద్ది, వారిని పర్మినెంట్ చేసి దీన్ని అమలు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే పలు కారణాలతో ఇది పెండింగ్‌లో పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఈ ఫైల్ పెండింగ్‌లోనే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 13వేల మంది జనరల్ డ్యూటీ హోంగార్డులు, మరో 2,500 మంది వరకు ఓడీ (అదర్ డిపార్ట్‌మెంట్) హోంగార్డులు పనిచేస్తున్నారు.

హోంగార్డుల సమస్యలు ఎన్నో..

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హోంగార్డుల నియామకాలను పూర్తిగా నిలిపివేశారు. అప్పటి నుంచి దాదాపు 600 మంది వరకు హోంగార్డులు వివిధ కారణాలతో చనిపోయారు. ఇక 2016 నుంచి తెలంగాణలో హోంగార్డుల కారుణ్య నియామకాలు లేవు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం కారుణ్య నియామకాలను చేపట్టాలని హోంగార్డుల కుటుంబాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.
- ప్రస్తుతం సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో మాత్రమే హోంగార్డులకు యూనిఫాం అలవెన్స్ ఇస్తున్నారు. జిల్లాల్లో 2018 నుంచి ఇప్పటివరకు ఏడాదికి రూ.7,500 చొప్పున యూనిఫాం అలవెన్స్ ఇవ్వాల్సి ఉంది.
- ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధులు, ఇతర బందోబస్తు విధులకు వెళ్లినప్పుడు.. ఇక్కడ తమ జీతాల్లో కోతలు విధిస్తున్నారని కొందరు హోంగార్డులు వాపోతున్నారు. తమను ఇతర రాష్ట్రాలకు డ్యూటీలకు వెళ్లాలని ప్రోత్సహిస్తున్న అధికారులే.. తాము ఇక్కడ డ్యూటీలో లేమన్న కారణంతో జీతంలో కోత విధించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.
- హోంగార్డులకు సైతం పోలీసు సిబ్బంది మాదిరిగా హెల్త్‌కార్డులు ఇవ్వాలన్న డిమాండ్ చాలా కాలం నుంచి ఉంది.
- హోంగార్డులు ప్రమాదాల్లో చనిపోతే రూ.5 లక్షలు ఇస్తున్నారని.. అలా కాకుండా ఏపీలో అమలు చేస్తున్నట్టుగా హోంగార్డు సహజ మరణం చెందినా రూ.5 లక్షలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.
- 2018 నుంచి కిట్ ఆర్టికల్స్ (స్వెటర్, విజిల్‌కార్డు, షూస్, బెల్ట్, క్యాప్) ఇవ్వడం నిలిపివేయడంతో తమపై ఆ ఆర్థిక భారం పడుతోందని హోంగార్డులు చెప్తున్నారు.
- జిల్లాలకు వెళ్లిన హోంగార్డులు ఆర్డర్ టు సర్వ్ కింద ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు వెళ్లి పనిచేయాల్సి వస్తోందని వాపోతున్నారు.
- ఇలా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నవంబర్ మొదటివారంలో రాష్ట్రస్థాయిలో ఆందోళన చేసేందుకు హోంగార్డులు సమాయత్తం అవుతున్నట్టు తెలిసింది.

బెయిల్ రద్దు కుట్రలో భాగం పంచుకుంటారా?

షర్మిలపై విజయసాయిరెడ్డి మండిపాటు

సాక్షి, హైదరాబాద్: ఈడీ జప్తు చేసిన, హైకోర్టు స్టే విధించిన సరస్వతి పవర్ షేర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తే వైఎస్ జగన్‌కు ఇబ్బందులు ఎదురై బెయిల్ రద్దు అయ్యే పరిస్థితి ఉత్పన్నం అవుతుందని తెలిసినా షర్మిల రాజకీయ కుట్రలో భాగస్వామిగా మారి కుట్రపూరితంగా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ పక్ష నేత వి.విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. దీనిపై వైఎస్ జగన్ రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జీల న్యాయ సలహాను షర్మిలకు పంపించినా పెడచెవిన పెట్టారని చెప్పారు. ఏ చెల్లి అయినా ఇలా చేస్తుందా? అని సూటిగా ప్రశ్నించారు. వైఎస్సార్ చనిపోయిన పదేళ్లకు.. షర్మిలకు వివాహమైన 20 ఏళ్ల తరువాత తాను వ్యాపారాల ద్వారా సంపాదించిన వాటిల్లో రూ.200 కోట్లు ఇచ్చిన అన్న పట్ల.. తన సొంత ఆస్తిలో 40 శాతం ఇవ్వటానికి సిద్ధపడిన అన్న పట్ల కనీస కృతజ్ఞత లేకపోగా నువ్వు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ ఏమిటంటే.. చంద్రబాబుతో కలసి బెయిల్ రద్దు చేసే కుట్రలు పన్నటమేనని షర్మిలను విమర్శించారు. మీరు తాజ్‌మహల్, విప్రో కావాలని అడిగితే ఇచ్చేస్తారా షర్మిలా? అని ప్రశ్నించారు. చంద్రబాబు కుయుక్తులను షర్మిల తెలుసుకోవాలని హితవు పలికారు. అతి మంచితనం వల్లే జగన్ అనర్థాలు కొని తెచ్చుకుంటున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియాతో కలిసి నిర్వహించే మీడియా సమావేశాల్లో ప్రజా సమస్యల కంటే జగన్‌పై దూషణలకే షర్మిల 95 శాతం ప్రాధాన్యమిస్తోందన్నారు. తల్లి విజయమ్మ కన్నీళ్లు తుడవడానికే ఇదంతా అని షర్మిల చెప్పడం అబద్ధమని, చంద్రబాబు కళ్లల్లో ఆనందం చూడటానికే అన్నపై కుయుక్తులు పన్నుతూ మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. తనపై, వైవీ సుబ్బారెడ్డిపై షర్మిల చేసిన వ్యాఖ్యలు, ఆస్తుల విషయంలో జగన్‌పై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. షర్మిలది ఆస్తి తగాదా కాదని, అధికారానికి సంబంధించిదని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌ను తిరిగి సీఎం కాకుండా చేయాలన్నదే షర్మిల ఆలోచనని, చంద్రబాబు ఇచ్చిన అజెండాతోనే ఆమె పనిచేస్తున్నారని మండిపడ్డారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా ఉన్నా, కేంద్రంలో ఆ పార్టీకి ఎన్డీఏ వ్యతిరేకమైనా, ఆమె చంద్రబాబుతో లాలూచీపడి జగన్‌పై కుట్రలు చేస్తోందన్నారు.

షర్మిల మాటలను ప్రజలు నమ్మరు

తల్లిని, చెల్లిని మోసం చేసిన వ్యక్తి ప్రజలకు ఏం లబ్ధి చేకూరుస్తారని ప్రశ్నించడం, జగన్‌ను నమ్మొద్దని చెప్పడం ఎంత ద్రోహమో, అన్యాయమో తన మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని షర్మిలకు విజయసాయిరెడ్డి సూచించారు. చంద్రబాబు మాటలనే ఆమె వల్లిస్తున్నారని, ఆయన అజెండాను నెత్తిన పెట్టుకున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ కోటిన్నర కుటుంబాలకు, 80 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఆసరా ఇచ్చారని, 45 లక్షల మందికి అమ్మ ఒడి అమలు చేశారని, అలాంటి సీఎం దేశంలో ఉన్నారా? అని ప్రశ్నించారు. ఇంత మందికి మేలు చేసిన జగన్ సొంత ఇంట్లో తల్లి, చెల్లికి అన్యాయం చేస్తారని కుట్రపూరితంగా చెబుతుంటే ఎవరు నమ్ముతారని షర్మిలను నిలదీశారు. మహిళల్లో జగన్ పట్ల వ్యతిరేకత పెంచాలనే చంద్రబాబు దుర్మార్గ అజెండాకు షర్మిల సహకరిస్తోందన్నారు.

తండ్రి మృతికి కారణమైన బాబుతో దోస్తీ

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మృతికి కారణమైన చంద్రబాబుతో కలిసి షర్మిల కుట్రలు చేయడం దుర్మార్గమని సాయిరెడ్డి పేర్కొన్నారు. తన తండ్రి మరణానికి చంద్రబాబే కారణమని షర్మిల గతంలో అనేకసార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 'రాజశేఖర్ రెడ్డి మరో 15 రోజుల్లో దుర్మార్గమైన చావు చస్తాడని' అంతకుముందు చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను గుర్తు తెచ్చుకోవాలన్నారు. వైఎస్ మరణానికి చంద్రబాబే కారణమని దీన్ని బట్టి అర్థం కావడం లేదా? అని నిలదీశారు. అలాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం, పసుపు చీర కట్టుకుని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించడం, చర్చలు జరపడం, కుట్రలు చేయడం... ఇంతకన్నా అమానవీయ ప్రవర్తన ఉంటుందా? అని ప్రశ్నించారు. శంకర్రావు, ఎర్రన్నాయుడు, అశోక్ గజపతిరాజు, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని వాడుకుని జగన్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుకు పంపిన విషయం మరిచిపోయారా? అని షర్మిలను ప్రశ్నించారు. జగన్ మోచేతి నీళ్లు తాగుతూ అనుకూలంగా మాట్లాడుతున్నామని తనను, వైవీ సుబ్బారెడ్డిని షర్మిల విమర్శించడం సహేతుకం కాదన్నారు. శత్రువుకు మేలు చేసేందుకు సొంత అన్ననే వేటాడి, వెంటాడి కాటేసే చెల్లెమ్మ షర్మిల మినహా ఎక్కడా చూడలేదన్నారు. వైఎస్ఆర్ ఆత్మ క్షోభకు కారణమైన షర్మిల ఎల్లో మీడియా ముందు పెట్టే కన్నీటికి విలువ లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయని చంద్రబాబు ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించే కుట్రలకు షర్మిలను వాడుకుంటున్నాడని విమర్శించారు.

దేశంలో ఇలాంటి అన్న ఉంటాడా?

వైఎస్ఆర్ బతికి ఉన్నప్పుడే ఆస్తుల పంపకం జరిగిందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్ఆర్‌కు వచ్చిన ఆస్తులను కుమారుడు, కుమార్తెకు ఆయన జీవించి ఉన్నప్పుడే పంచారని తెలిపారు. విజయలక్ష్మీ మినరల్స్, కోడూరు మిల్స్, కోడూరు ఆఫీసు ఆస్తులు, బ్రైరైటీస్ మినరల్స్ స్టాక్స్, 25 మెగావాట్ల సరస్వతి పవర్, ఎస్ఆర్ఎస్ హైడ్రో, 51 ఎకరాల ఇడుపులపాయ భూములు, 79 ఎకరాల శెట్టిగుంట ఆస్తులు, 7.6 ఎకరాల పులివెందుల భూములు, బంజారాహిల్స్‌లోని 280 గజాలు, విజయవాడలోని రాజ్‌యువరాజ్ థియేటర్లు షర్మిలకు అప్పగించారని చెప్పారు. వైఎస్ జగన్ తనకు వచ్చిన ఆస్తులను అభివృద్ధి చేశారన్నారు. జగన్ నెలకొల్పిన భారతీ సిమెంట్స్ కోసం తొలుత రూ.1,400 కోట్లు అప్పు చేశారని, ఆ తర్వాత తీర్చారని తెలిపారు. సాక్షి మీడియా మొదట్లో నష్టాన్ని చవిచూసిందన్నారు. ఈ నష్టాలు, అప్పులను షర్మిల ఎప్పుడూ పంచుకోలేదన్నారు. ఇవన్నీ జగన్ తన దక్షతతో అభివృద్ధి చేసి, లాభాల్లోకి నడిపించారని గుర్తు చేశారు. ఆయన అభివృద్ధి చేశారు కాబట్టే వాళ్ల పేర్లు పెట్టారని, తానే ఆ పేర్లు సూచించానని వెల్లడించారు. ఆమెకు ఏదైనా కంపెనీ నచ్చితే ఎవరైనా ఇస్తారా? అని ప్రశ్నించారు. జగన్ ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే ఆస్తుల పంపకాలు ఏ విధంగా జరిగాయో తెలుస్తుందన్నారు. జగన్ స్వార్జితమైన ఆస్తుల్లో 40 శాతం వాటా అడుగుతున్న షర్మిల... మరి వైఎస్ఆర్ ఆమెకు ఇచ్చిన ఆస్తుల్లో జగన్ 40% అడిగితే ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తనకో న్యాయం, జగన్‌కో న్యాయం ఏమిటన్నారు. 20 ఏళ్ల క్రితం పెళ్లయిన చెల్లిని పిలిచి, రూ.200 కోట్ల ఆస్తిని జగన్ ఇచ్చాడంటే దేశంలో ఎక్కడైనా ఇలాంటి అన్న ఉన్నారేమో చెప్పాలన్నారు.

అమ్మ తటస్థతపై సందేహాలు!

తన అసంబద్ధ చర్యలు కుమారుడి బెయిల్ రద్దు పరిస్థితికి దారి తీసే ప్రమాదం ఉందని తెలిసినా ఆ కుట్రలకు వైఎస్ విజయమ్మ పరోక్షంగా సహకరించడంపై సర్వత్రా తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. విజయమ్మ తటస్థతపై పలు సందేహాలు వ్యక్తం చేస్తు న్నారు. విజయమ్మను మొదటి నుంచి భావోద్వేగాలకు గురి చేసి షర్మిల ప్రభావితం చేస్తున్నట్లు పలు సందర్భాల్లో స్పష్టమైందని నెటిజన్లు, ప్రజలు చర్చించుకుంటున్నారు. న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసినా సరస్వతి షేర్ల ట్రాన్స్‌ఫర్ పత్రాలపై సంతకాలు చేయడం.. పలు సందర్భాల్లో షర్మిలకు అనుకూలంగా వ్యవహరించడం ఆమె తటస్థ వైఖరిని ప్రశ్నార్థకంగా మార్చినట్లు చర్చించుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సైతం కొద్ది గంటల్లో ఎన్నికల ప్రచారం ముగియనున్న సమయంలో విదేశాల నుంచి విజయమ్మ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వీడియో సందేశాన్ని విడుదల చేయటాన్ని గుర్తు చేస్తున్నారు. ఇద్దరు పిల్లలను సమానంగా చూడాల్సిన అమ్మ ఒకవైపే మొగ్గడం సరికాదని పేర్కొంటున్నారు. నీ ఆత్మాశ, కుతంత్రాల్లో అమ్మను కూడా పావుగా వాడుకున్నావు. తప్పుడు ప్రకటనలకు అమ్మను ఓ సాక్షిగా, అమలుకర్తగా చేశావంటూ వైఎస్ జగన్ తన సోదరికి రాసిన లేఖను గుర్తు చేస్తున్నారు. 'క్షమార్హం కాని అక్రమ చర్యల్లో అమ్మను భాగం చేశావు. గత కొద్ది సంవత్సరాలుగా అమ్మను భావోద్వేగాలకు నువ్వు వాడుకుంటున్న విషయం జగమెరిగిన సత్యం. నీ సొంత వ్యూహాల్లో అమ్మను భాగం చేశావు. కోర్టు అనుమతి లేకుండా షేర్లను బదిలీ చేస్తే నాకు న్యాయపరమైన సమస్యలు వస్తాయని తెలిసీ బదలాయింపు చేశావు. అంతేకాక షేర్ సర్టిఫికెట్లు, షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారాలు పోయినట్లుగా అమ్మ చేత తప్పుడు ప్రకటనలు ఇప్పించావు. అంతిమంగా అక్రమ పద్ధతిలో వాటాలను బదలాయింపు చేశావు. దీనివల్ల కుమారుడిగా నాకు న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని తెలిసి కూడా నీ చర్యల్లో భాగస్వామి అయింది. ఆమె తటస్థతపై ప్రశ్నలు తలెత్తున్నాయి. అంతేకాక ఆమె ఒకవైపే ఉందన్న భావన కలిగిస్తోంది' అని తీవ్ర ఆవేదనతో వైఎస్ జగన్ లేఖ రాయటాన్ని నెటిజన్లు, ప్రజలు ఉదహరిస్తున్నారు.




ఆదివారం రాత్రి సిరిసిల్లలో కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న బెటాలియన్ పోలీసులు

సద్దుమణగని ఆందోళనలు

రాష్ట్రంలోని కొన్ని బెటాలియన్లలో టీజీఎస్పీ సిబ్బంది నిరసనలు

- తమ తోటివారిపై సస్పెన్షన్లు ఎత్తివేయాలంటూ వినతులు
- ఏక్ పోలీస్ విధానం అమలు చేసేవరకు తగ్గేది లేదంటున్న కానిస్టేబుళ్లు
- సిబ్బందికి నచ్చజెబుతూనే కఠిన చర్యలకు ఉన్నతాధికారుల హెచ్చరికలు

సాక్షి, హైదరాబాద్/సిరిసిల్ల క్రైం/ఖిలా వరంగల్: టీజీఎస్పీ పోలీసులకు సంబంధించిన సెలవుల విధానంలో మార్పు నేపథ్యంలో మొదలైన సిబ్బంది ఆందోళనలు ఆదివారం కూడా కొనసాగాయి. ఆందోళనల నేపథ్యంలో సస్పెండైన తమ తోటి సిబ్బందిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా ఖాతరు చేయడం లేదు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నారని గుర్తించిన 39 మంది టీజీఎస్పీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ టీజీఎస్పీ అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 3, 4, 5 17వ బెటాలియన్లలో ఆరుగురు చొప్పున, 6, 12, 13వ బెటాలియన్లలో ఐదుగురు చొప్పున సస్పెండ్ చేశారు. దీంతో కానిస్టేబుళ్లు ఆదివారం మరోమారు ఆందోనకు దిగారు. నల్లగొండలోని 12వ బెటాలియన్ సిబ్బంది కాసేపు ఆందోళన చేశారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని హైదరాబాద్ కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, పిల్లలు క్యాండిల్ మార్చ్ చేశారు. ములుగు జిల్లా చల్వాయి ఐదో బెటాలియన్‌కు చెందిన సిబ్బంది ఏకంగా అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్‌జైన్‌కు లేఖ రాశారు. సస్పెండ్ చేసిన తమ తోటి సిబ్బందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే అందరినీ సస్పెండ్ చేయాలని వారు ఆ లేఖలో స్పష్టం చేశారు. మరోవైపు సిరిసిల్లలోని సర్దాపూర్ 17వ బెటాలియన్ పోలీసులు కూడా సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు విన్నవించారు. కొద్దిసేపు బైఠాయించిన తర్వాత విధుల్లో చేరారు. అనంతరం ఆదివారం రాత్రి సిరిసిల్లలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చేస్తున్న శాంతియుత నిరసనలను గమనించి ఉద్యోగులకు బాసటగా నిలవాల్సిన ఉన్నతాధికారులు కొందరిపై సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని అన్నారు.



సిరిసిల్లలో సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలంటూ వినతిపత్రం సిద్ధం చేస్తున్న ఉద్యోగులు

సివిల్ డ్రెస్‌తో ధర్నా

ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని, కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ మామునూరు టీజీ ఎస్పీ నాలుగో బెటాలియన్ గేటు వద్ద సిబ్బంది ధర్నాకు దిగారు. శనివారం బెటాలియన్ గేటు వద్ద ఆందోళనకు దిగిన కానిస్టేబుళ్లు ఎస్.సతీష్, బి.రమేష్, డి.శ్రీనివాస్, సీహెచ్ ప్రశాంత్, పి.సంపత్ కె.వినోద్‌ను సస్పెండ్ చేస్తూ అదేరోజు రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉదయం విధులకు హాజరైన స్పెషల్ పోలీసులు యూనిఫాం లేకుండా సివిల్ డ్రెస్‌తోనే బెటాలియన్ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. వీరికి పోలీసు కుటుంబాల సభ్యులు బాసటగా నిలిచారు.

ఫోకస్ పెంచిన ఉన్నతాధికారులు

టీజీఎస్పీ సర్వీస్ రూల్స్ ఏంటి?, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా ఇప్పుడు ఏక్ పోలీస్ విధానం లేకపోవడం, టీజీఎస్పీ అన్నది పారామిలిటరీ ఫోర్స్ కాబట్టి అందుకు అనుగుణంగానే పనిచేయాల్సి ఉంటుంది.. ఇలాంటి అనేక కోణాల్లో సిబ్బందికి నచ్చజెప్పేందుకు పోలీస్ ఉన్నతాధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన మేర సత్ఫలితాలు ఇవ్వ డం లేదు. దీంతో తదుపరి చర్యలతోపాటు..ఆందోళన మూలాలపై పోలీస్ ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టారు. ఇప్పటికే ఆయా బెటాలియన్లలో అడిషనల్ డీజీ స్థాయి నుంచి స్థానిక ఎస్పీల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇదే పద్ధతిలో మరింత లోతుగా యథార్థ పరిస్థితులను సిబ్బందికి నచ్చజెప్పే ప్రయత్నం కొనసాగించడంతో పాటు క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించేది లేదన్న సందేశాన్ని మరింత గట్టిగా సిబ్బందికి పంపే యోచనలో పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నట్టు తెలుస్తోంది.



వరంగల్‌లో టీజీఎస్పీ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నినాదాలు చేస్తున్న కానిస్టేబుళ్లు

మాజీ ఐపీఎస్ అధికారి ఇంట్లో బెటాలియన్ బ్యాండ్

పెళ్లికి బ్యాండ్ వాయించిన కానిస్టేబుళ్లు



కాజీపేట రూరల్: హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలో ఒక మాజీ ఐపీఎస్ అధికారి ఇంట్లో పెళ్లికి బెటాలియన్ కానిస్టేబుళ్లు బ్యాండ్ వాయించినట్లు పలువురు తెలిపారు. శనివారం రిటైర్డ్ పోలీస్ అధికారి ఇంటిలోని సభ్యులకు సంబంధించి పెళ్లి కాజీపేట ఫాతిమానగర్‌లోని చర్చిలో జరిగింది. ఈ వివాహానికి బ్యాండ్ వాయించే బాధ్యతను మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లకు అప్పగించినట్లు సమాచారం. ఈ విషయమై ప్రశ్నిస్తే నిబంధనల మేరకే ఈ పనులు చేయించుకుంటున్నామని ఆ మాజీ పోలీస్ అధికారి సమర్థించుకున్నట్లు తెలిసింది.

సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్ట్‌లపై మోదీ 'మన్ కీ బాత్'

ఐపీఎస్ సజ్జనార్ 'ఎక్స్'పోస్ట్‌ను ఉదహరిస్తూ పలు సూచనలు

సాక్షి, హైదరాబాద్/ న్యూఢిల్లీ: సైబర్‌నేరగాళ్లు ఇటీవల చేస్తున్న సరికొత్త మోసాలు, డిజిటల్ అరెస్టులపై ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ తరహా మోసాలు ఎలా జరుగుతున్నాయి? వాటిని ఎదుర్కొనేందుకు ఎలా అప్రమత్తంగా ఉండాలన్న సూచనలు ఇస్తూ ప్రధాని ఓ వీడియోను పంచుకున్నారు. సదరు వీడియోను టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేయగా...ఆ వీడియోను ఉదహరిస్తూ ప్రధాని మోదీ మాట్లాడారు. కర్ణాటక విజయపూర్‌కు చెందిన సంతోశ్ పాటిల్ అనే వ్యక్తి తాను ఒక నకిలీ పోలీస్‌తో చేస్తున్న సంభాషణను వీడియో తీశారు. దాన్ని సజ్జనార్ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేయగా అది వైరల్ అయ్యింది. అందులోని వివరాల మేరకు సంతోశ్ పాటిల్‌ను కేంద్ర హోంశాఖ, ప్రధాన మంత్రి కార్యాలయం సిబ్బంది గుర్తించారు. ఆ వీడియోలోని మోసాన్ని వివరించడంతోపాటు ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో సంతోశ్ పాటిల్ ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ప్రధాని మోదీ వరకు తన వీడియో చేరేలా తన 'ఎక్స్'ఖాతాలో షేర్ చేసినందుకు వీసీ సజ్జనార్‌కు సంతోశ్ పాటిల్ కృతజ్ఞతలు తెలిపారు. సజ్జనార్ సైతం సంతోశ్‌తో ఆదివారం వీడియోకాల్ మాట్లాడి అభినందించారు.

జానపద కళపై 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

జానపద కళలకు పుట్టినిల్లు అయిన తెలంగాణలో ఎన్నో జానపద కళలు, చిత్ర కళలు అవతరించాయని తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా చేర్యాల పెయింటింగ్స్ (నకాషీ) నిలుస్తోందని ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'లో ప్రస్తావించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో సంస్కృతి వారసత్వాన్ని పరిరక్షించడంలో ఎందరో అసాధా రణ వ్యక్తులు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. వారిలో చేర్యాలకు చెందిన నకాషీ కళాకారుడు డి.వైకుంఠం ఒకరని గుర్తు చేశారు. డి.వైకుంఠం దాదాపు 50 ఏళ్లుగా చేర్యాల జానపద కళను ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో నిమగ్న మయ్యారని కొనియాడారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 28-10-2024

మంచిమాట



చూసి రమ్మంటే కాల్చి వచ్చాడు అని ఒక సామెత ఉంది. అంటే చెప్పిన పని కాక ఎక్కువ చేసి వచ్చాడు అని అర్థం. సందర్భానుసారంగా దీనిని మెచ్చుకోటానికి, తప్పు పట్టటానికి కూడా ఉపయోగిస్తారు. దీనికి పూర్తి వ్యతిరేకం "పుల్లయ్య వేమవరం" - రాకపోకల శ్రమ తప్ప ఏ మాత్రం ప్రయోజనం లేదు అని. ఈ రెండు కూడా యజమాని చేత ఆదేశించ బడిన దాసుడు పనిని ఏవిధంగా నిర్వర్తించాడు? అనే దాన్ని తెలిపేవే.

కార్యసాధన

''రేపు పుల్లయ్యని వేమవరం పంపాలి'' అని యజమాని ఇంట్లో వాళ్ళతో చెపుతుంటే విని తెల్లవారే సరికి, వెళ్ళి తిరిగి వచ్చాడు. యజమాని పిలిచి వెళ్ళమని చెప్పే లోపే తాను చేసిన నిర్వాకం చెప్పాడు. వెళ్ళి ఏం చేశావు? అని అడిగితే సమాధానం లేదు. మళ్ళీ వెళ్ళవలసి వచ్చింది.

మరొక వ్యక్తి చెప్పిన పని మాత్రం పూర్తి చేసి రావటం జరిగింది. ఫలానా వారు ఉన్నారో లేదో చూసి రమ్మంటే ఉన్నదీ లేనిదీ కనుక్కుని వచ్చేయటం జరిగింది. లేరు అంటే మళ్ళీ ఎప్పుడు ఉంటారు? అని తెలుసుకుంటే మరొక మారు వెళ్ళవలసిన పని ఉండదు.

వేరొక వ్యక్తి యజమాని చెప్పిన పని చేసి, దానికి అనుబంధంగా ఉన్న మరిన్ని వివరాలు సేకరించి అంటే చూసి రమ్మన్న వ్యక్తి లేకపోతే ఎక్కడికి వెళ్లారు? ఎప్పుడు వస్తారు? అప్పుడు మా యజమాని రావచ్చా? మొదలైన వివరాలు తెలుసుకుంటే ఉపయోగంగా ఉంటుంది.

అక్కడి వారితో మాట్లాడి తమ వివరాలన్నీ చెప్పి వచ్చే తెలివితక్కువ వారూ, అనవసర ప్రసంగం చేసి అతితెలివితో వ్యవహారాన్ని చెడగొట్టే వారూ కూడా ఉంటారు. ఇటువంటి వారితో ప్రమాదం.

ఈ నలుగురిలో యజమానికి ప్రీతిపాత్రమైన వారు ఎవరు? తెలుస్తూనే తిరిగి వచ్చి, యజమాని అడిగిన ప్రశ్నలకి తగిన సమాధానాలు ఇచ్చి మరొకమారు వెళ్ళవలసిన పని లేకుండా చేయటం జరిగింది.

దూతగా వెళ్ళేవారు శారీరిక బలంతో పాటు, మానసిక ధైర్యం, శాస్త్రపరిజ్ఞానం కూడా కలిగి ఉండాలి. ఒక దేశ దౌత్య, రాయబార కార్యాల యాల్లో ఉండేవారికి ఉండవలసిన లక్షణాలు ఇవే. అప్పుడు మాత్రమే దేశ ప్రతిష్ఠని పెంపొందించే విధంగా నిర్ణయాలు తీసుకో గలుగుతారు.

ఉంది కదా! ఇటువంటి కార్యసాధకుడికి నిలువెత్తు ఉదాహరణ హనుమ. ముందు తనంతట తాను సముద్ర లంఘనం చేస్తాను అనలేదు. జాంబవంతుడు ప్రేరేపిస్తే కాదని కూడా అనలేదు. నిజానికి వెళ్ళింది సీతని చూడటానికి.కాని, చూసి రాలేదు. మాట్లాడాడు. అప్పుడు, తరువాత ప్రతిపని చేస్తున్నప్పుడు తాను ఇది చేయవచ్చునా? లేదా? అని వితర్కించి, ఆ పని తాను చేయవలసిన పనిలో భాగం అని నిర్ధారించుకుని మరీ చేశాడు. తన ప్రభువు లక్ష్యం తెలుసు. తాను చేసే ప్రతి పని దానికి సహకరించేదిగా ఉన్నదీ, లేనిదీ విచారించి, అందులో భాగమేనని నిర్ధారించుకుని మరీ చేశాడు. ఆయా సందర్భాలలో దూత అయిన వాడు ఏమి చేయవచ్చు, ఏమి చేయ కూడదు అని వితర్కించుకుని, అది శాస్త్ర సమ్మతమే అనినిశ్చయించుకున్నాక మాత్రమే చేశాడు. దూతగా వెళ్ళేవారు శారీరిక బలంతో పాటు, మానసిక ధైర్యం, శాస్త్రపరిజ్ఞానం కూడా కలిగి ఉండాలి. ఒక దేశ దౌత్య, రాయబార కార్యాలయాల్లో ఉండేవారికి ఉండవలసిన లక్షణాలు ఇవే. అప్పుడు మాత్రమే దేశ ప్రతిష్ఠని పెంపొందించే విధంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

''చూడబడినది నా చేత సీత'' అని చెప్పగానే ''ఆమె ఎట్లా ఉన్నది? ఏమన్నది?'' అని అడిగాడు రాముడు. నేను దూరం నుంచి చూశానే కాని, దగ్గరగా చూడలేదు, మాట్లాడలేదు అని చెపితే ఏం బాగుంటుంది? లంకా నగరం గురించి, రావణుడి సైన్యం గురించి అడిగినప్పుడు అవి తెలుసుకోమని చెప్ప లేదు కనుక నేను పట్టించుకోలేదు అంటే బాధ్యతాయుతంగా ప్రవర్తించినట్టు కాదు కదా అది!

అందుకే సమర్థులు చూసి రమ్మంటే కాల్చి వస్తారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



గృహస్థాశ్రమంలో నిత్యం జరిగే పంచ మహాయజ్ఞాలలో ఐదవది – '....నృయజ్ఞోతిథిపూజనమ్'. అతిథిని పూజించే వాడు ఒక్క గృహస్థు మాత్రమే. నేను ఆహ్వానిస్తే నా ఇంటికి వచ్చినవాడు అతిథి. నేను ఆహ్వానించకుండా వచ్చినవాడు– అభ్యాగతుడు. అతిథి పూజనమ్...పూజించడం అంటే గౌరవించడం. ఇంటికి వచ్చినవారిపట్ల మర్యాదగా మెలుగుతూ గౌరవించి పంపడం నేర్చుకో...

తన ఇంటికి వచ్చినవాడు గొప్పవాడా, నిరక్షరాస్యుడా, సామాన్యుడా అన్న రాలేదు నీదగ్గరికి. ఆయన హాయిగా అవన్నీ అనుభవిస్తున్న స్తోమత ఉన్నవాడే. కానీ ఆయన ఏదో కార్యం మీద వచ్చాడు. భగవంతుడు శంఖ చక్ర గదా పద్మాలు పట్టుకుని రాడు నీ ఇంటికి. అతిథి రూపంలో వస్తాడు. ఆ సమయంలో నీవిచ్చిన నీళ్ళు తాగవచ్చు, పట్టెడన్నం తినవచ్చు, బట్టలు కూడా పుచ్చుకోవచ్చు. కానీ ఆయన పుచ్చుకున్న వాడిగా ఉంటాడు. అలా ఉండి నీ ఉద్ధరణకు కారణమవుతాడు. అందునా నీవు పిలవకుండానే వచ్చాడు. అభ్యాగతీ స్వయం విష్ణుః– విష్ణుమూర్తే నీ

ఊరకరారు మహాత్ములు...

వివక్ష గృహస్థుకు ఉండదు. భోజనం వేళకు వచ్చాడు. భోజనం పెట్టు. లేదా ఏ పండో కాయో లేదా కాసిని మంచినీళ్లయినా ఇవ్వు.. అన్ని వేళలా అన్ని పెట్టాలనేం లేదు. వచ్చిన వారిని ప్రేమగా పలకరించు. నీకూ పరిమితులు ఉండవచ్చు. వాటికి లోబడే ఎంత సమయాన్ని కేటాయించగలవో అంతే కేటాయించు. కానీ ఒట్టి చేతులతో పంపకు. పండో ఫలమో ఇవ్వు. లేదా కనీసం గుక్కెడు చల్లటి నీళ్ళయినా ఇవ్వు. నీకు సమయం లేకపోతే ఆ బాధ్యతలను కుటుంబ సభ్యులకు అప్పగించు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అతిథి సేవతో గృహస్థు పాపాలు దహించుకు పోతున్నాయి. కారణం – ఆయన ఏది పెడుతున్నాడో దానిని 'నేను పెడుతున్నాను' అన్న భావనతో పెట్టడు. వచ్చిన అతిథి నీ దగ్గరకు వచ్చి గుక్కెడు నీళ్ళు తాగాడు, ఫలహారం చేసాడు, భోజనం చేసాడు...అంటే అవి అతనికి లేక దొరకక ఇంటికి వచ్చాడని గుర్తించు. మహితాత్ములైనవారు, భాగవతోత్తములు, భగవద్భక్తి కలవారు నీ ఇంటికి వస్తే.. గృహదేవతలు కూడా సంతోషిస్తారు.

అంటే దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి సులువైన మార్గం అతిథి పూజనమే. అతిథికి నీవు పెట్టలేదు. భగవంతుడే అతిథి రూపంలోవచ్చి నీదగ్గర తీసుకున్నాడు. అతిథిని మీరు విష్ణు స్వరూపంగా భావించి పెట్టినప్పుడు మీ అభ్యున్నతికి కారణమవుతుంది. మహాత్ములయిన వారు మనింటికి వస్తుండడమే దానికి సంకేతం. శ్రీ కృష్ణుడి క్షేమ సమాచారం తెలుసుకురమ్మని వసుదేవుడు పంపిన పురోహితుడితో నందుడు ''ఊరకరారు మహాత్ములు/ వారథముల యిండ్ల కడకు వచ్చుట లెల్లం/గారణము మంగళములకు/ నీ రాక శుభంబు మాకు, నిజము మహాత్మా !'' అంటాడు. అతిథి ఇంట అడుగు పెట్టడం అంత గొప్పగా భావిస్తుంది మన సమాజం.

రామకార్యంమీద పోతున్న హనుమకు మైనాకుడు ఆతిథ్యం స్వీకరించమని అర్థిస్తాడు. ఇప్పుడు వీలుపడదంటే...కనీసం ఒక్క పండయినా తిని కాసేపు విశ్రాంతయినా తీసుకువెళ్ళమంటాడు. ఇంటి ముందు నిలిచిన బ్రహ్మచారి 'భవతీ భిక్షాందేహి' అంటే... ఇంట్లో ఏవీ లేవంటూ ఇల్లంతా వెతికి ఒక ఎండిపోయిన ఉసిరికాయ తెచ్చి శంకరుడి భిక్షాపాత్రలో వేస్తుంది ఒక పేదరాలు. ఆ మాత్రం అతిథి పూజకే ఆమె ఇంట బంగారు ఉసిరికకాయలు వర్షంలా కురిసాయి.

అమృత బిందువులు

- జీవితం అంటే ఉరుకులు పరుగులతో నడిపించే చక్రాల బండి కాదు... ఉల్లాస ఉత్సాహాలతో ఆడుతూ పాడుతూ గడిపే రంగుల రాట్నం వంటిది.
- ఆవేశం ఆరోగ్యానికి మంచిది కాదు. ఇది ఆత్మీయుల మధ్య సంబంధాలను తుంచి వేస్తుంది.
- నోటినుంచి వచ్చే అపశబ్దాల ప్రవాహం కోలుకోలేని, వెనక్కు తీసుకోలేని కష్ట నష్టాలను తెచ్చి పెడుతుంది.
- చెప్పేడు మాటలను విని ఆవేశపడే కంటే చేతనను చైతన్యపరిచే శుద్ధ ఆలోచనలు చేయడం చాలా ఉత్తమం.
- చిన్న వారికి ప్రేమను, పెద్దవారికి గౌరవాన్నీ ఇవ్వాలి. ఏది ఇస్తామో, అదే పొందుతాము అనే ఆధ్యాత్మిక సూత్రాన్ని ఎప్పుడూ మరచిపోకూడదు.

సిద్ధ గురువులు ప్రసాదించిన వరం యోగం



మన దేహం ఆలయం లాంటిది. అందుకే తమ దేహాన్నే ఒక పవిత్ర క్షేత్రంగా చేసుకుని సాధన చేసుకున్నారు చేసుకున్నారు యోగులు. శరీరమనే ఈ క్షేత్రంలో సుషుమ్న అనే ఏకైక దైవనాడి ఉంటుంది. శరీరంలో మొత్తం 72,000 నాడులు ఉంటే అందులో సుషుమ్న నాడి ఒక్కటే దైవనాడి. నాడులు అంటే శరీరమంతటికీ శక్తిని ప్రసారం చేసే వాహికలు. యోగ శాస్త్రం మూడు శరీరాలను గురించి వివరిస్తుంది. భౌతిక దేహం, శక్తి దేహం, కారణ దేహం. ఈ మూడూ కలిసి పని చేస్తూ ఉంటాయి. భౌతిక శరీరానికి ఆహార అసమతౌల్యం కారణంగా అనేక రుగ్మతలు వచ్చినట్లు, శక్తి శరీరంలో లోపాల వల్ల కూడా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ప్రధానమైన అవయవాల పనితీరుకు, శక్తి శరీరానికి ప్రగాఢమైన సంబంధం ఉంటుంది.

ఈ సకల సృష్టి విశ్వశక్తి పైనే ఆధారపడి ఉంటుంది. జీవులన్నీ నిద్రావస్థలో విశ్వం నుంచి శక్తిని గ్రహిస్తాయి. అయితే మానవులకు నిద్రలో స్వీకరించే శక్తి మాత్రమే సరిపోదు. ఇప్పటి వేగయుగంలో అదనపు శక్తి అవసరం. ఆ శక్తి కేవలం ధ్యాన సాధన ద్వారా మాత్రమే లభిస్తుంది.

వెన్నుపాము అడ్డంగా ఉన్న జీవులను తిర్యక్ జీవులని, వెన్నెముక నిలువుగా ఉన్న జీవులను మానవులనీ తెలియజేస్తుంది యోగ శాస్త్రం. జీవులన్నింటిలోకీ మానవుడు అగ్రగణ్యుడు. వజ్ర సమానమైన వెన్నెముక వల్లే మానవుడికి పరమోన్నతమైన స్థితికి చేరుకోగలిగే అద్భుతమైన శక్తిని, అవకాశాన్నీ ఈ సృష్టి ప్రసాదిస్తుంది. నిద్రాణంగా ఉన్న సుషుమ్న నాడి ఉత్తేజితమై, ఈ దివ్య నాడిలో కుండలిని జాగరణ జరిగి, మూలాధార చక్రం నుండి సహస్రారం చేరినప్పుడు మనిషికి దివ్యానంద స్థితి అనుభవంలోకి వస్తుంది. ఈ విధంగా జరిగినప్పుడు మానవ శరీరమే ఒక మహాశక్తి క్షేత్రంగా మారుతుంది. భగవత్ తత్త్వాన్ని బాహ్యంగా గాక అనుభవ పూర్తిగా అర్థం చేసుకునే ఏకైక మార్గమే ధ్యానసాధన. సుషుమ్నా క్రియా యోగసాధన ద్వారా తక్కువ సమయంలోనే అపారమైన శక్తిని స్వీకరించవచ్చు. సుషుమ్నా క్రియ యోగధ్యానం నాలుగు ప్రక్రియల కలయిక. ఈ సాధనకు ఎటువంటి కఠిన నియమాలూ లేవు. ఈ ధ్యానం మానవులందరి కోసం సిద్ధ గురువులు ప్రసాదించిన గొప్ప వరం.



– ఆత్మానందమయి

డబ్బింగ్ స్టార్ట్



వెంకటేశ్

హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా ఫిల్మ్‌లో మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మాజీ పోలీసాఫీసర్ పాత్రలో వెంకటేశ్ కనిపిస్తారు. ఈ పోలీసాఫీసర్ భార్యగా ఐశ్వర్యా రాజేష్, ఆయన మాజీ ప్రేయసిగా మీనాక్షీ చౌదరి కనిపిస్తారు. కాగా ఈ సినిమా డబ్బింగ్ వర్క్స్ మొదలయ్యాయి. ''ఇప్పటివరకూ జరిపిన షూటింగ్‌తో తొంభై శాతం సినిమా పూర్తయింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే డబ్బింగ్ ఆరంభించాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

దుల్కర్ తన రోడ్డు తాను వేసుకున్నాడు – దర్శకుడు త్రివిక్రమ్



వెంకీ అట్లూరి, దుల్కర్ సల్మాన్, త్రివిక్రమ్, విజయ్ దేవరకొండ, సూర్యదేవర నాగవంశీ

''మమ్ముట్టీగారు మర్రి చెట్టు. మర్రి చెట్టు నీడలో మొక్కలు బతకవు అని చెబుతుంటారు. కానీ దాన్నుంచి బయటకు వచ్చి, తన రోడ్డు తాను వేసుకున్నాడు దుల్కర్. 'మహానటి, సీతా రామం' సినిమాలకు భిన్నమైన పాత్రను దుల్కర్ ఈ సినిమాలో చేశాడు. వన్నాఫ్ మై ఫేవరెట్ యాక్టర్స్ విజయ్ దేవరకొండ. తక్కువ వయసులోనే ఎంతో ప్రేమను... అంతే ద్వేషాన్ని చూశాడు విజయ్.. చాలా గట్టివాడు'' అని అన్నారు దర్శకుడు త్రివిక్రమ్. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'లక్కీ భాస్కర్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు దర్శకుడు త్రివిక్రమ్, హీరో విజయ్ దేవరకొండ అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో త్రివిక్రమ్ మాట్లాడుతూ– ''లక్కీభాస్కర్' సినిమా చూశాను. ఈ సినిమాలోని ప్రతి పాత్ర కథను ఇంపాక్ట్ చేస్తుంది. ఓ మధ్య తరగతివాడు ఓ సాహసం చేస్తే నెగ్గాలని మనకు కచ్చితంగా అనిపిస్తుంటుంది. నేనూ అక్కడ్నుంచే వచ్చాను. ఆ అడ్వెంచర్‌ను వెంకీ సక్సెస్‌ఫుల్‌గా తీశాడు. ఈ సినిమా చూసిన తర్వాత తడిసిన కళ్లతో, నవ్వుతున్న పెదాలతో ఆడియన్స్ థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''పెళ్లిచూపులు' సినిమా తర్వాత నాకు ఫస్ట్ చెక్ సితార ఎంటర్‌టైన్మెంట్స్ నుంచి వచ్చింది. త్రివిక్రమ్‌గారు పిలిపించి, మాట్లాడి చెక్ ఇప్పించారు. సితారలో ఇప్పుడు 'వీడీ 12' సినిమా చేస్తున్నాను. 'లక్కీ భాస్కర్'ను వెంకీ బాగా తీశాడనిపించింది. 'మహానటి, కల్కి 2898 ఏడీ' సినిమాలో నేను, దుల్కర్ నటించాం. కానీ స్క్రీన్ షేర్ చేసుకోలేదు. 'లక్కీ భాస్కర్ బ్లాక్‌బస్టర్ కావాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ– ''నాకు నచ్చిన చిత్రాల్లో 'అల.. వైకుంఠపురములో..' ఒకటి. త్రివిక్రమ్ గారి రైటింగ్‌లో మంచి డెప్త్ ఉంటుంది. విజయ్ నా లక్కీ చార్మ్. తెలుగులో నేను చేసిన తొలి సినిమా 'మహానటి' ఈవెంట్‌లో ఇతను దుల్కర్ అంటూ ఆడియన్స్‌కు నన్ను పరిచయం చేశాడు. ఆ తర్వాత 'సీతారామం' ఈవెంట్‌లో ఉన్నాడు. ఇప్పుడు 'లక్కీ భాస్కర్' ఈవెంట్‌లో ఉన్నాడు. ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందని అనుకుంటున్నాను. వెంకీ స్క్రిప్ట్‌లోని పాత్రలు మెచ్యూర్డ్‌గా ఉంటాయి. ఇలాంటి సినిమాను నిర్మించాలంటే చాలా ధైర్యం కావాలి. నాగవంశీ ధైర్యంతో ఈ సినిమా తీశాడు'' అని పేర్కొన్నారు దుల్కర్ సల్మాన్. ''బ్యాంకింగ్ వరల్డ్‌పై సినిమా తీయాలని 'లక్కీ భాస్కర్' తీశాను. డబ్బు అంటే ఇష్టం, అవసరం అనుకునే ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది'' అని తెలిపారు వెంకీ అట్లూరి. పాటల రచయిత రామజోగయ్యశాస్త్రి, నిర్మాత చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా

రైల్వేస్టేషన్‌లో...



ప్రభాస్

హీరో ప్రభాస్ రైలు ప్రయాణం చేస్తున్నారు. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని తెలిసింది. హైదరాబాద్‌లో వేసిన ఓ రైల్వేస్టేషన్ సెట్‌లో ప్రభాస్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఇలా ఈ సినిమా కోసం రైలు ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. మిథున్ చక్రవర్తి, జయప్రద ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ పీరియాడికల్ అండ్ హిస్టారికల్ ఫిల్మ్‌కు సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

హనుమంతుని నేపథ్యంలో రణమండల



టీజీ విశ్వప్రసాద్

''నా స్వస్థలం ఆదోనిలో షూటింగ్ చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. 'రణమండల' సినిమాతో అది నెరవేరుతోంది. ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తిగా ఆదోని పరిసర ప్రాంతాల్లోనే జరుపుతాం'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్న 46వ చిత్రానికి 'రణమండల' టైటిల్ ఖరారు చేసి, ఆదోని రణమండల దేవాలయంలో ప్రకటించి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. హనుమంతుని నేపథ్యంలో భారీ యాక్షన్ డివోషనల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ''రణమండల ఆంజనేయుని దేవాలయ క్షేత్ర నామాన్నే మా చిత్రానికి టైటిల్‌గా పెట్టడం హ్యాపీగా ఉంది. ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్, యాక్షన్, ఎమోషనల్ సీన్స్ కీలకంగా ఉంటాయి. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తాం. ఇక మా సంస్థ నుంచి రానున్న 47వ చిత్రం షూటింగ్‌ని కూడా ఆదోనిలోనే జరుపుతాం'' అని టీజీ విశ్వప్రసాద్ అన్నారు.

దేశభక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఫౌజా నచ్చుతుంది – దర్శకుడు ప్రమోద్ కుమార్



కాంతి డి. సురేష్, డి. సురేష్, అజిత్ దాల్మియా, కార్తీక్ దమ్ము, ప్రమోద్ కుమార్

''డబ్బులిచ్చి బ్రాండెడ్ బట్టలు కొన్నంత సులువుగా ఆర్మీ యూనిఫామ్‌ని కొనలేం. కష్టంతో, ఇష్టంతో సాధించుకోవాలి. దేశభక్తి ఉంటేనే అది సాధించగలం. దేశం అంటే ప్రేమ, భక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ మా 'ఫౌజా' నచ్చుతుంది. త్వరలో ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తాం'' అని ప్రమోద్ కుమార్ పున్వానా అన్నారు. కార్తీక్ దమ్ము, పవన్ మల్హోత్రా, ఐశ్వర్యా సింగ్ ముఖ్య తారలుగా ప్రమోద్ కుమార్ పున్వానా దర్శకత్వంలో అజిత్ దాల్మియా నిర్మించిన హిందీ చిత్రం 'ఫౌజా'. ఇండియన్ ఆర్మీ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం మూడు జాతీయ అవార్డులు సాధించింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళంలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా 'ఫౌజా'ని హైదరాబాద్‌లో ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని వీక్షించిన వారిలో హీరో విజయ్ ధరన్ దాట్ల, ఏపీ అడిషనల్ చీఫ్ సెక్రటరీ దమ్ము మురళీమోహన్, హర్యానా ప్రిన్సిపల్ సెక్రటరీ డా. డి. సురేష్, కాంతి డి. సురేష్ తదితరులు ఉన్నారు. ''ఫౌజీ' లాంటి చిత్రానికి భాషతో సంబంధం ఉండదు'' అని ఈ సందర్భంగా హీరో కార్తీక్ చెప్పారు. ''హిందీలో మా చిత్రానికి మంచి ఆదరణ లభించింది. తెలుగు ప్రేక్షకులూ ఆదరించాలని కోరుకుంటున్నాను'' అని అజిత్ దాల్మియా అన్నారు.

నిర్మాత జాగర్లమూడి రాధాకృష్ణ మూర్తి కన్నుమూత



నిర్మాత–నటుడు జాగర్లమూడి రాధాకృష్ణ మూర్తి (85) బాపట్ల జిల్లా కారంచేడులోని స్వగృహంలో కన్ను మూశారు. చిన్నతనం నుంచి నాటకాలపై మక్కువతో రంగస్థలంపై నటించారు. ఆ తర్వాత డా. రామానాయుడు నిర్మించిన పలు చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు. అనంతరం నిర్మాతగా మారి 'ఒక దీపం వెలిగింది, వియ్యాల వారి కయ్యాలు, ప్రతిబింబాలు, శ్రీవినాయక విజయం, కోడళ్లు వస్తున్నారు జాగ్రత్త' తదితర సినిమాలు నిర్మించారు. ఇక అక్కినేని నాగేశ్వరరావు హీరోగా రాధాకృష్ణమూర్తి నిర్మించిన 'ప్రతిబింబాలు' (1982)కి అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. దాంతో అప్పట్లో విడుదలకు నోచుకోలేదు. చివరికి ఆ చిత్రాన్ని 2022లో విడుదల చేశారు. కాగా రాధాకృష్ణ మూర్తి భార్య గతంలోనే మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి మృతి పట్ల తెలుగు నిర్మాతల మండలి సంతాపం వ్యక్తం చేసింది.

జాతర



సతీష్ బాబు, దియా రాజ్

సతీష్ బాబు రాటకొండ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జాతర'. ఈ సినిమాలో దియా రాజ్ హీరోయిన్. గల్లా మంజునాథ్ సమర్పణలో రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నవంబరు 8న విడుదలకానుంది. సతీష్ బాబు రాటకొండ మాట్లాడుతూ– ''చిత్తూరు జిల్లాలోని ఓ జాతర నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రంలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్, ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. ఫస్ట్ లుక్ అందర్నీ ఆకట్టుకుంది. సినిమా కూడా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

థ్రిల్ అవుతారు



నయన్ సారిక, తన్వీ రామ్

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన పీరియాడికల్ థ్రిల్లర్ మూవీ 'క'. ఈ చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సుజీత్–సందీప్ ద్వయం ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీని తెరకెక్కించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ సందర్భంగా నయన్ సారిక మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నేను పల్లెటూరి అమ్మాయి సత్యభామగా నటించాను. వాసుదేవ్‌గా కిరణ్ అబ్బవరం కనిపిస్తారు. కథలో థ్రిల్‌కి గురి చేసే మలుపులు ఉంటాయి. క్లైమాక్స్ ఆడియన్స్‌కు గుర్తుండిపోతుంది. నటీమణులు సావిత్రి, శ్రీదేవిగార్లు చేసిన పాత్రలను రిఫరెన్స్‌లుగా తీసుకుని నేను సత్యభామ పాత్ర చేశాను'' అన్నారు. తన్వీ రామ్ మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో స్కూల్ టీచర్ రాధ పాత్రలో నటించాను. అభినయ వాసుదేవ్, సత్యభామ ఒక టైమ్ ఫ్రేమ్‌లో కనిపిస్తే, మరో పీరియడ్ టైమ్‌లో నా రోల్ ఉంటుంది. వాసుదేవ్, సత్యభామల పాత్రలకు నా రోల్ ఎలా కనెక్ట్ అవుతుందనేది థియేటర్స్‌లో చూడండి. ఈ సినిమా చూసి ఆడియన్స్ థ్రిల్ అవుతారని నమ్ముతున్నాం'' అని తెలిపారు.



పోరాడి ఓడిన సుమిత్ నగాల్

పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. ప్రపంచ 71వ ర్యాంకర్ క్రిస్టోఫర్ ఒకానెల్ (ఆస్ట్రేలియా)తో జరిగిన క్వాలిఫయింగ్ సింగిల్స్ తొలి రౌండ్‌లో 81వ ర్యాంకర్ సుమిత్ 4-6, 6-7 (3/7)తో పోరాడి ఓడిపోయాడు. గంటా 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. సుమిత్‌కు 6,380 యూరోల (రూ. 5 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

చిరాగ్ చికారా 'పసిడి' పట్టు



ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో చివరిరోజు భారత్‌కు ఏకైక స్వర్ణ పతకం దక్కింది. అల్బేనియాలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత రెజ్లర్ చిరాగ్ చికారా పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. అబ్దిమాలిక్ కరాచోవ్ (కిర్గిస్తాన్)తో జరిగిన ఫైనల్లో చిరాగ్ 4-3 పాయింట్ల తేడాతో విజయం సాధించాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ (2022లో) తర్వాత ప్రపంచ అండర్-23 చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం నెగ్గిన రెండో భారతీయ రెజ్లర్‌గా చిరాగ్ గుర్తింపు పొందాడు.

సోఫీ డివైన్ 'షో'

- ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ మహిళల జట్టు కెప్టెన్
- 79 పరుగులు చేయడంతోపాటు 3 వికెట్లు సొంతం
- రెండో వన్డేలో భారీ విజయంతో సిరీస్‌లో నిలిచిన కివీస్
- 76 పరుగుల తేడాతో ఓడిపోయిన భారత జట్టు



హర్మన్‌ప్రీత్



సోఫీ డివైన్

అహ్మదాబాద్: వరుస విజయాలతో సిరీస్ నెగ్గాలనుకున్న భారత మహిళల జట్టును న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన దెబ్బ కొట్టింది. మొదట బ్యాటింగ్‌లో (86 బంతుల్లో 79; 7 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోర్ చేసిన ఆమె తర్వాత బౌలింగ్ (3/27)లో కీలకమైన వికెట్లను పడగొట్టింది. దీంతో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తేలిపోయింది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో కివీస్ జట్టు 76 పరుగుల తేడాతో భారత్‌పై జయభేరి మోగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసి రేసులో నిలిచింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్, సుజీ బేట్స్ (70 బంతుల్లో 58; 8 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. ఆతిథ్య బౌలర్లలో స్పిన్నర్ రాధా యాదవ్ 4, దీప్తి శర్మ 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత మహిళల జట్టు 47.1 ఓవర్లలో 183 పరుగులే చేసి ఆలౌటైంది. టెయిలెండర్ రాధా యాదవ్ (64 బంతుల్లో 48; 5 ఫోర్లు) ఒక్కతే ప్రత్యర్థి బౌలింగ్‌కు ఎదురునిలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సోఫీతో పాటు లియా తహుహు కూడా 3 వికెట్లు తీసింది. జెస్ కెర్, ఎడెన్ కార్సన్ చెరో 2 వికెట్లు తీశారు. మంగళవారం ఇరు జట్ల మధ్య ఇదే వేదికపై జరిగే ఆఖరి పోరుతో సిరీస్ ఫలితం తేలనుంది.

శుభారంభం

ఓపెనర్లు సుజీ బేట్స్, జార్జియా ప్లిమర్ (50 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 87 పరుగులతో చక్కని ఆరంభాన్నిచ్చారు. దీప్తి ఈ జోడీని విడగొట్టగా, లౌరెన్ (3) రనౌటైంది. అర్ధసెంచరీ పూర్తయ్యాక జట్టు స్కోరు 114 వద్ద సుజీ మూడో వికెట్‌గా నిష్క్రమించింది. బ్రూక్ హాలిడే (8) కూడా స్వల్ప వ్యవధిలో అవుటైంది. ఈ దశలో సోఫీ, మ్యాడీ గ్రీన్ (41 బంతుల్లో 42; 5 ఫోర్లు) ఐదో వికెట్‌కు 82 పరుగులు జోడించడంతో న్యూజిలాండ్ మంచి స్కోరు చేయగలిగింది. స్కోరు పెంచే ప్రయత్నంలో ధాటిగా ఆడిన సోఫీ డెత్ ఓవర్లో పెవిలియన్ చేరింది. 49వ ఓవర్లో రాధా యాదవ్ వరుస బంతుల్లో కెప్టెన్ సోఫీతో పాటు లియా తహుహు (0)లను అవుట్ చేసింది. ప్రియా, సైమాలకు చెరో వికెట్ దక్కింది.

రాధ ఒంటరి పోరాటం

స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (0) వైఫల్యం కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో ఖాతానే తెరువలేదు. టాపార్డర్‌లో షఫాలీ వర్మ (11), యస్తిక భాటియా (12) విఫలమవడంతో 26 పరుగులకే భారత్ 3 వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్ కూడా బాధ్యత కనబరచలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (17), తేజల్ హసబ్నిస్ (15), దీప్తి శర్మ (15) చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. 108 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి భారీ పరాజయానికి సిద్ధమైంది. ఈ దశలో స్పిన్ బౌలింగ్‌తో 4 వికెట్లు పడగొట్టిన రాధా యాదవ్ బ్యాటింగ్‌లోనూ భారత్ పరువు నిలిపే పోరాటం చేసింది. తొమ్మిదో వరుసలో బ్యాటింగ్‌కు దిగిన రాధ, సైమా ఠాకూర్ (54 బంతుల్లో 29; 3 ఫోర్లు)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించింది. భారత ఇన్నింగ్స్‌లో ఇదే అత్యధిక పరుగుల భాగస్వామ్యం. సైమాను జెస్ కెర్ అవుట్ చేయగా, కాసేపటికే సోఫీ డివైన్... రాధను అవుట్ చేసి భారత్ ఇన్నింగ్స్‌కు తెరదించింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ మహిళల ఇన్నింగ్స్: సుజీ బేట్స్ (సి అండ్ బి) రాధ 58; జార్జియా (సి) రాధ (బి) దీప్తి 41; లౌరెన్ (రనౌట్) 3; సోఫీ డివైన్ (సి) జెమీమా (బి) రాధ 79; హాలిడే (సి) రాధ (బి) ప్రియా 8; మ్యాడీ గ్రీన్ (సి) అరుంధతి రెడ్డి (బి) రాధ 42; ఇసాబెల్లా (స్టంప్డ్) యస్తిక (బి) దీప్తి 11; జెస్ కెర్ (నాటౌట్) 12; తహుహు (సి) దీప్తి (బి) రాధ 0; కార్సన్ (బి) సైమా 1; ఫ్రాన్ జోనస్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు)** 259. **వికెట్ల పతనం:** 1-87, 2-98, 3-114, 4-139, 5-221, 6-239, 7-245, 8-245, 9-252. **బౌలింగ్:** సైమా ఠాకూర్ 10-0-58-1, అరుంధతి రెడ్డి 10-0-52-0, దీప్తి శర్మ 10-3-30-2, ప్రియా మిశ్రా 10-1-49-1, రాధా యాదవ్ 10-0-69-4.



రాధా యాదవ్

భారత మహిళల ఇన్నింగ్స్: షఫాలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) జెస్ కెర్ 11; స్మృతి (సి) జార్జియా (బి) తహుహు 0; యస్తిక (సి) ఇసాబెల్లా (బి) తహుహు 12; హర్మన్‌ప్రీత్ (సి) కార్సన్ (బి) సోఫీ 24; జెమీమా (సి) ఇసాబెల్లా (బి) సోఫీ 17; తేజల్ (బి) కార్సన్ 15; దీప్తి శర్మ (సి) ఇసాబెల్లా (బి) తహుహు 15; అరుంధతి (సి) ఇసాబెల్లా (బి) కార్సన్ 2; రాధా యాదవ్ (సి) లౌరెన్ (బి) సోఫీ 48; సైమా (బి) సుజీ బేట్స్ (బి) జెస్ కెర్ 29; ప్రియా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (47.1 ఓవర్లలో ఆలౌట్)** 183. **వికెట్ల పతనం:** 1-5, 2-19, 3-26, 4-64, 5-77, 6-100, 7-102, 8-108, 9-178, 10-183. **బౌలింగ్:** లియా తహుహు 10-1-42-3, జెస్ కెర్ 10-0-49-2, ఫ్రాన్ జోనస్ 10-2-33-0, సోఫీ డివైన్ 7.1-0-27-3, ఎడెన్ కార్సన్ 10-2-32-2.

అర్జున్‌ది అరుదైన ఘనత

ప్రధాని నరేంద్ర మోదీ కితాబు



ప్రధాని మోదీ, అర్జున్ గేమ్ ఆడుతున్న దృశ్యం (ఫైల్)

న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) లైవ్ ఎలో రేటింగ్స్‌లో తెలంగాణ స్టార్ చెస్ ప్లేయర్, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 2800 పాయింట్ల మైలురాయిని అందుకోవడం అరుదైన ఘనత అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. '2800 ఎలో రేటింగ్ మైలురాయిని చేరుకున్న అర్జున్‌కు అభినందనలు. ఇది అసాధారణ ఘనత. మొక్కవోని పట్టుదల, నిలకడైన ప్రదర్శనతోనే ఇది సాధ్యమవుతుంది. జాతి గర్వపడే క్షణాలివి. వ్యక్తిగతంగానూ గొప్ప స్థాయికి చేరావు. మరెంతో మంది యువత చెస్ ఆడేందుకు, ఈ క్రీడను ఎంచుకొని ప్రపంచ వేదికలపై రాణించేందుకు స్ఫూర్తిగా నిలిచావు. భవిష్యత్తులోనూ ఇదేరకంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా' అని మోదీ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. సెర్బియాలో జరిగిన యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీలో మూడు రోజుల క్రితం అర్జున్ 2800 ఎలో రేటింగ్స్‌ను అందుకున్నాడు. భారత్‌లో చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా, ఓవరాల్‌గా 16వ ప్లేయర్‌గా అర్జున్ గుర్తింపు పొందాడు. ఆదివారం యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీ ముగిశాక అర్జున్ లైవ్ రేటింగ్ 2800 లోనికి వచ్చింది. ప్రస్తుతం అతని లైవ్ రేటింగ్ 2798కు చేరింది. యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీలో అర్జున్ ప్రాతినిధ్యం వహించిన అల్కాలాయిడ్ క్లబ్ ఓపెన్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది.

పింక్ పాంథర్స్, తలైవాస్ మ్యాచ్ 'టై'



సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో రెండో 'టై' నమోదైంది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జైపూర్ పింక్ పాంథర్స్, తమిళ్ తలైవాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 30-30తో సమంగా ముగిసింది. తలైవాస్ తరఫున సచిన్ 11 పాయింట్లతో విజృంభించగా... జైపూర్ జట్టు తరఫున అర్జున్ దేశ్వాల్ (7 పాయింట్లు), వికాస్ ఖండోలా (6) రాణించారు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 35-29 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్ జట్టును ఓడించింది. యూపీ జట్టు తరఫున భరత్ 13 పాయింట్లతో సత్తా చాటగా... అతడికి భవాని రాజ్‌పుత్ (9 పాయింట్లు) చక్కటి సహకారం అందించాడు. గుజరాత్ జెయింట్స్ తరఫున హిమాన్షు (9 పాయింట్లు), రాకేశ్ (8 పాయింట్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకున్న యూపీ యోధాస్ పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. లీగ్‌లో భాగంగా నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 8 గంటల నుంచి)... పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.

భారత్‌కు చుక్కెదురు

కఠ్మాండు: దక్షిణాసియా సీనియర్ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఐదుసార్లు చాంపియన్ భారత జట్టు వరుసగా రెండోసారి సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. ఆతిథ్య నేపాల్ జట్టుతో ఆదివారం జరిగిన సెమీఫైనల్లో భారత జట్టు 'పెనాల్టీ షూటౌట్'లో 2-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. నిర్ణీత సమయంలో రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూనియన్ బ్యాంక్, ముంబైలో 1500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న యూబీఐ శాఖల్లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1500.
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-200, అస్సాం-50, గుజరాత్-200, కర్ణాటక-300, కేరళ-100, మహారాష్ట్ర-50, ఒడిశా-100, తమిళనాడు-200, తెలంగాణ-200, పశ్చిమ బెంగాల్-100.
» **వయసు:** 01.10.2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, అప్లికేషన్స్ స్క్రీనింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అమరావతి, అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపుకు చివరితేది:** 13.11.2024.
» **వెబ్‌సైట్:** www.unionbankofindia.co.in

యంత్ర ఇండియా లిమిటెడ్‌లో 3,883 అప్రెంటిస్‌లు

నాగ్‌పూర్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న యంత్ర ఇండియా లిమిటెడ్.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని ఆర్డ్‌నెన్స్, ఆర్డ్‌నెన్స్ ఎక్విప్‌మెంట్ ఫ్యాక్టరీల్లో 58వ బ్యాచ్ ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

» **ప్రాంతాల వారీగా ఫ్యాక్టరీలు:** ఆర్డ్‌నెన్స్ కేబుల్ ఫ్యాక్టరీ-చండీగఢ్, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-నలంద, గన్ క్యారేజ్ ఫ్యాక్టరీ-జబల్‌పూర్, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-ఇటార్సీ, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-ఖమారియా, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-కట్నీ, హై ఎక్స్‌ప్లోజివ్ ఫ్యాక్టరీ-కిర్కీ, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-అంబఝరి, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ ప్రాజెక్ట్-అంబర్‌నాథ్ తదితరాలు.
» **ట్రేడులు:** మెషినిస్ట్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, మేసన్, ఎలక్ట్రోప్లేటర్, మెకానిక్, ఫౌండ్రీ మ్యాన్, బాయిలర్ అటెండెంట్, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ తదితరాలు.
» **అర్హత:** ఐటీఐ కేటగిరికి సంబంధించి అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి లేదా తత్సమానం, నాన్-ఐటీఐ కేటగిరికి సంబంధించి అభ్యర్థులు 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు నాన్-ఐటీఐలకు రూ.6000, ఐటీఐలకు రూ.7000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** నాన్-ఐటీఐ కేటగిరికి పదో తరగతి, ఐటీఐ కేటగిరికి పదో తరగతి, ఐటీఐలో సాధించిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.11.2024
» **వెబ్‌సైట్:** www.recruitgov.com/Yantra2024

ఐఐటీ గోవాలో నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గోవాలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
» **పోస్టుల వివరాలు:** స్టూడెంట్ కౌన్సిలర్-01, మెడికల్ ఆఫీసర్-01, స్పోర్ట్స్ సూపరింటెండెంట్-01, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, టెక్నికల్ సూపరింటెండెంట్(ఎలక్ట్రికల్)-01, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.
» **వయసు:** అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్(గ్రూప్-సి) పోస్టులకు 27 ఏళ్లు, మెడికల్ ఆఫీసర్, స్టూడెంట్ కౌన్సిలర్(గ్రూప్-ఎ) పోస్టులకు 42 ఏళ్లు, మిగతా(గ్రూప్-బి) పోస్టులకు 34 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.11.2024
» **వెబ్‌సైట్:** https://iitgoa.ac.in

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొలువుల పిలుపు

» 200 ఏఓ పోస్టులకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ నోటిఫికేషన్
» బ్యాచిలర్, ప్రొఫెషనల్ డిగ్రీ, పీజీతో పోటీ పడే అవకాశం
» జనరలిస్ట్, స్పెషలిస్ట్ విభాగాల్లో ఉద్యోగాలు
» ఎంపికైతే నెలకు రూ.88 వేల వేతనం



ఇన్సూరెన్స్ రంగంలో.. కొలువుదీరాలనుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వ రంగ బీమా సంస్థ.. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. 200 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైతే నెలకు రూ.88 వేల వేతనం అందుకోవచ్చు!! ఈ నేపథ్యంలో.. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఏఓ ఉద్యోగాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం పోస్టులు 200

తాజా నోటిఫికేషన్ ద్వారా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. రెండు విభాగాల్లో 200 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. స్పెషలిస్ట్ కేడర్‌లో 100 పోస్టులు, జనరలిస్ట్ కేడర్‌లో మరో 100 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. స్పెషలిస్ట్ కేడర్‌లో 100 పోస్ట్‌ల్లో రిస్క్ మేనేజ్‌మెంట్-10 పోస్టులు, ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్-20 పోస్టులు, ఆటోమొబైల్ ఇంజనీర్స్-20 పోస్టులు, కెమికల్ ఇంజనీర్స్/మెకట్రానిక్స్ ఇంజనీర్స్-10 పోస్టులు, డేటా అనలిటిక్స్-20 పోస్టులు, లీగల్-20 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆయా విభాగాలను అనుసరించి సంబంధిత సబ్జెక్ట్‌లో బీటెక్/ఎంటెక్/బ్యాచిలర్/ పీజీ డిగ్రీ/సీఏ/ఐసీడబ్ల్యూఏ/రిస్క్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఉత్తీర్ణులవ్వాలి. • వయసు:2024 సెప్టెంబర్ 30 నాటికి 21-30 ఏళ్లు ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రాత పరీక్షల వివరాలు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను స్పెషలిస్ట్, జనరలిస్ట్ కేడర్‌లకు వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు.

250 మార్కులకు స్పెషలిస్ట్స్ రాత పరీక్ష

స్పెషలిస్ట్స్ రాత పరీక్షను ఆరు విభాగాల్లో 250 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ (25 ప్రశ్నలు-25మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(40 ప్రశ్నలు-40 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (20 ప్రశ్నలు-20 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్ (30 ప్రశ్నలు-20 మార్కులు), సంబంధిత సబ్జెక్ట్ నాలెడ్జ్ (60 ప్రశ్నలు-120 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన సమయం గంటన్నర.

జనరలిస్ట్ ఏఓ రాత పరీక్ష ఇలా

జనరలిస్ట్ ఏఓ పోస్టులకు అయిదు విభాగాల్లో 250 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ (50 ప్రశ్నలు-50 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (50 ప్రశ్నలు- 60 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (40 ప్రశ్నలు-50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు-50 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్ (20 ప్రశ్నలు-40 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. రెండు విభాగాలకు నిర్వహించే రాత పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

డిస్క్రిప్టివ్ టెస్ట్

ఆబ్జెక్టివ్ టెస్ట్‌తోపాటు అదనంగా 30 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్ కూడా నిర్వహిస్తారు. లెటర్ రైటింగ్(10 మార్కులు),ఎస్సే రైటింగ్ (20 మార్కులు) విభాగాల్లో ఈ వ్యాస రూప పరీక్ష ఉంటుంది.

మలి దశలో ఇంటర్వ్యూ

రాత పరీక్షలోని ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విభాగాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలి దశలో 100 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో ఇన్సూరెన్స్ రంగంపై ఉన్న పరిజ్ఞానం, ఆసక్తి, భవిష్యత్తు లక్ష్యాలు, ఆయా స్పెషలైజ్డ్ విభాగాల్లో ఉన్న పని అనుభవం, నైపుణ్యంపై ప్రశ్నలు అడుగుతారు.

తుది జాబితా

పర్సనల్ ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత తుది జాబితా రూపకల్పనలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో పొందిన మార్కులకు 75 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 25 శాతం వెయిటేజీ కల్పించి.. తుది జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ఏడాది ప్రొబేషన్

నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ఏడాదిపాటు ప్రొబేషనరీ పీరియడ్ నిబంధన ఉంది. ఈ సమయంలో అభ్యర్థులు ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా.. ప్రొబేషన్ పిరియడ్‌తో కలిపి అయిదేళ్లపాటు సంస్థలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ కూడా ఇవ్వాలి.

ఆకర్షణీయ వేతనం

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొలువులు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనం అందిస్తారు. నెలకు రూ.50,925-రూ.96,765 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది. దీనికి అదనంగా ఇతర భత్యాలు లభిస్తాయి. నికరంగా నెలకు రూ.88 వేల వేతనం చేతికందుతుంది.

జీఎం స్థాయికి చేరుకునే అవకాశం

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో ఆయా విభాగాల్లో ఉన్నత హోదాలకు చేరుకునే అవకాశం ఉంది. తొలుత అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాక.. పదోన్నతికి అర్హత లభిస్తుంది. అసిస్టెంట్ మేనేజర్/బ్రాంచ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్/డివిజనల్ మేనేజర్; సీనియర్ డివిజనల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, రీజనల్ మేనేజర్; డీజీఎం, జీఎం వంటి హోదాలకు చేరుకోవచ్చు. సీఏఐఐబీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిసేత వేగంగా పదోన్నతులు పొందే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:2024, నవంబర్5
- ఆన్‌లైన్ రాత పరీక్ష తేదీ: 2024, డిసెంబర్ 14
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.uiic.co.in, https://uiic.co.in/recruitment/details/16167

రాత పరీక్షలో రాణించేలా

రీజనింగ్

రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు మరింత ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలి. ఇన్సూరెన్స్, ఆర్థిక రంగంలో మార్పులు, ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

స్పెషలిస్ట్ స్ట్రీమ్

స్పెషలిస్ట్ స్ట్రీమ్ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు తమ సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌కు సంబంధించి.. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేస్తూ అడుగులు వేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	663	79,402
నిఫ్టీ ▽	219	24,181

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	18,519	△	103
డోజోన్స్	42,114	▽	260
ఎఫ్‌టీఎస్ఈ 100	8,248	▽	21
డాక్స్	19,464	△	21
హాంగ్‌సెంగ్	3,300	△	19
నికాయ్	37,914	▽	229

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.67	84.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	107.73	110.57
€	యూరో	ఒకటి	89.80	92.42
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.76	56.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.71	56.90
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.57	66.24
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.52	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.00	23.78
¥	చైనా యువాన్	ఒకటి	10.92	12.75

ఈక్విటీ రాబడులపై పన్ను సునామీ!



చట్టంలో పలు వెసులుబాట్లు

- వీటిని అనుసరిస్తే పన్ను భారం పడదు
- పన్ను తగ్గించుకునే మార్గాలూ ఉన్నాయ్
- తద్వారా దీర్ఘకాలంలో అదనపు రాబడి
- ఏడాదికి మించిన పెట్టుబడుల పైనే ప్రయోజనం

కొన్నేళ్ల క్రితం విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలు మొదలు పెడితే మన ఈక్విటీలు బేల చూపు చూసేవి. కానీ, నేడు ఆ పరిస్థితి లేదు. ఫారిన్ ఇన్వెస్టర్లు అమ్మిన మేర ఇని స్టిట్యూషన్స్, రిటైల్ ఇన్వెస్టర్లు కొనుగోలు చేస్తున్నారు. మన దేశ ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యం గతంతో పోల్చితే గణనీయంగా పెరిగిందని చెప్పడానికి ఈ ఒక్క నిదర్శనం చాలు. నేరుగా స్టాక్స్‌లో, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. కరోనా తర్వాతి నుంచి ఈక్విటీ మార్కెట్ మంచి బుల్ ర్యాలీ చేయడం.. ఎంతో మంది ఇన్వెస్టర్లు అటు వైపు అడుగులు **వేసేలా చేసింది. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమానుగత పెట్టుబడుల (సిప్) ప్రాధాన్యాన్ని ఇన్వెస్టర్లు అర్థం చేసుకుంటున్నారు. తమ భవిష్యత్ ఆర్థిక లక్ష్యాల్లో** ఈక్విటీలకు చోటు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఈక్విటీ రాబడులపై పన్ను బాధ్యతను ప్రతి ఇన్వెస్టర్ తప్పకుండా అర్థం చేసుకోవాలి. 2024-25 బడ్జెట్‌లో ఈక్విటీ లాభాలపై స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాల పన్నును కేంద్ర సర్కారు పెంచేసింది. ఈ భారం సాధ్యమైన మేర తగ్గించుకునేందుకు ఇన్వెస్టర్ల ముందు పలు మార్గాలున్నాయి. వాటి గురించి వివరించే కథనమే ఇది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఆదాయపన్ను చట్టంలో ఇటీవలి మార్పుల అనంతరం స్వల్పకాల లాభాలపై 20 శాతం, దీర్ఘ కాల లాభాలపై 12.5 శాతం చొప్పున పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడాది నిండకుండా విక్రయించిన స్టాక్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై వచ్చే లాభం స్వల్పకాల మూలధన లాభం (ఎస్‌టీసీజీ) అవుతుంది. దీనిపై 20 శాతం పన్ను చెల్లించాలి. ఏడాది పూర్తయిన అనంతరం విక్రయించినప్పుడు వచ్చిన లాభం దీర్ఘ కాల మూలధన లాభం (ఎల్‌టీసీజీ) కిందకు వస్తుంది. ఎల్‌టీసీజీ ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలకు మించకపోతే ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. రూ.1.25 లక్షలకు మించిన లాభంపై 12.5 శాతం ఎల్‌టీసీజీ చెల్లించాల్సి ఉంటుంది.



పన్ను తగ్గించుకునే మార్గాలు..

ఈక్విటీల్లో స్వల్పకాల మూలధన లాభాలపై (ఎస్‌టీసీజీ) 20 శాతం పన్ను చెల్లించాల్సిందే. పన్ను భారాన్ని తగ్గించుకునేందుకు ఎలాంటి వెసులుబాట్లు లేవు. ఏడాదికి మించి పెట్టుబడులు కొనసాగించడం ద్వారానే మూలధన లాభాలపై పన్ను భారం లేకుండా చూసుకునేందుకు లేదా తగ్గించుకునేందుకు మార్గాలున్నాయి. ముఖ్యంగా ఈక్విటీలు మూడేళ్లు అంతకుమించిన కాలానికే అనుకూలం. మూడేళ్లలోపు పెట్టుబడులకు ఈక్విటీలు సూచనీయం కాదు. ఎందుకంటే స్వల్పకాలంలో ఈక్విటీలు స్థూల ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విధాన నిర్ణయాలు తదితర ఎన్నో అంశాల ఆధారంగా అస్థిరతలకు లోనవుతూ ఉంటాయి. మూడు నుంచి ఐదేళ్ల అంతకు మించిన కాలంలో ఈ అస్థిరతలను అధిగమించి స్టాక్స్ ర్యాలీ చేస్తుంటాయి. కనుక స్వల్పకాలంలో ఆటుపోట్లు ఉన్నప్పటికీ.. దీర్ఘకాలంలో మెరుగైన రాబడులకు భరోసా ఉంటుంది. కనుక రిటైల్ ఇన్వెస్టర్లు తమ మధ్య, దీర్ఘకాల లక్ష్యాల కోసమే ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. తద్వారా అధిక రాబడులకు తోడు, ఆ మొత్తంపై పన్ను భారాన్ని తగ్గించుకోవడానికి అవకాశాలుంటాయి.



ట్యాక్స్ హార్వెస్టింగ్



ఒక ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన లాభం రూ.1.25 లక్షల వరకు పన్ను లేదు కనుక, ఏటా తమ పెట్టుబడులపై ఈ మేరకు లాభాలను స్వీకరించడం ట్యాక్స్ హార్వెస్టింగ్ అవుతుంది. తిరిగి అంతే మొత్తాన్ని మళ్లీ ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఒక ఉదాహరణ చూద్దాం. ఉదాహరణకు 2023 సెప్టెంబర్ 1న స్టాక్స్ లేదా ఈక్విటీ ఫండ్స్‌లో రూ.6 లక్షలు ఇన్వెస్ట్ చేశారు. 2024 సెప్టెంబర్ 1 నాటికి ఈ విలువ 12 శాతం రాబడి అంచనా ప్రకారం రూ.6,75,305 అవుతుంది. ఇందులో లాభం రూ.75,305. రూ.1.25లక్షల వరకు లాభం ఉన్నా పన్ను లేదు కనుక, ఈ మొత్తాన్ని విక్రయించి తిరిగి ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల ఎలాంటి పన్ను భారం పడదు. ఇలా ఏటా రూ.1.25లక్షల మేరకు దీర్ఘకాలిక మూలధన లాభాన్ని స్వీకరిస్తూ.. తిరిగి ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లడం ఒక మార్గం.

ఇల్లు కొనడం..

ఈక్విటీ దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను లేకుండా ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54ఎఫ్ మార్గం చూపిస్తోంది. ఈ సెక్షన్ కింద గరిష్ట ప్రయోజనం రూ.10 కోట్లు. దీర్ఘకాల ఈక్విటీ పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన మొత్తం రూ.10 కోట్ల వరకు ఉంటే, దీనిపై భారీగా పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీనికి బదులు ఆ మొత్తంతో ఒక నివాస గృహం కొనుగోలు చేస్తే సరి. ఇలా చేయడం వల్ల ఎలాంటి పన్ను లేకుండా సెక్షన్ 54ఎఫ్ కింద పూర్తి ప్రయోజనం పొందొచ్చు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలే (హెచ్‌యూఎఫ్) ఈ ప్రయోజనానికి అర్హులు. దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులే అని కాదు, ప్లాట్, వాణిజ్య భవనం, బంగారం, ట్రేడ్ మార్క్‌లు, పేటెంట్లు, మెషినరీ సైతం లాంగ్ టర్మ్ క్యాపిటల్ అస్సెట్ కిందకు వస్తాయి. వీటిపైనా ఇదే ప్రయోజనం పొందొచ్చు.

షరతులు ఉన్నాయ్...

దీర్ఘకాల ఈక్విటీ మూలధన లాభాలపై సెక్షన్ 54ఎఫ్ కింద పన్ను మినహాయింపు పొందాలంటే కొన్ని షరతులు పాటించాల్సి ఉంటుంది. దీర్ఘకాల ఈక్విటీ పెట్టుబడులు విక్రయించే తేదీకి ఏడాది ముందు కాలంలో లేదా విక్రయించిన తేదీ నుంచి తర్వాతి రెండేళ్లలోపు నివాస అవసరాలకు వినియోగించే ఇల్లు (పాతది లేదా కొత్తది) కొనుగోలు చేయాలి. ఇల్లు నిర్మించుకునేట్టు అయితే దీర్ఘకాల క్యాపిటల్ అసెట్స్ విక్రయించిన నాటి నుంచి మూడేళ్ల వరకు వ్యవధి ఉంటుంది. మూలధన లాభాలే కాకుండా, విక్రయించినప్పుడు వచ్చిన మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా కొంత మొత్తంతోనే ఇల్లు కొనుగోలు లేదా ఇంటి నిర్మాణంపై వెచ్చిస్తే, అప్పుడు మిగిలిన మూలధన లాభాలపై నిబంధనల మేరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఇంటి కొనుగోలుకే ఈ ప్రయోజనం పరిమితం. ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులు విక్రయించగా వచ్చిన మొత్తం రెండిళ్ల కొనుగోలుపై వెచ్చిస్తే.. ఒక ఇంటిపై చేసిన వ్యయాన్నే సెక్షన్54ఎఫ్ కింద పరిగణనలోకి తీసుకుంటారు.

సెక్షన్ 54ఎఫ్ కింద పన్ను మినహాయింపు పొందాలంటే, ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులు విక్రయించే నాటికి ఒక ఇంటిని మించి కలిగి ఉండకూడదు. రెండో ఇంటిని జాయింట్‌లో కలిగి ఉన్నా అర్హత కోల్పోయినట్టే. ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులను విక్రయించినప్పుడు పన్ను మినహాయింపు కోసం ఇంటిపై వెచ్చించాలని చెప్పుకున్నాం. అయితే, విక్రయించిన ఆర్థిక సంవత్సరం రిటర్నులు దాఖలు చేసే నాటికి ఇల్లు కొనుగోలు లేదా నిర్మాణంపై వెచ్చించడం సాధ్యపడలేదు అనుకుందాం. అలాంటప్పుడు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్ కింద ఆ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాలి. ఆ తర్వాత దీని నుంచి ఉపసంహరించుకుని నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత కాలం లోపు ఇంటి కోసం వెచ్చించి, పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ నిర్ణీత కాలంలోపు ఇంటి కొనుగోలు లేదా నిర్మాణంపై వెచ్చించలేకపోయారని అనుకుందాం. అటువంటప్పుడు ఆ మొత్తాన్ని క్రితం ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎల్‌టీసీజీగా చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

బాండ్లు



సెక్షన్ 80ఈసీ కింద ఈక్విటీ దీర్ఘకాల మూలధన లాభాలను క్యాపిటల్ గెయిన్స్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసినా పన్ను భారం నుంచి తప్పించుకోవచ్చు. ఆర్ఈసీ, ఎన్‌హెచ్ఏఐ తదితర ప్రభుత్వరంగ సంస్థలు జారీ చేసే బాండ్లలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. వీటిలో పెట్టుబడులపై రాబడి 6 శాతం వరకు ఉంటుంది. దీర్ఘకాల ఈక్విటీ పెట్టుబడులు విక్రయించిన తేదీ నుంచి ఆరు నెలలు దాటకుండా ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తేనే ప్రయోజనం లభిస్తుంది. గరిష్టంగా రూ.50 లక్షల పెట్టుబడులకే ఈ ప్రయోజనం పరిమితం. ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన మొత్తం రూ.50 లక్షలకు మించి ఉంటే, అదనపు మొత్తంపై నిబంధనల మేరకు పన్ను చెల్లిస్తే సరిపోతుంది. బాండ్లలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత ఐదేళ్లలోపు వాటిని విక్రయిస్తే.. గతంలో పొందిన పన్ను ప్రయోజనం కోల్పోతారు. అంటే ఆ మొత్తంపై పన్ను చెల్లించాల్సి వస్తుంది. అంతేకాదు ఈ బాండ్లపై ఐదేళ్లలోపు రుణం పొందినా ఈ ప్రయోజనం కోల్పోతారు.

సరైన నిర్ణయమేనా?



మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్ లాభాలపై పన్ను తప్పించుకునేందుకు సెక్షన్ 54ఎఫ్‌ను వినియోగించుకుని ఇంటిపై ఇన్వెస్ట్ చేయడం సరైన నిర్ణయమేనా..? అంటే, అందరికీ కాకపోవచ్చన్నదే సమాధానం. పిల్లల ఉన్నత విద్య, వారి వివాహం, రిటైర్మెంట్ తదితర లక్ష్యాల కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన వారు, పన్ను మినహాయింపు కోసం తీసుకెళ్లి ఇంటిపై వెచ్చించడం సరైనది అనిపించుకోదు. కనుక ఈ విషయంలో ఇన్వెస్టర్లు అందరికీ ఒక్కటే సలహా నప్పదు. సొంతిల్లు సమకూర్చుకోవాలని కోరుకునే వారికి సెక్షన్ 54ఎఫ్ మంచి ఆప్షన్ అవుతుంది. అలాగే, పన్ను మినహాయింపు కోసం ఇంటిపై ఇన్వెస్ట్ చేసి వృద్ధాప్యంలో ఆ ఇంటిని రివర్స్ మార్ట్‌గేజ్ కోసం వినియోగించుకునే ఆలోచన ఉన్న వారికి కూడా 54ఎఫ్ ప్రయోజనం అనుకూలమే.

నష్టాలతో భర్తీ..



ఈక్విటీల్లో మూలధన లాభాలపై పన్ను తగ్గించుకునేందుకు.. మూలధన నష్టాలతో భర్తీ చేసుకోవడం మరో ఆప్షన్. ఏడాదికి మించని ఈక్విటీ పెట్టుబడులు విక్రయించగా వచ్చిన స్వల్పకాల మూలధన నష్టాన్ని.. తిరిగి స్వల్పకాల మూలధన లాభం లేదా దీర్ఘకాల మూలధన లాభంలో సర్దుబాటు చేసుకోవచ్చు. ఇలా సర్దుబాటు చేయగా మిగిలిన మొత్తంపై పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఇలా సర్దుబాటు చేసుకున్న తర్వాత కూడా నష్టం మిగిలి ఉంటే దాన్ని అప్పటి నుంచి తదుపరి ఎనిమిదేళ్లపాటు లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చు. పన్ను రిటర్నులు దాఖలు చేయడం ద్వారానే ఇందుకు అవకాశం ఉంటుంది. కానీ, దీర్ఘకాల మూలధన నష్టాన్ని.. కేవలం దీర్ఘకాల మూలధన లాభంతోనే సర్దుబాటు చేసుకోగలరు.

ఎస్‌బీఐకి బెస్ట్ బ్యాంక్ అవార్డు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కి భారత్‌లోనే అత్యుత్తమ బ్యాంక్‌గా పురస్కారం దక్కింది. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఈ అవార్డును ప్రకటించింది. వాషింగ్టన్‌లో అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు సమావేశాల సందర్భంగా నిర్వహించిన 31వ వార్షిక బెస్ట్ బ్యాంక్ అవార్డుల కార్యక్రమంలో ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి దీన్ని అందుకున్నారు. అత్యుత్తమ సేవలు అందిస్తూ, అందరికీ బ్యాంకింగ్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నందుకు గాను 'బెస్ట్ బ్యాంక్ ఇన్ ఇండియా' పురస్కారం లభించిందని ఎస్‌బీఐ వివరించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్‌లో మతాబులు వెలిగేనా? నిపుణుల విశ్లేషణ	కోల్ ఇండియా క్యూ2 లాభం 22 శాతం డౌన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-10-2024	
విశాఖ	545-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

బిజినెస్ సైకిల్ ఫండ్స్ భేష్..

- ఏడాది వ్యవధిలో 56 శాతం వరకు రాబడులు
- పరిశ్రమ గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: పెట్టుబడుల ప్రపంచంలో బిజినెస్ సైకిల్ మ్యూచువల్ ఫండ్స్‌కి క్రమంగా ఆదరణ పెరుగుతోంది. విస్తృత మార్కెట్‌తో పోలిస్తే ఇవి మెరుగ్గా రాబడులు అందిస్తుండటం ఇందుకు కారణం. గత ఏడాది వ్యవధిలో ఈ ఫండ్స్ 56 శాతం వరకు రాబడులు ఇచ్చినట్లు పరిశ్రమ గణాంకాల్లో వెల్లడైంది. వీటి ప్రకారం హెచ్‌ఎస్‌బీసీ, మహీంద్రా మాన్యులైఫ్, క్వాంట్ మొదలైన ఫండ్ హౌస్‌ల స్కీములు 50 శాతం పైగా రాబడులు అందించాయి. ఇదే వ్యవధిలో నిఫ్టీ 500 టీఆర్ఐ సూచీ 35.11 శాతం రాబడులు అందించింది. ఈ నేపథ్యంలో బిజినెస్ సైకిల్ ఫండ్స్‌పై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోందని ఆనంద్ రాఠీ వెల్త్ డిప్యూటీ సీఈవో ఫిరోజ్ అజీజ్ తెలిపారు. నిర్దిష్ట ఆర్థిక, మార్కెట్ పరిస్థితుల్లో రాణించే రంగాలకు చెందిన స్టాక్స్‌ని గుర్తించి, ఇన్వెస్ట్ చేసేందుకు బిజినెస్ సైకిల్ ఫండ్స్ ప్రయత్నిస్తాయి. ఆర్థిక వ్యవస్థలో మాంద్యం, రికవరీ తొలి నాళ్లు, వృద్ధి మధ్య దశ, చివరి దశ వంటి పరిస్థితులను బట్టి వివిధ రంగాల్లో పెట్టుబడులను మారుస్తుంటాయి. ఉదాహరణకు మాంద్యం దశలో యుటిలిటీస్, ఫార్మా వంటి డిఫెన్సివ్ రంగాలు మెరుగ్గా రాణించగలవు. అతే వృద్ధి ప్రారంభ మయ్యే తొలినాళ్లలో ఆటోమొబైల్స్, ఫైనాన్షియల్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలకు చెందిన స్టాక్స్ లాభపడే అవకాశాలు ఉంటాయి. ఇలా వ్యూహాత్మకంగా వివిధ రంగాల్లో పెట్టుబడులను అటూ-ఇటూ మారుస్తుండటమనేది ఇన్వెస్టర్లకు లాభాలను పంచుతోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

స్వల్ప సమయంలో అధిక రాబడులు అందిస్తుండటంతో బిజినెస్ సైకిల్ ఫండ్స్‌పై ఆసక్తి పెరుగుతోందని ఎప్సిలాన్ గ్రూప్‌లో భాగమైన మల్టీ ఆర్క్ వెల్త్ ఏవీపీ సిద్ధార్థ్ ఆలోక్ తెలిపారు. పరిస్థితులను బట్టి వివిధ సెక్టోరల్ ఫండ్స్‌కి మారేందుకు, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లను పట్టుకునేందుకు వ్యక్తిగతంగా పరిశోధిస్తూ, అవకాశాల కోసం ఎదురుచూస్తూ కూర్చునే భారాన్ని ఈ ఫండ్స్ తగ్గిస్తాయని విస్డమ్ ఎడ్జ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వ్యవస్థాపకుడు భావేష్ దమానియా తెలిపారు. అయితే, సాధారణంగా థీమ్యాటిక్ ఫండ్స్ పనితీరును లెక్కగట్టేందుకు కనీసం అయిదేళ్ల పాటైనా కార్యకలాపాలు ఉండాలని, ఇవన్నీ ఈ మధ్యే వచ్చాయి కాబట్టి ఇటీవలి కాలంలో పనితీరుపైనే ఆధారపడటం సరికాకపోవచ్చని ఆయన పేర్కొన్నారు.

16 ఫండ్స్..

ప్రస్తుతం దేశీయంగా 16 బిజినెస్ సైకిల్ ఫండ్స్ ఉండగా, 10 ఫండ్స్‌కి ఏడాది పైగా ట్రాక్ రికార్డు ఉంది. వీటిలో ఒక్కటి మినహా మిగతా అన్నీ కూడా గత 12 నెలల్లో నిఫ్టీ 500 టీఆర్ఐకి మించిన రాబడులు అందించాయి. పరిశ్రమ డేటా ప్రకారం 10 ఫండ్స్ సగటున 42 శాతం రాబడి అందించాయి. గత ఏడాది వ్యవధిలో అక్టోబర్ 17 వరకు.. హెచ్‌ఎస్‌బీసీ బిజినెస్ సైకిల్స్ ఫండ్ 56.3 శాతం, మహీంద్రా మాన్యులైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్ 56.17 శాతం, క్వాంట్ బిజినెస్ సైకిల్ ఫండ్ 50.8 శాతం రాబడులు అందించాయి.



మరిన్ని విశేషాలు..

- అధిక రాబడులు అందించిన వాటిలో బరోడా బీఎన్‌పీ పారిబా బిజినెస్ సైకిల్ ఫండ్ (44.58 శాతం రాబడి), ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ (42.27 శాతం), టాటా బిజినెస్ సైకిల్ ఫండ్ (41.26 శాతం), కోటక్ బిజినెస్ సైకిల్ ఫండ్ (40.03 శాతం), యాక్సిస్ బిజినెస్ సైకిల్ ఫండ్ (39.02 శాతం), ఆదిత్య బిర్లా సన్ లైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్ (36.33 శాతం), హెచ్‌డీఎఫ్‌సీ బిజినెస్ సైకిల్ ఫండ్ (31.97 శాతం) ఉన్నాయి.
- గత ఆరు నెలల వ్యవధిలో హెచ్‌ఎస్‌బీసీ బిజినెస్ సైకిల్స్ ఫండ్ 26.72 శాతం, మహీంద్రా మాన్యులైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్ 20.88 శాతం, క్వాంట్ బిజినెస్ సైకిల్ ఫండ్ 17.7 శాతం రిటర్న్‌లు ఇచ్చాయి. ఇదే వ్యవధిలో నిఫ్టీ 500 టీఆర్ఐ ఇండెక్స్ 15.2 శాతమే రాబడినిచ్చింది. మిగతా ఏడు ఫండ్స్ 13 శాతం నుంచి 23 శాతం వరకు రిటర్నులు ఇచ్చాయి.

స్టాక్ స్కోప్


బజాజ్ ఫైనాన్స్	యాక్సిస్ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 6,905
టార్గెట్: రూ. 8,030

ఎందుకంటే: ఆర్థిక సేవల రంగ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ పట్టణాలలో 1,500కుపైగా, గ్రామీణ ప్రాంతాలలో 2,600 బ్రాంచీలను నిర్వహిస్తుండటం ద్వారా కార్యకలాపాలను భారీగా విస్తరించింది. రెండు లక్షలకుపైగా రుణ పంపిణీ పాయింట్లతో సేవలందిస్తోంది. తద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం(క్యూ1) చివరికల్లా 8.81 కోట్ల కస్టమర్ల బేస్‌ను ఏర్పాటు చేసుకుంది. క్యూ1(ఏప్రిల్-జూన్)లో నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) వార్షికంగా 31 శాతం, త్రైమాసికం వారీగా(2023-24 క్యూ4తో పోలిస్తే) 7 శాతం చొప్పున ఎగశాయి. వివిధ విభాగాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. డిజిటల్ లెండింగ్ ప్రొడక్టులు.. ఈకామ్, ఇన్‌స్టాఈఎంఐలపై ఆర్‌బీఐ ఆంక్షలను ఎత్తివేయడంతో జూన్ మధ్య నుంచి అన్ని ప్లాట్‌ఫామ్‌లపైనా లైవ్ ఆఫరింగ్‌ను ప్రారంభించింది. వెరసి రానున్న మూడు త్రైమాసికాలలో ఈ ప్రభావం ప్రతిఫలించనుంది. అయితే క్యూ1లో సీవోఎఫ్ పెరుగుదల, పోర్ట్‌ఫోలియో మిక్స్‌లో మార్పుల కారణంగా నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) నీరసించాయి. మూడేళ్ల కాలం(2025-27)లో ఎన్ఐఎం 9.5-9.6 శాతంలో స్థిరపడవచ్చు. ప్రస్తుతం 9.8 శాతంగా నమోదయ్యాయి. క్యూ1లో స్థూల(0.86 శాతం), నికర(0.38 శాతం) మొండిబకాయిలు త్రైమాసికవారీగా నిలకడను చూపడం ద్వారా ఆస్తుల(రుణాలు) నాణ్యతలోనూ స్థిరత్వం కనిపించింది. ప్రస్తుతం రుణ నాణ్యతలో కనిపిస్తున్న సమస్యలు తాత్కాలికమే. రానున్న రెండు త్రైమాసికాలలో తిరిగి స్థిరత్వం సంతరించుకోనున్నట్లు కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. 2025-27 కాలంలో ఏయూఎం 26 శాతం, నికర వడ్డీ ఆదాయం 25 శాతం, నికర లాభం 23 శాతం చొప్పున వృద్ధి చూపగలవని అంచనా.

బంధన్ బ్యాంక్	జేఎం ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 169
టార్గెట్: రూ. 260



ఎందుకంటే: బ్యాంక్ సీఈవో, ఎండీగా పార్థ ప్రతిమ్ సేన్‌గుప్తా ఎంపికకు రిజర్వ్ బ్యాంక్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రయివేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ వెల్లడించింది. నవంబర్ 10లోగా పదవిని స్వీకరించే అవకాశముంది. మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించేందుకు ఆర్‌బీఐ అంగీకరించినట్లు బ్యాంక్ తెలియజేసింది. దీంతో ఇటీవలి కాలంలో బ్యాంక్ యాజమాన్య నిర్వహణ, కార్యకలాపాలలో ఏర్పడిన సందిగ్ధతకు తెరపడనుంది. కార్పొరేట్ బ్యాంకింగ్, రిటైల్ క్రెడిట్(రుణ) విభాగాలలో సేన్‌గుప్తాకున్న అనుభవం బ్యాంక్‌కు తోడ్పాటునివ్వనుంది. దీంతో గత కొన్నేళ్లుగా క్రెడిట్ బిజినెస్‌లో బంధన్ బ్యాంక్ ఎదుర్కొంటున్న సవాళ్లకు చెక్ పడే అవకాశముంది. మరోవైపు బ్యాంక్ కోవిడ్-19 కాలంలో సీజీఎఫ్ఎంయూ, ఈసీఎల్‌జీఎస్ పథకాల పేరుతో చేసిన క్లెయిములపై నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌ను విడుదల చేసింది. బ్యాలన్స్‌షీట్‌లో నిర్వహిస్తున్న వీటి పోర్ట్‌ఫోలియోపై బ్యాంక్ రూ. 228 కోట్లమేర రికవరీలను సాధించింది. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో వీటి ద్వారా రూ. 543 కోట్లమేర ఇతర ఆదాయంగా నమోదు చేసేందుకు వీలుంది. ఇది బ్యాంక్ క్యూ2 పన్నుకుముందు లాభం(పీబీటీ)లో 38 శాతంగా అంచనా. ఈసీఎల్‌జీఎస్ పథకంలో భాగంగా రూ. 347 కోట్ల తాజా క్లెయిములను నమోదు చేసేందుకు ఎన్‌సీజీటీసీ అనుమతించింది. మైక్రోఫైనాన్స్ విభాగం ఆస్తుల నాణ్యత విషయంలో సవాళ్లు కొనసాగుతున్న కారణంగా ఈ విభాగంలో బంధన్ తక్కువ వృద్ధిని సాధించే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

డాక్టర్ చదువుకు డబ్బుల్లేక..
కూలి పనులకు..

మెడిసిన్ సీటొచ్చినా.. ఫీజు కట్టలేని అడవి బిడ్డ

తల్లిదండ్రులతో కలసి కూలి పనులకు..

దాతల సాయం కోసం వినతి


చేనులో పత్తి ఏరుతున్న దేవి

హుస్నాబాద్ రూరల్: వైద్యురాలు కావాలన్నది ఆ అడవి బిడ్డ తపన.. అందుకోసం కూలి పనులు చేస్తూనే కష్టపడి చదివింది. నీట్‌లో 447 మార్కులు సాధించింది. ప్రైవేటు కాలేజీలో సీటు రావడంతో ఫీజులకు డబ్బుల్లేక.. ఎప్పట్లాగే తల్లిదండ్రులతో పాటు కూలి పనులకు వెళ్తోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం భల్లునాయక్ తండాకు చెందిన లావుడ్య లక్ష్మి, రమేశ్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. దంపతులు కూలిపని చేస్తూ కూతుళ్లను చదివిస్తున్నారు. పెద్ద కూతురు బీ–ఫార్మసీ చేస్తోంది. చిన్న కూతురు దేవిని కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డి గురుకులంలో చేర్పించి చదివించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు సాధించిన దేవి.. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో ఏడాదిగా తల్లిదండ్రులతో పాటు కూలి పనులకు వెళ్తూనే నీట్‌కు సిద్ధమైంది. నీట్‌లో 447 (2లక్షల 80 వేల ర్యాంకు) మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వస్తుందని ఆశించిన లావుడ్య దేవికి.. సిద్దిపేట సురభి మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదువుకు ఏటా రూ.3.5 లక్షల వరకు ఖర్చవుతుంది. అంత స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో.. చేసేదిలేక దేవి కూలి పనులకు వెళ్తోంది. ఆస్తులు అమ్మి ఫీజు కడదామంటే అడవిలో పెంకుటిల్లు ఒకటే దిక్కు. దానిని కొనేవారు కూడా ఎవరూ లేరు. దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేస్తే తమ బిడ్డ ఆశయం నెరవేరుతుందని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఈ-చలాన్ పేరిట సైబర్ మోసాలు

అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: వాహనదారులను బురిడీ కొట్టించేందుకు సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్ లింక్‌లు పంపుతున్నారు. అందులో.. మీ వాహనాలపై ఉన్న ఈ–చలాన్‌లు చెల్లించండని.. పేర్కొంటున్నారు. ట్రాఫిక్ చలాన్లు చెల్లించాలని వచ్చే ఎస్‌ఎంఎస్‌లో నకిలీ వెబ్‌సైట్ లింక్ ఉంటుందని, వాహనదారులు దీన్ని క్షుణ్ణంగా గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు. వాస్తవానికి ఈ–చలాన్‌కు సంబంధించిన నిజమైన వెబ్‌లింక్ https: // echallan. parivahan.gov.in/ కాగా. దీన్ని కొద్దిగా మార్పు చేసి సైబర్ నేరగాళ్లు https:// echallaanparivahan. in/ ను పంపుతున్నట్టు వారు తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేసిన వెంటనే.. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను హ్యాక్ చేసి డబ్బులు కొల్లగొట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

నవంబర్‌లో తిరుమలలో విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమలలో నవంబర్ నెలలో జరగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. నవంబర్ 1న కేదారగౌరీ వ్రతం, 3న భగినీహస్త భోజనం, శ్రీ తిరుమలనంబి శాత్తుమొర, 5న నాగుల చవితి, పెద్ద శేష వాహనం, 6న శ్రీ మనవాళ మహామునుల శాత్తుమొర, 8న వార్షిక పుష్పయాగానికి అంకురార్పణ, 9న శ్రీవారి పుష్పయాగం, అత్రి మహర్షి వర్ష తిరునక్షత్రం, పిళ్లైలోకాచార్య వర్ష తిరునక్షత్రం, పోయిగైయాళ్వార్ వర్ష తిరునక్షత్రం, పూదత్తాళ్వార్ వర్ష తిరునక్షత్రం, వేదాంత దేశికుల శా త్తుమొర, 10న పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 11న శ్రీ యాజ్ఞవల్క్య జయంతి, 12న ప్రబోధన ఏకాదశి, 13న కైశిక ద్వాదశి ఆస్థానం, చాతుర్మాస్య వ్రత సమాప్తి, 15న కార్తీక పౌర్ణమి, 28న ధన్వంతరి జయంతి, 29న మాస శివరాత్రి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

బ్రేక్ దర్శనాలు రద్దు: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 31న దీపావళి ఆస్థానం సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దుచేసింది.

పొగబండ్లు ఇక మాయం

డీజిల్ ఇంజన్ల స్థానంలో ఎలక్ట్రిక్ ఇంజన్లు

తెలంగాణలో 100 శాతం రైల్వే మార్గాల విద్యుదీకరణకు ఏర్పాట్లు

ఇకనుంచి లైన్ నిర్మాణంతోపాటే విద్యుదీకరణ పనులు.. మనోహరాబాద్–కొత్తపల్లి గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుతో శ్రీకారం

టెండర్ల ప్రక్రియ పూర్తి.. 2,3 నెలల్లో పనులు



సాక్షి, హైదరాబాద్: రైలుకు పర్యాయపదంగా వాడే పొగబండి ఇక మాయం కానుంది. డీజిల్ ఇంజన్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపేసే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రైల్వేను పూర్తిస్థాయిలో విద్యుదీకరించి.. ఇక ఎలక్ట్రిక్ ఇంజన్లనే వాడాలన్న రైల్వే శాఖ నిర్ణయానికి తగ్గట్టుగా ఏర్పాట్లు వేగిరమయ్యాయి. ఇంతకాలం కొత్త లైన్ల నిర్మాణాన్ని ముందు చేపట్టి, భవిష్యత్తులో కుదిరినప్పుడు ఆ మార్గాన్ని విద్యుదీకరించేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి చెప్పి, కొత్త లైన్ల పనులు జరుగుతున్న సమయంలోనే సమాంతరంగా ఎలక్ట్రిఫికేషన్ పనులను కూడా నిర్వహించాలని ఇటీవల రైల్వే శాఖ నిర్ణయించింది. ఆ నిర్ణయాన్నే ఇప్పుడు అమలులోకి తెస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ (పూర్తి కొత్త) లైన్ పనుల్లో దీనిని అమలు చేయనున్నారు. దీనిలో భాగమైన మనోహరాబాద్ (మేడ్చల్ సమీపం), కొత్తపల్లి (కరీంనగర్ శివారు) ప్రాజెక్టు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. అటు ట్రాక్ పనులు నిర్వహిస్తూనే సమాంతరంగా విద్యుత్తు లైన్ కూడా ఏర్పాటు చేసే పని ప్రారంభించబోతున్నారు. మామూలుగా అయితే కనీసం ఓ దశాబ్దం తర్వాత జరగాల్సిన పనులు తాజా నిర్ణయం ప్రకారం ఇప్పుడే జరగనున్నాయి. ఈ మార్గంలో సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వరకు ప్రస్తుతం రైళ్లు నడుస్తున్నాయి. 76.65 కి.మీ. ఉన్న ఈ మార్గాన్ని ముందు విద్యుదీకరించాలని నిర్ణయించారు. ఇటీవలే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు మరో రెండుమూడు నెలల్లో పనులు చేపట్టాలని తాజాగా నిర్ణయించారు.

తెలంగాణలో జరగాల్సింది 94 కి.మీ. మాత్రమే..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 6,609 కి.మీ. మేర రైలు మార్గాలున్నాయి. వీటిల్లో 6,150 కి.మీ. మేర విద్యుదీకరణ పూర్తయింది. ఇందులో తెలంగాణ పరిధిలోని 2,015 రూట్ కి.మీ.లలో ట్రాక్ ఉండగా ఇప్పటికే 1,921 రూట్ కి.మీ. మేర విద్యుదీకరణ పూర్తయింది. ఇంకా కేవలం 94 కి.మీ.మేర మాత్రమే విద్యుదీకరణ పనులు జరగాల్సి ఉంది. ఏడాదిలో ఆ పనులు కూడా పూర్తి కానున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో అందుబాటులో ఉన్న రైలు మార్గాల జాబితాలో మనోహరాబాద్–కొత్తపల్లి రూట్‌ను చేర్చలేదు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు పూర్తి కాకుండానే, విద్యుదీకరించనున్నందున దీనినీ ఎలక్ట్రిఫికేషన్ జాబితాలో చేరుస్తున్నారు. అకోలా మార్గంలో ఖానాపూర్–కమలాపూర్–నందగావ్ మధ్య పనులు జరగాల్సి ఉంది. అక్కన్నపేట–మెదక్ మధ్య పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇవి పూర్తయితే తెలంగాణలో 100% విద్యుదీకరణ జరిగినట్టవుతుంది.

రూ.105 కోట్లతో పనులు..

మేడ్చల్ సమీపంలోని మనోహరాబాద్ స్టేషన్ దాటాక ఈ కొత్త మార్గం మొదలవుతుంది. అక్కడి నుంచి 76.65 కి.మీ. దూరంలో ఉన్న సిద్దిపేట వరకు పనులు పూర్తి కావటంతో రైలు సర్వీసులు ప్రారంభించారు. ప్రస్తుతం డీజిల్ లోకోతో కూడిన డెమూ రైళ్లు నడుస్తున్నాయి. సిద్దిపేట–సిరిసిల్ల మధ్య ట్రాక్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. సిరిసిల్ల సమీపంలోని మానేరు మీద వంతెన నిర్మించి నది దాటాక కొత్తపల్లి వరకు ట్రాక్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 2027 నాటికి ఆ పనులు పూర్తవుతాయి. ఈలోపు సిద్దిపేట వరకు విద్యుదీకరించాలని నిర్ణయించి, అక్కడి వరకు రూ.105.05 కోట్లతో నిర్వహించే పనికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో నిర్మాణ సంస్థకు అవార్డు అందచేయటంతో పనులు మొదలుకానున్నాయి.

గజ్వేల్ సమీపంలో 25 కేవీ సబ్‌స్టేషన్..

విద్యుత్ సరఫరా కోసం గజ్వేల్ సమీపంలో 25 కేవీ సామర్థ్యంతో ప్రత్యేక సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. త్వరలో ఈ పనులు మొదలు కానున్నాయి. స్థానికంగా ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌తో దీనిని అనుసంధానిస్తారు.



ఇది డైమండ్ బీచ్!


➤ అదో చిత్రమైన బీచ్.. అంతటా నల్లటి ఇసుక.. దానిపై ఎక్కడ చూసినా ప్రకాశవంతమైన వజ్రాలు.. వజ్రాలంటే నిజంగా వజ్రాలేమీ కావు. అంత స్వచ్ఛంగా, స్పష్టంగా ఉండి మెరిసిపోయే ఐస్ ముక్కలు. ఐస్‌ల్యాండ్ దక్షిణ తీరంలోని 'డైమండ్ బీచ్' ప్రత్యేకత ఇది. ఈ ప్రాంతంలో సముద్రానికి ఆనుకుని భారీ హిమానీనదాలు (గ్లేసియర్లు) ఉన్నాయి. తరచూ వాటి నుంచి భారీ మంచు ఫలకాలు (ఐస్‌బర్గ్స్) సముద్రంలోకి జారిపోతుంటాయి. ఆ ఐస్‌బర్గ్స్ విరిగిపోయినప్పుడు.. చిన్న ముక్కలు అలలతో తీరానికి కొట్టుకువస్తాయి. అక్కడి అతి శీతల వాతావరణం వల్ల కరిగిపోకుండా అలాగే ఉంటుంటాయి. అసలే అది అగ్నిపర్వతం నుంచి వెలువడిన లావా నుంచి ఏర్పడిన నల్లటి ఇసుక బీచ్.. దానిపై అతి స్వచ్ఛమైన నీటితో కూడిన ఈ మంచు ముక్కలు.. ఇక సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించే ఉదయం, సాయంత్రం సమయాల్లో అయితే.. ఈ బీచ్‌ను చూడటానికి రెండు కళ్లూ చాలవంటే నమ్మాల్సిందే. మంచు ముక్కలు సూర్య కాంతి ప్రతిఫలిస్తూ.. వజ్రాలను తలదన్నేలా ధగధగా మెరిసిపోతుంటాయి మరి. ప్రస్తుతం ఐస్‌ల్యాండ్‌లో శీతాకాలం కావడంతో.. ఈ బీచ్ 'మంచు వజ్రాల'తో ఆకట్టుకుంటోంది.

– సాక్షి, సెంట్రల్ డెస్క్

టుడేస్ గ్రాఫిక్

2030లో దేశాలవారీగా వివిధ తరాల ప్రజల అత్యధిక వినియోగ వ్యయం ఇలా.. (అంచనా)

ఆఫ్రికా, ఆసియా ఖండంలోని చాలా దేశాల్లో 2030లో ప్రజలు చేసే ఖర్చుల్లో అత్యధిక వాటా యువత, మధ్యవయస్కులదే అవుతుందని తాజా అధ్యయనం అంచనా వేసింది. భారత్, పాకిస్తాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌తోపాటు బోట్స్‌వానా, ఇథియోపియా, అంగోలా లాంటి సబ్ సహారా దేశాలకు చెందిన జెన్ జీ, మిలీనియల్స్ తరాలదే అత్యధిక వినియోగ వ్యయం అవుతుందని వరల్డ్ డేటా ల్యాబ్, నీల్సన్ ఐక్యూ, జీఎఫ్‌కే సంస్థల సర్వే పేర్కొంది. వచ్చే పదేళ్లలో దుస్తులు, రవాణా, మద్యం, విద్యపై ఎక్కువగా, ఆరోగ్యంపై తక్కువగా జెన్ జీ ఖర్చుపెడుతుందని చెప్పింది. అలాగే చైనా, రష్యా, ఇతర ఆఫ్రికా దేశాల్లో మిలీనియల్స్ అత్యధికంగా ఖర్చు చేస్తారని తెలిపింది. ఇక యూరోప్‌లోని చాలా దేశాలు, అమెరికా, కెనడా తదితర దేశాల్లో మాత్రం జెన్ ఎక్స్ ప్రజలే అత్యధికంగా ఖర్చుపెడతారని సర్వే అంచనా వేసింది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



ఆదివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద జరిగిన సదర్ ఉత్సవాల దృశ్యం

ఉపాధ్యాయులూ మేల్కొనండి!

నవంబర్ 6 వరకు గడువు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సెప్టెంబర్ 30న ఓటరు నమోదు షెడ్యూల్‌ను విడుదల చేసింది. నవంబర్ 6వ తేదీ ఆఖరు తేదీగా ప్రకటించింది. గత ఎన్నికల ఓటరు జాబితా రద్దు చేశామని.. గతంలో ఓటు ఉన్న వారు కూడా తిరిగి నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఓటర్ నమోదుకు అవకాశం కల్పించారు. ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమై నెల రోజులు దాటింది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 12 కొత్త జిల్లాలున్నాయి. అందులో ఇప్పటి వరకు 10,089 మంది మాత్రమే ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. గడువు దగ్గర పడుతున్నా.. ఓటు నమోదుపై ఉపాధ్యాయులు పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20,888 మంది ఓటర్లుండగా.. ప్రస్తుతం మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 10,089 మంది మాత్రమే ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.

– నల్లగొండ

ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అలసత్వం

- గత ఎన్నికల్లో 20,888 మంది ఓటర్లు
- సెప్టెంబర్ 30 నుంచి ఇప్పటి వరకు 10,089 మంది మాత్రమే నమోదు
- నవంబర్ 6వ తేదీ వరకే గడువు

జిల్లాల వారీగా ఓటరు నమోదు ఇలా..

సిద్దిపేట	91	హనుమకొండ	1807
నల్లగొండ	2489	జయశంకర్‌భూపాలపల్లి	90
సూర్యాపేట	1339	భద్రాద్రికొత్తగూడెం	838
యాదాద్రి భువనగిరి	348	ఖమ్మం	1150
జనగాం	321	ములుగు	1035
మహబూబాబాద్	572		
వరంగల్	909	మొత్తం	10,089



పెరిగిన ఉపాధ్యాయుల సంఖ్య

ఓటరు నమోదుకు ఆఖరి తేదీ నవంబరు 6. ఇంకా 10 రోజులు మాత్రమే గడువుంది. గత ఎన్నికల్లో 20,880 మంది ఓటర్లు ఉన్నందువల్ల ఈసారి ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరిగింది. ఓటర్ల సంఖ్య కూడా పెరగాల్సి ఉంది. ప్రధానంగా హైస్కూల్ ఉపాధ్యాయులు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, బీఈడీ కళాశాలల అధ్యాపకులతోపాటు ప్రభుత్వ రికగ్నైజ్డ్ హైస్కూళ్లు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఓటర్ నమోదుపై స్పందించాల్సి ఉంది.

నివాసమే ప్రామాణికం..

ఓటర్లుగా ఉపాధ్యాయులు, అధ్యాపకుల నమోదు గడువు నవంబర్ 1 అని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ తేదీ కంటే ముందు కనీసం 3 ఏళ్లు కచ్చితంగా బోధించి ఉండాలి. ఎన్నిచోట్ల పని చేసినప్పటికీ 3 ఏళ్లు బోధించినట్లు సర్వీస్ సర్టిఫికెట్‌తో పాటు సంబంధిత విద్యాశాఖాధికారి సంతకం తప్పనిసరిగా ఉంటేనే ఓటు నమోదుకు అవకాశం ఉంటుంది. నివాస ప్రాంతాన్నే ఎన్నికల సంఘం ఓటర్ నమోదుకు ప్రామాణికంగా నిర్ణయించింది. ఎక్కడైతే నివాసం ఉంటున్నారో ఆ చిరునామా ఆధారంగా ఓటు నమోదు చేసుకోవాలి. బోధన ఎక్కడ చేసినప్పటికీ అది ప్రామాణికం కాదు. ఉదాహరణకు నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో నల్లగొండలో నివసిస్తున్న వ్యక్తి వరంగల్ జిల్లాలో పనిచేస్తే.. ఆ వ్యక్తి నల్లగొండ చిరునామాతోనే ఓటు నమోదు చేసుకోవలసి ఉంటుంది. ఈ మూడు జిల్లాల్లో ఎక్కడైనా ఉపాధ్యాయుడు పని చేస్తూ.. కరీంనగర్ జిల్లాలో నివసిస్తుంటే ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉండదు. ఓటు నమోదుకు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా వారి చిరునామాకు వెళ్లి.. దరఖాస్తుదారు ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడా? లేదా? అనేది సిబ్బంది పరిశీలించాలి. ఒకవేళ అక్కడ నివాసం లేకుంటే ఆ దరఖాస్తును తిరస్కరిస్తారు. ఉపాధ్యాయులు ఎక్కడ నివాసం ఉంటే.. అక్కడ ఓటు నమోదు చేసుకుంటేనే ఆ దరఖాస్తు చెల్లుబాటవుతుంది. నివాసం ప్రామాణికంగానే దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారి కోరుతున్నారు.

ఆమెకు ఆహ్వానం

- లింగ సమానత్వం దిశగా యువత అడుగులు
- ఎవరైనా ఒక్కటే అన్న ఆలోచన.. ఆడ శిశువులకు స్వాగతం
- 2036 నాటికి పెరగనున్న మహిళల సంఖ్య
- అంచనా గణాంకాలు విడుదల చేసిన కేంద్రం

తరం మారుతోంది..
జనం అభిప్రాయం మారుతోంది...
అబ్బాయే కావాలి.. వంశానికి వారసుడు
ఉండాలనే ధోరణిలో మార్పు వస్తోంది.
ఆడ, మగ.. ఎవరైనా చాలు అనే
ఆలోచన పెరుగుతోంది..
లింగ నిష్పత్తి సమానత్వం దిశగా
సమాజం వడివడిగా అడుగులు వేస్తోంది..

– సాక్షి, హైదరాబాద్



మన దేశంలో ఆది నుంచి పురుషాధిక్యత ఎక్కువ. అబ్బాయి ఇంటిపేరు నిలబెడతాడు.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకుంటాడు.. పున్నామ నరకం నుంచి తప్పించాలంటే పుత్రుడు ఉండాలి.. అమ్మాయి అయితే కట్నం, కానుకలిచ్చి పెళ్లి చేయాలి.. వివాహంతో తల్లి ఇంటితో రుణం తీరిపోతుంది.. లాంటి ఆలోచన చాలా మందిలో నాటుకుపోయింది. ఈ నేపథ్యంలో లింగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఆడ శిశువుల హత్యలు పెరిగాయి. లక్షల మంది ఆడ శిశువులు అమ్మ కడుపులోనే కన్నుమూశారు. అయితే ఇప్పుడు ఈ ధోరణి మారుతోంది.. అమ్మాయి ఐనా.. అబ్బాయి ఐనా ఓకే అంటూ యువతరం స్వాగతం పలుకుతోంది. ఆడ శిశువుల కంటే మగ శిశువుల నిష్పత్తి ఎక్కువగా ఉండే పరిస్థితి క్రమేపీ మారుతోంది. దేశంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడుతున్నట్లు, మహిళా జనాభా పెరగనున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన అంచనా గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 943 మహిళలు ఉండగా, 2036 వరకల్లా ఇది 952కు వృద్ధి చెందుతుందని గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర గణాంకాల ప్రకారం.. 2036 నాటికి దేశ జనాభా 152.2 కోట్లకు చేరుతుంది. మొత్తం జనాభాలో స్త్రీల శాతం 48.5 నుంచి 48.8కి పెరగనుంది. పదేళ్లలోపు చిన్నారుల సంఖ్య గణనీయంగా పడిపోవడంతో పాటు వృద్ధుల సంఖ్య పెరుగుతుందని స్పష్టం చేసింది. కాగా లింగ నిష్పత్తి, పని చేసే యువత, జననాల రేటుకు సంబంధించిన పలు ఆసక్తికర గణాంకాలను కేంద్రం వెల్లడించింది.

పడిపోతున్న సంతానోత్పత్తి రేటు.

జననాల రేటు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. సంతానోత్పత్తి రేటు పడిపోతున్న కారణంగా 2050 నాటికి జనాభా కుంచించుకుపోయే ప్రమాదం ఉంది. భవిష్యత్‌లో యువతరం కూడా తగ్గిపోతుందని అంచనా. 2100 నాటికి ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలుస్తుందని లాన్సెట్ అధ్యయనం పేర్కొంటోంది. అయితే జనాభా స్థాయి మాత్రం తగ్గిపోతుందని పేర్కొంది. పెరుగుతున్న ఖర్చులతో ఎక్కువ మంది పిల్లలను పెంచగలమా.. లేదా..అనే ఆలోచన, ఒక్కరు చాలు అనే అభిప్రాయాలు పెరుగుతున్నాయి.

తగ్గనున్న చిన్నారులు..పెరగనున్న పెద్దలు

చిన్నారులు (0–4 ఏళ్లు): 2011లో మొత్తం జనాభాలో చిన్నారులు 9.9 శాతం ఉండగా, 2036 వరకల్లా వీరు 6.35 శాతానికి తగ్గనున్నారు.

బాలలు (4–9 ఏళ్లు): 2011లో మొత్తం జనాభాలో వీరి శాతం 10.35 కాగా, 2036 వరకల్లా ఇది 7.7 శాతానికి పడిపోనుంది.

యువత (20–39 ఏళ్లు): 2011లో 32.1 శాతం ఉండగా, 2036లో 31.4 శాతానికి తగ్గనుంది.


వృద్ధులు (70 ఏళ్లకుపైన): 2011లో మొత్తం జనాభాలో 3.2 శాతం ఉండగా, 2036 వరకల్లా 6.5 శాతానికి పెరగనుంది.

ఉరుకుల పరుగుల జీవితం, ఒక్కరు చాలనే ధోరణే కారణం

జీవితంలో స్థిరపడే వరకు వివాహం వద్దనుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఇది భవిష్యత్‌లో మరింత పెరగవచ్చు. ఉరుకుల పరుగుల జీవితం, ఒత్తిడి కారణంగా సంతానోత్పత్తి తగ్గుతోంది. ఆడైనా.. మగైనా.. ఒక్కరు చాలు అనే ధోరణి పెరుగుతోంది. ఇది జననాల రేటు పడిపోవడానికి ముఖ్య కారణాలు.


– కిరణ్ మాదల, ప్రొఫెసర్, గాంధీ మెడికల్ కాలేజీ

ప్రతి వెయ్యి మంది మగవారికి మహిళలు ఇలా..



(2011 జనాభా లెక్కలు ప్రామాణికం. ఆ తర్వాతి లెక్కలు అంచనా గణాంకాలే)

పనిమంతులు పెరిగేదిలా..



(పని వయసు(15-59) వారి శాతం 2011లో 60.7 ఉండగా 2036 వరకు ఇది 64.9కు పెరగనుంది)

హైకోర్టు ఆదేశాలా.. అయితే మాకేంటి!

జిల్లాకో తీరు నియామకాలతో 'స్పోర్ట్స్ కోటా'కు అన్యాయం

- టీచర్ నియామకాల్లో అధికారుల ఇష్టారాజ్యం
- అనర్హులకు పోస్టింగ్.. అర్హులకు మొండిచేయి
- హైకోర్టు ఫలితాలు ఆపమన్నా.. బేఖాతర్ చేస్తూ ఏకంగా నియామకాలు



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ఆదేశాలన్నా కొందరు అధికారులు లెక్కలేనట్లు వ్యవహరిస్తున్నారు. తాము ఆదేశాలిచ్చే వరకు ఫలితాలు ప్రకటించవద్దని చెప్పినా బేఖాతర్ చేశారు. ఫలితాలు వెల్లడించడమే కాదు ఏకంగా పోస్టింగ్‌లు కూడా ఇచ్చేశారు. ఇదేమని అడిగితే అసలు కోర్టు ఆదేశాలే లేవంటూ విద్యాశాఖ అధికారులు సెలవిస్తున్నారు. దీంతో టీచర్ల నియామకంలో అన్యాయం జరిగిందని కోర్టుకెక్కిన స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 11,062 టీచర్ పోస్టుల భర్తీ కోసం 2024, ఫిబ్రవరి 29న ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో స్పోర్ట్స్ కోటాకు సంబంధించి 2018లో ప్రభుత్వం జీవో 107ను విడుదల చేసింది. దీని ప్రకారం ఫామ్–1.. ఇంటర్నేషనల్ గేమ్స్, ఫామ్–2.. నేషనల్ గేమ్స్(అసోసియేషన్), ఫామ్–3.. నేషనల్ గేమ్స్(యూనివర్సిటీ లెవెల్), ఫామ్–4.. నేషనల్ గేమ్స్(స్కూల్/స్టేట్ లెవెల్)గా పరిగణిస్తారు. ఆయా ఆటల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియామకాల్లో సంబంధిత ఫామ్‌లను సమర్పించాల్సి ఉంటుంది. దీన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) పరిశీలించి డైరెక్టరేట్‌కు పంపిస్తుంది. ప్రాధాన్యత ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో వీరిని భర్తీ చేశారు. అయితే తాజా డీఎస్సీలో ఫామ్–1, ఫామ్–2 ఉన్న అభ్యర్థులకు మాత్రమే కొన్ని జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వగా.. మరికొన్ని జిల్లాల్లో ఫామ్–3, ఫామ్–4 వారికి కూడా ఇచ్చారని, ఫామ్–3, ఫామ్–4 ఉన్నా తమకు ఇవ్వలేదనేది బాధితుల ప్రధాన ఆరోపణ. ఇంకొందరు రాష్ట్రస్థాయి క్రీడాకారులే అయినా జాతీయ స్థాయి ఫామ్ అందజేశారని.. శాట్ పరిశీలించకుండానే డైరెక్టరేట్‌కు అందజేయడంతో అలాంటి వారు కూడా ఉద్యోగాలు పొందారని అంటున్నారు. టీచర్ పోస్టులకు సంబంధించి శాట్‌కు దాదాపు 390 దరఖాస్తులు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి నిజంగా వారు ఆయా రంగాల్లో ప్రతిభ కనబరిచారా? లేదా? అనేది చూడాలి. కానీ శాట్ వచ్చినవి వచ్చినట్లు పంపేయడంతో అవకతవకలు చోటుచేసుకున్నాయని వారు చెబుతున్నారు.

నవంబర్ 21 వరకు..

జీవో సరిగా లేదంటూ నల్లగొండ జిల్లా కేతేపల్లికి చెందిన ఆర్.రమేశ్‌తోపాటు మరో 9 మంది హైకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం వీరి పిటిషన్‌పై సెప్టెంబర్ 25న విచారణ చేపట్టింది. ఎస్‌జీటీ పోస్టుల భర్తీకి పిటిషనర్ల నుంచి సర్టిఫికెట్లన్నీ తీసుకుని పరిశీలించాలని, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు పిటిషనర్ల ఫలితాలు వెల్లడించవద్దని ఆదేశించింది. తదుపరి విచారణ నవంబర్ 21కి వాయిదా వేసింది. అయినా ఈలోపే ఫలితాలు వెల్లడించారు. పిటిషనర్లలో ఒక్కరు మాత్రమే ఎంపికైనట్లు ప్రకటించి ఉద్యోగం ఇచ్చారు.

ఎలాంటి జీవో లేకుండా..

ప్రభుత్వంగానీ, శాట్‌గానీ, నియామక డైరెక్టరేట్‌గానీ ఫామ్–1, ఫామ్–2 ఉన్న వాళ్లకే స్పోర్ట్స్ కోటా కింద పోస్టింగ్‌లు ఇస్తామని చెప్పలేదు. ఎలాంటి జీవో ఇవ్వలేదు. ప్రాధాన్యత ఆధారంగా మొదట ఫామ్–1 వారికి.. లేకుంటే ఫామ్–2 వారికి.. లేకుంటే ఫామ్–3 వారికి.. లేకుంటే ఫామ్–4 వారికి ఉద్యోగం ఇవ్వాలి. మాకు హైకోర్టు ఉత్తర్వులిచ్చినా వాటిని డైరెక్టరేట్ పాటించలేదు. నల్లగొండ జిల్లాలో స్పోర్ట్స్ కోటాలో లేరంటూ ఆ పోస్టులు జనరల్ అభ్యర్థులకు ఇచ్చారు.

– ఆర్.రమేశ్, బాధితుడు

ఇదెక్కడి న్యాయం...

ఎంసెట్ లాంటి వాటికే స్పోర్ట్స్ సర్టిఫికెట్లను ఫిజికల్‌గా తనిఖీ చేస్తున్నప్పుడు.. పోస్టింగ్‌లకు దాన్ని ఎందుకు అమలు చేయరు? ఆన్‌లైన్‌లో ఎవరు ఏది పెడితే అది పంపిస్తారా? స్కూల్ అసిస్టెంట్‌ను గ్రూప్–1 స్థాయిగా, ఎస్‌జీటీని గ్రూప్–2 స్థాయి పోస్టులుగా ప్రభుత్వం పేర్కొంటోంది. మరి ఇంత ప్రాధాన్యమున్న ఉద్యోగాల భర్తీలో పారదర్శకత ఏదీ? ప్రభుత్వం బాధితులతో మాట్లాడి పరిష్కారం చూపాలి.

– కృష్ణమూర్తి, బాధితుడు

శాట్ పరిశీలన ప్రకారమే..

స్పోర్ట్స్ అథారిటీ ఫైనల్ చేసిన తర్వాతే మేం నిర్ణయం తీసుకుంటాం. 393 దరఖాస్తులను పంపిస్తే శాట్ పరిశీలన చేసి 35 మంది అర్హులను మాకు పంపారు. ఫామ్–1, ఫామ్–2 వారికి అవకాశం ఇచ్చారు. ఇద్దరు నాన్ లోకల్, 33 మంది లోకల్ వారికి పోస్టింగ్‌లు వచ్చాయి. ఇతరులు కూడా తమకు అర్హత ఉందని చెబుతున్నారు. అనుమానం ఉంటే మరోసారి అప్లికేషన్లు ఇస్తే శాట్‌కు పంపించి పరిష్కరిస్తాం. హైకోర్టు నుంచి మాకు ఎలాంటి ఆదేశాలేవు. పోస్టింగ్‌లు ఇచ్చాక ఇప్పుడు చేసేదేం లేదు.

– డైరెక్టర్, పాఠశాల విద్య



కిటకిటలాడిన యాదాద్రి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలి వచ్చారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి సుమారు 3 గంటలు పట్టగా, వీఐపీ దర్శనానికి గంట పట్టిందని భక్తులు తెలిపారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.30,07,901 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

– యాదగిరిగుట్ట

అశ్వంపై ఆటవిడుపు..



ఆదివారం వచ్చిందంటే చాలు..కడప నగరంలోని ప్రధాన పార్కుల వద్ద గుర్రాలు కనువిందు చేస్తున్నాయి. చిన్నారులు వాటిపై స్వారీ చేస్తాం అంటూ మారం చేస్తున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తమ పిల్లల కళ్లల్లో ఆనందం కోసం తల్లిదండ్రులు కూడా వారి కోర్కెను తీర్చేస్తున్నారు. దీంతో అశ్వాలపై ఎక్కిన చిన్నారులు చల్ చల్ గుర్రం అంటూ...ఫొటోలకు ఇలా ఫోజులిస్తున్నారు. - ఎస్.కె మహమ్మద్ రఫీ , సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప

అత్యవసర బండి.. ఆపదలో ఉందండీ



ఎవరికైనా ఆరోగ్యం విషమించినా, ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నా తక్షణం ఆశ్రయించేది 108 వాహనాన్నే..మరి ఆ బండే శిథిలావస్థలోకి చేరితే? ఇంజన్, టైర్లలో చిన్నపాటి లోపాలున్నాయని నెల్లూరు బాలాజీనగర్‌లో 108 వాహనాన్ని మూలన పెట్టేయడంతో అది పూర్తిగా దెబ్బతిని ఇలా మారిపోయింది. - కమలాకర్, సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మాకొద్దు బాబోయ్ మద్యం షాపు



జనావాసాల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ వారం రోజులుగా విశాఖపట్నంలోని భూపేష్‌నగర్ వాసులు ఆందోళన చేపడుతున్నారు. ఆదివారం ఆందోళనకారులు మద్యం దుకాణం ఎదుట వంట వార్పు చేపట్టి అక్కడే భోజనాలు చేసి ఇలా వినూత్నంగా నిరసన తెలిపారు. - పీఎల్‌మోహన్, సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

పోరాటాల ద్వారానే రాజ్యాధికార సాధన సాధ్యం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్



రాయచోటి అర్బన్: రాజ్యాధికారాన్ని దక్కించుకునేలా పేదలు, కార్మికులు సంఘటితంగా పోరాటాన్ని సలపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటిలోని కేజీఎస్ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలు జరిగాయి. దీనికి హాజరైన గఫూర్ మాట్లాడుతూ దేశంలో సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. బూర్జువాలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల చేతుల నుండి శ్రామిక, కర్షక వర్గం చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చినప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, శ్రామికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్, మతోన్మాదులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు.

భార్య గొంతు కోసిన భర్త



బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

జమ్మలమడుగు: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త బ్లేడ్‌తో ఆమె గొంతు కోసి పరారయ్యాడు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని ఎస్సీ కాలనీకి చెందిన మేరీ, విజయ్ భార్యభర్తలు. విజయ్ ఆటోలో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. కొంత కాలంగా మేరీపై అనుమానం పెంచుకున్నాడు. తన భార్య ఇతరులతో సంబంధం పెట్టుకుందనే అనుమానించేవాడు. భార్యతో పాటు ఆదివారం ప్రార్ధన కోసం టౌన్ చర్చికి వచ్చాడు. ప్రార్థన చేస్తున్న సమయంలో ఉన్నట్లుండి భర్త విజయ్ తనతోపాటు తెచ్చుకున్న బ్లేడ్‌తో భార్య మేరీ గొంతు కోశాడు. గొంతు, మెడ దగ్గర తీవ్ర గాయాలై రక్తస్రావం ఎక్కువగా అవుతుండటంతో స్థానికులు రక్తస్రావం జరుగకుండా గుడ్డను గొంతుకు కట్టి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, మొదటి భార్య చనిపోవడంతో విజయ్ ఎస్సీ కాలనీకి చెందిన మేరీని 15 ఏళ్ల క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం . ఒక బాబు పీఆర్ ఉన్నత పాఠశాలలో చదువుతుండగా.. మరో బాబు గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు.

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరుబాట

నేటి నుంచి మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

సాక్షి, అమరావతి: విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టినట్టు భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ ప్రకటించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యాదీవెన, వసతిదీవెన సహా విద్యార్థులకు రావాల్సిన అన్ని బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28, 29, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని చెప్పారు. నవంబర్ 6న 'చలో కలెక్టరేట్' కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు అయినా విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు విడుదల చేయకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో చదువులు పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికేట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. పలు యూనివర్సిటీల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతూ బకాయిల విడుదల విషయంలో జాప్యం చేస్తోందన్నారు. 'తల్లికి వందనం' ఎప్పుడు అమలు చేస్తారో కూడా స్పష్టత ఇవ్వడం లేదన్నారు.

ఏపీలో తగ్గిన అమ్మకాలు

గడచిన మూడేళ్లలో ఏపీలో ఇఫ్కో అవుట్‌లెట్స్‌తో పాటు ఆర్బీకేల ద్వారా 10.50 లక్షల బాటిళ్ల విక్రయాలు జరిగాయి. కాగా 2024–25 సీజన్ కోసం 10లక్షల నానో యూరియా, 4 లక్షల నానో డీఏపీ బాటిళ్లను ఇఫ్కో సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. వర్షాలు, వరదలు, వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ఖరీఫ్–2024లో అతికష్టమ్మీద 1.04లక్షల బాటిళ్ల నానో యూరియా ప్లస్, 48వేల నానో డీఏపీ బాటిళ్ల అమ్మకాలు జరిగాయి. కాగా వచ్చే రబీ సీజన్‌లో నానో యూరియా ప్లస్ 3లక్షల బాటిళ్లతో పాటు లక్ష బాటిళ్ల నానో డీఏపీని అందుబాటులో ఉంచేందుకు ఇఫ్కో ఏర్పాట్లు చేసింది. గడచిన మూడేళ్లుగా ఆర్బీకేల ద్వారా కూడా విక్రయాలు జరపగా, గడచిన ఖరీఫ్ సీజన్ నుంచి ఇఫ్కో అవుట్‌లెట్స్‌తో పాటు ఓపెన్ మార్కెట్ ద్వారా మాత్రమే నానో ఎరువులను అందుబాటులో ఉంచుతోంది. నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులు, గ్రామీణ యువతకు కిసాన్ డ్రోన్స్ కూడా ఇస్తున్నారు. గతేడాది ఒక్కొక్కటి రూ.15లక్షల విలువైన ఈ వెహికల్‌తో కూడిన కిసాన్ డ్రోన్స్‌ను 75 మందికి అందజేశారు. ఈ ఏడాది మరో 70 మందికి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తగ్గిన 'నానో' ఎరువుల అమ్మకాలు

గత మూడేళ్లలో 10.50 లక్షల బాటిళ్ల విక్రయం

2023-24 సీజన్ వరకు ఏటా పెరిగిన అమ్మకాలు

- సంప్రదాయ ఎరువులకు భిన్నంగా నానో ఎరువులు
- గత ఖరీఫ్‌లో మార్కెట్‌లోకి నానో యూరియా ప్లస్
- వచ్చే సీజన్ నుంచి నానో జింక్, నానో కాపర్

గత మూడేళ్లలో గణనీయంగా పెరిగిన నానో ఎరువుల అమ్మకాలు.. గత ఖరీఫ్ సీజన్ నుంచి భారీగా తగ్గాయి. సంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో బయోటెక్నాలజీ ద్వారా ద్రవరూపంలో అభివృద్ధి చేసిన ఈ సూక్ష్మ ఎరువులను 2021లో భారత రైతులు ఎరువుల సహకార సంస్థ (ఇఫ్కో) మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. తొలుత యూరియా, ఆ తర్వాత నానో డీఏపీలను మార్కెట్‌లోకి తీసుకొచ్చిన ఇఫ్కో గత ఖరీఫ్ సీజన్ నుంచి నాలుగింతల నత్రజని (16 శాతం)తో సహా అధిక పోషక విలువలతో కూడిన నానో యూరియా ప్లస్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. వచ్చే సీజన్ నుంచి నానో జింక్, నానో కాపర్‌ను తీసుకొచ్చేందుకు సైతం ఏర్పాట్లు చేస్తోంది. - సాక్షి, అమరావతి



500 మిల్లీ లీటర్ల బాటిల్‌లో తీసుకొచ్చిన నానో యూరియా/డీఏపీలు 45 కిలోల సంప్రదాయ యూరియా, డీఏపీ బస్తాకు సమానం. బస్తా యూరియా ధర మార్కెట్‌లో రూ.266.50 ఉండగా, అదే పరిమాణంలో ఉన్న ఈ నానో యూరియాను రూ.225కే ఇఫ్కో అందుబాటులోకి తీసుకొచ్చింది. సంప్రదాయ డీఏపీ బస్తా మార్కెట్‌లో రూ.1,350 ఉండగా, నానో డీఏపీ బాటిల్ రూ.600కే తెచ్చింది.

తగ్గిన నానో విక్రయాలు..

గడచిన మూడేళ్లలో వీటి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. దేశ వ్యాప్తంగా 2021–22 సీజన్‌లో 2.12 కోట్ల బాటిళ్ల, 2022–23లో 3.30 కోట్ల బాటిళ్ల అమ్మకాలు . దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల ప్రభావం వల్ల సాగు తగ్గడంతో 2023–24లో 2.04 కోట్ల నానో యూరియా, 44 లక్షల నానో డీఏపీ బాటిళ్ల విక్రయాలు జరిగాయి. 2024–25 సీజన్‌లో 4.60 కోట్ల నానో యూరియా, 2 కోట్ల నానో డీఏపీ బాటిళ్ల విక్రయాలు లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఖరీఫ్ సీజన్‌లో కేవలం కోటి బాటిళ్ల నానో యూరియా ప్లస్, 43 లక్షల నానో డీఏపీ బాటిళ్ల అమ్మకాలు మాత్రమే జరిగాయి.

ఎకరానికి రూ.30 వేలు ఆదా

గడువు ముగిసిన పిల్లులు, కుక్కల మేతను వినియోగించడం ద్వారా ఎకరానికి సుమారు రూ.30 వేల వరకు ఖర్చులు తగ్గుతున్నట్టు రైతులు చెబుతున్నారు. ఎకరం చెరువులో చేపల పెంపకానికి సాధారణంగా 2.5 టన్నుల మేతను వినియోగిస్తారు. చేపల మేత కిలో రూ.42 చొప్పున ఎకరానికి 1.05 లక్షల వరకు ఖర్చవుతుంటే.. కాలం చెల్లిన పిల్లులు, కుక్కల మేతను వినియోగిస్తే రూ.75 వేల వరకు ఖర్చవుతోంది. మేత ఖర్చులను ఆదా చేసేందుకు ఆక్వా రైతులు ఇలాంటి మేతలు వినియోగిస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల సరిహద్దు ప్రాంతంలో ఈ మేతను అధికంగా వినియోగిస్తున్నారు.



చేపలకు పిల్లుల దాణా

- కుక్కల దాణా సైతం వినియోగం
- కోనసీమలో కాలం చెల్లిన మేత తెచ్చి చెరువుల్లో వేస్తున్న ఆక్వా రైతులు
- అప్సడా, సీఏఏ నిబంధనలకు విరుద్ధంగా చేపల మేత వినియోగం
- జలాలు కలుషితమై పొరుగు రైతులకు ఇబ్బందులు

కాట్రేనికోన: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని చేపల రైతులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పిల్లులు, కుక్కలకు పెట్టే కాలం చెల్లిన (ఎక్స్‌పైర్డ్) మేతను చేపలకు ఆహారంగా వేస్తున్నారు. కాలం చెల్లిన మేతలు తక్కువ ధరకు వస్తుండటంతో వాటిని చెరువుల్లో యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీనివల్ల జలాలు కలుషితమై పొరుగు రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాస్తవానికి చేపలు, రొయ్యలకు అప్సడా (ఏపీఎస్ఏడీఏ), సీఏఏ నిబంధనల ప్రకారం ఆక్వా గ్రేడ్ మేతలు, మందులను మాత్రమే వాడాల్సి ఉంది. మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొందరు బరితెగించి ఈ తరహా మేతలను చేపలకు వినియోగిస్తున్నారు.

కేజీ రూ.30కే వస్తుండటంతో..

థాయ్‌లాండ్ దేశానికి చెందిన మార్స్ పెట్‌కేర్ కంపెనీ సెబా బ్రాండ్ (చికెన్ ఫ్లేవర్)తో 75 శాతం యానిమల్ ప్రొటీన్లు ఉన్న మేతను పిల్లులు, కుక్కలకు బిస్కెట్ల రూపంలో మార్కెట్‌లో విక్రయిస్తోంది. మాంసకృత్తులు అధికంగా ఉండే పిల్లుల మేత ఒకటిన్నర కేజీల ఆన్‌లైన్ ధర రూ.1,099 ఉంది. అయితే, క్వాలిటీ లేని థర్డ్ గ్రేడ్ మేత, గడువు ముగిసిన, ముగియనున్న మేత కేజీ సుమారు రూ.30కే లభిస్తోంది. ఆ మేతల్ని కొందరు రైతులు దిగుమతి చేసుకుని చుట్టుపక్కల రైతులకు విక్రయిస్తున్నారు. రూప్‌చంద్, శీలావతి, బొచ్చె చేపలకు కొంతమంది రైతులు ఈ మేతను వాడుతున్నారు.

చేపలకు ఎటువంటి నష్టం ఉండదు

కుక్కలు, పిల్లులకు పెడుతున్న మేత చేపలకు వేసినా నష్టమేమీ ఉండదు. కానీ.. అప్సడా నిబంధనల ప్రకారం ఆక్వా గ్రేడ్ మేతలు, మందులను మాత్రమే చేపలు, రొయ్యలకు దాణాగా వాడాలి. కాలం చెల్లిన కుక్కలు, పిల్లుల మేత వాడుతున్న రైతులను గుర్తిస్తాం. రైతులు ఎలాంటి దాణా వాడుతున్నారు, దాణా తయారీకి ఏ జంతువుల మాంసం వినియోగించారు, దాణా నాణ్యతను ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తాం. - శ్రీనివాస్, మత్స్యశాఖ జేడీ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

దంపతులపై చైన్ స్నాచర్ల దాడి

3 కాసుల బంగారు గొలుసు అపహరణ

పెంటపాడు: పెళ్లికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్న దంపతులను టార్గెట్ చేసుకున్న దుండగులు వారి నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండల శివారులోని ముదునూరు వద్ద జరిగింది. తాడేపల్లిగూడేనికి చెందిన గంగుల నాగరాజు, గంగుల సత్యవతి దంపతులు శనివారం రాత్రి భీమవరంలో బంధువుల పెళ్లికి వెళ్లారు. మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్న సమయంలో వారిని బైక్‌పై వెనుక నుంచి అనుసరించిన దుండగులు సత్యవతి మెడలోని గొలుసుపై కన్నేశారు. గొలుసు అపహరణకు యత్నించే క్రమంలో దంపతులిద్దరినీ కొంత దూరం ఈడ్చుకొని వెళ్లి 3 కాసుల బంగారు గొలుసు తెంపుకొని బైక్‌పై ఉడాయించారు. బైక్‌పై నుంచి పడిపోయిన దంపతులకు గాయాలపాలవడంతో స్థానికులు వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

టెన్త్ పరీక్షల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఆప్షన్‌గా ఉండాలి

విద్యాశాఖ మంత్రికి పేరెంట్స్ అసోసియేషన్ లేఖ

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో దేనినైనా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ విద్యార్థులకు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోషియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాసింది. పబ్లిక్ పరీక్షలలో రెండు భాషల్లో ఏదైనా ఎంచుకునే స్వేచ్ఛ విద్యార్థులకు ఉండాలని, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు శిక్షరం నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. తెలుగు బోధనకు అలవాటుపడిన ఉపాధ్యాయులు ఇంగ్లిష్ మీడియం, అందులోనూ సీబీఎస్ఈ సిలబస్‌ను ఎలా బోధించగలరని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయులను ఎంపిక చేయకపోగా, ఉన్నవారు ఇంగ్లిష్‌లో బోధించేందుకు అవసరమైన కనీస శిక్షణ ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షలు సైతం లోపభూయిష్టంగా ఉన్నాయని, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడంలో తప్పులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో కనీస సామర్థ్యాలు లేని వారికి సైతం 49/50 మార్కులు వేస్తున్నారని, ఇదెలా సాధ్యమని వారు ప్రశ్నించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి వాస్తవ పరిస్థితులను శాస్త్రీయంగా అధ్యయనం చేసి తమ పిల్లల బోధనలోను, ఉపాధ్యాయుల ఎంపికలోను మార్పులు చేయాలన్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో శిక్షణనిచ్చి కఠినమైన పరీక్ష విధానం అవలంబించాలని డిమాండ్ చేశారు.

సాల్ట్ పథకం ఒప్పందాన్ని రద్దు చేయాలి

రాయచోటి అర్బన్ ప్రపంచబ్యాంకుతో రాష్ట్రంలో అమలవుతున్న సాల్ట్ పథకం ఒప్పందాన్ని వెంటనే రద్దుచేయాలని, విద్యారంగంలో ప్రపంచబ్యాంకు విధానాలకు స్వస్తిపలకాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్‌లు డిమాండ్ చేశారు. రాయచోటిలోని అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ సాల్ట్ పథకంలో భాగంగా అమలవుతున్న విధానాల వలన ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతోందన్నారు. ప్రాథమిక పాఠశాలల విభజన, తరగతుల విలీనంతో తీవ్రనష్టం జరుగుతోందంటూ తెలపారు. అంతేగాక ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌లు, అసంబద్ధ శిక్షణ కార్యక్రమాలు, అనవసర ఆన్‌లైన్ పనులు ఎక్కువై ఉపాధ్యాయులు బోధన నుండి దూరమవుతారన్నారు.

సాగర్ వద్ద కొనసాగుతున్న నీటి విడుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్‌లో ఆదివారం రెండు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 2 గేట్ల ద్వారా 16,138 క్యూసెక్కులు దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 64,472 క్యూసెక్కులు వస్తుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా 9,967, ఎడమ కాలువ ద్వారా 6,173, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 29,394, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాల్వకు 400 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



సాగర్‌లో రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయిలో 590.00 అడుగుల వద్ద ఉంది. ఇది 312.0450 టీఎంసీలకు సమానం.

ఆధ్యాత్మిక సమాచారం

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది.



భక్తిశ్రద్ధలతో ఇరుగులమ్మకు పూజలు



సిద్దవటం: మండలంలోని సిద్దవటం గ్రామ శివారులోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున వెలసిన ఇరుగులమ్మ ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారని ఆలయ పూజారి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు




బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండల పరిధిలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి కూడా భక్తులు వాహనాల్లో తరలివచ్చారని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

విద్యా సమాచారం

ఐ లీగ్ ఫుట్‌బాల్ విశాఖలోనే ఆడాలి

విశాఖ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మక ఐ లీగ్ ఫుట్‌బాల్ విశాఖ వేదికగా నిర్వహించేందుకు ఎంతో శ్రమిస్తే ఇప్పుడది హైదరాబాద్‌కు తరలిపోవడం శోచనీయమని ఏపీ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలోనే ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్) ద్వారా విశాఖ వేదికగా నిర్వహించేందుకు లైసెన్స్ దక్కిందన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్‌సీ ప్రారంభ వేడుకను అప్పట్లో విశాఖలో ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ పేరిట విశాఖలో ఫుట్‌బాల్ అభివృద్ధికి, స్థానిక క్రీడాకారుల ప్రోత్సాహానికి ఐ లీగ్ ఎంతో దోహదపడగలదని పేర్కొన్నారు.

ప్రారంభమైన ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పీజీ, డిగ్రీ కోర్సుల పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయని దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పరీక్ష కేంద్రాలకు పరిశీలకులను, ప్రత్యేక స్క్వాడ్ బృందాలు, రీజనల్ కోఆర్డినేటర్లను నియమించామని వారి ద్వారా పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. వర్సిటీ దూరవిద్య కేంద్రంలో ప్రత్యేక విద్యార్థి సహాయ కేంద్రం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్ విజేత కౌత్సవ్

విజయవాడస్పోర్ట్స్: బీఎస్‌కేయూ మొదటి అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్ విభాగం విజేతగా పశ్చిమబెంగాల్ క్రీడాకారుడు కౌత్సవ్ కందు నిలిచాడు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో ఆరు రోజులుగా జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. రూ.15 లక్షల నగదు బహుమతితో క్లాసికల్, బ్లిట్జ్, ర్యాపిడ్ రౌండ్‌లలో జరిగిన ఈ పోటీలకు మూడు దేశాల నుంచి వందలాది మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ర్యాపిడ్ రౌండ్‌కు ప్రాతినిధ్యం వహించిన 601 మంది క్రీడాకారులకు స్విస్ లీగ్ పద్ధతిలో తొమ్మిది రౌండ్లలో పోటీలను నిర్వహించారు. ఓపెన్ విభాగంలో అత్యధికంగా 8/9 పాయింట్లను సాధించిన అంతర్జాతీయ మాస్టర్ కౌత్సవ్ కందు విజేతగా నిలిచి రూ.50 వేల నగదు బహుమతిని అందుకోగా, రెండో స్థానంలో నిలిచిన అంతర్జాతీయ మాస్టర్ కుశాగ్రమోహన్(తెలంగాణ) రూ.20 వేల నగదు, మూడో స్థానం సాధించిన గ్రాండ్ మాస్టర్ ఎం.ఆర్.వెంకటేష్(తమిళనాడు) రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారు.


● శ్రీనగర్



శ్రీనగర్‌లోని దాల్ లేక్

మంచు కురిసే వేళలో కశ్మీరలోయ విహారం


శ్రీనగర్‌లోని హరిపర్బత్ పోర్ట్




శ్రీనగర్‌లో 1948లో నెహ్రూ ప్రసంగం


దాల్ లేక్‌లో హౌస్ బోట్స్




శ్రీనగర్‌లోని షాలిమార్ బాగ్ ప్రాంతం

శ్రీనగర్‌లో టూర్‌కి ఎప్పుడు బాగుంటుంది? శీతాకాలంలో దాల్ లేక్ గడ్డ కడితే అదో మధురానుభూతి. దాల్ లేక్ గడ్డకట్టే లోపు వెళ్లి సరస్సులో శికారా రైడ్ చేయాలంటే అక్టోబర్ – నవంబర్ నెలలు బెస్ట్. ఫ్లోటింగ్ మార్కెట్‌లో సరదాగా షాపింగ్ చేయవచ్చు. సినిమా పాటల్లో రంగురంగుల్లో బారులుగా కనిపించే తులిప్ తోటలను కళ్లారా చూడవచ్చు. అలాగే షాలిమార్ గార్డెన్స్‌ని కూడా. రెండురోజుల పాటు బస చేసేటట్లు వెళ్తే శ్రీనగర్ టూర్‌కి న్యాయం జరుగుతుంది. ఉదయం సన్నటి సూర్యకిరణాలు ఒంటిని తాకుతూ రాత్రయితే మంచు గిలిగింతలు పెడుతూంటుంది.

సంస్కృతుల సమ్మేళనం

మౌర్య చక్రవర్తి అశోకుడు నిర్మించిన నగరం ఇది. శ్రీనగర అంటే లక్ష్మీదేవి నివాసమనే అర్థంలో ఈ పేరు వచ్చింది. స్థానికులు సిరినగర అని పలుకుతారు. ఆదిశంకరాచార్యుడు ఇక్కడ పర్యటించి ఒక ఆలయాన్ని నిర్మించాడు. ఇక్కడ జమామసీదు ఉంది. కశ్మీరీ హ్యాండీక్రాఫ్ట్స్‌లో దారుశిల్పాలు, కార్పెట్‌లు, కశ్మీరీ సంప్రదాయ ఆభరణాలు బాగుంటాయి. క్రీస్తుపూర్వం నుంచి మొఘలుల కాలం వరకు పాలకులను, వారి సంస్కృతిని ప్రతిబింబిస్తుంటుంది నగరం.

పశుమినా శాలువాతో రండి

శ్రీనగర్ టూర్‌కి గుర్తుగా తప్పకుండా కొనాల్సింది పశుమినా షాల్. చాలా తేలిగ్గా ఉంటుంది. చంగ్‌తంగి జాతి మేకల గొంతు కింద భాగం నుంచి సేకరించిన ఉన్నితో నేస్తారు. కశ్మీర్ వాళ్లు షాల్‌ల కోసమే ఈ మేకలను పెంచుతారు. ఈ షాల్ ధర నాలుగు వేల నుంచి మొదలవుతుంది. అత్యంత నైపుణ్యంగా నేసిన షాల్ నాలుగు లక్షల ధర పలుకుతుంది. నాలుగు వేల షాల్ కూడా వెచ్చదనాన్నివ్వడంలో ఏ మాత్రం రాజీపడదు.

● కెంప్టీ ఫాల్స్



ఉత్తర కోనలో ఓ జలపాతం

కెంప్టీ ఫాల్స్... ఇది ఉత్తరాఖండ్‌లో ఓ జలపాతం. ముస్సోరీ హిల్‌స్టేషన్ టూర్‌లో చూడవచ్చు. కెంప్టీ అనే పేరులో భారతీయత ధ్వనించదు. ఆ మాటకు వస్తే మనదేశంలో చాలా హిల్ స్టేషన్‌ల పేర్లలో కూడా ఆంగ్లీకరణ ప్రభావం ఉంటుంది. కెంప్టీ అనే పదం క్యాంప్ టీ అనే మాట నుంచి వచ్చింది. బ్రిటిష్ వాళ్లు ఈ హిల్‌స్టేషన్‌ని, జలపాతాన్ని గుర్తించకముందు ఈ జలపాతానికి ఉన్న పేరేమిటి అని అడిగితే స్థానికుల్లో ఎవరి దగ్గరా సమాధానం దొరకదు. ఇది గర్వాలీ రీజియన్. వారి భాషలో ఈ జలపాతం పేరు ఏమి ఉండేదో గైడ్‌లు కూడా చెప్పలేరు. ఈ వాటర్‌ఫాల్ దగ్గరున్న గ్రామం పేరు రామ్‌గావ్.



రెండు వేల అడుగులు దిగాలి!

మనదగ్గర నివాసప్రదేశాలు విశాలమైన మైదానాల్లో విస్తరించి ఉంటాయి. ఒక ఊరికి మరో ఊరికి మధ్య ఓ కొండ లేదా ఊరి మధ్యలో కొండలు, గుట్టలు ఉంటాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రం దాదాపుగా పర్వతశ్రేణుల్లో విస్తరించి ఉంటుంది. ముస్సోరీ పట్టణం కూడా అంతే. దారి పొడవునా రోడ్డుకి ఇరువైపులా ఉన్న కట్టడాలే పట్టణం అంటే. పట్టణం విస్తీర్ణాన్ని చదరపు కిలోమీటర్లలో చెప్పలేం, కిలో మీటర్లలో చెప్పాల్సిందే. లైబ్రరీ రోడ్, వ్యూ పాయింట్, మాల్‌రోడ్, లాల్‌టిబ్బ, లాండొర్, క్యామెల్స్ బ్యాక్ రోడ్... ఇలా అన్నీ కొండవాలులో ఉన్న రోడ్లే. గన్‌హిల్ మీద మాత్రం కొంత చదును నేల ఉంటుంది. ఢిల్లీ నుంచి ముస్సోరీకి సుమారుగా 300 కిలో మీటర్లుంటుంది. ముస్సోరీ సముద్రమట్టానికి రెండువేల మీటర్ల ఎత్తులో ఉంటుంది. కెంప్టీ ఫాల్స్‌కు చేరడానికి కొండల అవతలవైపు 13 కిలోమీటర్లు కిందకు ప్రయాణించాలి. ఆరువేల ఐదు వందల అడుగుల నుంచి నాలుగువేల ఐదువందల అడుగులకు చేరతాం. అంటే రెండు వేల అడుగుల కిందకు ప్రయాణిస్తామన్నమాట. ముస్సోరీ నుంచి తెల్లవారుజామున ప్రయాణం మొదలుపెడితే ఓ గంట లోపే కెంప్టీ ఫాల్స్‌కు చేరతాం. కొండవాలులో ప్రయాణం కాబట్టి వేగం పాతికకిలోమీటర్లకు మించదు.




ముస్సోరీ పట్టణం వాహనాల హారన్‌ల శబ్దం దూరమయ్యే సరికి సన్నగా జలపాతం ఝరి మొదలవుతుంది. దగ్గరకు వెళ్లేకొద్దీ ఝుమ్మనే శబ్దం వీనులవిందు చేస్తుంది. తెల్లగా పాలకుండ ఒలికినట్లుండే జలపాతం కిందకు వెళ్లే లోపే నీటి తుంపర మంచు బిందువులంత చల్లగా ఒంటిని తాకుతూ ఆహ్వానం పలుకుతాయి. శీతాకాలంలో జలపాతం హోరు ఎండాకాలంలో ఉన్నంత జోరుగా ఉండదు. నీరు గడ్డకడదామా నేల మీద పడదామా అన్నట్లు ఉంటుంది.

కాబోయే కలెక్టర్‌లు కనిపిస్తారు!

ముస్సోరీ టూర్‌లో సాయంత్రాలు కానీ వీకెండ్‌లో కానీ కనిపించే కొందరు యువతీయువకులను జాగ్రత్తగా గమనించి చూస్తే పర్యాటకులు కాదు, స్థానికులూ కాదనే సందేహం వస్తుంది. వాళ్లు సివిల్స్‌లో ఐఏఎస్‌కు సెలెక్ట్ అయ్యి ముస్సోరీలో శిక్షణ పొందుతున్న భవిష్యత్తు కలెక్టర్‌లు. కెంప్టీ ఫాల్స్‌ను చూసిన తర్వాత తిరిగి ముసోరీ చేరుకుని ఇప్పుడు కేబుల్ కార్‌లో గన్‌హిల్‌కు చేరాలి. గన్‌హిల్‌కి రాత్రిపూట వెళ్తే లైట్ల కాంతిలో మిణుకుమిణుకు మంటున్న ముసోరీని చూడవచ్చు. పగలు వెళ్తే డెహ్రాడూన్ పట్టణం కూడా కనిపిస్తుంది. ఆకాశం మబ్బుల్లేకుండా నిర్మలంగా ఉంటే గన్‌హిల్ నుంచి హిమాలయ పర్వత శిఖరాలు కనిపించే అవకాశం ఉంది.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





వైజయంతిమాల

నృత్య దిగ్గజం

భారతీయ కళలో సంప్రదాయం, ఆధునికతకు వారధిగా నిలిచిన ప్రముఖ నర్తకి, నటి వైజయంతిమాల ఉత్తమ బాలీవుడ్ నటీమణుల జాబితాలో స్థానం పొందారు. 1954 నుండి 1967 వరకు బాక్సాఫీస్ ఇండియా 'అగ్ర నటీమణుల' జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. భారతీయ సినిమా 'మొదటి మహిళా సూపర్‌స్టార్' అని సగౌరవంగా పిలిచింది. మొదటి పాన్ ఇండియా స్టార్‌గా, భారతీయ నృత్యకారిణిగా, రాజకీయ నాయకురాలిగా.. ఇలా మూడు రంగాలలో తనదైన ముద్ర వేసిన వైజయంతిమాల ఈ యేడాది పద్మ విభూషణ్ అవార్డు అందుకున్నారు.



ఆగస్టు 13, 1933న తమిళ కుటుంబంలో జన్మించిన వైజయంతిమాల కళల ప్రపంచంలోకి చిన్న వయస్సులోనే చేరిపోయారు. అమ్మమ్మ యదుగిరి దేవి ఆమెకు భరతనాట్యం పట్ల ప్రేమను కలిగించిన మొదటి గురువు. ఎనిమిదేళ్ల వయస్సులో వైజయంతిమాల అప్పటికే తన నృత్యంతో ప్రేక్షకులను ఆకర్షించింది. రోమ్‌లోని ప్రముఖుల సమక్షంలోనూ, పోప్ ముందు కూడా ప్రదర్శన ఇచ్చారు. వేదికపైన, సినిమా రెండింటిలోనూ అద్భుతమైన కెరీర్‌ను చూసింది. కేవలం 16 సంవత్సరాల వయస్సులో తమిళ చిత్రం వాజ్కై తో తెరంగేట్రం చేశారు. ఆమె కాలంలోని అనేక మంది నటీమణులు తమ పాత్రలలో భాగంగా కేవలం నృత్యం చేసేలా కాకుండా, వైజయంతిమాల భారతీయ చిత్రాల కథా కథనంలో నృత్యాన్ని ఒక సమగ్ర అంశంగా మార్చారు.

సమర్థమైన ప్రదర్శన

సినిమాలలో డ్యాన్స్ సన్నివేశాలు ఉండేలా ఒక కొత్త ప్రమాణాన్ని పరిచయం చేశారు వైజయంతి మాల. ఆ విధంగా సినిమాకి భరతనాట్యం గొప్పతనాన్ని తీసుకువచ్చిన నర్తకి. నాగిన్, మధుమతి వంటి చలనచిత్రాల కథలలో శాస్త్రీయ పద్ధతులను మిళితం చేయడంలో ఆమె సామర్థ్యాన్ని చూపింది. 'ఈరోజు సినిమాల్లో నృత్యం దాని ఆత్మను కోల్పోయింది' అంటారు ఆమె. మారుతున్న ట్రెండ్‌ల మధ్య శాస్త్రీయ కళారూపాల సమగ్రతను కాపాడుకోవడంలో ఆమె నిబద్ధతను ఈ సెంటిమెంట్ నొక్కి చెబుతుంది.

సినిమా నుంచి...

సినీ పరిశ్రమలో దాదాపు రెండు దశాబ్దాల తర్వాత, నటన నుండి బయటకు వచ్చారు. నాట్యం పట్ల ఆమెకున్న అభిరుచి నృత్యంలో మరింత లోతుగా అన్వేషించే దిశగా మారింది. సాంప్రదాయ ఆలయ కళారూపాలను సంరక్షించడానికి, భరతనాట్యం గొప్ప వారసత్వాన్ని ప్రోత్సహించడానికి అంకితమైన నృత్య పరిశోధనా సంస్థను ఆమె స్థాపించారు. భవిష్యత్ తరాలు దాని అందం, ప్రాముఖ్యతను అభినందిస్తూ, ప్రదర్శనలు ఇవ్వడం, బోధించడం కొనసాగించడం ద్వారా ఈ కళారూపానికి ఆమె అంకితభావం స్పష్టంగా కనిపిస్తుంది. నృత్యానికి మించి, వైజయంతిమాల దక్షిణ మద్రాసు పార్లమెంటు సభ్యురాలిగా రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు.

● అమరకంటక్

నర్మద పుట్టిల్లు





కార్తీకమాసం వస్తోంది. నర్మద నది పుట్టింటికి వెళ్దాం. కార్తీకమాసానికి నర్మద నదికి ఏ ప్రాధాన్యమూ లేదు. ఇక్కడున్న అమరకంటక్ ఆలయం ఈ మాసంలో భక్తులతో పోటెత్తుతుంది. నది విషయానికి వస్తే మనదేశంలో పుట్టిన నదుల్లో బంగాళాఖాతంలో కలిసేవే ఎక్కువ. పశ్చిమంగా ప్రయాణించి అరేబియాలో కలిసే నదులు తక్కువ. వాటిలో పెద్దనది నర్మద. మధ్యప్రదేశ్‌లో మైకాల్ కొండల్లో ఉంటుందీ ప్రదేశం. వింధ్యపర్వత శ్రేణులు, సాత్పూర శ్రేణుల కలయిక ప్రదేశం ఇది. దట్టమైన అడవి మధ్యలో కొండల్లో నుంచి నీటి ప్రవాహం ఒక చోట చిన్న సరస్సుగా విస్తరించి అక్కడ నుంచి ప్రవాహంగా కిందకు సాగుతుంది. ఆ సరస్సునే నర్మదాకుండ్ అంటారు. ఈ కొండల్లో నర్మదతోపాటు సోన్, జోహిల్లా నదులు కూడా ఉద్భవించాయి. ప్రకృతిని దైవంగా భావించే పరంపరలో భాగంగా ఇక్కడ నర్మద నదికి ఆలయం ఉంది. నీరు అంటే జనానికి జీవనాన్నిచ్చేది కాబట్టి ఈ ప్రదేశానికి అమరమైనది అనే పేరు పెట్టాడు కబీర్‌దాస్. కాళిదాసు తన రచనల్లో ఈ ప్రదేశాన్ని అమరకంటకం అన్నాడని చెబుతారు. ఈ పొయెటిక్ ఎక్స్‌ప్రెషన్స్‌తోనే ఈ ప్రదేశానికి అమరకంటక్ అనే పేరు వచ్చింది. ఆది శంకరాచార్యుడు ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. పురాతన ఆలయాన్ని రాణి అహిల్యాబాయ్ హోల్కర్ పునరుద్ధరించారు.

ఢిల్లీలో మన జానపద సంస్కృతి

ఆర్ట్



ఢిల్లీలోని ఆర్ట్ అలైవ్ గ్యాలరీలో తోట వైకుంఠం ఐదు దశాబ్దాల కళాత్మక ప్రయాణాన్ని ఆర్ట్ లవర్స్ ఆసక్తిగా తిలకిస్తున్నారు.

తెలంగాణలోని కరీంనగర్ జిల్లా బూరుగుపల్లిలో పుట్టి పెరిగిన తోట వైకుంఠం దేశంలోనే అత్యంత ప్రముఖ కళాకారులలో ఒకరిగా మారే వరకు కళతో ప్రయాణం చేశారు. ఢిల్లీలోని ఆర్ట్ అలైవ్ గ్యాలరీలో రెండు అంతస్తులలో విస్తరించి ఉన్న అతని తాజా సోలో ఎగ్జిబిషన్ రీడిఫైనింగ్ ది కల్చరల్ గేజ్, 1980ల నుండి 2024 వరకు ఆయన చేసిన విస్తృతమైన 70 కళాఖండాలను ప్రదర్శిస్తుంది. ఇది తెలంగాణ శక్తివంతమైన సంస్కృతిని కళ్లకు కడుతుంది. వైకుంఠం తన కళాత్మక వృత్తిని కాగితంపై బొగ్గు, పెన్సిల్‌తో పని చేయడం ప్రారంభించాడు. చదువుతున్న కళాశాలలో ఉపాధ్యాయుడు ఒకరు అతని సామర్థ్యాన్ని అతనికే చూపించారు. 'ఒక చిన్న బొగ్గు ముక్కతో, విభిన్న పొరలతో మొత్తం ప్రపంచాన్ని సృష్టించవచ్చు. ఇది నిజంగా ప్రత్యేకమైనది. బొగ్గు టోనల్ విలువ అసాధారణమైనది, అనేక వైవిధ్యాలను ప్రయత్నించవచ్చు' అని వైకుంఠం చెప్పారు.



గ్రామ దృశ్యాలు

ఆ తరువాత కాన్వాస్‌పై యాక్రిలిక్స్‌తో ప్రధానంగా తెలంగాణా మహిళలపై దృష్టి సారించే చిన్న ఫార్మాట్‌లతో చిత్రాలను గీయడం ప్రారంభించాడు. ఈ విషయం అతనికి ఆసక్తిని కలిగించింది. అనేక సెషన్‌ల అభ్యాసం తర్వాత పెయింటింగ్ చేయడం ప్రారంభించాడు. 'నా ప్రజలు, గ్రామం, దాని రోజువారీ దృశ్యాల జ్ఞాపకాలతో నిండిన నా అంతర్గత ప్రపంచాన్ని చిత్రించాను. దూరం ప్రయాణించడానికి నా దగ్గర అంత డబ్బు లేదు. కాబట్టి, మా గ్రామంలోనే అనేక చిత్రాలను రూపొందించాను' అని అతను గుర్తుచేసుకున్నాడు. ప్రజల జీవనశైలిని గమనించి పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగులపై దృష్టి పెట్టాడు.

తెలంగాణ మహిళ

'మా కమ్యూనిటీలోని మహిళల సంక్లిష్టమైన ఆభరణాలు, కేశాలంకరణ, శక్తివంతమైన వస్త్రధారణను అధ్యయనం చేశాను, వారి సహజసిద్ధమైన శక్తి, బలం, పెంపకం.. ఇలా అన్నింటా తెలంగాణ స్త్రీలను మనోహరంగా చూపడానికి ప్రయత్నించాను. తల్లి– బిడ్డ, గ్రామీణ భారతీయ స్త్రీల పెంపకం స్ఫూర్తిమంతంగా ఉంటుంది. ఒక తల్లి తన బిడ్డను ఆరాధించే దృష్టితో చూస్తుంది. మహిళల పట్ల నా దృక్పథాన్ని రూపొందించడంలో బలమైన పాత్ర పోషించిన మా అమ్మ నాకు ప్రేరణ' అంటారు ఈ కళాకారుడు. గ్రామస్తుల సాధారణ భంగిమలో కూర్చున్న బొమ్మలతో, నిటారుగా ఉన్న స్థితిలో ముడుచుకున్న మోకాళ్లతో రూపొందించి ఉంటాయి.

స్థానిక దుస్తులను ధరించి, చీర, చోలీలను చుక్కలతో అలంకరించారు. 'నా ముందున్న మార్గం ద్వారా సృజనాత్మక శక్తిని రాష్ట్ర ప్రజలను, వారి సంప్రదాయ జీవన సంపదను అన్వేషించడానికి, వారిని మెరుగుపరచడానికి, పరిపూర్ణంగా మార్చడానికి కృషి చేస్తాను' అని వివరిస్తారు. ఎగ్జిబిషన్‌తో పాటు డాక్యుమెంటరీ ఫిల్మ్, ఐదు దశాబ్దాల కళాత్మక ప్రయాణంపై పరిశోధన చేసిన ప్రచురణ కూడా ఇక్కడ అందుబాటులోఉంది. 'దాదాపు పదేళ్ల తర్వాత ఢిల్లీలో షో చేస్తున్న ఈ మాస్టర్ ఆర్టిస్ట్ స్టూడియోతో పాటు కళ, జీవితంపై అతని దృక్కోణాల గురించి మనకు అత్యంత దగ్గరైన రూపాన్ని అందిస్తుంది' అని ఆర్ట్ అలైవ్ గ్యాలరీ డైరెక్టర్ సునైనా ఆనంద్ చెప్పారు. ఈ ఆర్ట్ అలైవ్ గ్యాలరీలో ఈ చిత్రాల ప్రదర్శన నవంబర్ 20 వరకు (ఆదివారాలు మూసివేయబడతాయి) ఉదయం 11 నుండి సాయంత్రం 7 వరకు ఉంటుంది.

వేదిక

ఒక్కచోట చేరిన నృత్య ప్రపంచం

కేంద్ర సాంస్కృతిక సంస్థ నిర్వహించిన ఆరు రోజుల మెగా డ్యాన్స్ ఫెస్టివల్ భారతదేశంలోని ప్రముఖ గురువులు, నృత్యకారులను ఒకచోట చేర్చింది.



భారతీయ నృత్య సంస్కృతి చరిత్ర, భౌగోళిక, రసాయన, జీవశాస్త్రంతో చాలా పొరలను నిక్షిప్తం చేసుకొని ఉంది. ఈ రంగంలో గురు శిష్య పరంపర కూడా అత్యధికంగా ఉంది. అయితే, కొన్ని దశల తర్వాత కొందరు తమ జీవన పరిమితులకు లోనవుతుంటారు. కొంతమంది సమయస్ఫూర్తితో నాట్యంలో లీనమైపోతారు. కొందరు యువకులు విడిపోయి కొత్తగా ఏదైనా చేయాలని కోరుకుంటారు. ఆ విధంగా వివిధ వయస్సులు, హోదాలు కలిగిన 500 మంది డ్యాన్సర్లు చర్చించడానికి, ప్రసంగించడానికి ఒక పెద్ద గదిలో ఉంచడానికి, సమాధానాలను కనుగొనడానికి సంగీత నాటక అకాడమీ ప్రయత్నించింది. ఐదు తరాలకు చెందిన 500 మందికి పైగా హాజరైన డ్యాన్స్ గ్రూప్ ఆరు రోజుల పాటు 25కి పైగా సెషన్‌లు, ముఖ్యమైన చర్చలు జరిపారు. భారతదేశంలోని చాలా మంది గురువులు, నృత్యకారులను ఒకే చోట చూడటం అంటే సాధ్యమయ్యే విషయం కాదు. వారందరికీ ఆతిథ్యం ఇవ్వడం, రవాణా సదుపాయం వంటి వసతులు కల్పించడం అభినందనీయం.



నీ ఉద్యోగులు, కస్టమర్ల అభిప్రాయాలను తెలుసుకో..
ఇంకేమీ ఆలోచించకుండా వారు చెప్పినట్లు వ్యాపారం చెయ్...
- జాన్ లెగెరే, టీ-మొబైల్ మాజీ సీఈఓ

సాక్షి ప్లస్
సోమవారం। 28-10-2024

మార్కెట్‌లో మతాబులు వెలిగేనా?

- ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులే
- 1న గంటపాటు ముహూరత్ ట్రేడింగ్
- విదేశీ గణాంకాలపై ఇన్వెస్టర్ల దృష్టి
- ఫలితాలు, డెరివేటివ్స్ ముగింపు కీలకం
- ఆటుపోట్లకు చాన్స్ ఉందంటున్న నిపుణులు



ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లపై పలు అంశాలు ప్రభావం చూపనున్నాయి. దేశీయంగా కార్పొరేట్ల క్యూ2 ఫలితాలు, అక్టోబర్ ఎఫ్అండ్‌వో సిరీస్ ముగింపు కీలకంగా నిలవనున్నాయి. దీంతో ఈ వారం మార్కెట్లు ఆటుపోట్లకు లోనుకానున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు ఇప్పటికే వేడెక్కిన అమెరికా అధ్యక్ష ఎన్నికలు, పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధ భయాలు సైతం ట్రెండ్‌ను ప్రభావితం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ స్టాక్ మార్కెట్ల తీరు, క్యూ2 ఫలితాలపై ఇన్వెస్టర్లు ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఈ వారం బీహెచ్ఈఎల్, డాబర్ ఇండియా, గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీలు.. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అదానీ పవర్ జులై-సెప్టెంబర్(క్యూ2) పనితీరును వెల్లడించనున్నాయి. గురువారం(31న) అక్టోబర్ డెరివేటివ్స్ గడువు ముగియనుంది. ఇది మార్కెట్లలో హెచ్చుతగ్గులకు కారణం కావచ్చని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా అంచనా వేశారు. స్వల్ప కాలంలో మార్కెట్లు కన్సాలిడేట్ కావచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల అమ్మకాలు ఆగడం, యూఎస్ అధ్యక్ష ఎన్నికలు పూర్తికావడం వంటి అంశాలు ట్రెండ్ రివర్స్‌కు దోహదం చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

ఎఫ్‌పీఐల ఎఫెక్ట్

కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్‌లో వెల్లువెత్తుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలు ఇన్వెస్టర్లను ఆందోళనకు లోనుచేస్తున్నట్లు నాయిర్ పేర్కొన్నారు. ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది. దీపావళి సందర్భంగా శుక్రవారం(నవంబర్ 1) మార్కెట్లకు సెలవుకాగా.. సంవత్ 2081 ప్రారంభం సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు గంటపాటు ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించనున్నాయి. ఎప్పటిలాగే బీఎస్ఈ, ఎన్ఎస్ఈ.. సాయంత్రం 6-7 మధ్య ముహూరత్ ట్రేడింగ్‌కు తెరతీయనున్నాయి. నిరుత్సాహకర క్యూ2 ఫలితాలు, ఎఫ్‌పీఐల భారీ అమ్మకాల నేపథ్యంలో గత వారం మార్కెట్లు పతనబాటలో సాగిన సంగతి తెలిసిందే. దీంతో సెంటిమెంటు బలహీనపడినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ్‌కుమార్ తెలియజేశారు. అందుబాటు ధరల్లో ఉన్న చైనా మార్కెట్లు, అక్కడి ప్రభుత్వ సహాయక ప్యాకేజీ ఎఫ్‌పీఐ అమ్మకాలకు కారణమవుతున్నట్లు తెలియజేశారు.

విదేశీ అంశాలు

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ పరిస్థితులు, ముడిచమురు ధరలు కీలకంగా నిలవనున్నట్లు సంతోష్ పేర్కొన్నారు. వీటికితోడు ఎఫ్‌పీఐల తీరు, క్యూ2 ఫలితాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు వివరించారు. యూఎస్ అధ్యక్ష ఎన్నికలకు ముందు ప్రపంచవ్యాప్తంగా ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించనున్నట్లు తెలియజేశారు. ఈ వారం యూఎస్ క్యూ3(జులై-సెప్టెంబర్) జీడీపీ గణాంకాలు, సెప్టెంబర్ ఉపాధి రిపోర్ట్, చైనా తయారీ రంగ డేటాతోపాటు.. యూఎస్ పీసీఈ ధరలు వెల్లడికానున్నాయి. ఇవి ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యోల్బణ అంచనాలపై ప్రభావం చూపే విషయం విదితమే. జపాన్ మానిటరీ పాలసీ సమావేశం జరగనుంది.

2.2 శాతం డౌన్

గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు అమ్మకాలతో నీరసించాయి. సెన్సెక్స్ నికరంగా 1,822 పాయింట్లు(2.25 శాతం) పతనమై 79,402 వద్ద నిలవగా.. నిఫ్టీ మరింత ఎక్కువగా 673 పాయింట్లు(2.7 శాతం) కోల్పోయి 24,181 వద్ద ముగిసింది. మిడ్ క్యాప్ 5.2 శాతం, స్మాల్‌క్యాప్ 7.4 చొప్పున కుప్పకూలాయి. కాగా.. దేశీ మార్కెట్ రికార్డ్ గరిష్టం నుంచి 8 శాతం పతనమైనట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్‌మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా ప్రస్తావించారు. ఇందుకు నిరాశపరుస్తున్న క్యూ2 ఫలితాలు, ఎఫ్‌పీఐల అమ్మకాలు కారణమవుతున్నట్లు తెలియజేశారు. సమీపకాలంలో ఈ ట్రెండ్ కొనసాగే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఎఫ్‌పీఐల అమ్మకాల రికార్డ్

గత నెలలో దేశీ స్టాక్స్‌లో నికర ఇన్వెస్టర్లుగా నిలిచిన ఎఫ్‌పీఐలు ఉన్నట్టుండి అక్టోబర్‌లో అమ్మకాల బాట పట్టారు. ఇటీవల అమ్మకాల స్పీడ్ పెంచి నిరవధికంగా స్టాక్స్ నుంచి వైదొలగుతున్నారు. తద్వారా ఈ నెలలో ఇప్పటివరకూ నికరంగా రూ. 85,790 కోట్ల(10.2 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. వెరసి మార్కెట్ చరిత్రలోనే అక్టోబర్ నెల అత్యధిక విక్రయాల రికార్డ్‌కు వేదికకానుంది. అంతక్రితం నెల(సెప్టెంబర్)లో ఎఫ్‌పీఐలు గత 9 నెలల్లోనే అత్యధికంగా రూ. 57,724 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ఇంతక్రితం 2020 మార్చిలో మాత్రమే ఎఫ్‌పీఐలు ఒక నెలలో అత్యధికంగా రూ. 61,973 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు.



మల్టీ-అసెట్ ఫండ్స్‌తో పోర్ట్‌ఫోలియోకు దీపావళి కాంతులు

కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అంతా ఒక్క చోట చేరి సంతోషంగా జరుపుకునే దీపాల పండుగ దీపావళి. సంపద, శ్రేయస్సును ప్రసాదించే లక్ష్మీ దేవి పూజ ఈ వేడుకల్లో కీలకమైనది. లక్ష్మీదేవి కటాక్షం పొందాలన్నా, సంపదను సాధించాలన్నా మనం కూడా కష్టపడి పనిచేయాలి. తెలివిగా ఇన్వెస్ట్ చేయాలి. లక్ష్మీ దేవి పూజలో ఉపయోగించే దీపాలు, పూలు, నగదు మొదలైన వాటిని ఒకసారి పరిశీలిస్తే మన ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోను తీర్చిదిద్దుకునేందుకు ప్రేరణనిచ్చే అంశాలెన్నింటినో తెలుసుకోవచ్చు. వివిధ పూజాద్రవ్యాల సమాహారంలాగా ఈక్విటీ, డెట్, గోల్డ్ మొదలైన వాటితో కూడుకున్న మల్టీ అసెట్ ఫండ్ అనేది మెరుగైన రాబడులను పొందడంలో ఇన్వెస్టర్లకు ఎంతగానో తోడ్పడుతుంది.

సురేశ్ సోని



సీఈవో, బరోడా బీఎన్‌పీ పారిబా ఏఎంసీ

దీపాలు: ఈక్విటీల కాంతులు

చీకటిని పారద్రోలి, ఆశల కాంతులు నిస్తాయి దీపాలు. మొత్తం పూజా కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహించేలా వెలుగు పంచుతాయి. మల్టీ-అసెట్ ఫండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే, ఈక్విటీ పెట్టుబడులు కూడా ఇలాంటి పాత్రే పోషిస్తాయి. సాధారణంగా పోర్ట్‌ఫోలియోకు వృద్ధి చోదకాలుగా ఈక్విటీలు పనిచేస్తాయి. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధికి దోహదపడతాయి. దీపాలు ఏ విధంగానైతే గదిని కాంతివంతం చేస్తాయో దీర్ఘకాలంలో అధిక రాబడులను అందించి వృద్ధి దిశగా సాగే బాటను ప్రకాశింపచేస్తాయి ఈక్విటీలు. మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా వీటితో కొన్ని రిస్కులు ఉన్నప్పటికీ సంపద సృష్టి విషయంలో వీటికున్న సామర్థ్యాల కారణంగా సమతుల్యమైన పోర్ట్‌ఫోలియోలో తప్పనిసరిగా చోటు కల్పించాల్సిన ఆర్థిక సాధనంగా ఈక్విటీలు ఉంటాయి.

పుష్పాలు: డెట్ సాధనాల సౌరభాలు

లక్ష్మీ పూజలో స్వచ్ఛత, అందానికి చిహ్నమైన పుష్పాలు కూడా కీలకమే. పరిమళాలు వెదజల్లే పుష్పాలు పూజా కార్యక్రమానికి ఒకవైపు రంగుల హంగులను జోడిస్తూ మరోవైపు ఆధ్యాత్మిక శోభను తెస్తాయి. మల్టీ అసెట్ ఫండ్‌లో బాండ్లు, డిబెంచర్లు, గవర్నమెంట్ సెక్యూరిటీల్లాంటి డెట్ సాధనాలు కూడా ఇలాంటి పాత్రే పోషిస్తాయి. మల్టీ అసెట్ ఫండ్‌లో డెట్ సాధనాలు స్థిరత్వాన్ని, క్రమానుగత ఆదాయాన్ని అందిస్తాయి. ఈక్విటీలు హెచ్చుతగ్గులకు లోనైనా పోర్ట్‌ఫోలియో తీవ్ర ఒడిదుడుకులకు లోను కాకుండా సమతూకంగా ఉండేలా డెట్ సాధనాలు కాస్త బఫర్‌గా పనిచేస్తాయి. ఇవి మరో అంచె భద్రతను కల్పిస్తాయి. మార్కెట్ అనిశ్చితిని అధిగమించే ధీమాను అందిస్తాయి.

తిలకం: రక్షణ కవచం

నుదుటిపైన బొట్టు/తిలకం శుభాన్ని, రక్షణను సూచిస్తుంది. ప్రతికూల శక్తుల నుంచి భక్తులకు ఇది రక్షణ కల్పిస్తుంది. మల్టీ-అసెట్ ఫండ్‌లో ఈ పాత్రను పసిడి పోషిస్తుంది. సాధారణంగా ద్రవ్యోల్బణం, మార్కెట్ పతనాలకు హెడ్జింగ్‌గా ఉపయోగపడే సాధనంగా బంగారాన్ని పరిగణిస్తారు. రక్షణ కల్పించే తిలకంలాగే బంగారం కూడా ఆర్థిక సంక్షోభాల సమయంలో మీ పోర్ట్‌ఫోలియోను సురక్షితంగా ఉంచుతుంది. తమ సంపదను కాపాడుకోవాలనుకునే ఇన్వెస్టర్లు .. కాలం గడిచినా విలువను కోల్పోని బంగారాన్ని తమ పోర్ట్‌ఫోలియోలో తప్పనిసరిగా చేర్చుకోతగిన సాధనం కాగలదు. ఇటీవలి కాలంలో చూస్తే బంగారం కూడా గణనీయంగా రాబడులు అందించింది. వివిధ అంశాలను పరిశీలిస్తే రాబోయే రోజుల్లో పసిడికి డిమాండ్ మరింతగా పెరిగే సూచనలే కనిపిస్తున్నాయి.


నాణేలు/డబ్బు: నగదు తత్సమానాలు

నాణేలు, నోట్ల రూపంలో సంపద, సమృద్ధి, శ్రేయస్సు, ఆర్థిక సమృద్ధిని సూచించే నగదుకు కూడా లక్ష్మీ పూజలో ప్రాధాన్యం ఉంటుంది. లక్ష్మీ దేవి ఆర్థిక వృద్ధి, స్థిరత్వాన్ని ప్రసాదిస్తుందని, ఆశీర్వదిస్తుందని నమ్మకం. ఇన్వెస్టింగ్ ప్రపంచంలో టీఆర్ఈపీఎస్ (ట్రెజరీ బిల్స్ రీపర్చేజ్ అగ్రిమెంట్స్), ట్రెజరీ బిల్లుల్లాంటివి నగదు తత్సమానమైనవి. ఇవి పోర్ట్‌ఫోలియోలో అంతర్గతంగా భద్రతా కవచంగా ఉపయోగపడతాయి. మార్కెట్లు ఒడిదుడుకులకు లోనైనప్పుడు స్థిరత్వాన్ని ఇస్తాయి.

వివిధ పూజాద్రవ్యాలతో లక్ష్మీ పూజ ఎలాగైతే సంపూర్ణమవుతుందో వివిధ సాధనాలను తగు పాళ్లలో జోడించుకుంటే పోర్ట్‌ఫోలియో కూడా సంపూర్ణంగా, సమతూకంగా ఉంటుంది. ఈక్విటీ, డెట్, బంగారం, నగదు మేళవింపుగా ఉండే మల్టీ అసెట్ ఫండ్స్ అటువంటి ప్రయోజనాలను ఇన్వెస్టర్లకు కల్పిస్తాయి.


కోల్ ఇండియా లాభం డౌన్

- క్యూ2లో రూ. 6,275 కోట్లు
- షేరుకి రూ. 15.75 డివిడెండ్



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం కోల్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 22 శాతం క్షీణించి రూ.6,275 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 8,049 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,760 కోట్ల నుంచి రూ. 32,178 కోట్లకు క్షీణించింది. వాటాదారులకు షేరుకి రూ. 15.75 చొప్పున ఈ ఏడాదికి తొలి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. పూర్తి అనుబంధ సంస్థ సీఐఎల్ సోలార్ పీవీని మూసివేసేందుకు బోర్డు అనుమతించినట్లు కోల్ ఇండియా వెల్లడించింది. అయితే ఇప్పటివరకూ ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలనూ చేపట్టకపోవడం గమనార్హం! 8-10 నెలల్లోగా మూసివేత ప్రక్రియ పూర్తికావచ్చని కోల్ ఇండియా భావిస్తోంది. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిలో కంపెనీ 80 శాతం వాటాను ఆక్రమించే సంగతి తెలిసిందే.

జియో ధమాకా ఆఫర్లు



హైదరాబాద్: రిలయన్స్ జియో తాజాగా 'దీపావళి ధమాకా' ఆఫర్లను ప్రకటించింది. సాధారణంగా రూ. 999 ధర ఉండే జియోభారత్ 4జీ ఫోన్లను పండుగ సందర్భంగా రూ. 699కే అందిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే, వినియోగదార్లకు రూ. 123కే నెలవారీ సబ్‌స్క్రిప్షన్ అందిస్తున్నట్లు తెలిపింది. ఇతర ఆపరేటర్ల రూ. 199 ప్లాన్లతో పోలిస్తే ఇది 40 శాతం చౌక అని వివరించింది. రూ. 123 నెలవారీ టారిఫ్ ప్లాన్‌తో అపరిమితమైన ఉచిత వాయిస్ కాల్స్, నెలకు 14 జీబీ డేటా, 455 పైగా లైవ్ టీవీ ఛానల్స్, సినిమా ప్రీమియర్లు మొదలైన ప్రయోజనాలు పొందవచ్చని రిలయన్స్ జియో తెలిపింది.

రెయిన్‌బో హాస్పిటల్స్ లాభం రూ. 79 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ నికర లాభం రూ. 79 కోట్లుగా (కన్సాలిడేటెడ్) నమోదైంది. క్రితం క్యూ2లో ఇది సుమారు రూ. 63 కోట్లు. మరోవైపు, ఆదాయం రూ. రూ. 340 కోట్ల నుంచి రూ. 429 కోట్లకు పెరిగింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలు నవంబర్ 14న ప్రారంభమవుతాయని సంస్థ తెలిపింది.

ఇలా చేస్తే భారీగా విదేశీ పర్యాటకులు

- డైరెక్ట్ ఫ్లయిట్ సర్వీసులు అవసరం
- వీసా ప్రక్రియలు సులభంగా మారాలి
- బుకింగ్ డాట్ కామ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: విదేశీ పర్యాటకులను భారీగా ఆకర్షించేందుకు, పర్యాటక రంగం వృద్ధికి వీలుగా బుకింగ్ డాట్ కామ్ కీలక సూచనలు చేసింది. అంతర్జాతీయంగా మరిన్ని ప్రాంతాల నుంచి డైరెక్ట్ విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం, వీసా ప్రక్రియలను సులభతరం చేయడం, భారత్‌లోని విభిన్న, విస్తృతమైన పర్యాటక ప్రదేశాల గురించి ప్రచారం చేయాలని సూచించింది. వివిధ భాగస్వాముల నుంచి సమిష్టి చర్యలకు తోడు నిర్దేశిత పెట్టుబడులతో భారత పర్యాటకం కొత్త శిఖరాలకు వెళుతుందని పేర్కొంది. రానున్న ఏడాది, రెండేళ్లలో భారత్‌ను సందర్శించాలని అనుకుంటున్న వయోజనుల అభిప్రాయాలను సర్వేలో భాగంగా తెలుసుకుని బుకింగ్ డాట్ కామ్ ఒక నివేదిక విడుదల చేసింది. 19 దేశాలకు చెందిన 2,000 మంది అభిప్రాయాలను సర్వేలో భాగంగా తెలుసుకుంది. భారత్‌కు రావాలనుకుంటే, ఎదుర్కొనే సవాళ్లు, ప్రోత్సాహకాలు, ప్రాధాన్యతలు ఏంటని ప్రశ్నించి, వారి అభిప్రాయాలు రాబట్టింది. విదేశీ పర్యాటకుల్లో సగం మంది కేవలం భారత్‌ను చూసి వెళ్లేందుకే వస్తున్నారు. మూడింట ఒక వంతు భారత్‌తోపాటు, ఆసియాలో ని మరికొన్ని దేశాలకూ వెళ్లేలా ట్రావెల్ ప్లాన్‌తో వస్తున్నారు. యూఎస్, యూకే, జర్మనీ, యూఏఈ నుంచి ఎక్కువ మంది వస్తున్నారు. సంప్రదాయంగా చైనా, కెనడా, బంగ్లాదేశ్ నుంచి ఎక్కువ మంది వచ్చేవారు. భారత్‌కు వస్తున్న విదేశీ పర్యాటకులకు సంబంధించి టాప్-10 దేశాల్లో ఆస్ట్రేలియా, ఇటలీ, నెదర్లాండ్స్ తాజాగా చేరాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, జైపూర్ విదేశీ పర్యాటకులు సందర్శించే వాటిల్లో టాప్-5 ఎంపికలుగా ఉంటున్నాయి. హంపి, లేహ్‌కు ఆదరణ పెరుగుతోంది. పత్నిటాప్, పెహల్గామ్, మడికెరి, విజయవాడ, ఖజురహో ప్రాంతాలను సైతం సందర్శించేందుకు విదేశీ పర్యాటకులు ఆసక్తి చూపిస్తున్నారు.

రిటైర్మెంట్ ప్రణాళిక ఇలా..



వివేక్ ప్రకాశ్
సీడీవో (ప్రొప్రైటరీ ఛానల్స్), కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ



చాలా మందికి రిటైర్డ్ జీవితానికి సంబంధించి కొన్ని ఆలోచనలు ఉంటాయి. రిటైర్మెంట్ తర్వాత కొందరు సముద్రానికి దగ్గరగా ఉండటానికి ఇష్టపడితే మరికొందరు ప్రశాంతంగా ఏ కొండ ప్రాంతంలోనో లేదా ఊళ్లోనో ఉండాలనుకుంటారు. మన దేశంలో రిటైర్మెంట్ పరిస్థితులు నాటకీయంగా మారుతున్నాయి. పదవీ విరమణ అంటే పరిమితమైన అవసరాలతో ప్రశాంతమైన జీవనమనే రోజులు పోతున్నాయి. నేటి రిటైరీలు ఉద్యోగానంతరం కూడా జీవితాన్ని చురుగ్గా సాగించాలనుకుంటున్నారు. ప్రయాణాలు, హాబీలు, సోషల్ ఎంగేజ్‌మెంట్ మొదలైన వాటితో సందడిగా గడపాలనుకుంటున్నారు. అయితే, పటిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో కూడుకున్న పెట్టుబడులు పెట్టడం ద్వారానే ఈ కల సాకారం కాగలదు. చాలా మందికి తాము సరైన ప్రణాళికనే వేసుకున్నామా, తాము దాచుకుంటున్నది రిటైర్మెంట్ తర్వాత అవసరాలకు సరిపోతుందా అనే సందేహాలు ఉంటాయి. ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానాల కారణంగా ప్రస్తుతం మనిషి జీవితకాలం మరింతగా పెరుగుతోంది. కాబట్టి ఆర్థిక ప్రణాళికలు వేసుకునేటప్పుడు ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు రిటైర్మెంట్ తర్వాత సౌకర్యవంతంగా జీవించాలంటే నెలకో రూ. 1 లక్ష (ఏడాదికి రూ. 12 లక్షలు) అవసరమవుతాయని, 60 ఏళ్ల తర్వాత మరో 15 ఏళ్ల పాటు జీవిస్తారనుకుంటే మొత్తం రూ. 1.8 కోట్లు (రూ. 12 లక్షలు గీ 15) అవసరమవుతాయి. 85 ఏళ్ల వరకు జీవిస్తే రూ. 3 కోట్లు అవసరమవుతాయి. ఆర్థిక ప్రణాళికలు వేసుకునేటప్పుడు ఇలా అదనపు సంవత్సరాల కోసం ప్లానింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఆర్థిక వనరుల సమీకరణకు కృషి

రిటైర్మెంట్ తర్వాత కూడా జీవితం నిశ్చింతగా సాగేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు అన్ని అవకాశాలను పరిశీలించండి. వాస్తవ గణాంకాలను పరిగణనలోకి తీసుకోండి. మీ నెలవారీ జీవన వ్యయాలను లెక్కేయండి. ముందుగా చెప్పినట్లు జీవితకాలం 85 ఏళ్లనుకుంటే, 60 ఏళ్ల వ్యక్తికి అప్పటివరకు అయ్యే జీవన వ్యయాల కోసం రూ. 3 కోట్ల వరకు నిధి అవసరమవుతుంది. వార్షిక ద్రవ్యోల్బణానికి సమాన స్థాయిలో రాబడులు ఉంటాయన్న అంచనా లతో ఈ మేరకు లెక్క వేశాం. మీ ఖర్చులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని లెక్క వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.

దేశీయంగా పెరుగుతున్న హెల్త్‌కేర్ ఖర్చులను ఒకసారి చూద్దాం. హెల్త్‌కేర్ ద్రవ్యోల్బణం సుమారు 14 శాతంగా ఉంటోంది. కొత్త టెక్నాలజీలు, చికిత్సల వల్ల బిల్లుల భారం మరింతగా పెరుగుతుంది. వైద్య చికిత్సల ఖర్చులు పెరిగే కొద్దీ ఎమర్జెన్సీల కోసం మరింత నిధిని పక్కన పెట్టుకోవాల్సి వస్తుంది. పెరిగే ఖర్చులను తట్టుకునేందుకు మీరేం చేయాల్సి ఉంటుందంటే..

- పెద్ద మొత్తంలో కవరేజీ ఉండేలా హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి
- బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను పరిమాణాన్ని పెంచుకునేందుకు టాప్-అప్ తీసుకోవాలి
- మేజర్ అనారోగ్యం బైటపడినప్పుడు ఏకమొత్తంగా డబ్బునందించే క్రిటికల్ ఇల్‌నెస్ ఇన్సూరెన్స్‌ను పరిశీలించాలి
- జీవితకాలానికి మించే రిటైర్మెంట్ ఫండ్‌ను సమకూర్చుకోవాలంటే ఏం చేయాలంటే

1. భారీ రిటైర్మెంట్ నిధిని ఏర్పాటు చేసుకోవడం: పొదుపు చేయాలి. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయాలి.
2. ఆర్థిక సాధనాలు ఉపయోగించుకోవాలి: మీ రిటైర్మెంట్ ఫండ్‌ను పెంచుకునేందుకు జీవిత బీమా సాధనాలను పరిశీలించండి. ఏ ఆర్థిక ప్రణాళికకైనా, ముఖ్యంగా రిటైర్మెంట్‌లాంటి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలు మొదలైనవి విజయవంతం కావాలంటే జీవిత బీమా, ఆరోగ్య బీమా కవరేజీలు తగినంతగా ఉండటం ముఖ్యం.
3. పన్ను ప్రయోజనాలు: బీమా పథకాలు సాధారణంగా పన్నులపరమైన ప్రయోజనాలు కల్పించేవిగా ఉంటాయి.

పన్ను ఎగవేతను పట్టించే చట్టాలు

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య




ట్యాక్సేషన్ నిపుణులు

పన్ను తప్పకపోవచ్చు. అలాంటప్పుడు కట్టడమే.. నాగరిక పౌరుల బాధ్యత. కట్టాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు పన్ను చెల్లించకపోవడమే 'ఎగవేత'. ఈ 'ఎగవేత' సముద్రంలో ఎందరో గజ ఈతగాళ్లను ఏరిపారేసిన చట్టాలున్నాయి. దాని ఊసెత్తకండి. ఎన్నెన్నో మార్గాలు. ఆదాయాన్ని చూపించకపోవడం, ఆదాయం తక్కువ చేయడం, పన్ను చెల్లించకపోవటం, తప్పుడు లెక్కలు చూపడం, లెక్కలు రాయకపోవడం, స్మగ్లింగ్, దొంగ కంపెనీలు, తప్పుడు బిల్లులు, బ్లాక్ వ్యవహారాలు .. ఇలా శతకోటి మార్గాలు. కొన్ని పరిశ్రమ రంగాల్లో అవకాశం 'ఎండమావి'లాగా ఎదురుచూస్తుంది. సినిమా రంగం, రియల్ ఎస్టేట్, కొన్ని వస్తువుల ఉత్పత్తిలో, బంగారంలో, షేరు మార్కెట్, వ్యవసాయం, బెట్టింగ్, పందాలు, అస్తవ్యస్తమైన రంగాలు.. ఇలా ఎన్నో. చట్టాన్ని అనుసరించడానికి ఒకే మార్గం. రాచమార్గం ఉంటుంది. అతిక్రమించడానికి అన్నీ అడ్డదార్లే.

ఆదాయపు పన్ను చట్టం ప్రకారం..

1. తనిఖీ చేయడం
2. సమన్లు ఇవ్వటం
3. పిలిచి ఎంక్వైరీ చేయడం
4. సెర్చ్
5. సీజ్ చేయడం
6. సర్వే చేయడం
7. ఇతరులను కూడా ఎంక్వైరీ చేయడం
8. సాక్ష్యాలను సేకరించటం
9. పన్ను కట్టించడం (కక్కించడం)
10. వడ్డీ, రుసుములు, పెనాల్టీ విధించడం
11. జైలుకి పంపడం

ఇలా ఎన్నో విస్తృత అధికారాలు ఉన్నాయి.

బినామీ వ్యవహారాల చట్టం..

ఇది సునామీలాంటి చట్టం. బినామీ వ్యవహారాల ద్వారా పన్ను ఎగవేత చేస్తుంటారు. ఈ చట్టం ప్రకారం అధికార్లకు నోటీసులు ఇవ్వడం, ఎంక్వైరీలు, వ్యవహారంలో ఉన్న ఆస్తులను జప్తు చేయడం మొదలైన అధికారాలు ఉన్నాయి.

ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ చట్టం

ప్రపంచంలో జరిగే వ్యవహారాల మీద నిఘా ఉంటుంది. విదేశీయులతో వ్యవహారాలు, ఎక్స్ఛేంజ్ వ్యవహారాలు, అనుమతులు లేకుండా ఆస్తుల సేకరణ, ఆస్తులను ఉంచుకోవడం, వ్యవహారాలు చేయడం, వాటి ద్వారా లబ్ధి పొందడం .. ఇలాంటి వాటిపై అధికార్ల వీక్షణం తీక్షణంగా ఉంటుంది. అన్యాయంగా వ్యవహారాలు చేస్తే, తప్పులు చేస్తే ఉపేక్షించదు ఈ చట్టం. అతిక్రమణ జరిగితే 'అంతే సంగతులు' .. శంకరగిరి మాన్యాలు పట్టాల్సిందే.

మనీలాండరింగ్‌కి సంబంధించిన చట్టం..

అక్రమంగా పొందిన డబ్బుని దాచి.. కాదు దోచి.. దాని మూలాలను భద్రపర్చి.. పన్ను కట్టకుండా.. లెక్కలు చూపకుండా .. దానికి 'లీగల్' రంగు పూసే ప్రయత్నమే మనీలాండరింగ్. ఈ ప్రక్రియ చట్టవిరుద్ధం. ఇందులో ఎందరో బడాబడా బాబులు ఇరుక్కుని జైలు పాలయ్యారు. హవాలా వ్యవహారాలు మొదట్లో హల్వాలాగా ఉంటాయి. హలీంలాగా నోట్లో కరిగిపోతాయి. కానీ అవి చాలా డేంజర్. అలవాట్లకు బానిస అయి, తాత్కాలిక ఆర్థిక ఒత్తిళ్లకు తలవంచి 'లంచావతారం'గా మారిన వారు ఉద్యోగాలు కోల్పోయి.. ఉనికినే కోల్పోయారు. కాబట్టి, సారాంశం ఏమిటంటే 'ఎండమావి' భ్రమలో పడకండి. చక్కటి ప్లానింగ్ ద్వారా చట్టప్రకారం సరైన దారిలో వెళ్లే ప్రయత్నం చేయండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

హరికృష్ణ, విదిత్ జట్టుకు టైటిల్

యూరోపియన్ కప్ టోర్నీలో మూడోసారి విజేతగా నిలిచిన నోవీ బోర్ చెస్ క్లబ్



బెల్‌గ్రేడ్ (సెర్బియా): ప్రతిష్టాత్మక యూరోపియన్ చెస్ క్లబ్ కప్ (యూసీసీసీ) టీమ్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో చెక్ రిపబ్లిక్‌కు చెందిన నోవీ బోర్ చెస్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. 68 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో నోవీ బోర్ క్లబ్ జట్టు టైటిల్ నెగ్గడం ఇది మూడోసారి. 2013లో, 2022లోనూ ఈ జట్టుకు టైటిల్ లభించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో మొత్తం 84 జట్లు పోటీపడ్డాయి. నిర్ణీత ఏడు రౌండ్ల తర్వాత నోవీ బోర్ క్లబ్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆరు మ్యాచ్‌ల్లో నెగ్గిన నోవీ బోర్ జట్టు ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని టోర్నీని అజేయంగా ముగించింది. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్, చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడ్డ పెంటేల హరికృష్ణ, భారత గ్రాండ్‌మాస్టర్, మహారాష్ట్ర ప్లేయర్ విదిత్ సంతోష్ గుజరాతి నోవీ బోర్ జట్టుకు టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించారు. హరికృష్ణ 6 గేమ్‌లు ఆడి 3.5 పాయింట్లు సాధించగా... విదిత్ కూడా 6 గేమ్‌లు ఆడి 4 పాయింట్లు సంపాదించాడు. విన్సెంట్ కెమెర్ (జర్మనీ), డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్), డేవిడ్ ఆంటోన్ గిజారో (స్పెయిన్), థాయ్ దాయ్ వాన్ ఎన్గుయెన్ (చెక్ రిపబ్లిక్), నీల్స్ గ్రాండెలియస్ (స్వీడన్), మాటెజ్ బార్టెల్ (పోలాండ్) విజేత జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు. భారత నంబర్‌వన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్ సభ్యుడిగా ఉన్న అల్కాలాయిడ్ క్లబ్ (నార్త్ మెసెడోనియా) 12 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. అర్జున్ 7 గేమ్‌లు ఆడి 5.5 పాయింట్లు స్కోరు చేశాడు. 11 పాయింట్లతో వాడోస్ చెస్ క్లబ్ (రొమేనియా) మూడో స్థానాన్ని దక్కించుకుంది. మహిళల విభాగంలో ప్రపంచ జూనియర్ చాంపియన్, భారత స్టార్ దివ్య దేశ్‌ముఖ్ సభ్యురాలిగా ఉన్న గరుడ అజ్కా బీఎస్‌కే క్లబ్ జట్టు 11 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది.


దివ్య దేశ్‌ముఖ్

హర్ష కార్తీక ఖాతాలో రెండో టైటిల్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ సర్క్యూట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఓరుగంటి హర్ష కార్తీక వారం వ్యవధిలో రెండో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలో ఆదివారం ముగిసిన జే30 టోర్నమెంట్‌లో 13 ఏళ్ల హర్ష కార్తీక విజేతగా నిలిచింది. ఈనెల 20న ఇదే వేదికపై జరిగిన టోర్నీలోనూ హర్ష తొలిసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో హర్ష 6-4, 6-2తో బ్రెజిల్ ప్లేయర్ బ్రూనా లియోటో కర్వాలోపై విజయం సాధించింది. లేక్‌వ్యూ టెన్నిస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న హర్ష వరుసగా రెండో టోర్నీలోనూ తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకుండా టైటిల్ సాధించడం విశేషం. తొలి రౌండ్‌లో 'బై' పొందిన హర్ష రెండో రౌండ్‌లో 6-0, 6-2తో సమిరావిత్ (ఇథియోపియా)పై, క్వార్టర్ ఫైనల్లో 6-3, 6-1తో హెలెనా (జర్మనీ)పై, సెమీఫైనల్లో 6-3, 6-4తో ప్రీశా శాంత మూర్తి (భారత్)పై గెలిచింది.

ఐక రాజు జోడీకి ఐటీఎఫ్ టైటిల్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ సర్క్యూట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఐక రాజు కనుమూరి డబుల్స్ టైటిల్‌ను సాధించింది. మెక్సికోలో ఆదివారం ముగిసిన జె100 టోర్నీలో 17 ఏళ్ల ఐక రాజు-కోరీ మొంటోయ (అమెరికా) ద్వయం చాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఐక రాజు-కోరీ మొంటోయ జోడీ 6-4, 2-6, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో కరోలినా అలోన్సో-మరియన్ ఏంజెల్ (మెక్సికో) జంటను ఓడించింది. సెమీఫైనల్లో ఐక రాజు-కోరీ 6-1, 6-3తో లిగయా ముర్రే-యేల్ సఫర్ (అమెరికా)లపై, క్వార్టర్ ఫైనల్లో 3-6, 6-1, 10-3తో 'సూపర్ టైబ్రేక్'లో సాండ్రా ఇసబెలా (మెక్సికో)-మాన్యుయెలా మొస్కోసో (ఈక్వెడార్)లపై గెలిచారు. ఐటీఎఫ్ జూనియర్ సర్క్యూట్‌లో ఐక రాజుకిది నాలుగో డబుల్స్ టైటిల్‌కాగా, సింగిల్స్ విభాగంలో ఆమె మూడు టైటిల్స్ సొంతం చేసుకుంది.

ఆంధ్ర 344 ఆలౌట్

- హిమాచల్ ప్రదేశ్ 198/4
- శశికాంత్‌కు 3 వికెట్లు

సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర బౌలర్ శశికాంత్ మూడు వికెట్లతో మెరిశాడు. గ్రూప్ 'బి'లో భాగంగా విశాఖపట్నంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న పోరులో ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. అంకిత్ (53; 3 ఫోర్లు), ఆకాశ్ వశిష్ట్ (52 బ్యాటింగ్; 5 ఫోర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. ఓపెనర్లు శుభమ్ అరోరా (16), ప్రశాంత్ చోప్రా (10)తో పాటు... ఏకాంత్ సేన్ (20) విఫలమయ్యారు. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ 3 వికెట్లు పడగొట్టగా... విజయ్ ఒక వికెట్ తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 295/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 92.4 ఓవర్లలో 344 పరుగులకు ఆలౌటైంది. ఆదివారం 49 పరుగులు చేసి మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. మనీశ్ (42; 4 ఫోర్లు), త్రిపురాణ విజయ్ (33; 2 ఫోర్లు) చివర్లో కీలక పరుగులు చేశారు. హిమాచల్ ప్రదేశ్ బౌలర్లలో దివేశ్ శర్మ 5 వికెట్లు పడగొట్టగా... రిషీ ధావన్ మూడు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శనతో ఆంధ్ర జట్టు దీటుగా బదిలిస్తున్న హిమాచల్ ప్రదేశ్ జట్టు ఇంకా 146 పరుగులు వెనుకబడి ఉంది. చేతిలో ఆరు వికెట్లు ఉండగా... కెప్టెన్ రిషీ ధావన్ (38 బ్యాటింగ్; 4 ఫోర్లు), ఆకాశ్ వశిష్ట్ క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (ఎల్బీ) (బి) రిషీ ధావన్ 5; మహీప్ కుమార్ (ఎల్బీ) (బి) రిషీ ధావన్ 4; షేక్ రషీద్ (బి) అర్పిత్ 69; హనుమ విహారి (సి) రిషీ ధావన్ (బి) ముకుల్ నేగీ 66; శ్రీకర్ భరత్ (సి) ఆకాశ్ (బి) దివేశ్ శర్మ 65; అశ్విన్ హెబ్బర్ (సి) ఏకాంత్ సేన్ (బి) దివేశ్ శర్మ 15; మనీశ్ (సి) ముకుల్ నేగీ (బి) దివేశ్ శర్మ 42; త్రిపురాణ విజయ్ (సి) ఆకాశ్ వశిష్ట్ (బి) రిషీ ధావన్ 33; శశికాంత్ (సి) శుభమ్ అరోరా (బి) దివేశ్ శర్మ 6; లలిత్ మోహన్ (సి) శుభమ్ అరోరా (బి) దివేశ్ శర్మ 14; సత్యనారాయణ రాజు (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (92.4 ఓవర్లలో ఆలౌట్) 344.** **వికెట్ల పతనం:** 1-5, 2-11, 3-136, 4-202, 5-226, 6-245, 7-317, 8-321, 9-341, 10-344. **బౌలింగ్:** వినయ్ 9-0-41-0; రిషీ ధావన్ 19-3-80-3; అర్పిత్ గులేరియా 11-0-47-1; దివేశ్ శర్మ 20.4-4-60-5; మయాంక్ డాగర్ 18-2-53-0; ముకుల్ నేగీ 15-2-52-1.

హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్: శుభమ్ అరోరా (సి) శ్రీకర్ భరత్ (బి) శశికాంత్ 16; ప్రశాంత్ చోప్రా (సి) శ్రీకర్ భరత్ (బి) శశికాంత్ 10; అంకిత్ (బి) విజయ్ 53; ఏకాంత్ సేన్ (బి) శశికాంత్ 20; ఆకాశ్ వశిష్ట్ (బ్యాటింగ్) 52; రిషీ ధావన్ (బ్యాటింగ్) 38; ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం (65 ఓవర్లలో 4 వికెట్లకు) 198.** **వికెట్ల పతనం:** 1-12, 2-31, 3-59, 4-124. **బౌలింగ్:** శశికాంత్ 15-6-50-3; సత్యనారాయణ రాజు 14-1-40-0; లలిత్ మోహన్ 11-1-26-0; విజయ్ 13-1-41-1; మహీప్ కుమార్ 4-1-10-0; మనీశ్ 7-0-28-0; రషీద్ 1-0-2-0.


శశికాంత్

హైదరాబాద్ 536/8 డిక్లేర్డ్

- హిమతేజ, తనయ్ అర్ధశతకాలు
- పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్ 24/2

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు చేసింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో పుదుచ్చేరితో పోరులో బ్యాటర్లంతా కలిసికట్టుగా కదం తొక్కడంతో హైదరాబాద్ జట్టు 163 ఓవర్లలో 536/8 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (328 బంతుల్లో 173; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ సెంచరీతో విజృంభించగా... రోహిత్ రాయుడు (84; 7 ఫోర్లు, 1 సిక్స్), హిమతేజ (60; 7 ఫోర్లు), తనయ్ త్యాగరాజన్ (53 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించారు. ఓవర్‌నైట్ స్కోరు 290/1తో ఆదివారం రెండో రోజు ఆట కొనసాగించిన హైదరాబాద్ ఆడుతూ పాడుతూ పరుగులు రాబట్టింది. రెండో వికెట్‌కు తన్మయ్, రోహిత్ 220 పరుగులు జోడించడంతో గట్టి పునాది పడింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (27), వికెట్ కీపర్ రాహుల్ రాధేశ్ (24) ఎక్కువ సేపు నిలవలేకపోగా... చామా మిలింద్ (7) ఆకట్టుకోలేకపోయాడు. మిడిలార్డర్ విఫలమైనా... ఆఖర్లో తనయ్ త్యాగరాజన్ మెరుపులు మెరిపించాడు. పుదుచ్చేరి బౌలర్లలో అంకిత్ శర్మ 3, సతీశ్ రెండు వికెట్లు పడగొట్టారు. కొండంత స్కోరు చేసిన అనంతరం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... చివరి గంటలో బ్యాటింగ్‌కు వచ్చిన పుదుచ్చేరి బ్యాటర్లు తీవ్రంగా తడబడ్డారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పుదుచ్చేరి 12 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది. శ్రీధర్ రాజు (19), సాగర్ (0) అవుట్ కాగా... వికెట్ కీపర్ అజయ్ రొహెరా (3) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. హైదరాబాద్ బౌలర్లలో రోహిత్ రాయుడు, అనికేత్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. చేతిలో 8 వికెట్లు ఉన్న పుదుచ్చేరి జట్టు... హైదరాబాద్ స్కోరుకు ఇంకా 512 పరుగులు వెనుకబడి ఉంది. గౌరవ్ యాదవ్ (0 బ్యాటింగ్), ఆకాశ్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.


హిమతేజ

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) (సబ్) విఘ్నేశ్వరన్ (బి) అంకిత్ శర్మ 173; అభిరత్ రెడ్డి (సి) అరుణ్ కార్తీక్ (బి) సాగర్ 68; రోహిత్ రాయుడు (బి) ఫాబిద్ అహ్మద్ 84; హిమతేజ (సి) అమన్ (బి) సతీశ్ 60; రాహుల్ సింగ్ (సి) గంగ శ్రీధర్ రాజు (బి)గౌరవ్ యాదవ్ 27; రాహుల్ రాధేశ్ (సి అండ్ బి) అంకిత్ శర్మ 24; చామా మిలింద్ (బి) సతీశ్ 7; తనయ్ త్యాగరాజన్ (నాటౌట్) 53; అనికేత్ రెడ్డి (బి) అంకిత్ శర్మ 12; రక్షణ్ రెడ్డి (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 17, **మొత్తం (163 ఓవర్లలో 8 వికెట్లకు డిక్లేర్) 536.** **వికెట్ల పతనం:** 1-111, 2-231, 3-345, 4-397, 5-440, 6-458, 7-460, 8-486. **బౌలింగ్:** గౌరవ్ యాదవ్ 35-9-102-1; సాగర్ 31-5-98-1; ఫాబిద్ అహ్మద్ 30-6-78-1; అమన్ ఖాన్ 11-1-55-0; అంకిత్ శర్మ 35-1-117-3, సతీశ్ 20-2-72-2.

పాకిస్తాన్ వన్డే, టి20 కెప్టెన్‌గా రిజ్వాన్

లాహోర్: ఊహించిందే జరిగింది! పాకిస్తాన్ పరిమిత ఓవర్ల (వన్డే, టి20 ఫార్మాట్) కొత్త సారథిగా మొహమ్మద్ రిజ్వాన్ ఎంపికయ్యాడు. బాబర్ ఆజమ్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వికెట్ కీపర్ రిజ్వాన్‌కు పగ్గాలు అప్పగించింది. వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న పాకిస్తాన్ జట్టు మూడు వన్డేలు, మూడు టి20లు ఆడనుంది. అనంతరం జింబాబ్వేలో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం పీసీబీ వేర్వేరు సిరీస్‌లకు జట్లను ప్రకటించింది. రిజ్వాన్ సారథ్య బాధ్యతలు నిర్వర్తించనుండగా... సల్మాన్ ఆఘా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల స్వదేశంలో ఇంగ్లండ్‌తో చివరి రెండు టెస్టుల నుంచి బాబర్ ఆజమ్‌ను తప్పించిన బోర్డు ఆసీస్ పర్యటనకు అతడితో పాటు పేసర్లు షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షాలను ఎంపిక చేసింది. పని భారం కారణంగా జింబాబ్వేతో టి20 సిరీస్‌కు రిజ్వాన్‌కు విశ్రాంతినిచ్చి సల్మాన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. 'కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవడం బాబర్ సొంత నిర్ణయం. అతడిపై ఎవరూ ఒత్తిడి చేయలేదు. అతడు మా ప్రధాన అస్త్రం. బ్యాటింగ్‌పై మరింత దృష్టి పెట్టేందుకే అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. సెలెక్టర్లందరూ రిజ్వాన్ వైపు మొగ్గు చూపారు. వైస్ కెప్టెన్‌గా సల్మాన్ అతడికి సహాయ సహకారాలు అందిస్తాడు' అని పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ పేర్కొన్నాడు. 2015లో వన్డే క్రికెట్‌లో అరంగేట్రం చేసిన 32 ఏళ్ల రిజ్వాన్ జాతీయ జట్టు తరఫున 74 వన్డేలు, 102 టి20లు ఆడాడు. 'పాకిస్తాన్ కెప్టెన్‌గా ఎంపికవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. జట్టును ముందుకు తీసుకెళ్లేందుకు నా వంతు ప్రయత్నం చేస్తా. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని యువ ఆటగాళ్లను తీర్చిదిద్దుతాం' అని రిజ్వాన్ అన్నాడు.



ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు పాకిస్తాన్ జట్టు: రిజ్వాన్ (కెప్టెన్), సల్మాన్, ఆమిర్ జమాల్, అబ్దుల్లా షఫీక్, అరాఫత్, బాబర్ ఆజమ్, ఫైసల్ అక్రమ్, హారీస్ రవూఫ్, హసీబుల్లా, కమ్రాన్ గులామ్, మొహమ్మద్ హస్నయిన్, ఇర్ఫాన్ ఖాన్, నసీమ్ షా, అయూబ్, షాహీన్ షా అఫ్రిది.

షాహీన్ షా అఫ్రిదికి షాక్

స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిదికి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) షాకిచ్చింది. వార్షిక కాంట్రాక్టుల్లో అతడిని 'ఎ' కేటగిరి నుంచి తొలగించి 'బి' కేటగిరీలో వేసింది. 2024-25 కోసం పీసీబీ ఆదివారం వార్షిక కాంట్రాక్టు వివరాలు ప్రకటించింది. సీనియర్ ప్లేయర్లు ఫఖర్ జమాన్, ఇఫ్తిఖార్ అహ్మద్, ఒసామా మీర్‌లను ఈ జాబితా నుంచి తొలగించింది. పాక్ టెస్టు కెప్టెన్ షాన్ మసూద్‌ను 'బి' కేటగిరీలోనే కొనసాగించింది. గత ఏడాది 27 మందికి వార్షిక కాంట్రాక్టు ఇవ్వగా ఈసారి ఆ సంఖ్యను 25కు కుదించింది. ఇందులో ఐదుగురు ప్లేయర్లకు తొలిసారి అవకాశం దక్కింది. కొత్త కెప్టెన్ రిజ్వాన్, మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్‌లు 'ఎ' కేటగిరీలో ఉండగా... షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, షాన్ మసూద్ 'బి' కేటగిరీలో చోటు దక్కించుకున్నారు. 'సి' కేటగిరీలో 9 మంది, 'డి' కేటగిరీలో 11 మంది ఉన్నారు. కేటగిరీలను బట్టి ప్లేయర్లకు మ్యాచ్ ఫీజులు అందనున్నాయి.

లూయిస్ మెరుపు సెంచరీ

- చివరి వన్డేలో విండీస్ విజయం
- 2-1తో సిరీస్ నెగ్గిన శ్రీలంక

పల్లెకెలె: ఓపెనర్ ఎవిన్ లూయిస్ (61 బంతుల్లో 102 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగడంతో వెస్టిండీస్ జట్టుకు ఊరట విజయం దక్కింది. శ్రీలంక చేతిలో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్ కోల్పోయిన వెస్టిండీస్ జట్టు శనివారం వర్షం అంతరాయం మధ్య సాగిన ఆఖరి వన్డేలో 8 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 23 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. నిసాంక (56; 8 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (56 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో మెరిశారు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, రూథర్‌ఫోర్డ్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ దశలో వర్షం కారణంగా మ్యాచ్‌కు ఐదు గంటలు అంతరాయం కలిగింది. వాన ఆగిన అనంతరం వెస్టిండీస్ లక్ష్యాన్ని 23 ఓవర్లలో 195 పరుగులుగా నిర్ణయించారు. దీంతో ఆరంభం నుంచే ధాటిగా ఆడిన కరీబియన్ జట్టు 22 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసి గెలిచింది. టి20 తరహాలో దంచి కొట్టిన లూయిస్‌కు రూథర్‌ఫోర్డ్ (26 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) నుంచి చక్కటి సహకారం దక్కింది. 2021 తర్వాత తొలి వన్డే ఆడిన లూయిస్... ఎడాపెడా బౌండరీలు బాది జట్టును గెలిపించాడు. లూయిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', అసలంకకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.



సెయింజ్‌కు 'పోల్' పొజిషన్

మెక్సికో సిటీ: ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ సీజన్‌లో తొలి పోల్ పొజిషన్ సాధించాడు. మెక్సికో గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ టోర్నీలో సెయింజ్ అగ్రస్థానంలో నిలిచాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో సెయింజ్ ల్యాప్‌ను అందరికంటే వేగంగా 1 నిమిషం 15.946 సెకన్లలో పూర్తి చేశాడు. మెక్సికో గ్రాండ్‌ప్రిలో ఐదుసార్లు విజేతగా నిలిచిన రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టాపెన్ (1 నిమిషం 16.171 సెకన్లలో) రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (1 నిమిషం 16.260 సెకన్లలో) మూడో స్థానంలో నిలిచాడు. గత వారం యూఎస్ గ్రాండ్ ప్రి నెగ్గిన ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ నాలుగో స్థానంతో క్వాలిఫయింగ్ రౌండ్‌ను ముగించాడు. బ్రిటన్ స్టార్ డ్రైవర్ హామిల్టన్ (మెర్సిడెస్) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 'మెక్సికోలాంటి క్లిష్ట తరమైన ట్రాక్‌పై వరుసగా రెండు ల్యాప్‌ల్లో అగ్రస్థానంతో ముగించడం ఆనందంగా ఉంది' అని సెయింజ్ అన్నాడు. మెయిన్ రేసును సెయింజ్ పోల్ పొజిషన్‌తో ప్రారంభించనున్నాడు.





క్వార్టర్ ఫైనల్లో మనిక ఓటమి

మోంట్‌పెలియర్ (ఫ్రాన్స్): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ టోర్నమెంట్‌లో భారత స్టార్ మనిక బత్రా పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 30వ ర్యాంకర్ మనిక 8-11, 8-11, 10-12తో ప్రపంచ 21వ ర్యాంకర్ కియాన్ తియాని (చైనా) చేతిలో ఓడిపోయింది. 24 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో చైనా క్రీడాకారిణికి మనిక గట్టిపోటీనిచ్చినా కీలకదశలో తడబడి మూల్యం చెల్లించుకుంది. తన సర్వీస్‌లో 13 పాయింట్లు గెలిచిన మనిక, ప్రత్యర్థి సర్వీస్‌లోనూ 13 పాయింట్లు సాధించింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన మనికకు 9,375 డాలర్ల (రూ. 7 లక్షల 88 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 175 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

జయహో జెంగ్...

కెరీర్‌లో ఐదో సింగిల్స్ టైటిల్ నెగ్గిన చైనా టెన్నిస్ స్టార్

డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీకి అర్హత



టోక్యో: పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, చైనా టెన్నిస్ స్టార్ కిన్‌వెన్ జెంగ్ ఒకే విజయంతో రెండు లక్ష్యాలు సాధించింది. ఆదివారం ముగిసిన టొరే పాన్ పసిఫిక్ ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో ఆమె విజేతగా నిలిచింది. ఈ గెలుపుతో ప్రపంచ ఏడో ర్యాంకర్ కిన్‌వెన్ కెరీర్‌లో ఐదో సింగిల్స్ టైటిల్ సాధించడంతోపాటు సీజన్ ముగింపు ప్రతిష్టాత్మక టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌కు అర్హత పొందింది. 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా)తో జరిగిన ఫైనల్లో కిన్‌వెన్ జెంగ్ 7-6 (7/5), 6-3తో విజయం సాధించింది. గంటా 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కిన్‌వెన్ ఏకంగా 16 ఏస్‌లు సంధించింది. కిన్‌వెన్‌కు 1,42,000 డాలర్ల (రూ. 1 కోటీ 19 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

అత్యంత వృద్ధ మహిళ అస్తమయం

ధూమపానం, మద్యపానానికి దూరం



అమెరికాలో అత్యంత వృద్ధ మహిళ ఎలిజబెత్ ఫ్రాన్సిస్ తన 115 ఏళ్ల వయసులో మరణించారు. 'క్వీన్ ఎలిజబెత్ ఆఫ్ హ్యూస్టన్'గా పిలుచుకునే ఫ్రాన్సిస్ అమెరికాలో అత్యంత వృద్ధురాలిగా, ప్రపంచంలో మూడో వృద్ధురాలిగా రికార్డుకెక్కారు. అమెరికాలో అత్యంత ఎక్కువ కాలం బతికిన 21వ వ్యక్తి కాగా.. ప్రపంచంలో 54వ వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ఫ్రాన్సిస్ కుటుంబమే దీర్ఘాయుష్షు ఉన్న కుటుంబం. ఆమె సోదరి బెర్తా జాన్సన్ కూడా అత్యధికకాలం జీవించారు. 2011లో మరణించేనాటికి ఆమెకు 106 ఏళ్లు. అప్పటివరకూ అక్కా చెల్లెల్లిద్దరూ కలిసే బతికారు. ఇంత కాలం బతకడం ఎలా సాధ్యమైందంటే 'సంతోషంగా జీవించాలని ప్రతిరోజూ అనుకున్నాను. అంతా దేవుడి దయ.. నన్ను తీసుకెళ్లడానికి అతని దగ్గర ఏ కారణం లేదు' అని చెప్పేవారు. 112 ఏళ్ల వయసులోనూ తన మనవరాళ్లు, మనవలతో కలిసి అన్ని కుటుంబ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఫ్రాన్సిస్ ఆయుష్షు రహస్యం మాత్రం.. 'ఆల్కహాల్, ధూమపానానికి దూరంగా ఉండటమే' అని చెబుతారు ఆమె దగ్గరివారు. లూసియానాలోని సెంట్ మేరీ పారిష్‌లో 1909లో జన్మించిన ఫ్రాన్సిస్.. తన జీవిత కాలంలో ప్రపంచంలో ఎన్నో మార్పులకు సాక్షిగా ఉన్నారు. 20 మంది అమెరికా అధ్యక్షులను, రెండు ప్రపంచ యుద్ధాలను, పౌర హక్కుల ఉద్యమాలను దగ్గరగా చూశారు. 1920లో తల్లి మరణించడంతో ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. ఐదుగురు తోబుట్టువుల్లో ఒకరైన ఫ్రాన్సిస్.. టెక్సాస్‌లోని గాల్వెస్టన్‌లో ఉన్న అత్త దగ్గర పెరిగారు. 1928లో ఆమెకు పాప జన్మించింది. ఒంటరి మహిళగానే కూతురిని పెంచారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఆదివారం చిత్రకూట్‌లోని ఓ దుకాణంలో ఇలా టీ తయారు చేస్తూ ఫొటోలకు పోజిచ్చారు..

భర్తను సూట్‌కేస్‌లో కుక్కి.. ఉసురు తీసింది!



సారా బూన్

కొన్నిగంటలపాటు భర్తను సూట్‌కేసులో కుక్కి ఆయన చనిపోయేందుకు కారణమైన ఓ ఫ్లోరిడా మహిళను కోర్టు దోషిగా తేల్చింది. ఫ్లోరిడాలోని వింటర్‌పార్క్ అపార్ట్‌మెంట్‌లో సారా బూన్, భర్త జార్జ్ టోరెస్‌తో కలిసి ఉంటున్నారు. 2020లో టోరెస్ ఓ సూట్‌కేస్‌లో శవమై కనిపించాడు. అతని భార్య బూన్‌ను అనుమానించిన పోలీసులు ప్రశ్నించగా.. 'ఇద్దరం మద్యం తాగి ఉన్నాం. ఆటలో భాగంగా అతను సూట్‌కేసులో దాక్కున్నాడు. అతని వేళ్లు బయటికి ఉన్న కారణంగా జిప్ తీసుకోగలడని భావించాను. నేను మేడపైకి వెళ్లి పడుకున్నా. నిద్రలేచి చూసే సరికి అతను ఇంకా సూట్‌కేసులోనే ఉన్నాడు. అప్పటికే అతని ఊపిరి ఆగిపోయింది' అని వెల్లడించింది. కేసు విచారణ నాలుగేళ్లపాటు కొనసాగింది. చివరికి బూన్ ఫోనే ఆమెను పట్టించింది. తనను సూట్‌కేసులోంచి తీయాలని టోరెస్ వేడుకుంటుండగా, తాను నవ్విన దృశ్యాలను బూన్ తన ఫోన్‌లో బంధించింది. అంతేకాదు శ్వాస తీసుకోవడం కష్టంగా ఉందని, బయటికి తీయాలని టోరెస్ బతిమాలుతుండగా 'నీకు దక్కాల్సింది అదే.. నన్ను మోసం చేసినప్పుడు నాకు కూడా అలాగే అనిపించింది. నేను కూడా గట్టిగా ఊపిరి పీల్చుకోలేకపోయాను' అంటూ బూన్ సమాధానం ఇవ్వడం వీడియోలో రికార్డు అయ్యింది. దీంతో కోర్టు బూన్‌ను దోషిగా తేల్చింది. డిసెంబర్‌లో శిక్ష ఖరారు చేయనుంది.

- వాషింగ్టన్

50 విమానాలకు బెదిరింపులు

దోషులుగా తేలితే ప్రయాణ నిషేధం: కేంద్రం

న్యూఢిల్లీ: భారత విమానయాన సంస్థలకు చెందిన మరో 50 విమానాలకు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో, గత 14 రోజుల్లో 350కి పైగా విమానాల్లో బాంబులు పెట్టినట్లు ఉత్తుత్తి బెదిరింపులు వచ్చినట్లయింది. చాలా వరకు హెచ్చరికలు సామాజిక మాధ్యమాల ద్వారానే అందాయి. ఆకాశ ఎయిర్‌కు చెందిన 15 విమానాలు, ఇండిగో 18, విస్తార 17 విమానాలు బెదిరింపులు వచ్చాయి. బాంబులు పెట్టినట్లు హెచ్చరికలు అందిన పుణె–జోధ్‌పూర్ సర్వీసును అహ్మదాబాద్‌కు, కోజికోడ్–దమ్మామ్ సర్వీసును ముంబైకి దారి మళ్లించినట్లు ఇండిగో అధికారులు తెలిపారు. బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించిన వారిపై ప్రయాణ నిషేధం విధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఆదివారం తెలిపారు. దోషులను గుర్తించేందుకు కేంద్ర నిఘా విభాగాలు అంతర్జాతీయ సంస్థల సహకారాన్ని తీసుకుంటున్నాయన్నారు. ఇందుకోసం సివిల్ ఏవియేషన్ చట్టాలను సవరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. బాంబు బెదిరింపులకు పాల్పడే వారి ఖాతాలను గుర్తించేందుకు సామాజిక మాధ్యమ వేదికలైన 'ఎక్స్', మెటాల సహకారం కోరామన్నారు.

రాష్ట్రాలకు ఆ అధికారం లేదు

మోటార్ డ్రైవింగ్ స్కూళ్లకు మార్గదర్శకాల జారీపై అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్: కేంద్ర మోటార్ వాహనాల చట్టం,1989 ప్రకారం మోటార్ డ్రైవింగ్ స్కూళ్లకు మార్గదర్శకాల జారీ అధికారం కేవలం కేంద్రప్రభుత్వానికే ఉంటుందని అలహాబాద్ హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేస్తూ జస్టిస్ అంజనీకుమార్ మిశ్రా, జస్టిస్ జయంత్ బెనర్జీల హైకోర్టు ధర్మాసనం శుక్రవారం తీర్పును వెలువరిచింది. తమ డ్రైవింగ్ స్కూళ్లను ఇబ్బందులకు గురిచేసేలా యూపీ సర్కార్ ఇచ్చిన ప్రామాణిక నిర్వాహణ పద్ధతి(ఎస్‌ఓపీ) ఉత్తర్వులను యూపీ మోటార్ ట్రైనింగ్ స్కూల్ ఓనర్స్ అసోసియేషన్ అలహాబాద్ హైకోర్టులో సవాల్‌చేసింది. కేంద్ర మోటార్ వాహనాల చట్టానికి అదనపు నియమనిబంధనలు చేర్చే అధికారం రాష్ట్రాలకు ఉండదని ధర్మాసనం స్పష్టంచేసింది.

వాళ్లంతా ప్రజాస్వామ్య వ్యతిరేకులు


ట్రంప్ విమర్శకులపై ఎలాన్ మస్క్ ఆగ్రహం

లాన్‌కాస్టర్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను విమర్శిస్తున్న వాళ్లంతా ప్రజాస్వామ్యానికి చేటుచేస్తున్నారని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. ట్రంప్ కోసం భారీగా నిధులు సేకరిస్తూ సొంత డబ్బు ఖర్చు చేస్తున్న మస్క్ శనివారం స్వింగ్ రాష్ట్రమైన పెన్సిల్వేనియాలో ప్రచార సభలో ప్రసంగించారు. 2021 జనవరి ఆరో తేదీన జో బైడెన్‌ను అధ్యక్షుడిగా పార్లమెంట్‌లో ప్రకటించే సందర్భంగా రిపబ్లికన్ కార్యకర్తలను ట్రంప్ పార్లమెంట్ భవంతి మీదకు ఉసిగొల్పారన్న ఆరోపణలను మస్క్ కొట్టిపారేశారు. ''ఆరోజు కార్యకర్తలు పరిస్థితిని హింసాత్మకంగా మారొద్దని ట్రంప్ వేడుకున్నారు. ఘటనతో ఆయనకు సంబంధంలేదు. వాస్తవానికి అదొక విషయమే కాదు'అని వ్యాఖ్యానించారు.

కుంచించుకుపోతున్న కాస్పియన్

ప్రపంచంలోనే అతి పెద్దదైన కాస్పియన్ సరస్సు ఉనికి ప్రమాదంలో పడింది. రోజురోజుకూ నీరు తగ్గిపోయి కుంచించుకుపోతోంది. కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతూ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారింది...

ప్రపంచంలోనే అతి పెద్ద సరస్సుకు పర్యావరణ సెగ ● శతాబ్దాంతానికి 59 అడుగులు తగ్గనున్న నీటిమట్టం



కాస్పియన్ సముద్రం.. ప్రపంచంలోనే అతిపెద్ద సరస్సు. దీని సముద్రతీరం 4,000 మైళ్ళకు పైగా విస్తరించి ఉంది. కజకిస్తాన్, ఇరాన్, అజర్‌బైజాన్, రష్యా, తుర్క్‌మెనిస్తాన్ దేశాలు.. చేపలు పట్టడం, వ్యవసాయం, పర్యాటకం, త్రాగునీటితో పాటు చమురు, గ్యాస్ నిల్వల కోసం కాస్పియన్‌పైనే ఆధారపడతాయి. ఆనకట్టలు, అధిక వెలికితీత, కాలుష్యం, పెరుగుతున్న వాతావరణ సంక్షోభంతో కాస్పియన్ క్షీణిస్తోంది. కొన్ని దశాబ్దాలుగా ఈ క్షీణత వేగవంతమవుతోంది. 130 నదుల నుంచి కాస్పియన్ సరస్సులోకి నీరు ప్రవేశిస్తుంది. అందులో 80 శాతం నీరు ఒక్క ఓల్గా నది నుంచే వస్తుంది. ఐరోపాలోనే పొడవైన నది ఓల్గా. దీనిపై రష్యా 40 ఆనకట్టలను నిర్మించింది. మరో 18 నిర్మాణంలో ఉన్నాయి. ఇవి కాస్పియన్‌కి నీటి ప్రవాహాన్ని తగ్గించాయి. ఓల్గా దిగువ ప్రాంతాలు అనేక పారిశ్రామిక కేంద్రాలకు నిలయంగా ఉన్నందున, రసాయన, జీవ కాలుష్య కారకాలు విడుదలవుతున్నాయి. ఈ క్షీణతలో వాతావరణ మార్పులు సైతం కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇరాన్ నుంచి వచ్చే కాలుష్యం కూడా కాస్పియన్‌ను దెబ్బతీస్తోంది. ఉష్ణోగ్రతల్లో మార్పులు బాష్పీభవన రేటును పెంచి.. అస్తవ్యస్తమైన వర్షపాతానికి కారణమవుతున్నాయి. చమురు వెలికితీత, ఇతర పరిశ్రమల నుంచి వస్తున్న కారకాలతో కాస్పియన్ కలుషితమవుతోంది. వీటన్నింటితో.. కాస్పియన్ నీటి మట్టం పడిపోవడం 1990 మధ్య నుంచే ప్రారంభమైంది. 2005 నుంచి ఈ వేగం పెరిగింది. సుమారు 5 అడుగుల నీటిమట్టం తగ్గిందని జర్మనీలోని బ్రెమెన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎర్త్ సిస్టమ్స్ మోడలర్ మాథియాస్ ఫ్రాంజ్ వెల్లడించారు. ఈ శతాబ్దం చివరి నాటికి 8 నుంచి 18 మీటర్లు (26 నుంచి 59 అడుగులు) క్షీణించే అవకాశం ఉందని పరిశోధన ఒకటి అంచనా వేసింది.

సంక్షోభంలోకి ఐదు దేశాలు...

సరస్సు క్షీణత.. దీనిపై ఆధారపడి ఉన్న ఐదు దేశాలను సంక్షోభంలోకి నెడుతోంది. చేపలు పట్టడం, పర్యాటకం తగ్గిపోతుంది. ఓడరేవు నగరాల్లో నౌకలు దిగడం సమస్యగా మారడంతో షిప్పింగ్ పరిశ్రమ దెబ్బతింటుంది. దేశాల మధ్య రాజకీయంగానూ కీలక పరిణామాలు సంభవిస్తాయి. వనరుల కోసం పోటీ పెరుగుతుంది. చమురు, గ్యాస్ నిల్వలపై కొత్త విభేదాలకు దారితీస్తుంది. ఇక కాస్పియన్‌ను ఆవాసంగా చేసుకున్న ప్రత్యేకమైన వన్యప్రాణుల పరిస్థితి ఇప్పటికే ఆందోళనకరంగా ఉంది. వందలాది జంతుజాలానికి నిలయమైన అడవి కూడా అంతరించనుంది. కానీ నీరు తగ్గుముఖం పట్టడం వల్ల దాని లోతుల్లో ఆక్సిజన్ స్థాయిలు క్షీణిస్తాయి. దీంతో కొంత కాలానికి అందులోని జంతుజాలం తుడిచిపెట్టుకుపోతుంది. కాస్పియన్ సముద్రంలో అనేక రకాల స్టర్జన్ జాతులు ఉన్నాయి. ఈ చేప అత్యంత విలువైన, రుచికరమైన కేవియర్‌ను ఇస్తుంది. ప్రపంచంలోని కేవియర్‌లో 80–90% మధ్య కాస్పియన్ నుంచే ఉత్పత్తి అవుతుంది. కానీ కొన్ని దశాబ్దాలుగా తగ్గుతూ వస్తోంది. స్టర్జన్ చేపలు వేగంగా కనుమరుగవుతున్నాయని, త్వరలో అంతరించిపోయే అవకాశం ఉందని ఒక సర్వేలో తేలింది. ఇది బయటకు కనిపించని ఒక భారీ సంక్షోభం. సముద్ర క్షీరదాలైన కాస్పియన్ సీల్స్‌కు కూడా ప్రమాదకర సంకేతం. ఈ సంక్షోభానికి పరిష్కారాలు తక్కువ. ఇందుకు ఏ ఒక్క దేశాన్ని నిందించలేమని, కానీ సమిష్టి చర్యలు తీసుకోవడంలో విఫలమైతే అరల్ సముద్ర విపత్తు పునరావృతం అవుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సముద్ర మట్టాలు పెరుగుతుంటే కాస్పియన్ ఎందుకు తగ్గుతోంది?

వాతావరణంలో వేగంగా వస్తున్న మార్పులు ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలను పెంచుతున్నాయి. కానీ కాస్పియన్ వంటి భూపరివేష్టిత సరస్సులది భిన్నమైన కథ. ఇవి నదుల నుంచి ప్రవహించే నీరు, వర్షపాతం సమతుల్యతపై ఆధారపడతాయి. వాతావరణం వేడెక్కుతున్న కొద్దీ ఈ సమతుల్యత దెబ్బతింటోంది. దీంతో అనేక సరస్సులు కుంచించుకుపోతున్నాయి. భవిష్యత్ ఎలా ఉంటుందో చెప్పడానికి ఎక్కువ శ్రమా అక్కర్లేదు. ఎందుకంటే కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌ల మధ్య ఉన్న అరల్ సముద్రం దాదాపు అంతరించిపోయింది. ఒకప్పుడు ప్రపంచంలోని అతిపెద్ద సరస్సులలో ఒకటిగా ఉన్న అరల్.. ఇప్పుడు అంతంత మాత్రంగా మిగిలింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

బిష్ణోయ్ ప్రజలకు సల్మాన్ క్షమాపణ చెప్పాలి

రైతు నేత రాకేశ్ తికాయత్

ప్రయాగ్‌రాజ్: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ను చంపుతామంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చేస్తున్న బెదిరింపులపై భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ)నేత రాకేశ్ తికాయత్ స్పందించారు. బిష్ణోయ్ వర్గం ప్రజలకు సల్మాన్ క్షమాపణలు చెప్పాలని సూచించారు. వివాదం సమసిపోతే క్షమాపణ చెప్పడం తప్పేమీ కాదని అభిప్రాయపడ్డారు. ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాపంచాయత్‌లో పాల్గొన్న తికాయత్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ గురించి అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులిచ్చారు. తెలిసో తెలియకో జరిగిన తప్పునకు క్షమాపణలు చెబితే సల్మాన్‌కు జరిగే నష్టం కూడా ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామంటూ వాగ్దానం చేసిన యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం పొలాల్లో మీటర్లు బిగిస్తోందని ఆరోపించారు. మీటర్లు బిగించాక రైతులకు ఉచిత విద్యుత్ ఇద్దామనుకుంటే 2027 ఎన్నికల్లో బీజేపీ ఆ మేరకు వాగ్దానం చేయాలని, లేదంటే మీటర్లను బిగించరాదని ఆయన డిమాండ్ చేశారు. బిష్ణోయ్ ప్రజలు దైవరూపంగా భావించే కృష్ణ జింకలను సల్మాన్ వేటాడినట్లు ఆరోపణలున్న విషయం తెలిసిందే.

నేడు సీ-295 ప్లాంట్ ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ సోమవారం గుజరాత్‌లోని వడోదరలో సీ–295 సైనిక విమానం ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్లాంట్‌లో 2026 సెప్టెంబర్‌లో మొట్టమొదటి సీ–295 విమానం బయటకు వస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇక్కడ మొత్తం ఇలాంటి 40 విమానాలు తయారుకానున్నాయి. సీ–295 మీడియం టాక్టికల్ ట్రాన్స్‌పోర్ట్ విమానాలను టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(టీఏఎస్ఎల్) తయారు చేయనుంది. ఈ ప్లాంట్‌కు ప్రధాని మోదీ 2022లో శంకుస్థాపన చేశారు. ఎయిర్‌బస్ డిఫెన్స్, స్పెయిన్‌కు చెందిన స్పేస్ ఎస్ఏ సంస్థలతో భారత రక్షణ శాఖ 56 యుద్ధ విమానాల కోసం 2021లో రూ.21,935 కోట్ల కాంట్రాక్టును కుదుర్చుకుంది. ఇందులో స్పెయిన్ నుంచి రావాల్సిన 16 విమానాలకుగాను ఇప్పటికే ఆరు వచ్చేశాయి. మిగతా 40 విమానాలను 2031 ఆగస్టులోగా ఇక్కడే తయారు చేయాల్సి ఉంటుంది.

ప్రజలకు ఉదయనిధి దీపావళి శుభాకాంక్షలు

చెన్నై: తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. డీఎంకే ఆనవాయితీకి విరుద్ధంగా ఆ పార్టీ నేత శుభాకాంక్షలు తెలపడం గమనార్హం. దివంగత సీఎం కరుణానిధి సహా గతంలో ఆ పార్టీ నేతలెవరూ ప్రజలకు దీపావళి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన దాఖలాలు లేవు. ఆదివారం ఉదయనిధి డీఎంకే ఆవిర్భావ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఆయన 'విశ్వాసం ఉన్నవారు, పండగ చేసుకునే వారికి దీపావళి తిరునాళ్ శుభాకాంక్షలు'అని నర్మగర్భంగా అన్నారు. ఉదయనిధి వ్యంగ్యంగా శుభాకాంక్షలు తెలిపారంటూ రాష్ట్ర బీజేపీ నేత నారాయణన్ తిరుపతి మండిపడ్డారు. 'విశ్వాసం లేని వారు నరకాసురునిలా జీవించాలని శుభాకాంక్షలు తెలుపుతున్నాను'అని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

2100 నాటికి ఉష్ణోగ్రతలో... 3.1 డిగ్రీల పెరుగుదల!

గ్రీన్‌హౌస్ వాయువుల కట్టడిలో వైఫల్యం వల్లే

- ప్రపంచ దేశాలపై ఐక్యరాజ్యసమితి అసహనం
- వచ్చే నెలలో జరిగే కాప్–29 సదస్సుపైనే ఆశలు



వాతావరణ మార్పుల కట్టడి కోసం ప్రస్తుతం ప్రపంచ దేశాలు అమలు చేస్తున్న చర్యలు ఏమాత్రం సరిపోవని ఐక్యరాజ్యసమితి తేల్చిచెప్పింది. భూగోళంపై ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమవుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను అరికట్టడంలో ప్రపంచ దేశాలు ఘోరంగా విఫలమవుతున్నాయని ఎండగట్టింది. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ శతాబ్దం ఆఖరు నాటికి సగటు ఉష్ణోగ్రత మరో 3.1 డిగ్రీల సెల్సియస్(5.4 డిగ్రీల ఫారెన్‌హీట్) పెరుగుతుందని స్పష్టంచేసింది. ఈ మేరకు వార్షిక ఉద్గారాల నివేదికను ఐక్యరాజ్యసమితి ఇటీవల విడుదల చేసింది. వాస్తవానికి ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకే(2.7 ఫారెన్‌హీట్) పరిమితం చేయాలన్న ప్రతిపాదనకు ప్రపంచదేశాలు మద్దతు పలికాయి. 2015లో పారిస్‌లో జరిగిన కాప్–21 సదస్సులో సంబంధిత ఒప్పందంపై సంతకాలు చేశాయి. భూగోళంపై జీవుల మనుగడ కొనసాగాలంటే ఉష్ణోగ్రతల పెరుగుదలను కట్టడి చేయాల్సిందేనని నిపుణులు స్పష్టంచేశారు. పారిస్ ఒప్పందంపై సంతకాలు చేసి దాదాపు పదేళ్లవుతున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉండడం శోచనీయమని ఐక్యరాజ్యసమితి ఆక్షేపించింది.

- ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, వాస్తవ పరిస్థితిని చూస్తే 2100 నాటికల్లా ఉష్ణోగ్రతలు 3.1 డిగ్రీల దాకా పెరిగిపోనున్నాయి. అంటే లక్ష్యం కంటే రెండింతలు కావడం గమనార్హం. ప్రభుత్వాల చర్యలు ఎంత నాసిరకంగా ఉన్నాయో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.
- కర్బన ఉద్గారాలను అరికట్టడం, వాతావరణ మార్పులను నియంత్రించడం తక్షణావసరమని ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ వెల్లడించారు. లేకపోతే మనమంతా మహావిపత్తును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
- 2022 నుంచి 2023 దాకా ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు 1.3 శాతం పెరిగినట్లు ఒక అధ్యయనంలో వెల్లడయ్యింది. ఇది 57.1 గిగా టన్నుల కార్బన్ డయాక్సైడ్‌కు సమానం.
- ఒకవేళ ఇప్పటినుంచి ఉద్గారాల నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేసినప్పటికీ ఉష్ణోగ్రతలు 2100 కల్లా 2.6 డిగ్రీల నుంచి 2.8 డిగ్రీల దాకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.
- కర్బన ఉద్గారాల్లో అధిక వాటా జీ20 దేశాలదే. వాతావరణ మార్పులను అరికట్టడంతో ఆయా దేశాలు దారుణంగా విఫలమవుతున్నాయని ఐక్యరాజ్యసమితి అసంతృప్తి వ్యక్తం చేసింది. వాతావరణ లక్ష్యాల సాధనలో చాలా వెనుకంజలో ఉన్నాయని వెల్లడించింది.
- ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలంటే గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను 2030 నాటికి 42 శాతం, 2035 నాటికి 57 శాతం తగ్గించుకోవాల్సి ఉంటుంది. అది దాదాపు అసాధ్యమేనని నిపుణులు అంటున్నారు.
- ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్–29) సదస్సు వచ్చే నెలలో అజర్‌బైజాన్‌లో జరుగనుంది. వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ దిశగా ఈ సదస్సులో కీలక తీర్మానాలు ఆమోదిస్తారని పర్యావరణ ప్రేమికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ గెలుపు... మహిళలకు ముప్పు: మిషెల్

హారిస్‌కు మద్దతుగా ప్రచారం

కలమజూ (మిషిగన్): అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలిస్తే అమెరికా మహిళల జీవితాలు ప్రమాదంలో పడతాయని మాజీ ప్రథమ మహిళ మిషెల్ ఒబామా హెచ్చరించారు. దాన్ని నివారించాలంటే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం మిషిగన్‌లో డెమొక్రాట్ల ప్రచార సభలో ఆమె పాల్గొన్నారు. ''ఈ ఎన్నికల్లో ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోకపోతే మీ భార్య, మీ కూతురు, మీ తల్లి... ఇలా మహిళలుగా మేమంతా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది'' అని ఆమె హెచ్చరించారు. డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్ తర్వాత పార్టీ ప్రచారంలో మిషెల్ పాల్గొనడం ఇదే తొలిసారి. హారిస్‌కు మద్దతుగా ఆమె ఉద్వేగభరితంగా మాట్లాడారు. ఆమె ప్రజల ప్రయోజనాలకోసమే పని చేస్తారన్నారు. ర్యాలీ అనంతరం మిషిగన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్‌తో కలిసి హారిస్ ట్రాక్ హౌజ్ బార్ అండ్ గ్రిల్‌కు వెళ్లారు. స్థానికంగా తయారు చేసిన బీర్ తాగారు. స్థానికులతో పిచ్చాపాటీ మాట్లాడారు. యువతుల టేబుల్ వద్దకు రాగానే వారిలో ఒకరు హారిస్‌తో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. మిషిగన్‌లో ఇప్పటికే 20 శాతం మంది ముందస్తుగా ఓటేశారు.



ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కమల, మిషెల్

మహిళలకు అవకాశాలు: బైడెన్

హారిస్ గెలిస్తే అన్ని రంగాల్లోనూ మహిళలకు గతంలో కంటే ఎక్కువ అవకాశాలు లభిస్తాయని అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. పిట్స్‌బర్గ్‌లోని లేబర్స్ ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ నార్త్ అమెరికాలో ఆయన మాట్లాడారు. కార్మికులను ట్రంప బలహీనపరిచారని మండిపడ్డారు. కార్మిక ప్రయోజనాల కోసం ట్రంప్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

లింగ సమానత్వంలో భారత్ ముందడుగు

సామాజిక కట్టుబాట్లు, భద్రత అడ్డంకి: ఐరాస

న్యూఢిల్లీ: లింగ సమానత్వంలో భారత్ సాధిస్తున్న పురోగతి స్ఫూర్తిదాయకమని ఐక్యరాజ్యసమితి కొనియాడింది. అయితే సామాజిక కట్టుబాట్లు, పరిమిత శ్రామిక భాగస్వామ్యం, సరైన భద్రత లేకపోవడం లింగ సమానత్వానికి ఇంకా ఆటంకం కలిగిస్తున్నాయని అభిప్రాయపడింది. ఈ అంతరాన్ని పూడ్చడానికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ప్రయత్నాలు అవసరమని సూచించింది. దేశంలో మహిళల పురోగతి, సవాళ్లపై ఐరాస మహిళా వ్యూహాత్మక భాగస్వామ్యాల డైరెక్టర్ డేనియల్ సీమార్, భారత్‌లో ఐరాస మహిళల కంట్రీ రిప్రజెంటేటివ్ సుసాన్ జేన్ ఫెర్గూసన్ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మహిళల జీవితాలను మార్చడానికి, మహిళలు, బాలికల నిర్దిష్ట అవసరాలకు బడ్జెట్‌లో 6.8 శాతానికి నిధులు పెరిగాయన్నారు. ఆరోగ్యం, విద్య, ఆర్థిక రంగాల్లో అంతరాలను తొలగించడానికి బడ్జెట్ నిరంతర విస్తరణ అవసరమని నొక్కి చెప్పారు. ఈ లక్ష్యాలను పూర్తిగా చేరుకోవడానికి ప్రైవేట్ రంగ పెట్టుబడులు అవసరమని ఫెర్గూసన్ పేర్కొన్నారు. పంచాయతీలు, స్థానిక ప్రభుత్వ సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యంతో నాయకత్వంలో కూడా పురోగతి కనిపిస్తోందని చెప్పారు. పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఆమోదం పొందడం జాతీయ రాజకీయ ముఖచిత్రంపై ప్రభావాన్ని చూపుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే లింగ ఆధారిత హింస (జీబీవీ) దేశంలో నిరంతర సమస్యగా ఉందని, ఇది మహిళల భద్రత, స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తోందని అధికారులు ఎత్తిచూపారు. చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ సామాజిక కట్టుబాట్లు మహిళలను అడ్డంకిగా మారాయన్నారు. మహిళల భద్రతపై దృష్టి సారించే కమ్యూనిటీ పోలీసింగ్ ప్రయత్నాలను ప్రవేశపెట్టడానికి, పోలీసులకు శిక్షణ ఇవ్వడానికి మధ్యప్రదేశ్ వంటి రాష్ట్ర ప్రభుత్వాలతో యూఎన్ ఉమెన్ సహకరిస్తోందని తెలిపారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2022–23 ప్రకారం దేశంలో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్య రేటు 37 శాతానికి పెరిగినప్పటికీ, సవాళ్లు ఉన్నాయని, పిల్లల సంరక్షణ, సురక్షిత రవాణా, పనిప్రాంతంలో భద్రతతో మహిళలు మరిన్ని ఆర్థిక అవకాశాలు పొందగలుగుతారని సూచించారు.

సంస్కరణలతోనే పటిష్ట ప్రజాస్వామ్యం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారతదేశం - ఎన్నికల సంస్కరణలు

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు మౌలిక అంశం. నేటి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల చెంత ఉండే ప్రభుత్వం ఏర్పడాలంటే ఎన్నికలే ఏకైక మార్గం. నిష్పాక్షికంగా, స్వేచ్ఛాయుతంగా జరిగే ఎన్నికలపైనే ప్రజాస్వామ్య విజయం ఆధారపడి ఉంటుంది. న్యాయబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలను నిర్వహించడానికి మన రాజ్యాంగ నిర్మాతలు స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. పని విధానానికి సంబంధించినంతవరకూ ఎవరికీ ఎలాంటి నివేదిక సమర్పించని రాజ్యాంగబద్ధ సంస్థ కేంద్ర ఎన్నికల కమిషన్. ఇది 1950 జనవరి 25న తన పనిని ప్రారంభించింది. ప్రారంభంలో ఇది ఏకసభ్య కమిషన్‌గా ఉన్నప్పటికీ, 1993 నుంచి త్రిసభ్య కమిషన్‌గా పనిచేస్తోంది. 1995లో సుప్రీంకోర్టు త్రిసభ్య కమిషన్ ఏర్పాటును సమర్థించింది. రాజ్యాంగబద్ధ సంస్థల ఎన్నికలన్నింటినీ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుండగా; 73, 74 రాజ్యాంగ సవరణల ఆధారంగా ఏర్పడిన రాష్ట్రాల ఎన్నికల కమిషన్‌లు స్థానిక స్వపరిపాలనా సంస్థల ఎన్నికలను నిర్వహిస్తున్నాయి. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు బహుళ సభ్య కమిషన్‌గా రాజ్యాంగబద్ధత కల్పించాలని పి.వి. నర్సింహారావు ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ తగిన మెజార్టీ లేని కారణంగా కేవలం చట్టబద్ధతను మాత్రమే కల్పించి త్రిసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 324 అధికరణం ప్రకారం భారత రాష్ట్రపతి ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను, ఇతర కమిషనర్లను నియమిస్తారు. ప్రధాన కమిషనర్‌ను తొలగించే సందర్భంలో మాత్రమే పార్లమెంట్ 2/3వ వంతు మెజార్టీతో తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఇతర కమిషనర్లను తొలగించడానికి ప్రధాన కమిషనర్‌ను కొలీజియంగా సంప్రదించి కేంద్రకేబినెట్ సలహా మేరకు రాష్ట్రపతి తొలగిస్తారు. ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించడమే కాకుండా ప్రజా ప్రతినిధులను అనర్హులుగా ప్రకటించే సందర్భంలో 103వ అధికరణ ప్రకారం రాష్ట్రపతికి సలహాలు ఇస్తుంది. అదే విధంగా 192వ అధికరణను అనుసరించి శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించే సందర్భంలో గవర్నర్ కూడా ఎన్నికల కమిషన్‌ను సంప్రదించాలి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఎన్నికల కమిషన్‌కు సెమి జ్యుడీషియల్ అధికారాలు సంక్రమిస్తాయి. 1957లో రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా డాక్టర్ ఎన్.బి. ఖరే వేసిన పిటిషన్‌ను విచారించే సందర్భంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

ప్రజాప్రాతినిధ్య చట్టాలను రూపొందించడం, సవరణలు చేయడం లాంటి అంశాలను పార్లమెంట్ చేసినప్పటికీ అమలు పర్చాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని అమలుపరిచే క్రమంలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను రూపొందిస్తుంది. కార్యనిర్వహణపరమైన అంశాలను రూపొందించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం గమనార్హం. భారతదేశంలో ఎన్నికలు నిర్వహించే సందర్భంలో పార్లమెంట్ చేసిన చట్టాల్లో తగిన నిబంధనలు లేనట్లయితే రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల కమిషన్ అనుబంధ చట్టాలు చేయవచ్చని చీఫ్ ఎలక్షన్ కమిషన్ Vs మహేందర్ పాల్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు 1978లో తీర్పునిచ్చింది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికలు మొదలుకొని 2014లో జరిగిన 16వ సాధారణ ఎన్నికల వరకు అనేక ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టారు. 'ఒక వ్యవస్థ తనను తాను సంరక్షించుకొని, తనను తాను సమర్థంగా తీర్చిదిద్దుకునే క్రమంలో తనను తాను సంస్కరించుకోవాల్సిన అవసరం ఉంటుంది' అని ఎడ్మాండ్ బర్క్‌లాంటి ప్రముఖులు పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యం గడిచిన 6 దశాబ్దాల కాలంలో అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలదొక్కుకున్నదనేది విమర్శకులు సైతం అంగీకరించే వాస్తవం. రెండో ప్రపంచయుద్ధానంతరం స్వాతంత్ర్యాన్ని పొందిన అనేక దేశాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేస్తూ సైనిక తిరుగుబాటు జరిగి, నియంతృత్వ పాలనలోకి వెళ్లిన ఉదంతాలను గమనించవచ్చు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాల్లో ఈ విధమైన తిరుగుబాట్లను మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. కానీ భారత్‌లో ఇలాంటి ఉదంతాలు కనిపించవు. అదే మన ప్రజాస్వామ్య గొప్పదనం.

మన ప్రజాస్వామ్య గొప్పదనం

రాజ్యాంగం అమల్లోకి వచ్చే కాలంనాటికి నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం, వెనుకబాటుతనం లాంటి అనేక సమస్యలున్నప్పటికీ మన రాజ్యాంగ నిర్మాతలు సార్వత్రిక వయోజన ఓటుహక్కును ప్రసాదించారు. ఒకరకంగా ఇది వ్యక్తులను చైతన్యవంతం చేయడమే. 1971 లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఇందిరాగాంధీకి పట్టం కట్టిన ప్రజలు 1975లో జాతీయ అత్యవసర పరిస్థితి తదనంతరం 1977లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే కాకుండా ఇందిరాగాంధీని సైతం ఎంపీగా ఓడించారు. జనతాపార్టీ సుస్థిర ప్రభుత్వాన్ని అందించడంలో విఫలమైతే 1980లో తిరిగి ఇందిరాగాంధీకి అధికారాన్ని కట్టబెట్టారు. ఈ అంశాలు భారత ప్రజల విజ్ఞత, చైతన్య స్ఫూర్తిని తెలియజేస్తాయి. 1988లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటింగ్ వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వకాలంలోనే 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రవేశపెట్టారు. అంటే ఒక రాజకీయ పార్టీ గుర్తుపై గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల్లోకి వెళ్లినప్పుడు సహజసిద్ధంగానే తమ పదవిని కోల్పోతారు. రాజకీయాల్లో నైతిక విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తెచ్చారు. వాస్తవానికి భారతదేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధ పార్టీలు కావు. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని అనుసరించి కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు గుర్తింపునిస్తుంది. రాజ్యాంగంలో రాజకీయ పార్టీల గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోయినా, పార్టీల మార్పిడిని నిషేధిస్తూ రాజ్యాంగంలో చట్టం చేర్చడం ఒక ప్రత్యేక అంశం. 1962 తర్వాత ద్విసభా నియోజకవర్గాల స్థానంలో ఏకసభ్య నియోజక వర్గాలను ప్రవేశపెట్టారు. గతంలో ఒక అభ్యర్థి ఎన్ని నియోజక వర్గాల్లోనైనా పోటీ చేయడానికి అవకాశం ఉండేది. కానీ 1996లో ప్రజాప్రాతినిధ్య చట్టం ద్వారా తీసుకువచ్చిన సంస్కరణల ప్రకారం ఒక అభ్యర్థి రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అవకాశం లేదు. అదేవిధంగా నేరమయ రాజకీయాలను అరికట్టడం కోసం 2 ఏళ్ల అంతకంటే ఎక్కువ కాలం శిక్ష అనుభవించిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లేదు. ఎన్నికల ప్రచార కాలాన్ని కూడా 21 రోజుల నుంచి 14 రోజులకు తగ్గించారు. ఆషామాషీ అభ్యర్థుల సంఖ్యను తగ్గించడం కోసం ఎన్నికల డిపాజిట్లను పెంచారు. పార్లమెంట్‌కు పోటీ చేయడానికి సాధారణ అభ్యర్థులు రూ.25,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.12,500 డిపాజిట్ చెల్లించాలి. శాసనసభకు పోటీ చేయడానికి సాధారణ అభ్యర్థులైతే రూ.10,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5000 డిపాజిట్‌గా చెల్లించాలి. ప్రారంభంలో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయకూడదనే ఉద్దేశంతో పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే వారి ఎన్నికల ఖర్చుపై పరిమితులు విధించారు. పార్లమెంట్‌కు పోటీచేసే సభ్యులకు వ్యయపరిమితి రూ.70 లక్షలుగా, శాసనసభకు పోటీచేసే అభ్యర్థులకు వ్యయ పరిమితి రూ.28 లక్షలుగా నిర్ణయించారు.



అక్రమాలను అడ్డుకోవడానికి చర్యలు

రాజ్యసభ సభ్యుల ఎన్నికల సందర్భంగా ప్రతి వ్యక్తి నివాస స్థల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చిన నిబంధనను సుప్రీంకోర్టు సమర్థించింది. 1996 నుంచి మనదేశంలో ఎన్నికల పరిశీలకులను నియమిస్తున్నారు. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా ముఖ్యంగా రిగ్గింగ్‌ను అరికట్టాలంటే అక్రమాలను నిరోధించాలనే ఉద్దేశంతో ఈవీఎం ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజకీయ పార్టీలకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఏర్పాటు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తీసుకురావడంతో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా నిరోధించగలుగుతున్నాం. 2010లో ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేసిన మార్పులను అనుసరించి ప్రపంచంలో ఎన్ఆర్ఐలు ఎవరైనా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంది.

2003లో పీయూసీఎల్ Vs యూవోఐ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి తన వ్యక్తిగత వివరాలతో కూడిన అఫిడవిడ్‌ను తప్పనిసరిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముందు ప్రమాణపూర్తిగా సమర్పించాలనే అంశాన్ని ప్రజా ప్రాతినిధ్య చట్టంలో చేర్చారు. పౌరహక్కుల యూనియన్ ప్రతిపాదనను ఎన్నికల కమిషన్ సమర్థించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులందరూ ఎవరూ నచ్చని సందర్భంలో 'పైవారెవరూ నచ్చలేదు' అని పేర్కొనే 16వ బటన్‌ను ఈవీఎంలో ఏర్పాటు చేశారు. ఈ అంశమే నోటా (None of the above – Nota)గా ప్రసిద్ధి చెందింది. గతంలో ఎన్నికల్లో పోటీ చేసిన వారు ఎవరైనా రెండేళ్లు అంతకంటే ఎక్కువ కాలం శిక్ష విధించినట్టు న్యాయస్థానాలు తీర్పులు ఇవ్వగానే వారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించేవారు. కానీ సిట్టింగ్ అభ్యర్థులకు అంటే గతంలో ఎంపీలేదా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా ఎన్నికైన వారెవరికి ఈ అనర్హత వర్తించదని పేర్కొనే నిబంధనను చేర్చగా.. ఇటీవల సుప్రీంకోర్టు ఈ నిబంధన చెల్లదని తీర్పునిచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో రాజ్యసభ సభ్యత్వాన్ని కోల్పోయిన మొదటి వ్యక్తి రషీద్ మసూద్.


మాదిరి ప్రశ్నలు

1. భారత రాష్ట్రపతి ఎన్నిక వివాదాలను పరిష్కరించేది ఎవరు? (సివిల్స్ - 1997)
   1) ప్రధాన ఎన్నికల కమిషనర్
   2) భారత పార్లమెంట్
   3) 39వ రాజ్యాంగ సవరణ ప్రకారం పార్లమెంటరీ కమిటీ
   4) సుప్రీంకోర్టు
2. పార్లమెంట్ సభ్యుల అనర్హతను నిర్ణయించేది? (సివిల్స్ - 1979)
   1) ఎన్నికల కమిషనర్
   2) లోక్‌సభ స్పీకర్ 3) రాష్ట్రపతి
   4) పార్లమెంట్ నియమించే కమిటీ
3. కిందివాటిలో ఎన్నికల సంఘం విధులను తెలపండి. (సివిల్స్-1994)
   ఎ. లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షుని ఎన్నిక నిర్వహించడం
   బి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ
   సి. ఎన్నికలకు సంబంధించిన అనుమానాలు వివాదాలపై నిర్ణయం
   1) ఎ, బి మాత్రమే 2) ఎ, సి మాత్రమే
   3) బి, సి మాత్రమే 4) ఏదీకాదు
4. రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఒక వ్యక్తి డిపాజి ట్ కోల్పోవడం అంటే? (సివిల్స్- 1995)
   1)ఎన్నికల్లో అభ్యర్థికి అతితక్కువ ఓట్లు రావడం
   2) నియోజకవర్గంలో ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేయడం
   3) ఓడిపోయిన అభ్యర్థికి గెలుపొందిన అభ్యర్థికి మధ్య ఓట్ల తేడా చాలా ఎక్కువగా ఉండటం
   4) గెలిచిన అభ్యర్థికి ఓడిపోయిన అభ్యర్థికి మధ్య ఓట్ల తేడా తక్కువగా ఉండటం
5. భారతదేశంలో రాజకీయ పార్టీలకు సంబంధించి కింది అంశాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి. (సివిల్స్ - 2001)
   ఎ. 1951ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని అనుసరించి రాజకీయ పార్టీలను రిజిస్ట్రేషన్ చేయించాలి
   బి. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది.
   సి. జాతీయ పార్టీగా గుర్తింపు పొందా లంటే 4 రాష్ట్రాల్లో రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందాలి
   డి. 1999 సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘంతో రిజిస్ట్రేషన్ చేసిన ప్రాంతీయ పార్టీలు 48, జాతీయ పార్టీలు 6.
   1) ఎ, బి, డి వాస్తవం
   2) ఎ, సి మాత్రమే వాస్తవం
   3) బి, డి మాత్రమే వాస్తవం
   4) ఎ, బి, సి, డి వాస్తవం

సమాధానాలు

1) 4; 2) 3; 3) 4; 4) 1; 5) 4.

Identify the correctly spelt word



Teaching pronunciation

A sentence is made of words. A word is made of letters. A letter is made of.. sound. It is sound that makes a language, which starts with the ear. When a baby starts to talk, he does it by hearing the sounds his mother and imitating them. Normal babies unlike a deaf one can hear and can imitate. They are wonderful imitators and this gift of imitation given us the gift of speech, lasts for a number of years. It is well known that a child of ten years old or less can learn any language perfectly, if it is brought up surrounded by that language, no matter where it was born and who its parents were. But after this age, ability to imitate perfectly becomes less and we all know only too well that adults have great difficulty in mastering the pronunciation(as well as other parts) of a foreign language. Why is this? Why should this gift of imitation we all have as children disappear in later life? Why grown up people can't pick up the characteristic sound of a foreign language as a child can? The answer is ' that our native language won't let us'.

Speech depends on hearing. Therefore, we must hear English. But just hearing it is not enough, we must listen to it and we must listen to it not for the meaning but for the sound of it. Letters are written. Sounds are spoken. There are 44 phonemes in English. A phoneme can be explained as the smallest phonetic unit in a language that is capable of conveying a distinction in meaning, as the 'm' of mat and the 'b' of bat in English. Of these, vowels are 12, consonants are 24 and diphthongs are 8. A diphthong is a complex speech sound or glide that begins with one vowel and gradually changes to another vowel within the same syllable, as (oi) in boil or (i) in fine.

Model Questions

1. Identify the suitable word to insert in the blank given.
   Janaki was______ injured in the accident and died in an hour.
   a) Seriously b) fatally
   c) fatefully d) vitally
2. Identify the word opposite in meaning of the underlined one in the following sentence.
   I love children's innocence and lack of **guile**.
   a) Profusion b) deception
   c) reception d) blamelessness.
3. Pick out the word opposite in meaning of the underlined word in the following sentence.
   One can't deny the eternal and **immutable** principle of right and wrong.
   a) Changeable b) unbeatable
   c) commuting d) muted

Choose the words that are almost similar in meaning of the underlined words in the following sentences.

4. I can't go on with your **saw** for I have been bored with its repetition.
   a) An old horse
   b) a short poem
   c) a wise saying
   d) a boring story.
5. He shook his head and gave me a **rueful** smile.
   a) Fearful b) sorrowful
   c) defensive d) meaningful

Read the following passage and answer the questions that follow.

Some years after World War I the Prince of Wales visited a hospital for hopelessly wounded veterans. Beside each broken body he stopped and chatted. While he was being led to the doorway the Prince asked, 'I understand you have thirty six patients here. But I have seen only twenty nine."

They gave the excuse that the rest were too horribly wounded for him to see. "Is it for my sake or theirs you are not taking me there?" "For yours, sir." "Then I insist you show me in." Here too the Prince stopped by each and thanked him for his sacrifice.

Once more he turned to the guide and asked, "Where is the seventh?" The nurse objected, "Please don't ask to see him, sir. It can do no good." But the visitor persisted and was taken into a darkened room to what was left of a human body-blind, twisted, frighteningly disfigured. The prince turned white, his lips were drawn, and tears trickled down his cheeks. Impetuously he bent and kissed the cheeks of the broken hero.

6. A veteran is
   a) A person who is long experienced or practised in an activity or capacity
   b) A person who has served in the armed forces
   c) An old soldier who has seen long service.
   d) Any one of the above.
7. The Prince asked while leading to the doorway
   a) That he didn't understand why he had seen only twenty nine.
   b) That he didn't understand why he hadn't seen thirty six
   c) That he understood that they had thirty six
   d) That he understood that he had seen only twenty nine
8. The nurse didn't take him to them because
   a) The rest were too horribly wounded
   b) The nurse herself was unable to see them in such wretched condition.
   c) She thought they might be disturbed by the Prince's arrival
   d) The Prince wouldn't help feel disgusted with.
9. The Prince bent and kissed the patient
   a) Passionately b) emotionally
   c) excitedly d) energetically
10. When somebody is lying, you say that he is **telling me a fairy tale**. What is the figure of speech employed used here?
    a) Euphemism
    b) Metaphor c) Hyperbole
    d) Personification
11. The word 'politician' has it stress on its..
    a) First syllable
    b) second syllable
    c) third syllable
    d) no stress because it is a polysyllabic word.
12. Identify the grammatically correct sentence.
    India is unable to compete with another countries in the field of education
    India is unable to compete with another country in the field of education.
    a) Both sentences are right
    b) both sentences are wrong
    c) only first sentence is right
    d) only second sentence is right.
13. We know what we are but we don't know what we shall be.
    The above sentence is a..
    a) Complex sentence
    b) Compound sentence
    c) Simple sentence
    d) Compound-complex
14. A person who looks on the brighter side of things and people is known as..
    a) Sycophant b) optimist
    c) cynic d) pessimist
15. One who doesn't care for literature or art is a..
    a) Barbarian b) Philistine
    c) Illiterate d) Primitive
16. All the English consonants are divided into..
    a) Five groups
    b) four groups
    c) three groups
    d) six groups
17. When asked what grammar is, it can be defined as..
    a) A body of rules
    b) A Practical analysis of a language
    c) It is the analytical and terminological study of a sentence
    d) All the above three.
18. The definition 'words in their best order is prose and the best words in their best order is poetry' is given by..
    a) William Hazlitt
    b) Francis Bacon
    c) S.T. Coleridge
    d) Robert Lynd.
19. Identify the correctly spelt word
    a) Occurred b) occured
    c) ocurred d) occurrd
20. Identify the wrongly spelt word of the following
    a) Decieve b) relieve
    c) believe d) All are correct
    Improve the sentence given by choosing the best option.
21. Your advice is **no different from** the other friend
    a) Not different
    b) No different from that of the
    c) Not different from the
    d) No improvement.
22. Identify the correct words in the following blanks.
    You can't provoke me ____ anger and I wink ____ such things.
    a) For, of b) to, at
    c) with, about d) of, to
23. Put the options in correct order to complete the given sentence.
    He said that those who
    P) would miss a very interesting game
    Q) to be played
    R) between two famous teams
    S) would not accompany him
    a) QRPS b) SPQR
    c) SQRP d) SRPQ
24. Choose the correct option for the underlined words.
    She did not like the movie, **nor I did**.
    a) Nor did I b) nor I like it
    c) nor I liked it d) nor I do.
25. For 'The Eve of St. Agnes', the Spenserian stanza was successfully used by..
    a) Lord Byron b) John Keats
    c) Lord Tennyson d) PB Shelley
26. Fill in the blanks with the suitable names of poets.
    The term 'Metaphysical' as applied to poetry, was first used by ____ who borrowed it from ____ who wrote it about John Donne.
    a) Dr. Johnson, Dryden
    b) George Herbert,Henry Vaughan
    c) Sir John Suckling,John Cleveland
    d) Alexander Pope, Richard Crashaw
27. A good lesson plan is the basis of..
    a) good teaching
    b) becoming a good teacher
    c) good learning method
    d) becoming a planned teacher
28. From the technical point of view, the class readier should be…
    a) related to the child's local and social background
    b) related to the family's neighbourhood and environment.
    c) in the form of stories, letters, dialogues,autobiographies etc.
    d) religious and adventurous.
29. The All India Seminar on the Teaching of English in Secondary Schools was held at___ in ___
    a) Kharagpur, November 1957
    b) Nagpur, December, 1957
    c) Raipur, December, 1958
    d) Khatmandu, 1958.
30. The passive form of 'Circumstances will oblige me to go' is…
    a) I will oblige to go in such circumstances
    b) I will be obliged to go under any circumstances.
    c) I shall oblige to go circu-mstantially
    d) I shall be obliged to go

Key

1) b, 2) d, 3) a, 4) a, 5) b, 6) d, 7) d, 8) d, 9) b, 10) a, 11) c, 12) d, 13) b, 14) b, 15) b, 16) a, 17) d, 18) c, 19) a, 20) a, 21) b, 22) b, 23) b, 24) a, 25) b, 26) a, 27) a, 28) a, 29) b, 30) d.

చెట్ల కింద రాత్రి వేళ ఎందుకు నిద్రించొద్దు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



మాదిరి ప్రశ్నలు

1. చెమటలో ఉండే పదార్థాలు?
   1) నీరు, ఉప్పు, వ్యర్థ పదార్థాలు
   2) నీరు మాత్రమే 3) నీరు+లవణాలు
   4) ఫాస్ఫరికామ్లం
2. కిందివాటిలో తక్కువ విషతుల్యమైన నైట్రోజన్ సంబంధ వ్యర్థ పదార్థం?
   1) యూరియా 2) యూరికామ్లం
   3) అమ్మోనియా 4) క్రియాటిన్
3. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడబోత జరుగుతుంది?
   1) వృక్కం (నెఫ్రాన్) 2) మూత్రకోశం
   3) వృక్క ధమని 4) ప్రసేకం
4. కింది వాటిలో యూరియా తయారయ్యే భాగం?
   1) మూత్రపిండం 2) పెద్ద పేగు
   3) మూత్రాశయం 4) కాలేయం
5. మానవ శరీరంలో మొదటిసారిగా ఏ అవయవాన్ని మార్పిడి చేశారు?
   1) గుండె 2) కాలేయం
   3) కిడ్నీ 4) క్లోమం
6. ఏ వ్యాధితో బాధపడే వారికి డయాలసిస్ చేస్తారు?
   1) కాలేయ సమస్య
   2) మూత్ర కోశాల సమస్య
   3) గుండె 4) ఊపిరితిత్తులు
7. కింది వాటిలో ఏ హార్మోన్ లోపంతో డయాబెటీస్ మెల్లిటస్ వస్తుంది?
   1) థైరాక్సిన్ 2) గ్లూకగాన్
   3) పిట్యూటరీ గ్రంథి 4) ఇన్సులిన్
8. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని ఏ గ్రంథిని పిలుస్తారు?
   1) అడ్రినల్ గ్రంథి 2) థైరాయిడ్
   3) లివర్ / కాలేయం 4) థైమస్ / బాలగ్రంథి
9. చిరు కప్ప రూపాంతరం చెంది ప్రౌఢ కప్పగా మారడానికి కావాల్సిన హార్మోన్?
   1) ఎఫ్ఎస్‌హెచ్ 2) ఎల్‌హెచ్
   3) థైరాక్సిన్ 4) అడ్రినల్ గ్రంథి
10. క్లోమం ఒక?
    1) బహిస్స్రావ గ్రంథి
    2) అంతస్స్రావ గ్రంథి
    3) అంతస్స్రావ - బహిస్స్రావ గ్రంథి
    4) ఏదీకాదు
11. పీయూష గ్రంథి ఎక్కడ ఉంటుంది?
    1) కంఠం 2) కాలేయం
    3) మూత్ర పిండం పైన
    4) కపాలం మధ్యన
12. పాల పొదుగు నుంచి చూషణ ద్వారా పాలను స్రవించడానికి తోడ్పడే హార్మోన్?
    1) ప్రొలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
    3) అడ్రినలిన్ 4) థైమోసిన్
13. కింది వాటిలో వేటి నుంచి అయోడిన్ అధికంగా లభిస్తుంది?
    1) సముద్ర చేపలు 2) సముద్ర ఉప్పు
    3) సీ వీడ్స్ 4) కూరగాయలు
14. అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధి?
    1) మహాకాయం 2) జడవామనుడు
    3) విస్తరించిన అవటు గ్రంథి
    4) చిన్న అవటు గ్రంథి
15. ఎండోక్రైన్ గ్రంథులపై ప్రభావం చూపే గ్రంథి?
    1) ఎడ్రినల్ గ్రంథి
    2) పారాథైరాయిడ్ గ్రంథి
    3) పీయూష గ్రంథి
    4) థైరాయిడ్ గ్రంథి
16. ఇన్సులిన్ ఒక?
    1) కొవ్వు పదార్థం 2) హార్మోన్
    3) రంగు పదార్థం 4) ఎక్సో ఎంజైమ్
17. పీయూష గ్రంథి అధీనంలో లేని గ్రంథి?
    1) పారాథైరాయిడ్ గ్రంథి
    2) థైరాయిడ్ 3) క్లోమం
    4) అడ్రినల్ గ్రంథి
18. రక్తపోటును నియంత్రించే హార్మోన్?
    1) థైరాక్సిన్ 2) ఇన్సులిన్
    3) ఎడ్రినలిన్ 4) పిట్యూటరీ గ్రంథి
19. ఇన్సులిన్, ఈస్ట్రోజన్ అనేవి ?
    1) బ్యాక్టీరియాలు 2) ఫంగస్‌లు
    3) క్రిములు 4) హార్మోన్లు
20. అధిక ఆవేశాన్ని కలిగించే గ్రంథి ఏది?
    1) పిట్యూటరీ గ్రంథి 2) ఎడ్రినల్ గ్రంథి
    3) థైరాయిడ్ గ్రంథి 4) సెలైవరీ గ్రంథి
21. మానవ దేహంలో అధివృక్క గ్రంథి వేటిపై ఉంటుంది?
    1) చిన్న పేగు 2) గుండె
    3) ఊపిరితిత్తులు 4) మూత్ర పిండాలు
22. తమ జాతి జీవులపై ప్రభావం చూపించేవి, జీవి శరీరం నుంచి బాహ్యంగా విడుదలయ్యే సమ్మేళనాన్ని ఏ విధంగా పిలుస్తారు?
    1) సబ్‌హార్మోన్లు 2) న్యూరోహార్మోన్లు
    3) ఫిరమోన్లు 4) న్యూరోట్రాన్స్ మీటర్
23. స్త్రీ జీవుల్లో ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని నియంత్రించేది?
    1) ఈస్ట్రోజన్ 2) ఆక్సిటోసిన్
    3) టెస్టోస్టిరాన్ 4) ప్రొజెస్టిరాన్
24. శిశువుల్లో మాత్రమే ఉండి కౌమార దశలో అంతరించే గ్రంథి?
    1) థైరాయిడ్ గ్రంథి
    2) థైమస్ గ్రంథి 3) పీనియల్ గ్రంథి
    4) పీయూష గ్రంథి
25. గర్భ నిరోధక మాత్రల్లో ఉండే హార్మోన్?
    1) ఈస్ట్రోజెన్ 2) ప్రొజెస్టిరాన్
    3) ఆక్సిటోసిన్ 4) ప్రొలాక్టిన్
26. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్య రసాన్ని స్రవింపజేసే హార్మోన్?
    1) సెక్రిటిన్ 2) ఇన్సులిన్
    3) కోలిసిస్టోకైనిన్ 4) ఎడ్రినలిన్
27. లైంగిక కార్టికాయిడ్ల అధికస్రావం వల్ల వచ్చే వ్యాధి?
    1) విరిలిజం 2) హిర్సుటిజం
    3) గైనకోమాస్టియా 4) పైవన్నీ
28. కొమ్ములు, గోళ్లలో ఉండే ప్రోటీన్?
    1) బొటాక్స్ 2) కెరాటిన్
    3) రాటెక్స్4) బీటా కెరోటిన్
29. కండరాలకు వచ్చే కేన్సర్ వ్యాధిని ఏమంటారు?
    1) అంపోమా 2) ల్యుకేమియా
    3) సార్కోమా 4)మస్కులార్ డిస్ట్రోఫి
30. రక్తం అనేది ఒక..?
    1) ద్రావణం 2) కొల్లాయిడ్
    3) సరళ పదార్థం 4) జెల్
31. డెక్స్ట్రోకార్డియా అంటే ఏమిటి?
    1) చిన్న గుండె 2) పెద్ద గుండె
    3) కుడివైపు ఉన్న గుండె 4) ఏదీకాదు
32. అందరికీ ఉపయోగపడే బ్లడ్ గ్రూప్?
    1) ఎ 2) బి 3) ఎబి 4) ఓ
33. చెట్ల కింద రాత్రి వేళ ఎందుకు నిద్రించొద్దు?
    1) తక్కువ ఆక్సిజన్ విడుదల
    2) ఎక్కువ ఆక్సిజన్ విడుదల
    3) కార్బన్ డై ఆక్సైడ్ విడుదల
    4) ఏదీ కాదు
34. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి? 1) చర్మం ద్వారా 2) మొప్పల ద్వారా
    3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
    4) ఊపిరితిత్తుల ద్వారా
35. రక్తపోటుకు కారణమైన హార్మోన్ ?
    1) కాలేయం 2) టెస్టిస్
    3) పాంక్రియాస్ 4) అడ్రినలిన్
36. బారియాట్రిక్ శస్త్రచికిత్స అంటే ఏమిటి?
    1) గుండె బైపాస్ సర్జరీ 2) ఉదరం సర్జరీ
    3) మెదడు సర్జరీ 4) ఏదీకాదు
37. రూట్ కెనాల్ థెరపీ అనేది దేనికి సంబంధించినది?
    1) దెబ్బతిన్న పళ్ల 2) దెబ్బతిన్న మూత్రనాళం
    3) గోళ్ల చికిత్స 4) రక్తనాళ చికిత్స
38. తుమ్ములు, మింగడం, వాంతి, దగ్గు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి?
    1) మస్తిష్కం
    2) మజ్జాముఖం(మెడుల్లా అబ్లాంగేట)
    3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్
39. ఆల్కహాల్, అనస్థీషియా(మత్తుమందు) మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
    1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
    3) మెడుల్లా అబ్లాంగేట
    4) వెన్నుపాము
40. శిశువు లింగ నిర్ధారణకు ఉపయోగించే పరీక్ష?
    1) ఆమ్నియో సింటాసిస్
    2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
    3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
41. పాలలోని బ్యాక్టీరియాలను నశింపజేసే శాస్త్రీయ పద్ధతి?
    1) సూక్ష్మ జీవరహితం 2) శుద్ధిచేయడం
    3) కిణ్వనం 4) పాశ్చరైజేషన్
42. పాలు అనేవి?
    1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
    2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
    3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
    4) నీరు విస్తరించి ఉన్న చమురు
43. గాయాలు మానడానికి ఉపయోగపడే విటమిన్?
    1) ఎ 2) కె 3) సి 4) డి
44. సూర్యకాంతి నుంచి లభించే విటమిన్?
    1) బి 2) సి 3) కె 4) డి
45. నేలలో నత్రజని పెరుగుదల కోసం సాగు చేసే పంట?
    1) వరి 2) గోధుమ 3) చిక్కుడు 4) పత్తి
46. కాఫీలో కలిపే చికోరి పొడర్‌ను దేని నుంచి గ్రహిస్తారు?
    1) కాండం 2) ఆకులు
    3) విత్తనాలు 4) వేర్లు
47. ఆకుల ద్వారా జరిగే ట్రాన్స్‌ఫరేషన్‌ను ఏమంటారు?
    1) స్టొమాటల్ 2) క్యుటిక్యులార్
    3) లెంటిక్యులార్ 4) గుట్టేషన్
48. జీవుల్లో అనువంశిక లక్షణాలకు కారణం?
    1) హెచ్‌బీ 2) ఆర్ఎన్ఏ
    3) డీఎన్ఏ 4) ఏటీపీ
49. జన్యువు అనగా?
    1) డీఎన్ఏ ముక్క
    2) ప్రోటీన్‌లోని అమైనోఆమ్లం
    3) సహలగ్న సముదాయం
    4) ఆర్ఎన్ఏలోని కొంత భాగం
50. యాంటిబయోటిక్ పెన్సిలిన్‌ను ఉత్పత్తి చేసేవి?
    1) ఆల్గే 2) బ్యాక్టీరియాలు
    3) సింథటిక్ రకాలు 4) ఫంగస్
51. సిట్రస్ కాంకర్ వ్యాధి వేటి ద్వారా వస్తుంది?
    1) ఫంగీ 2) వైరస్
    3) బ్యాక్టీరియా 4) మైకోప్లాస్మా
52. భారత తొలి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ఏది?
    1) అగ్ని-4 2) అగ్ని-5
    3) బ్రహ్మోస్ 4) పృథ్వీ-3
53. సూర్యుడి శక్తికి కారణం?
    1) కృత్రిమ రేడియోధార్మిక శక్తి
    2) కేంద్రక విచ్ఛిత్తి 3) కేంద్రక సంలీనం
    4) సహజ రేడియోధార్మిక శక్తి
54. చమురు దీపాల్లోని నూనె.. వత్తుల ద్వారా పైకి రావడానికి కారణం?
    1) స్నిగ్ధతా ధర్మం
    2) ఉష్ణోగ్రత వ్యత్యాసం
    3) పీడన వ్యత్యాసం
    4) కెపిలారిటీ ధర్మం
55. ఆకాశంలోని నీలి రంగుకు కారణం?
    1) కాంతి పరావర్తనం
    2) కాంతి వక్రీభవనం
    3) కాంతి వివర్తనం 4) కాంతి పరిక్షేపనం
56. దేని ఉత్పత్తిని వివరించడానికి బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని వినియోగిస్తారు?
    1) భూమి మీది జీవజాలం
    2) జీవ పరిణామం
    3) అణు విస్ఫోటం 4) విశ్వం
57. ఎల్పీజీలో ఏ రసాయనాన్ని కలపడం వల్ల గ్యాస్ లీకేజీలో వాసనను గుర్తించగలుగుతాం?
    1) ఇథైల్ ఆల్కహాల్
    2) ఫినోల్ 3) బెంజిన్
    4) ఇథైల్ మెర్క్ పటన్
58. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఎక్కడ ఉంది?
    1) తిరుపతి 2) తిరువనంతపురం
    3) డెహ్రాడూన్ 4) భోపాల్
59. క్రయోజెనిక్ ఇంజన్‌లో వాడే ఇంధనం?
    1) ద్రవ హైడ్రోజన్
    2) ద్రవ ఆక్సిజన్
    3) ద్రవ హీలియం
    4) ద్రవ నైట్రోజన్
60. శాస్త్రీయంగా పులియబెట్టడమంటే?
    1) ఆక్సిజన్‌లో చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
    2) ఆక్సిజన్ లేకుండా చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
    3) ఆక్సిజన్ లేకుండా చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
    4) ఆక్సిజన్‌లో చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం

సమాధానాలు

1) 1	2) 2	3) 1	4) 4	5) 3
6) 2	7) 4	8) 2	9) 3	10) 3
11) 4	12) 2	13) 3	14) 3	15) 3
16) 2	17) 1	18) 3	19) 4	20) 2
21) 4	22) 3	23) 1	24) 2	25) 2
26) 3	27) 4	28) 2	29) 3	30) 2
31) 3	32) 4	33) 3	34) 3	35) 4
36) 2	37) 1	38) 2	39) 2	40) 1
41) 4	42) 2	43) 3	44) 4	45) 3
46) 4	47) 1	48) 3	49) 1	50) 4
51) 3	52) 2	53) 3	54) 4	55) 4
56) 4	57) 4	58) 3	59) 1	60) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఒత్తిడి, కోపం, ఎక్కువ బీపీకి ఏ హార్మోన్ బాధ్యత వహిస్తుంది?
   1) ఆక్సిటోసిన్ 2) థైరాక్సిన్
   3) ఎడ్రినాలిన్ 4) గలనిన్
2. కింది వాటిలో దేనిని జంతు స్టార్చ్ అంటారు?
   1) సెల్యూలోజ్ 2) గ్లైకొజన్
   3) కైటిన్ 4) పెక్టిన్
3. RNAలో న్యూక్లియోటైడ్స్ దేనితో ముడిపడి ఉంటాయి?
   1) పెప్టైడ్ బంధాలు
   2) హైడ్రోజన్ బంధాలు
   3) అయానిక బంధాలు
   4) ఫాస్ఫోడైఎస్టర్ బంధాలు
4. యూనివర్సల్ ఆక్సెప్టెడ్ బ్లడ్ గ్రూప్?
   1) O^- 2) A^- 3) B^+ 4) AB^+
5. మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏది?
   1) మెదడు 2) గుండె
   3) చర్మం 4) కాలేయం
6. విటమిన్ E లోపం దేనిని కలిగిస్తుంది?
   1) రికెట్స్ 2) బెరి బెరి
   3) పెల్లాగ్రా 4) వంధ్యత్వం
7. జన్యుశాస్త్ర పితామహుడు ఎవరు?
   1) హెస్రీ 2) మెండల్
   3) మారిసన్ 4) మోర్గాన్
8. కిరణ జన్య సంయోగ క్రియలో విడుదలయ్యే ఆక్సిజన్ నీటి నుంచి వస్తుందని నిరూపించింది ఎవరు?
   1) కాల్విన్ 2) హాచ్
   3) రూబెన్, కామెన్ 4) మేయర్

సమాధానాలు

1) 3	2) 2	3) 4	4) 4	5) 3
6) 4	7) 2	8) 3		

In which direction is he facing?



BANK EXAMS


REASONING

DISTANCE & DIRECTIONS

In this chapter problems are asked based on the directions and the distance travelled in that direction.

Let us see the change in direction when a left turn or right turn takes place.

Direction	Left	Right
North	West	East
East	North	South
South	East	West
West	South	North



Note:

i) Two right turns or two left turns → opposite directions

ii) One left turn and one right turn → same direction.

iii)Three left turns → one right turn

iv) Three right turns → one left turn

v) Four left or four right turns → same direction

While solving the questions, keep in mind if only direction is asked no need to draw the directional diagram.

Practice Questions

1. **Ravi in his evening walk travelled towards the sun 3 km, then he turned to his left walked 2 km. He again turned to his right walked another 2 km. Finally, he turned to his right walked another 2 km. In which direction is Ravi walking now?**
   1) East 2) West
   3) North 4) South
   5) None of these

A: 3

Ravi is walking towards the Sun in the evening, so initially he is moving in West direction. Afterwards he successively turned left, right and right respectively. The movement left turn gets nullified with one right turn. Ravi effectively took one right turn to his initial direction. The direction to the right of West is North. So Ravi is moving in the North direction.

2. **One Morning, Raja started to walk towards the Sun. After walking a while, he turned to his right and again to his right. After walking a while, he again turned right. In which dir- ection is he facing?**
   1) South 2) East
   3) West 4) North
   5) None of these


A: 4

Raja is moving towards Sun in the morning means he is moving in East direction. Afterwards he successively took three right turns. The impact of taking three right turns is same as taking one left turn. The direction to the left of East is North. Therefore finally Raja is walking in North direction.

3. **Veena walked 5 m towards north, took a left turn and walked 7m. She took a left turn again and walked 8m before taking a left turn and walking 7m. She then took a final left turn and walked 1m before stopping. How far is Veena from the starting point?**
   1) 3 m 2) 6 m 3) 4 m
   4) 2 m 5) 7 m

A: 4

In this question, to find the distance, it is necessary to draw the direction diagram.




S → Starting point, F → Finishing point

∴ Veena is 2m away from the starting point.

4. **Ajay walked 2m towards east, took a right turn and walked 7m. He then took a left turn and walked 5m before taking a left turn and walking 7m. He then took a final right turn and walked 1m before stopping. How far is Ajay from the starting point?**
   1) 8 m 2) 7 m 3) 6 m
   4) 5 m 5) 9 m


A: 1



Ajay is 2 + 5 + 1 = 8m away from the starting point.


5. **A man started from A, walked 10 km towards North, then took a right turn, and walked 7km and again walked 8 km towards his left. Finally he took a right turn and walked for 13 km and reached point B. In which direction is he with respect to the starting point?**
   1) Northeast 2) Southeast
   3) West 4) North
   5) Northwest

A: 1



6. **A man starts from a point A and walks 5 metres in the east, then he turns right and walks 3 metres, again he turns right and walks 9 metres and finally he takes a right turn walks 3 metres. Now how far is the man from point A and in which direction?**
   1) 6 m towards West
   2) 4 m towards West
   3) 4 m towards South
   4) 6 m towards East
   5) None of these


A: 2



The man is 4m far from point A towards West.

7. **Vivek and Ashok start from a fixed point. Vivek moves 3 km North and turns right and then covers 4 km. Ashok moves 5 km West and turns right and walks 3 km. Now how far are they apart?**
   1) 10 km 2) 9 km 3) 8 km 4) 6 km
   5) None of these


A: 2



Distance between Vivek and Ashok at the finishing positions are 5 + 4 = 9 km

8. **A child was looking for his father. He went 90 metres towards east before turning to his right. He then went 20 metres before turning to his right again to look for his father at his uncle's place 30 metres from this point. His father was not there. He then went 100 metres to the north before meeting his father in a street. How far from the starting point did the son meet his father?**
   1) 80 metres 2) 100 metres
   3) 140 metres 4) 260 metres
   5) None of these

A: 2



PT = 90–30 = 60m,

TU = 100–20 = 80m

PU = $\sqrt{((PT^2)+(TU)^2)}$


= $\sqrt{((60^2)+(80)^2)}$

= $\sqrt{(3600+6400)}$

= $\sqrt{10000}$ = 100m


Directions(Q. 9 - 10): ***Study the giv-en information carefully and answer the given questions.***

Sunil started walking from point A. He walked 6 metres towards East to reach point B. From point B he took a right turn and walked 3 metres to reach point C. From point C he took a right turn and walked 10 metres to reach point D. From point D he took a left turn and walked 4 metres to reach point E. From point E, he walked 4 metres East to reach point F, Point G is exactly midway between point C and point D.



9. **If Sunil walks 4 metres to the North of point F, how far and in which direction will he be from point G?**
   1) 1 metre towards East
   2) 2 metres towards East
   3) 1 metre towards West
   4) 2 metres towards West
   5) 1.5 metres towards East

A: 3



EF = FO = 4 m

∴ DO = 4m

DG = GC = 5m

∴ OG = DG – DO

= 5 – 4 = 1m

10. **How far and in which direction is point F from point A?**
    1) 7 metres towards North
    2) 6 metres towards South
    3) 8 metres towards South
    4) 6 metres towards North
    5) 7 metres towards South

A: 5